సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 99

సోమవారం 30-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'




టైటిల్‌కు చేరువలో...

యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్లో ఆయుశ్ శెట్టి, తన్వీ శర్మ -14లో



రూపాయి లేకపోయినా యూపీఐ చెల్లింపులు -15లో



ఏప్రిల్ 1 నుంచి జనగణన

2026 ఏప్రిల్ 1 నుంచి జనగణన అధికారికంగా మొదలవనుంది. తొలి దశలో హౌస్‌లిస్టింగ్ ప్రక్రియ జరగనుంది.

వివరాలు 6లో ▸



సిలికాన్ రహిత కంప్యూటర్

అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ వర్సిటీ పరిశోధకులు తొలిసారిగా సిలికాన్ రహిత కంప్యూటర్‌ను అభివృద్ధి చేశారు.

వివరాలు 6లో ▸



రథయాత్రలో తొక్కిసలాట

పూరీ జగన్నాథ రథయాత్రలో గుండీచా ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు భక్తులు మృతిచెందారు.

వివరాలు 6లో ▸




8 గంటల ముందే చార్ట్

ఇకపై రైళ్లు బయలుదేరడానికి 8 గంటల ముందే రిజర్వేషన్ చార్ట్ సిద్ధం చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది.

వివరాలు 6లో ▸

కాంగ్రెస్‌కు ఏటీఎం

రేవంత్ సర్కార్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధ్వజం



బీఆర్ఎస్ ప్రభుత్వానికి మించి అవినీతికి పాల్పడుతోంది

- ఈ ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు వచ్చాయి
- బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు నాయకులు, కార్యకర్తలు సంకల్పం తీసుకోవాలి
- ఆపరేషన్ సిందూర్‌పై రాహుల్‌బాబా పిచ్చి ప్రశ్నలు వేస్తున్నారు
- పదేళ్లలో పాకిస్తాన్‌కు భారత్ తడాఖా ఏంటో చూపించాం
- మావోయిస్టులు వెంటనే హత్యాకాండను విడిచి లొంగిపోవాలి
- పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం..లోగో ఆవిష్కరణ
- బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు ఎన్నో ప్రయోజనాలన్న అమిత్‌షా
- నిజామాబాద్ రైతు మహా సమ్మేళనం సభలో ప్రసంగం

నిజామాబాద్ రైతు మహా సమ్మేళన సభలో ప్రసంగిస్తున్న అమిత్ షా

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఢిల్లీలో కాంగ్రెస్ నాయకత్వానికి ఏటీఎంలా మారిందని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు వచ్చాయని అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కాళేశ్వరం, స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, సింగరేణి నియామకాల వంటి వాటి ద్వారా రాష్ట్రాన్ని భారీగా లూటీ చేసి, ఏటీఎంలా మార్చి దోచేసుకుందని ఆరోపించారు. ఆదివారం నిజామాబాద్‌లో పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఎంపీ అర్వింద్, బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డిలతో కలిసి అమిత్‌షా ప్రారంభించారు. పసుపు రైతులతో మాట్లాడారు. పసుపు బోర్డు లోగోను ఆవిష్కరించారు. రైతు మహా సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు.

అధికారం మారినా అవినీతి మారలేదు

'రాష్ట్రంలో అధికారం మారినప్పటికీ అవినీతి మారలేదు. బీఆర్ఎస్ చేసిన అవినీతిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కేసులు నమోదు చేయడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి మించి అవినీతికి పాల్పడుతోంది. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు నాయకులు, కార్యకర్తలు సంకల్పం తీసుకోవాలి. ఆపరేషన్ సిందూర్‌కు ఆధారాలు చూపించాలంటూ రాహుల్‌బాబా ఏవేవో పిచ్చి ప్రశ్నలు వేస్తున్నాడు. మోదీ ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో ▶

సాగే కాదు.. ఎగుమతులు కూడా

- పసుపు రైతుల దశ మార్చనున్న బోర్డు.. భారత్ ఆర్గానిక్ కోఆపరేటివ్ లిమిటెడ్ ఏర్పాటుకు కేంద్రం సన్నాహాలు
- స్థానికంగా ఆర్ అండ్ డీ సెంటర్ ఏర్పాటు చేస్తామన్న అమిత్‌షా
- ఐదేళ్లలో బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులకు ప్రణాళికలు

- వివరాలు 2లో▶

పదోన్నతుల్లో పంచాయితీ



2 వేల మందికిపైగా టీచర్ల ప్రమోషన్లకు ఫైల్ రెడీ

- 2, 3 రోజుల్లో ఉత్తర్వులకు అవకాశం
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న 2023 జీహెచ్‌ఎంలు.. తొలుత బదిలీలు చేపట్టి తమకూ చాన్స్ ఇవ్వాలని డిమాండ్
- కోర్టుకెళ్లే యోచనలో ఉపాధ్యాయ సంఘాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల పదోన్నతులకు రంగం సిద్ధమైంది. పదవీ విరమణ పొందిన, మరణించిన వారి వల్ల ఏర్పడిన ఖాళీలన్నీ భర్తీ కానున్నాయి. పాఠశాల విద్య డైరెక్టరేట్ కార్యాలయం దీనికి సంబంధించిన ప్రతిపాదనలను గత వారం ప్రభుత్వానికి పంపింది. రెండు, మూడురోజుల్లో దీనికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడే వీలుంది. స్కూల్ అసిస్టెంట్ల (ఎస్‌ఏ) నుంచి గెజిటెడ్ హెచ్‌ఎం (జీహెచ్‌ఎం)లుగా పదోన్నతులు పొందుతున్న వాళ్ళు దాదాపు 700 మంది వరకూ ఉన్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ల (ఎస్‌జీటీ) స్థాయి నుంచి ఎస్‌ఏగా పదోన్నతి పొందుతున్న వాళ్ళు 1,500 వరకూ ఉంటారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం 750 వరకూ జీహెచ్‌ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే ఈ ప్రక్రియ సవ్యంగా జరుగుతుందా? అనే సందేహాలు విద్యాశాఖను వెంటాడుతున్నాయి.

జీహెచ్‌ఎంల నుంచి అభ్యంతరాలు

ముందుగా బదిలీలు చేపట్టకుండా, పదోన్నతులు కల్పించనుండటంపై జీహెచ్‌ఎంలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రక్రియపై న్యాయ పోరాటానికి కొన్ని సంఘాలు సిద్ధమవుతున్నాయి. చాలా ఏళ్ళ తర్వాత 2023లో ప్రమోషన్లు ఇచ్చారు. ఈ క్రమంలో 994 మంది స్కూల్ అసిస్టెంట్లు ప్రమోషన్లు పొందారు. మల్టీజోన్ పదోన్నతి కావడంతో వీరంతా సొంత జిల్లాల నుంచి రాష్ట్రంలోని సుదూర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అన్ని ప్రాంతాల వాళ్ళూ 100 నుంచి 500 కిలోమీటర్ల దూరంలో

మిగతా 5వ పేజీలో ▶

జూడాల స్టైపెండ్ పెంపు



- 15 శాతం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు
- బకాయిలు సైతం చెల్లించేలా ఆదేశాలు
- మంత్రి దామోదర చర్చలు సఫలం.. సమ్మె ప్రతిపాదన విరమించుకున్న జూడాలు -3లో

న్యూస్‌రీల్

భద్రాచలం మహిళల విజయాలు అద్భుతం



భద్రాచలం ప్రాంతంలో చిరుధాన్యాలతో బిస్కెట్లు తయారుచేస్తున్న మహిళలపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. దేశంలో మహిళా సాధికారతకు వీరు నిదర్శనంగా నిలుస్తున్నారని కొనియాడారు.

- వివరాలు 16లో▶

దక్షిణ 'రింగు'.. కేంద్రానిదా? రాష్ట్రానిదా ?



రీజినల్ రింగ్‌రోడ్డు దక్షిణ భాగానికి సంబంధించి అటు ఎన్‌హెచ్‌ఏఐ ఇటు రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరుగా డీపీఆర్‌ల తయారీకి ఏర్పాట్లు చేస్తుండటంతో ఇది ఎవరి పరిధిలోకి వస్తుందన్న గందరగోళం నెలకొంది.

- వివరాలు 12లో▶

పైసా ఆదాయం పెరగలే!



కొత్త ఆర్థిక సంవత్సరం రాష్ట్ర ఖజానాకు అంతగా కలిసిరావడం లేదు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో వరుసగా రెండో నెలలో కూడా ఆదాయ పరిస్థితిలో మార్పు రాలేదు. రాష్ట్ర సొంత పన్నులు సహా అన్నీ కలిపి ఏప్రిల్ నెల తరహాలోనే మే నెలలోనూ రూ.16 వేల కోట్లు మాత్రమే సమకూరాయి.

- వివరాలు 12లో▶

కాచుకొని.. కాపాడుతారు



గోదావరిలో దూకి ప్రాణాలు తీసుకోవడానికి సిద్ధపడే వారికి నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం యంచ గ్రామ యువకులు బతుకుపై ఆశలు కలిగిస్తున్నారు. చావుకు, బతుక్కు మధ్యలో నిలిచి ఎంతో మంది ప్రాణాలు నిలబెడుతున్నారు.

- వివరాలు 2లో▶



థ్యాంక్స్ చెప్పడమంటే ఆయన ఉద్దేశంలో నోబెల్‌కు సిఫారసు చేయడం!

ఎన్నిక ఏకగ్రీవమే!

కమల దళపతిగా ఈటల, రాంచందర్‌రావులలో ఒకరికి అవకాశం

- ఆ దిశగా సమాలోచనలు చేస్తున్న అధిష్టానం.. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక నోటిఫికేషన్ విడుదల
- నేడు నామినేషన్ ప్రక్రియ.. రేపు ఎన్నిక



ఈటల



రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జ్ యెండల లక్ష్మీనారాయణ ఎన్నిక ప్రకటన విడుదల చేశారు. అధ్యక్ష స్థానానికి పోటీ చేయాలనుకునేవారు సోమవారం నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. జూలై 1వ తేదీన అధ్యక్ష ఎన్నిక జరుగుతుంది. ఈ మేరకు పార్టీ పెద్దలు ఎన్నిక ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. అధ్యక్ష ఎన్నిక ప్రక్రియలో 119 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, 38 జిల్లా శాఖల అధ్యక్షులు, 17 మంది జాతీయ కౌన్సిల్ సభ్యులు పాల్గొంటారు. రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించిన అంశంపై పార్టీ నాయకత్వం ఇప్పటికే సన్నాహక సమావేశం నిర్వహించింది. రంగారెడ్డి జిల్లా మన్నెగూడ సమీపంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ అభయ్‌పాటిల్, సంస్థాగత ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ తివారి తదితరులు పార్టీ రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేశారు. అధ్యక్ష ఎన్నికకు పెద్దగా పోటీ లేకుండానే..అందరి సమ్మతితో ఎన్నిక జరిపే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే సోమవారం నాటి నామినేషన్ల ప్రక్రియలో అందరి సమ్మతితో ఒక అభ్యర్థి మాత్రమే నామినేషన్ దాఖలు చేసేలా క్షేత్రస్థాయి నాయకత్వంతో సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది. నామినేషన్ వేసిన కొన్ని గంటల వ్యవధిలోనే నామినేషన్ పరిశీలన నిర్వహిస్తారు. ఒకరికంటే ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్ వేస్తే... విత్‌డ్రాకు కూడా అవకాశం ఉంటుంది. ఈ ప్రక్రియంతా నామమాత్రమేనని పార్టీ నేతలు అంటున్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఇప్పటికే పలువురు ఢిల్లీ పెద్దలను కలిసి అవకాశం కల్పించాలంటూ ఎవరికి వారు ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో పార్టీ అధిష్టానం క్షేత్రస్థాయి నాయకత్వంతో సమాలోచనలు చేసి

మిగతా 3వ పేజీలో ▶

కలసి తింటే కలదు సుఖం..

'కలసి తినే కుటుంబం కలసి ఉంటుంది' అని సామెత. కుటుంబ సభ్యులంతా కలసి కూర్చొని, భోజనం చేస్తే మనసుకు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుందని పూర్వీకులు తమ అనుభవంతో ఏర్పరచిన ఈ సంప్రదాయాన్ని ఇప్పుడు వైద్య పరిశోధకులు సైతం ధ్రువీకరిస్తున్నారు. 'కలసి ఉంటే కలదు సుఖం - కలసి తింటే కలదు ఆరోగ్యం' అని నిర్ధారణగా చెబుతున్నారు.

3లో





ఆర్టీసీ.. టూరిస్టు బస్సు

- రెగ్యులర్ సర్వీసులకు అదనంగా టూర్ ప్యాకేజీ బస్సులు
- పొరుగు రాష్ట్రాలతోపాటు, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు సర్వీసులు
- ముమ్మర ప్రచారం చేస్తూ పర్యాటకులను తరలిస్తున్న ఆర్టీసీ
- మంచి స్పందనతో సంస్థకు కాసులు కురిపిస్తున్న టూర్లు

- వివరాలు 16లో▶

డీఎస్ విగ్రహాన్ని అమిత్‌షా ఆవిష్కరించడమా?

ఈ చర్యతో డీఎస్ ఆత్మ క్షోభిస్తుంది: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్, పొన్నం, వీహెచ్

సాక్షి, హైదరాబాద్: బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లతో అసలు సంబంధమే లేని దివంగత పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి.శ్రీనివాస్ విగ్రహాన్ని.. సంఘ్ సిద్ధాంతాలు కలిగిన వ్యక్తులు ఆవిష్కరించడం బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఈ చర్యతో డీఎస్ ఆత్మ క్షోభిస్తుందని పేర్కొన్నారు. డీఎస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో కాంగ్రెస్ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, పలువురు సీనియర్ నేతలు, కార్పొరేషన్ల చైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో ఇష్టాగోష్టిలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. డీఎస్ జీవితాంతం లౌకిక వాదిగా ఉన్నారని.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. అలాంటి వ్యక్తి విగ్రహాన్ని బీజేపీలో కీలకంగా ఉన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆవిష్కరించడం బాధాకరమని అన్నారు. త్వరలోనే హైదరాబాద్‌లో మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు. వచ్చే నెల నాలుగో తేదీన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు. ఆ రోజున ఎల్బీ స్టేడియంలో గ్రామస్థాయి నేతలతో సభ జరుగుతుందని, 15 వేల మంది హాజరయ్యే ఈ సభకు కూడా ఖర్గే వస్తారని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడే వారికి నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన హైదరాబాద్ కాంగ్రెస్ నేతల సమావేశంలో ఆయన మట్లాడారు.

మీడియా ముసుగులో బీఆర్‌ఎస్‌పై దుష్ప్రచారం


మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: మీడియా ముసుగులో కొంతమంది బీఆర్‌ఎస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆరోపించారు. ఆయన ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మీడియాపై బీఆర్‌ఎస్ పార్టీకి గౌరవం ఉందని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు శిష్యుడు రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఒక మీడియా చానల్ ప్రసారం చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ వ్యతిరేకులంతా ఇప్పుడు ఏకమవుతున్నారని ఆరోపించారు. వారే బీఆర్‌ఎస్ పార్టీపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌పై వ్యక్తిగత ప్రసారాలు ఆపకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో పల్లె రవికుమార్, గజ్జెల నగేష్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీకి ఇవ్వండి

బీసీ నేత 'జాజుల'




సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిని బీసీ వర్గానికి చెందిన వ్యక్తికే ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ ముఖ్యమంత్రి నినాదంతో గత ఎన్నికల్లో హడావుడి చేసిన ఆ పార్టీ.. కనీసం అధ్యక్ష పదవినైనా బీసీకి ఇవ్వాలని సూచించారు. హరియాణాలో బీజేపీపై తీవ్ర వ్యతిరేకత ఉన్నప్పటికీ.. బీసీ ముఖ్యమంత్రి నినాదంతో ఆ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.



వంతెనపై నుంచి నదిలో దూకిన వారిని కాపాడిన మత్స్యకారుడు శ్రీకాంత్ (ఫైల్)

కాచుకొని.. కాపాడుతారు



యంచ-బాసర మధ్య ప్రవహిస్తున్న గోదావరి నది

బాసర గోదావరి వంతెనపై ఆపద్బాంధవులు

ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వారిని రక్షిస్తున్న యంచ యువకులు

ఐదేళ్లలో 450 మందిని కాపాడిన గ్రామస్తులు

బోధన్: బతకడానికి ఏ దారీ లేనప్పుడు గోదారే దిక్కు అని.. ప్రాణాలు తీసుకోవటానికి సిద్ధపడే వారికి ఆ గ్రామ యువకులు బతుకుపై ఆశలు కలిగిస్తున్నారు. చావుకు, బతుక్కు మధ్యలో నిలిచి ఎంతో మంది ప్రాణాలు నిలబెడుతున్నారు. వారే నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం యంచ గ్రామ యువత. యంచ గ్రామం గోదావరి నది ఒడ్డునే ఉంటుంది. అక్కడికి కిలోమీటర్ దూరంలో నది నిజామాబాద్, నిర్మల్ జిల్లాలను వేరు చేస్తుంది. నదికి ఇటువైపు నిర్మల్ జిల్లా బాసర ఆలయం ఉంది. ఈ ఆలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న రోడ్డు వంతెన కొంతకాలంగా ఆత్మహత్యలు, ఆత్మహత్యా యత్నాలకు కేంద్ర బిందువుగా మారింది. అక్కడే యంచ గ్రామ యువకులు నిత్యం కాపుకాసి ఎందరినో రక్షిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గత ఐదేళ్లలో వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసిన సుమారు 450 మందిని రక్షించారు. ఇందులో మత్స్యకారులు కీలక పాత్ర పోషిస్తున్నారు. యంచ గ్రామ యువకులు ప్రవీణ్, వినోద్, మహిపాల్, భూంరాజ్, క్రిష్ణ, యోగేష్, ప్రణయ్, ప్రణీత్, లింగన్న, భోజన్న, ప్రశాంత్, శ్రీకాంత్, బాబు, బేగరి సాయిలు, విజయ్, కిషోర్, రామక్రిష్ణ, నగేష్, సాయి శంకర్, సాయిబాబా ఒక్కొక్కరు పదుల సంఖ్యలో ప్రాణాలు కాపాడారు.



వంతెనపై కాపుకాస్తున్న యంచ గ్రామస్తులు

వాట్సాప్ గ్రూప్‌లో ఏకమై..

యంచ గ్రామంతోపాటు సమీపంలోని అల్జాపూర్ యువకులు గ్రామ పంచాయతీ (జీపీ) పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసుకున్నారు. నది వంతెన దాటి బాసర ప్రాంతంలో వ్యవసాయ పనుల కోసం యంచ గ్రామ రైతులు వెళ్లి వస్తుంటారు. వంతెనపై ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే వాట్సాప్ గ్రూప్‌లో సమాచారం చేరవేస్తారు. దీంతో గ్రామంలో ఎవరు అందుబాటులో ఉన్నా వెంటనే వంతెన వద్దకు చేరుకుంటారు. ఆత్మహత్యా ప్రయత్నం చేసేవారితో మాట్లాడి, మనసు మార్చి.. నవీపేట, బాసర పోలీసుల సహకారంతో వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తారు.

బలవన్మరణాలు వేదన కలిగిస్తున్నాయి

పురాతన ఆలయాలతో పుణ్య క్షేత్రంగా విరాజిల్లుతున్న మా ఊరు తీరాన బలవన్మరణాలు వేదన కలిగిస్తున్నాయి. గోదావరి వంతెన వద్ద ఆత్మహత్యలను ఆపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. వంతెన మీద ఇనుప కంచెను, సీసీ కెమెరాలు, పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలి. నేను 50 మంది ప్రాణాలు కాపాడాను.

- ప్రవీణ్, యంచ మాజీ సర్పంచ్ భర్త

25 మంది ప్రాణాలు కాపాడాను

నాలుగేళ్లలో వంతెనపై నుంచి నదిలో దూకేందుకు వచ్చిన 25 మందికి పైగా వ్యక్తులను అడ్డుకుని ప్రాణాలు రక్షించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించాను.

- మహిపాల్, యంచ గ్రామ యువకుడు

నిత్యం కనిపెడుతుంటాను

నిత్యం వంతెన మీదుగా బాసర ట్రిపుల్ ఐటీకి విధుల కోసం రాకపోకలు సాగించే సమయంలో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను కనిపెడుతుంటాను. రెండేళ్ల క్రితం ఓ వ్యక్తి ముగ్గురు పిల్లలతో వంతెన పై నుంచి దూకేందుకు రాగా వారిని అడ్డుకుని తిరిగి పంపించాను.

- ప్రణీత్, యంచ గ్రామం, బాసర ట్రిపుల్ ఐటీ ఉద్యోగి

నదిలో మునిగి పోతున్నవారిని బయటకు తెచ్చాం

- సుమన్, శ్రీకాంత్, భోజన్న, సురేష్, లింగం

యంచ గ్రామ మత్స్యకారులు

కాంగ్రెస్‌కు ఏటీఎం

▶ మొదటి పేజీ తరువాయి

గత పదేళ్లలో పాకిస్తాన్‌కు భారత్ తడాఖా ఏంటో చూపించింది. పదేళ్లలో మూడుసార్లు ఆ దేశంపై దాడి చేసింది. సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్ చేశాం. యూరి, పుల్వామా, పహల్‌గామ్ దాడులకు దీటైన బదులు ఇచ్చాం. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ గడ్డపైకి వెళ్లి దాడి చేశాం. అక్కడి ఉగ్రవాదుల స్థావరాలను భారత సైన్యం ధ్వంసం చేసింది. కీలక టెర్రరిస్టులను మట్టుబెట్టింది. కానీ గతంలో కాంగ్రెస్ సర్కార్.. పాకిస్తాన్ విషయంలో మెతక వైఖరి అవలంబించింది..' అని అమిత్‌షా విమర్శించారు.

2026 మార్చిలోగా నక్సల్స్ ఏరివేత

'దేశ భద్రతను మోదీ ప్రభుత్వం పటిష్టం చేస్తోంది. దేశంలో అశాంతికి కారణమైన నక్సల్స్ ఏరివేతకు ఆపరేషన్ కగార్ చేపట్టాం. (ఆపరేషన్ కగార్ చేయాలా.. వద్దా అని సభికులను ప్రశ్నించారు) దశాబ్దాలుగా నక్సల్స్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. లొంగిపోవాలని గతంలోనే హెచ్చరించినా లొంగిపోలేదు. అందుకే కగార్ చేపట్టాం. 2026 మార్చిలోగా దేశంలో నక్సల్స్ లేకుండా చేసి ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకుంటాం' అని కేంద్ర హోంమంత్రి విజ్ఞప్తి చేశారు.

పసుపు పంటకు రాజధానిగా ఇందూరు

'తెలంగాణ రైతులకు ఇచ్చిన హామీ మేరకు మోదీ ప్రభుత్వం జాతీయ పసుపు బోర్డును నిజామాబాద్‌లో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. భారతీయ సంప్రదాయాల్లో, ఔషధాల తయారీలో వినియోగించే పసుపు పంటను నిజామాబాద్ జిల్లా రైతాంగం అధికంగా సాగు చేస్తోంది. అందుకే ఈ ప్రాంత రైతుల ఆకాంక్షను గౌరవిస్తూ ప్రధాని మోదీ నిజామాబాద్‌లో పసుపు బోర్డును నెలకొల్పారు. ఇప్పుడు నిజామాబాద్ పసుపు పంటకు రాజధాని నగరంగా మారింది. నిజామాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తుంది. అనేక దశాబ్దాలుగా ఈ పంట పండిస్తున్నప్పటికీ రైతులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా లాభాలు సమకూరడం లేదు. ప్రస్తుతం బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు ఇప్పుడు అందుతున్న మద్దతు ధర కంటే రానున్న రెండు మూడు సంవత్సరాల్లో క్వింటాలుకు అదనంగా కనీసం రూ.7వేల వరకు ఎక్కువ ధర దక్కుతుంది. ఎగుమతులు భారీగా పెరిగితే ధర కూడా భారీగా పెరిగిపోతుంది. పసుపు బోర్డు ద్వారా రైతులకు నాణ్యమైన పంటను సాగు చేసేలా శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, ఎగుమతుల వరకు దళారుల ప్రమేయం లేకుండా చేయడం జరుగుతుంది.



పసుపు వంగడాలను పరిశీలిస్తున్న అమిత్ షా, బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎంపీ అర్వింద్ తదితరులు

2030 వరకు అంతర్జాతీయ స్థాయిలో ఒక బిలియన్ డాలర్ల విలువ చేసే పసుపు ఉత్పత్తులను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం భారత్ కోఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్, ఆర్గానిక్ పంటను ప్రోత్సహించేందుకు రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను నెలకొల్పుతోంది..' అని అమిత్‌షా వెల్లడించారు.

స్థానిక రైతుల పోరాటం ఫలించింది: తుమ్మల

పసుపు బోర్డును ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. బోర్డు ఏర్పాటుతో ఈ ప్రాంత రైతుల పోరాటం ఫలించినట్లయిందని అన్నారు. బోర్డు ద్వారా అధునాతన సాగు విధానాలు, యాంత్రీకరణ, సరికొత్త పరిశోధనలు, మెరుగైన మార్కెటింగ్, ఎగుమతుల వంటి వసతులతో పసుపు రైతులకు ప్రయోజనం కలిగేలా కేంద్రం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతుల సంక్షేమమే పరమావధిగా పాలన చేస్తోందని, రైతాంగ ప్రయోజనాల కోసం ఏడాది కాలంలోనే రూ.లక్ష కోట్ల వరకు ఖర్చు చేశామని చెప్పారు. బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ.. పసుపు బోర్డును ఏర్పాటు చేసినందుకు ప్రధాని మోదీకి, అమిత్‌షాకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బోర్డు కార్యదర్శి భవానిశ్రీ, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య, మానాల మోహన్‌రెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అమిత్‌షా నగరంలో డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. సాయంత్రం 5.45 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి తిరిగివెళ్లారు.





పసుపు బోర్డు లోగోను ఆవిష్కరిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా. చిత్రంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఎంపీలు అర్వింద్, లక్ష్మణ్, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, భూపతిరెడ్డి ● సభకు హాజరైన రైతులు

రేవంత్ సర్కార్‌పై దర్యాప్తు ఎందుకు చేయించడం లేదు?

- ఒక్క పసుపు బోర్డును ఎన్నిసార్లు ప్రారంభిస్తారు?
- కేంద్ర మంత్రి అమిత్‌షాని ఎక్స్‌లో ప్రశ్నించిన మాజీ మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కార్‌పై అవినీతి ఆరోపణలు చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీబీఐ, ఈడీలతో వెంటనే విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆర్‌ఆర్ ట్యాక్స్ పేరిట రాహుల్-రేవంత్ కలిసి తెలంగాణను దోచుకుంటున్నారని గతంలో ఆరోపించిన ప్రధాని మోదీ, ఇప్పటి వరకు దర్యాప్తునకు ఆదేశించకపోవడానికి కారణమేంటో చెప్పాలన్నారు. దేశ ప్రధాని హోదాలో మోదీ, కేంద్ర హోంమంత్రిగా అమిత్ షా తెలంగాణకు వచ్చి సీఎంపై కేవలం అవినీతి ఆరోపణలు చేస్తే సరిపోతుందా అని కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ఢిల్లీ కాంగ్రెస్ పార్టీ పెద్దలకు తెలంగాణలోని రేవంత్ సర్కార్ ఏటీఎంలా మారిపోయిందని నిజామాబాద్ గడ్డపై తేల్చిచెప్పిన అమిత్‌షా, కేంద్ర హోంమంత్రి హోదాలో విచారణకు ఆదేశించి నిజాయితీ నిరూపించుకోవాలన్నారు. ధాన్యం దిగుబడిలో దేశంలోనే నంబర్‌వన్ స్థానానికి తెలంగాణ ఎదగడంలో కీలకపాత్ర పోషించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై అమిత్‌షా బురద జల్లడం అత్యంత దురదృష్టకరం అని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో పసుపు బోర్డుకు నిధులు కేటాయించకుండా, ఆఫీసుకు రిబ్బన్ కట్ చేస్తే నయాపైసా ప్రయోజనం ఉండదని కేటీఆర్ స్పష్టం చేశారు. పసుపు బోర్డు కార్యాలయానికి సొంత భవనం నిర్మించకుండా కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనే ఆఫీసును ప్రారంభించడం సమంజసమేనా అని ప్రశ్నించారు. పసుపు బోర్డు కార్యాలయాన్ని నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేస్తున్నామని ఈ జనవరి 14న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తే, ఇవాళ పసుపు బోర్డు కార్యాలయాన్ని మరోసారి అమిత్ షా ప్రారంభించడం బీజేపీ చేసే జుమ్లా పనులకు, చెప్పే జూటా మాటలకు నిదర్శనం అని కేటీఆర్ విమర్శించారు. నదుల అనుసంధానం ముసుగులో ఏపీలోని టీడీపీ ప్రభుత్వం చేపట్టిన బనకచర్లకు కేంద్రం బంగారు బాటలు వేయడం గోదావరిపై తెలంగాణ రైతుల హక్కులను కాలరాయడమే అని కేటీఆర్ మండిపడ్డారు.

పసుపు బోర్డు కాదు.. మద్దతు ధర కావాలి

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పసుపు రైతులకు కావాల్సింది తాత్కాలిక కార్యాలయాలు, రెండుసార్ల ప్రారంభోత్సవాలు కాదని, పసుపు రైతుకు మద్దతు ధర కావాలని, ఇప్పుడున్న పసుపు బోర్డు నాలుక గీసుకోవడానికి కూడా పనికిరాదని మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలో కేంద్రమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై ఆయన ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశంలో 70 శాతం పసుపు తెలంగాణలో పండుతుందని, పసుపు బోర్డు కోసం కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ప్రయత్నాలు చేసినా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకరించలేదన్నారు. 2025లో పసుపు బోర్డు కార్యాలయం ఏర్పాటు చేసినా, నిధులు కేటాయించలేదన్నారు. స్థానిక ఎన్నికల డ్రామాలో భాగంగా మరోసారి పసుపు బోర్డును ప్రారంభించారని విమర్శించారు. దీనికి జిల్లాలోని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, ఎంపీలకు ఆహ్వానం రాలేదన్నారు. పసుపు బోర్డుకు ఇప్పటివరకు పాలకవర్గం లేదన్నారు. బోర్డుకు పార్లమెంట్ చట్టం లేదని విమర్శించారు. వ్యక్తిగత ఆరోపణలు చేస్తే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అభిమానులు తిరగబడతారని చెప్పారు. మీడియా ముసుగులో ఒక సెక్షన్ ఆఫ్ మీడియా పరిధులు దాటితే మేము కూడా మా పరిధులు దాటుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు గ్యాదరి బాలమల్లు, మన్నె గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నై.. తెలంగాణ అన్న వ్యక్తి సీఎం గద్దెనెక్కారు: హరీశ్‌రావు



అమరచింత: తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న సమయంలో 'నై తెలంగాణ'అన్న వ్యక్తి, నేడు తెలంగాణ సీఎంగా గద్దెనెక్కి, ఇక్కడి వనరులను ఆంధ్రకు మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. వనపర్తి జిల్లా అమరచింతలో ఆదివారం రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాయిచంద్ విగ్రహావిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా పోటీ చేస్తే, తన పాటల తూటాలతో రేవంత్‌ను అక్కడి నుంచి తరిమికొట్టిన ఘనత సాయిచంద్‌కే దక్కిందన్నారు. అలాంటి సాయి మన మధ్య లేకపోవడంతోనే ఈనాడు నై తెలంగాణ అన్న వ్యక్తులు రాజ్యమేలుతున్నారని దుయ్యబట్టారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో జరుగుతున్న కుట్రలను ప్రతి తెలంగాణ వాది అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కేసీఆర్‌ను నామరూపాలు లేకుండా చేస్తా అని ప్రగల్భాలు పలుకుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ ఒక శక్తి అనే విషయాన్ని మరచిపోతున్నారన్నారు. ఆసరా పెన్షన్ల పెంపు ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మరో నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సాగే కాదు.. ఎగుమతులు కూడా

పసుపు రైతుల దశ మార్చనున్న బోర్డు

- భారత్ ఆర్గానిక్ కోఆపరేటివ్ లిమిటెడ్ ఏర్పాటుకు కేంద్రం సన్నాహాలు
- స్థానికంగా ఆర్ అండ్ డీ సెంటర్ ఏర్పాటు చేస్తామన్న అమిత్‌షా
- ఐదేళ్లలో బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులకు ప్రణాళికలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్‌లో ఏర్పాటు చేసిన పసుపు బోర్డుకు అనుబంధంగా పసుపు ఎగుమతుల పెంపు లక్ష్యంతో 'భారత్ ఆర్గానిక్ కోఆపరేటివ్ లిమిటెడ్'ను ఏర్పాటు చేసి దాని ఆధ్వర్యంలో ఆర్గానిక్ పసుపు పండించే విషయమై స్థానికంగా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ) సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్న కేంద్ర సహకార, హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటనతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. అదేవిధంగా కోఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్ ఓరియంట్ యూనిట్ ఏర్పాటుకు సైతం కేంద్రం సన్నాహాలు చేస్తుండటంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దీని ద్వారా పసుపు బ్రాండింగ్-మార్కెటింగ్-ఎక్స్‌పోర్ట్ పాలసీతో వచ్చే ఐదేళ్లలో ఒక బిలియన్ డాలర్ల (రూ.8 వేల కోట్లు) ఎగుమతులు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో 'ఇందూరు బ్రాండ్' పేరిట తామే పసుపు సేద్యం చేయడంతో పాటు ఎగుమతులు చేసేందుకు కూడా అవకాశాలు లభిస్తాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎగుమతులు భారీగా పెరిగితే ప్రస్తుతం ఉన్న క్వింటాల్ పసుపు ధర రూ.15 వేల నుంచి రూ.50 వేలకు పెరుగుతుందని చెప్పడంతో రైతుల్లో ఉత్సాహం వెల్లువెత్తుతోంది. తమ ప్రాంతానికి అంతర్జాతీయ ఖ్యాతి దక్కుతుందంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విత్తనం నుంచి ఎగుమతుల వరకు అండగా..

కొంతకాలం క్రితం వరకు సుగంధ ద్రవ్యాల బోర్డు కింద ఉన్న పసుపు పంటను విడదీసి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పసుపు బోర్డు ఏర్పాటు చేయడమే కాకుండా దీన్ని నిజామాబాద్‌లో నెలకొల్పింది. ప్రత్యేక బోర్డుతో రైతులకు అభివృద్ధి చేసిన, తెగుళ్లు తట్టుకునే కొత్త వంగడాలు అందుబాటులోకి వస్తాయి. విత్తనాలు మొదలు పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ వరకు రైతులకు సహకారం లభిస్తుంది. అవసరాన్ని బట్టి పసుపు బోర్డు రైతులకు విత్తనం అందించి పంటను బై బ్యాక్ చేసే అవకాశాలు కూడా ఉంటాయి. మరోవైపు రాయితీలు సైతం పెరుగుతాయి. పసుపు తవ్వకం, ఆర బెట్టడం, ఉడక బెట్టడం, ఎండబెట్టడం, పాలిష్ చేయడానికి అవసరమైన యంత్రాలను రాయితీపై అందిస్తారు. కొత్త వంగడాల అభివృద్ధితో పాటు పసుపు పంట విత్తిన తర్వాత సాగుకు శాస్త్రీయ, సాంకేతిక పద్ధతులు అవలంబించే విషయంలో శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇస్తారు. తద్వారా దిగుబడి పెరడమే కాకుండా పంటలో నాణ్యతకు అవకాశం ఉంటుంది. ఇక పసుపు పంట మార్కెటింగ్ కోసం అంతర్జాతీయ కంపెనీలను తీసుకువచ్చే బాధ్యత సైతం బోర్డు తీసుకుంటుంది. ఎఫ్‌పీవోలు (రైతు ఉత్పత్తిదారుల సంఘాలు) ద్వారా పసుపు ఆరబెట్టి, ఉడకబెట్టి, పాలిష్ చేసి, పౌడర్ చేసి, ప్యాకెట్లు చేసి ప్రత్యేక బ్రాండ్ల ద్వారా నేరుగా ఎగుమతులు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు కూడా కేంద్రమంత్రి ప్రకటించారు. తదుపరి దశలో ఇక్కడ పసుపు శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేసేందుకు కూడా కేంద్రం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు జిల్లాకు పసుపు శుద్ధి కర్మాగారాలు తరలి వస్తాయని, దీంతో ఈ ప్రాంతంలో ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని స్థానికులు చెబుతున్నారు.

సాగు పెంచేలా ప్రణాళికలు

పసుపు బోర్డు నేపథ్యంలో పసుపు సాగు విస్తీర్ణాన్ని 2008లో మాదిరిగా లక్ష ఎకరాలకు పైగా పెంచేలా ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు కేంద్రం ప్రణాళికలు తయారు చేస్తోంది. నిజామాబాద్ మార్కెట్‌కు గతంలో 12 లక్షల క్వింటాళ్లకు పైగా పసుపు వచ్చేది. రానురాను విస్తీర్ణం తగ్గడంతో పంట ఉత్పత్తి సైతం భారీగా తగ్గుతూ వస్తోంది. గత సీజన్‌లో రాష్ట్రంలో 40 వేల ఎకరాల లోపే పసుపు సాగు చేశారు. తాజాగా ముగిసిన సీజన్‌లో నిజామాబాద్ మార్కెట్‌కు 8 లక్షల క్వింటాళ్ల పసుపు మాత్రమే వచ్చింది. రాష్ట్రంలో మొత్తం పసుపు సాగులో 65 శాతం ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే ఉండటం గమనార్హం. తదుపరి స్థానాల్లో జగిత్యాల, నిర్మల్, వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాలు ఉన్నాయి.

రైతులకు ఎగుమతి అవకాశాలు



పసుపు బోర్డు ఏర్పాటుతో తెలంగాణలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుంది. భారత్ ఆర్గానిక్ కోఆపరేటివ్ లిమిటెడ్ పేరిట పసుపు ఎగుమతులు చేసేందుకు నేరుగా రైతులకే అవకాశం లభిస్తుంది. విలువ ఆధారిత పంట ఉత్పత్తులను రైతులే అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతి చేసే అవకాశం కలుగుతుంది. దీంతో రైతులకు మరింత లబ్ధి చేకూరుతుంది.

- పాట్కూరి తిరుపతిరెడ్డి, పసుపు రైతు, ఎఫ్‌పీవో చైర్మన్, మనోహరాబాద్

పోరాటానికి దక్కిన గౌరవం



పసుపు బోర్డు సాధన కోసం ఏళ్ల తరబడి అనేక పోరాటాలు చేశాం. ఈ క్రమంలో మాపై అనేక కేసులు అయ్యాయి. వీటికి సంబంధించి ఇప్పటికీ కోర్టుకు తిరుగుతున్నాం. పసుపు బోర్డు రావడంతో మా పోరాటానికి గౌరవం దక్కింది. 9 నెలల పాటు సాగు చేసే ఈ పంటకు బోర్డుతో మద్దతు ధర దక్కడంతో పాటు ఎగుమతులు సైతం చేసుకునే అవకాశం కలుగుతుందని ఆశిస్తున్నాం.

- చింతలపల్లి గంగారెడ్డి, పసుపు రైతు, మునిపల్లి

'కలిసి తినే కుటుంబం కలిసి ఉంటుంది' అని సామెత. కుటుంబ సభ్యులంతా కలిసి కూర్చొని, భోజనం చేస్తే మనసుకు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటుందని పూర్వీకులు తమ అనుభవంతో ఏర్పరచిన ఈ సంప్రదాయాన్ని ఇప్పుడు వైద్య పరిశోధకులు సైతం ధ్రువీకరిస్తున్నారు. 'కలిసి ఉంటే కలదు సుఖం - కలసి తింటే కలదు ఆరోగ్యం' అని నిర్ధారణగా చెబుతున్నారు. చక్కటి భోజన సంభాషణ మనిషిలోని నిస్సత్తువను పోగొడుతుందని, మానసిక ఒత్తిళ్ల నుంచి ఉపశమనం లభిస్తుందని, కుటుంబ సభ్యుల మధ్య బంధాలు మరింత బలపడతాయని మానసిక, వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.



కలిసి తింటే.. కలదు సుఖం

కబుర్లతో కాలక్షేపం.. కొసరికొసరి వడ్డనలు

ఈ 'రౌండ్ టేబుల్'తో ఇంటిల్లిపాదికీ ఆరోగ్యం

మంచి మాటలతో అందరి మనసులకూ ఆహ్లాదం

మంచి ఔషధమంటున్న మానసిక, వైద్య నిపుణులు

ఆస్వాదనతో పాటు అనుభూతి!

కుటుంబ సభ్యులను ఆత్మీయతలతో పెనవేసే అనేక అంశాలలో 'అందరూ కలిసి భోజనం చేయటం' అనే అలవాటు ముఖ్యమైనది. భోజనాన్ని ఆస్వాదిస్తూనే, సంభాషణలను అనుభూతి చెందే అవకాశం డైనింగ్ టేబుల్ మీద ఉంటుంది. కుటుంబానికి ఇంతకంటే ముఖ్యమైన 'రౌండ్ టేబుల్ సమావేశం' మరొకటి ఉండదు. ఉల్లాసకరమైన మాటలు వస్తాయి. ఉత్తేజకరమైన నవ్వులు పూస్తాయి. ఆహ్లాదం ఘుమఘుమలాడుతుంది. సందట్లో ఓ నాలుగు ముద్దలు ఎక్కువ తింటాం. అందుకే భోజన సంభాషణ అంటే కేవలం ఒక మంచి విషయం మాత్రమే కాదు, మానసికమైన ఆరోగ్యం కూడా అంటున్నారు మనోవైజ్ఞానిక నిపుణులు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

జెన్–జి తరానికి తప్పనిసరి

భోజన సంభాషణలు కేవలం ఆచారాలు కావు. ఇవి రోజువారీ నిస్సత్తువను పోగొట్టి, మానసిక ఆరోగ్యాన్నిచ్చే సందర్భాలు కూడా. భారతీయ సంస్కృతిలో అంతర్లీనమైనదిగా ఉన్న ప్రియ భోజన భాషణ ఇప్పటి జెన్–జి తరానికి తప్పనిసరి అవసరం అని అధ్యయనాలు చెబుతున్నాయి. భోజనం చేసే సమయంలోని మనోల్లాసమైన సంభాషణలు మెదడును నెమ్మదింపజేస్తాయి. నాడీ వ్యవస్థను నియంత్రించడంలో, ఒత్తిడిని తగ్గించడంలో తోడ్పడతాయి. అయితే ఆధునిక జీవన శైలిలోని ఉరుకులు పరుగుల వల్ల వ్యక్తిగత జీవితంలోకి వృత్తిపరమైన బాధ్యతలు చొరబడి, ఇంటిల్లపాదీ కలిసి కూర్చొని భోజనం చేసే సంప్రదాయం నెమ్మదిగా అంతరించిపోతోంది.

ఆసక్తి ఉన్నా అవకాశం లేదు

ఈ తరం పిల్లలు భోజనానికి కలవరు. ఇంటి సంభాషణలపై ఆసక్తి చూపరు. అలాగని కుటుంబ సంబంధాలు, కుటుంబ భోజనాలపై వారు మరీ అంత నిర్లిప్తంగా కూడా ఏమీ లేరు. 1996 తర్వాత జన్మించిన 2,000 మందిపై జరిగిన ఒక అధ్యయనం ప్రకారం 64 శాతం మంది తమ స్నేహితులు, కుటుంబ సభ్యులతో భోజన సంభాషణలను జరపటంలో ఆసక్తి చూపారు. అదే సమయంలో.. అందుకు అవకాశం ఉండటం లేదని అన్నారు. ఎవరికి వారుగా భోజనం ముగించే వ్యక్తిగత వ్యవహారంగా మారిన ప్రస్తుత తరుణంలో.. కుటుంబ బంధాలు మెరుగవ్వాలంటే కలిసి కూర్చుని కబుర్లు చెప్పుకొంటూ భోజనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

భోజన సమయ బంధుత్వాలు..: చిన్న కుటుంబాల్లో పెద్ద వాళ్లకు చోటు ఉండదు. కానీ భోజన సమయంలో పెద్ద వాళ్ల గురించిన కథలకు చోటు లేకుండా ఉండదు. తరాల కథలు మాటల్లోకి వస్తాయి. పారంపర్య కుటుంబ గాథలు ఇష్టమైన భోజనంలా అనిపిస్తాయి. 'మరి కాస్త వడ్డించు' అని అడిగినట్లుగా వంశవృక్షంలోని తాత ముత్తాల గురించి 'ఇంకా చెప్పు' అని కుతూహలంగా అడిగి మరీ చెప్పించుకుంటారు. ఎంతో ముఖ్యమైన రేపటి ఆ 'ముఖ్యమైన సమావేశం' గురించిన ఆలోచన మదిలోకే రాదు. అంతా కలిసి భోంచేస్తున్నారు కదా పాపం.. అని డెడ్‌లైన్‌లు డైనింగ్ హాల్ బయటే ఉండిపోతాయి. ఇక భోజన సమయంలో 'నో–ఫోన్ పాలసీ' పెట్టుకుంటే కడుపు నిండా కబుర్లు.. కళ్ల నిండా కమ్ముకునే నిద్ర మేఘాలు.

'బర్నౌట్'కు తగిన చికిత్స..: ఒత్తిడి, అలసట. శక్తి క్షీణత.. అన్నీ కలిసి ప్రపంచాన్ని ఇప్పుడు 'బర్నౌట్' చేసేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ బర్నౌట్‌ను 'పని ఒత్తిడి సిండ్రోమ్'గా వర్ణించింది. ప్రస్తుతం ఈ డిజిటల్ ప్రపంచంలో బర్నౌట్ కాని వారు లేరంటే అతిశయోక్తి కాదు. 2024 సెప్టెంబర్‌లో భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఫిక్కీ), బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ సంయుక్తంగా నిర్వహించిన ఓ అధ్యయనం.. 58 శాతం మంది భారతీయులు పనిలో అమితంగా బర్నౌట్ అవుతున్నట్లు వెల్లడించింది. ఈ బర్నౌట్ నుంచి బయటపడేందుకు కుటుంబంతో కలిసి భోజనం చేయటం ఒక మంచి మార్గమని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా, సానుకూల భోజన సంభాషణలు.. ఒత్తిడికి మూలమైన 'కార్టిసాల్' అనే హార్మోన్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడే 'ఆక్సిటోసిన్' హార్మోన్‌ను విడుదల చేస్తాయి. ఆక్సిటోసిన్ సామాజిక బంధాలకు, సంతానోత్పత్తికి దోహదపడుతుంది. లైంగిక సామర్థ్యం పెంచడంలో కీలకపాత్ర పోషిస్తుంది. దీని వల్ల మెదడుకు విశ్రాంతి లభిస్తుంది.

మాటలు ప్లేట్లు దాటకూడదు!..: భోజన సంభాషణలు తేలికగా ఉన్నప్పుడే కలిసి భోజనం చేయటం వల్ల ప్రయోజనాలు చేకూరుతాయి. లేదంటే, ఒంటరిగా తినడమే నయం అనే నిస్పృహలోకి వెళ్లిపోతారు. పచ్చళ్ల దగ్గర మొదలై పంతాలూ పట్టింపుల వరకు వెళ్లిపోతే.. కలిసి భోజనం చేయకపోతేనే ఉత్తమం. చాలా వరకు సంభాషణ ఆహార పదార్థాల చుట్టూరానే తిరగాలి. మాటల్లోనే మాధుర్యం ఒలకాలి. ఇంట్లో ఎవరు ఏది ఇష్టంగా తింటారో సరదాగా చర్చించుకోవాలి. రుచికరమైన వంటకాలు చేసిన వారిని ప్రశంసించడం.. ఈ చర్చా కార్యక్రమాన్ని రక్తికట్టించే అసలైన ప్రధాన ముడిసరుకు. అది మన అభిరుచిని తెలియజేయడమే కాదు.. మనకు ప్రేమగా వండిపెట్టిన వారి నైపుణ్యానికి కూడా దక్కాల్సిన కితాబు. వంటంతా ఒక ఎత్తయితే.. వడ్డన మరో ఎత్తు. ప్రేమగా, కొసరి కొసరి వడ్డిస్తుంటే.. ఎవ్వరూ నో చెప్పలేరు. అందుకే, అలా ప్రేమగా వడ్డించినవారిని కూడా మనస్ఫూర్తిగా మెచ్చుకోవాలి. కిందటి రోజు చూసిన సినిమా, ఆవకాయ పచ్చళ్లపై చర్చ, వంశపారంపర్య విశేషాల ప్రస్తావన.. కాదేదీ ప్రస్తావనకు అనర్హం. ఇలాంటి మంచి విషయాల చుట్టూ మాటలు సాగితే మనసుకు, దేహానికి మంచి మెడిసిన్ పడినట్లే.

జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ పెంపు

- 15 శాతం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు
- బకాయిలు సైతం చెల్లించేలా ఆదేశాలు
- మంత్రి దామోదర చర్చలు సఫలం ..సమ్మె ప్రతిపాదనను విరమించుకున్న జూడాలు



మంత్రి దామోదరకు వినతిపత్రం ఇస్తున్న జూడాలు

సాక్షి, హైదరాబాద్/సంగారెడ్డి : ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని ఎంబీబీఎస్, డెంటల్ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ చేస్తున్న వైద్య విద్యార్థులతోపాటు పీజీ వైద్యవిద్య అభ్యసిస్తున్న డాక్టర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇంటర్న్‌షిప్ విద్యార్థులతోపాటు పీజీ డాక్టర్లు, సీనియర్ రెసిడెంట్ల స్టైపెండ్‌ను 15 శాతం పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు జీవో 90ను విడుదల చేసూ ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఉత్వర్వులిచ్చారు. మరోవైపు పెంచిన స్టైపెండ్స్‌ను ఇకపై ప్రతి నెలా 10వ తేదీన చెల్లించాలని అధికారులను మంత్రి దామోదర ఆదేశించారు. ఈ మేరకు సంవత్సరానికి సరిపడా స్టైపెండ్స్ చెల్లించేందుకు అవసరమైన బీఆర్వోను (బడ్జెట్ రిలీజ్ ఆర్డర్) అధికారులు విడుదల చేశారు. పెండింగ్ స్టైపెండ్ బకాయిలను కూడా ప్రభుత్వం విడుదల చేసింది.

పెరగనున్న స్టైపెండ్

ప్రస్తుతం హౌస్‌సర్జన్ (మెడికల్, డెంటల్)కు ప్రతినెలా రూ.25,906 స్టైపెండ్ ఉండగా, ఇక నుంచి ప్రతినెలా రూ.29,792 అందనుంది. పీజీ డాక్టర్లకు ఫస్ట్ ఇయర్‌లో రూ.58,289 ఉండగా, ఇక నుంచి రూ.67,032, సెకండ్ ఇయర్‌లో రూ.61,528 ఉండగా, ఇక నుంచి రూ.70,757, ఫైనల్ ఇయర్‌లో రూ.64,767 ఉండగా, ఇప్పటి నుంచి రూ. 74,482 స్టైపెండ్ ఆయా మెడికోలకు అందనున్నది.

- పీజీ డిప్లమో విద్యార్థులకు ఫస్ట్ ఇయర్‌లో రూ.58,289 ఉండగా, ఇక నుంచి రూ.67,032 స్టైపెండ్ రానున్నది. సెకండ్ ఇయర్‌లో రూ.61,528 ఉండగా, ఇక నుంచి రూ. 70,757 చొప్పున స్టైపెండ్ రానున్నది.

సూపర్ స్పెషాలిటీ డాక్టర్లకు రూ.లక్ష పైనే..

మరోవైపు సూపర్ స్పెషాలిటీ డాక్టర్లకు ఫస్ట్ ఇయర్‌లో రూ.92575 ఉండగా, అది రూ. 1,06,461కి పెరిగింది. సెకండ్ ఇయర్‌లో రూ. 97,204 ఉండగా, ఇక నుంచి రూ.1,11,785 అందనుంది. థర్డ్ ఇయర్‌లో రూ.1,01,829 ఉండగా, ఇక నుంచి రూ, 1,17,103కి చేరనున్నది. ఎండీఎస్ ఫస్ట్ ఇయర్‌లో రూ.58,289 ఉండగా, ఇక నుంచి రూ. 67,032 ఇవ్వనున్నారు. సెకండ్ ఇయర్‌లో రూ. 61,528 ఉండగా, ఇక నుంచి రూ. 70,757, థర్డ్ ఇయర్‌లో రూ.64,767 ఉండగా, ఇక నుంచి రూ.74,482కి పెరగనున్నది. సీనియర్ రెసిడెంట్స్‌కు రూ.92,575 ఇక నుంచి రూ.1,06,461 చేరనున్నది. ప్రైవేట్ వైద్య కళాశాలల్లోని విద్యార్థులు తమకు కనీస స్టైపెండ్ కూడా ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలల వద్ద ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

జూడాలతో చర్చలు సఫలం

జూనియర్ డాక్టర్లతో మంత్రి దామోదర రాజనర్సింహ ఆదివారం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. సంగారెడ్డిలోని తన నివాసానికి జూడాలను చర్చలకు ఆహ్వానించిన మంత్రి సుదీర్ఘంగా చర్చలు జరిపి వారి డిమాండ్లను అంగీకరించారు. జూడాల డిమాండ్లను దశలవారీగా నెరవేరుస్తామని మంత్రి స్పష్టం చేయడంతో వారు సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో జూడాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజయ్ కుమార్, జూడాల రాష్ట్ర అధ్యక్షుడు ఐజాక్ న్యూటన్, డాక్టర్లు కీర్తన ,గిరిప్రసాద్, సందీప్, అవినాశ్ పాల్గొన్నారు.

దుర్గమ్మకు బంగారు బోనం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని విజయవాడలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు హైదరాబాద్ భాగ్యనగర్ శ్రీ మహంకాళీ జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆదివారం బంగారు బోనాన్ని సమర్పించింది. జోగిని శ్యామలాదేవి, ఇతరులు మొత్తం 11 రకాల బోనాలతో ఊరేగింపుగా దుర్గమ్మ చెంతకు బయలుదేరగా.. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, పోతురాజు విన్యాసాలతో సాగింది. మంత్రి రామనారాయణ రెడ్డి, ఈఓ, అర్చకులు, వేద పండితులు బంగారు బోనానికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న కమిటీ.. బంగారు బోనం , పట్టుచీర, పూలు, పండ్లు, ఇతర సామగ్రిని వారికి అందజేసింది.

భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం

జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి



జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

చందానగర్: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ గుర్తింపు సాధించిందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి పేర్కొన్నారు. గోపన్‌పల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత దేశం తీసుకునే నిర్ణయాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వస్తున్నదని,అందులో అనేకం ఉన్నా, కోవిడ్ సమయంలో వ్యాక్సిన్ రూప కల్పనే నిదర్శనమన్నారు. అన్ని దేశాల్లో భారతీయులు నివాసముంటున్నారని,అక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా కేంద్రం జోక్యం చేసుకొని వారిని తిరిగి మనదేశానికి తీసు తీసుకొస్తోందన్నారు పలు అంతర్జాతీయ, జాతీ య అంశాలపై పలు ప్రశ్నలతో విద్యా ర్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. నగరంలోని 30 స్కూళ్ల నుంచి 350 ప్రతినిధులు విస్మన్-2025లో పాల్గొన్నారు. ముగింపు వేడుకల్లో వివిధ రకాల ట్రోఫీలు, నగదు పురస్కారాలను విద్యార్థులకు అందించారు.

రేపటి నుంచి పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ కేటగిరీ–2 ప్రవేశాలకు జరిగే ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఆయా ఫ్యాకల్టీల డీన్లు విడుదల చేశారు. లా, ఎంబీఏ, కామర్స్, వ్యాయామ విద్య, ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, సైన్స్, ఇన్ఫర్మేటిక్స్, టెక్నాలజీ, ఫార్మసీ తదితర ఫ్యాకల్టీలలో పీహెచ్‌డీ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాలను ప్రకటించారు. జూలై 1 నుంచి 11 వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయి.

రేపటి నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

బాలానగర్: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ జూలై 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మొదటి విడతగా నిర్వహిస్తున్నట్లుగా జేఎన్‌టీ యూహెచ్ అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ బాలునాయక్ ఆదివారం తెలిపారు. కౌన్సెలింగ్‌కు వచ్చే అభ్యర్థులు హాల్‌టికెట్, ఎస్సెస్సీ మార్కుల మెమో, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్స్, టీసీ, ఆదాయ ధ్రువీ కరణ పత్రం , ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఏడు సంవత్సరాల నుంచి అభ్యర్థికి సంబంధించిన నివాస ధ్రువీకరణ పత్రాలను 1 సెట్ జిరాక్స్ కాపీలను తీసుకొని రావాలి. ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని రావాలి.

వైద్యారోగ్య శాఖలో 16,448 మంది తాత్కాలిక ఉద్యోగుల సర్వీసు ఏడాది పెంపు

గతేడాదితో పోలిస్తే తగ్గిన తాత్కాలిక ఉద్యోగుల సంఖ్య

సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్య శాఖ పరిధిలోని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విభాగంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సేవలు అందిస్తున్న ఉద్యోగుల సర్వీస్‌ను ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈ ఏడాది మార్చితో ఈ విభాగంలో పనిచేస్తున్న వారి కాంట్రాక్టు గడువు ముగిసినా, మూడు నెలలుగా రెన్యూవల్ చేయలేదు. ఈ నేపథ్యంలో తాత్కాలిక ఉద్యోగుల సర్వీస్‌ను పొడిగించాలని ఇటీవల డీఎంఈ నరేంద్ర కుమార్ ప్రభుత్వానికి లేఖ రాయడంతో మంత్రి దామోదర రాజనర్సింహ ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. శనివారం ఆర్థికమంత్రి భట్టి విక్రమార్కతో సమావేశమైనప్పుడు పరిస్థితిని వివరించారు. దీంతో ఆర్థికశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా డీఎంఈ పరిధిలోని 16,448 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ కాలాన్ని మరో సంవత్సరం పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టుల్లో 4,772 కాంట్రాక్ట్ సర్వీసెస్ ఉండగా, 8,615 ఔట్ సోర్సింగ్ పద్ధతిలో, మరో 3,056 గౌరవ వేతనంతో కొనసాగనున్నాయి. ఐదు పోస్టులు మల్టీ టాస్కింగ్ స్టాఫ్ బేస్‌లో ఉన్నాయి. ప్రొఫెసర్ల నుంచి ప్లంబర్స్ వరకు వివిధ కేటగిరీల్లో ఉద్యోగులు ఉన్నారు. రెగ్యులర్ స్టాఫ్ నియామకమయ్యే వరకు వివిధ కేడర్లలోని ఉద్యోగులు కొనసాగుతారు. కాగా గత సంవత్సరంతో పోలిస్తే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య తగ్గించి ఏడాది కాలం సర్వీస్ పెంచినట్టు తెలుస్తోంది.

ఎస్సీ గురుకులంలో డిప్యూటేషన్ల లొల్లి !

- దాదాపు 150 మంది టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్లకు ఆకస్మిక స్థానచలనం
- విధుల్లో చేరిన కొందరు.. న్యాయస్థానాన్ని ఆశ్రయించిన మరికొందరు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్)లో ఉన్నతాధికారులు తీసుకుంటున్న ఆకస్మిక నిర్ణయాలు అటు విద్యార్థులకు, ఇటు సిబ్బందికి తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. డెడికేటెడ్ కాలేజీల పేరిట ఇటీవల పలు జూనియర్ కాలేజీల్లో కోర్సుల షిఫ్టింగ్‌తో పెద్ద సంఖ్యలో విద్యార్థులు సతమతమయ్యారు. తాజాగా సొసైటీ పరిధిలోని పలు పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న ట్రైన్డ్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్లు, జూనియర్ లెక్చరర్లకు డిప్యూటేషన్ పేరిట స్థానచలనం కలిగించింది. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి డిప్యూటేషన్ ఉత్తర్వులు జారీ చేశారు. సుదీర్ఘకాలం ఒకేచోట పనిచేసి కోరిన చోటుకు బదిలీ పొందిన పలువురు టీచర్లకు ఏడాదిలోపే డిప్యూటేషన్ పేరిట ఆకస్మిక బదిలీలు చేపట్టడంపై కొందరు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. వాస్తవంగా పనిచేసే చోటు నుంచి వందల కిలోమీటర్ల మేర డిప్యూటేషన్‌పై పంపడం ఇప్పుడు గురుకుల సొసైటీలో చర్చనీయాంశమైంది.

ప్రిన్సిపాల్స్ కమిటీ సూచనలతో...

టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ పరిధిలోని కాలేజీల్లో వినూత్న బోధన పద్ధతులు అనుసరించేందుకు సొసైటీ డెడికేటెడ్ కాలేజీల ఏర్పాటుకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా కొందరు సీనియర్ ప్రిన్సిపాల్స్‌తో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా పలు సంస్కరణలు చేపట్టింది. ఈ సంస్కరణలు ఇప్పుడు విద్యార్థులు, సిబ్బందిని ఇరకాటంలో పడేసినట్టయ్యింది. డెడికేటెడ్ కాలేజీల పేరిట పలు కాలేజీల్లో కోర్సులను షిఫ్ట్ చేసింది. ఆ మేరకు అక్కడ చదువుతున్న విద్యార్థులను కూడా షిఫ్ట్ చేసింది. ఇలా కోర్సుల షిఫ్టింగ్‌తో ఆయా కాలేజీల్లో ఉన్న బోధన సిబ్బందిని ఇతర కాలేజీలకు డిప్యూటేషన్‌పై పంపింది. బాలికల విద్యా సంస్థల్లో పనిచేస్తున్న పురుష టీచర్లను కూడా డిప్యూటేషన్ పద్ధతిలో స్థానచలనం కలిగించింది. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి వర్షిణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల్లో 140 మంది టీచర్లు వారికి నిర్దేశించిన విద్యాసంస్థల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అయితే ఆకస్మిక డిప్యూటేషన్లపై టీచర్ల నుంచి వ్యతిరేకత వస్తోంది. గతేడాది బదిలీల ప్రక్రియలో ఎంపిక చేసుకున్న స్కూళ్లు, కాలేజీల నుంచి ఆకస్మికంగా డిప్యూటేషన్‌పై పంపడాన్ని వ్యతిరేకిస్తున్నారు. గతేడాది బదిలీల సమయంలోనే ఈ నిబంధనలు అమలు చేస్తే అప్పట్లో తమకు అనుకూలమైన స్కూళ్లు, కాలేజీలను ఎంపిక చేసుకునే వాళ్లమంటూ సొసైటీ అధికారులపై మండిపడుతున్నారు. సాధారణ బదిలీలు జరిగే వరకు వాస్తవ పోస్టింగ్ ఉన్న చోటే కొనసాగించాలనే డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు కొందరు ఉపాధ్యాయులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఈ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది.

ఎన్నిక ఏకగ్రీవమే!

▶ మొదటి పేజీ తరువాయి

అభిప్రాయాలను సైతం స్వీకరించినట్టు తెలిసింది. అధ్యక్ష ఎన్నిక రిటర్నింగ్ అధికారిగా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే వ్యవహరిస్తారు.

నామినేషన్ల స్వీకరణ రాష్ట్ర కార్యాలయంలోనే

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికకు సోమవారం నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. అదేరోజు సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు పరిశీలన, ఉపసంహరణకు అవకాశం కల్పించారు. జూలై 1వ తేదీన అధ్యక్ష ఎన్నిక, ప్రకటన ఉంటుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పోటీలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు పేరు బలంగా వినిపిస్తున్నాయి. ఈసారి అధ్యక్ష స్థానాన్ని బీసీకే ఇస్తారనే ప్రచారం పార్టీ వర్గాల్లో జోరుగా వినిపిస్తోంది. ఈ క్రమంలో ఈటల బీసీ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో ఆయనకు అవకాశం ఎక్కువగా ఉంటుందనే ప్రచారముంది.



ధర్మం దుఃఖాన్ని నిర్మూలిస్తుంది. సంతోషాన్ని ఇస్తుంది.
ధర్మం అంటే శరీరం పట్ల కలిగే అనిత్య జ్ఞానం.
అందుకే అనిత్య స్వభావాన్ని నిరంతరంగా తెలుసుకుంటూ ఉండాలి.
– నయాజీ ఊ బా ఖీన్

సాక్షి
సోమవారం, 30 జూన్ 2025

నానాకాలం చదువులు

'వానాకాలం చదువు'లంటారు. ఇప్పటికీ దేశంలో చాలాచోట్ల వానకీ, చదువుకీ చుక్కెదురే. చెట్ల కిందో, అరుగుల మీదో, అంతంతమాత్రపు కప్పు కిందో బడులు నడిపేటప్పుడు; చక్కా నడిచి పోడానికి పక్కారోడ్లు లేనప్పుడు వానాకాలంలో చదువుకు గంట కొట్టి ఇంటికి పరిమితమవక తప్పదు. వెనకటి కాలంలో చదువు చెప్పే రోజులతో సమానంగా నిషేధించే రోజులూ ఉండేవి. అష్టమి, నవమి, చతుర్దశి, అమావాస్య, పౌర్ణమి మొదలైన తిథుల్లో, గ్రహణం పట్టినప్పుడూ అధ్యయనం కూడదు. వాటిని 'అనధ్యయన దినా'లనేవారు. వేదాలు, ఇతర రహస్య విద్యల వల్లింపైతే వర్షాకాలంలో పూర్తిగా నిషిద్ధం. నేర్చుకున్నది మాత్రం నెమరు వేసుకోవచ్చు.

క్రమంగా కేలండర్ మారిపోయి వర్షర్తువూ, చదువుల ఋతువూ ఒకేసారి మొదలవడం ప్రారంభించాయి. మినహాయింపులున్నా ఆ రెంటి మధ్యా వైరుధ్యం పోయి సయోధ్య వెల్లివిరుస్తోంది. వానలతో పచ్చదనాన్ని తెచ్చుకుని కొత్త ఉత్సాహాన్ని నింపుకొనే ప్రకృతితో చదువుల ఋతువు పోటీపడుతూ రహదారులనూ, బడితావులనూ పిల్లల సందడితో వర్ణరంజితమూ, కర్ణరంజితమూ చేస్తోంది. మరోపక్క విచిత్రంగా ముల్లు ఈ కొస నుంచి పూర్తిగా దాని వ్యతిరేక దిశకు తిరగడమూ జరుగుతోంది. చదువుల అభావ దినాలు పోయి ఉల్బణ దినాలు వచ్చాయి. ఋతు నిర్బంధాలూ, తిథివార నిషేధాలూ పోయి చదువుల కేలండర్ 'సార్వకాలికత'ను తెచ్చుకుంటోంది. వానా కాలం చదువులు పోయి నానాకాలం చదువులొచ్చాయి. అది మరోరకం వైపరీత్యానికి దారి తీసింది.

అంతటా కాకపోయినా, అనేక ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలలో వేసవి సెలవులు కుదించుకు పోతున్నాయి. ప్రత్యేకించి పబ్లిక్ పరీక్షలు రాయబోయే పిల్లలకు వేసవి తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ పైన వేసవి పొడవునా ట్యూషన్ తరగతులకు హాజరవడం అనివార్యమవుతోంది. భుజాలను వంచే పుస్తకాల బరువుకు తోడు మస్తకాలను భయాందోళనలతో నింపే చదువు బరువూ పెరిగిపోతోంది. 'స్కూలు వర్కు'ను మించి 'హోము వర్కు' నివ్వడంతో బడికీ, ఇంటికీ తేడా చెరిగిపోయి, వేరే వృత్తి ఉద్యోగాల్లో తలమునకలయ్యే తల్లితండ్రులే టీచర్లు గానూ మారి, అదనపు భారాన్ని మోయాల్సి వస్తోంది. తల్లుల పరిస్థితి మరీ ఘోరం. ఉద్యోగానికి అదనంగా వంటపనీ, ఇంటిపనీ, పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూనే ఉపాధ్యాయిని పాత్రనూ పోషించవలసి వస్తోంది. స్త్రీ, పురుష బాధ్యతల మధ్య అసమానతలు కొనసాగుతున్న పరిస్థితిలో గృహిణికి ఇదెంత భారమో ఊహించగలం. స్కూలు ఫీజులూ, ఇతరత్రా వసూళ్ల రూపంలో వేలు, లక్షలు ధారపోస్తున్నా తల్లితండ్రులకు 'టీచరీ' రూపంలో ఈ అదనపు చాకిరీ తప్పడం లేదు. ఆటపాటలతో సహా ఇతరేతర మానసికోల్లాసాలకు ఒకటి, రెండు గంటలైనా ఒత్తిడి లేని స్వేచ్ఛా సమయం చిక్కని పిల్లల పాలిట చదువు అక్షరాలా 'నిర్బంధ' విద్యే అవుతోంది. విద్యాసంస్థలు చదువు బరువు తగ్గించకుండానే అదనపు వేళల్లో ఆటపాటల బరువునూ మోపడంతో పిల్లలకసలే ఊపిరి సలపడం లేదు. దేశంలో విద్యాబోధన ఎంత శాస్త్రీయంగా జరుగుతోందో పట్టించుకునే వ్యవస్థ అసలేదైనా ఉందా, చదువులు పిల్లల శారీరక మానసిక వికాసానికేమైనా సాయపడు తున్నాయా అన్న ప్రశ్నలు తల్లితండ్రుల నుంచే ఎదురవుతున్నాయి. పరీక్షలలో సాధించాల్సిన మార్కుల గరిష్ఠ శాతం కూడా ఇప్పుడు మారిపోయింది. తదుపరి చదువుకు ఏ ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలోనైనా సీటు రావడానికి డెబ్బై, ఎనభై శాతం మార్కులు కూడా సరిపోవడం లేదు, తొంభై శాతం దాటి తీరాల్సిందే. దాంతో పిల్లల్లో పోటీ, అసూయ, అలజడి, ఆందోళన, ఒత్తిడి పెరిగి పోతున్నాయి. తమ చదువూ, భవిష్యత్తుల గురించి తల్లితండ్రులు కనే కలల భారం పిల్లల కను రెప్పల మీద పడి వాళ్ళ నిద్రను హరిస్తోంది.

పిల్లల్లో గ్రహణశక్తి, చురుకుదనం పెరిగిన మాట నిజమే కానీ, మొత్తంగా నేటి ఈ చదువుల తీరు ఆదర్శవంతమేనా అన్న సందేహం మాత్రం వదలకుండా వేధిస్తూనే ఉంది. ఇక చదువుల్లో రకరకాల అసమానతలు పెరగడమే తప్ప తగ్గుతున్న జాడలేదు. ఉజ్జ్వల భవిష్యత్తు వైపు నడిపించే చదువుల నిచ్చెనపై చివరి మెట్ల మీద చతికిల బడుతున్నవారు నేటికీ అసంఖ్యాకమే. ఇంకోవైపు నూటికి నూరుశాతం అక్షరాస్యతను సాధించడానికి ప్రభుత్వాలు ఇప్పటికీ ఆపసోపాలు పడుతూనే ఉన్నాయి. నూటయాభయ్యేళ్ళ క్రితం, బ్రిటిష్ వలస పాలన ప్రారంభం నాటికి మూడు శాతం పైచిలుకు ఉన్న అక్షరాస్యత ఇప్పుడు ఎనభై శాతానికి చేరడం, విడిగా చూసినప్పుడు ఒకింత ఊరటే కానీ, ఎన్నో దేశాలతో పోల్చితే ఈ పెరుగుదల వేగమూ, శాతమూ ఏమంత విశేషం కావని పెదవి విరిచేవారూ ఉన్నారు. ఇందులో మళ్ళీ ప్రాంతీయంగా, జెండర్ పరంగా అంతరాలూ యథాతథం. ఎప్పుడో కానీ సోదిలోకి రాని ఈశాన్య రాష్ట్రాలు అక్షరాస్యతలో అగ్రస్థానంలో ఉండటం ఒక విశేషమైతే, ఎంత ప్రామాణికమో తెలియదు కాని, బిహార్‌తో కలసి ఆంధ్రప్రదేశ్ ఆ పట్టికలో అడుగు బొడుగు స్థానాలలో కనిపించడం కలవరపరిచే విషయం. ఇక చదువుల నాణ్యత విషయానికొస్తే, పట్టికలో మన దేశం స్థానం ఉసూరుమనిపించే మరో అధ్యాయం.

చదువుకీ, మంచి రాబడిగల ఉద్యోగాలకూ పీటముడి పడిన దశలో విద్యాభ్యాసం పూర్తిగా పరుగు పందెంగా మారి పిల్లల్ని విపరీత శ్రమకూ, అలసటకూ గురిచేస్తున్న మాట నిజం. చదువుల మరో పరమార్థమైన జ్ఞాన సముపార్జనకు కూడా పెద్ద పీట వేస్తూ ఎప్పటికది నిలకడ తెచ్చుకుంటుందో, పిల్లల్ని పరీక్షల భయతీరాన్ని దాటించి వైజ్ఞానికపు వెలుగుల ఉల్లాస తీరం వైపు నడిపిస్తుందో కాలమే తేల్చాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.పంచమి ప.11.48 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** మఖ ప.10.18 వరకు,తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.6.40 నుండి 8.20 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.26 నుండి 1.18 వరకు, తదుపరి ప.3.03 నుండి 3.55 వరకు, **అమృత ఘడియలు:** ఉ.7.47 నుండి 9.27 వరకు, తదుపరి తె.4.41 నుండి 6.22 వరకు (తెల్లవారితే మంగళవారం), స్కంధ పంచమి.

సూర్యోదయం : 5.32
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

వాస్తవిక రాజకీయం

విశ్లేషణ



అజిత్ రానాడే

ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధానికి తాత్కాలికంగానైనా విరామం లభించింది. ఇరాన్‌లోని మూడు అణు స్థావరాలపై అమెరికా బంకర్ బస్టర్ బాంబులు వేసింది. ఈ విషయంలో అధ్యక్షుడు ట్రంప్ వైఖరిపై చర్చ చాలాకాలం పాటు కొనసాగుతుంది. బహుశా కోర్టు మెట్లూ ఎక్కవచ్చు. సుమారు 15 కిలోటన్నుల బరువున్న బంకర్ బస్టర్ బాంబులు అణుస్థావరాలను ధ్వంసం చేసే అవకాశాలు తక్కువే. అంటే ఇరాన్ అణు కార్యక్రమం స్తంభించిపోలేదు. పోనీ అమెరికా బాంబులతో ఆ ప్రాంతంలో శాంతి నెలకొందా? ఇరాన్‌లో ప్రభుత్వం మారిందా? ఊహూ! కాదనే చెప్పాలి.

బాంబు దాడులకు బదులుగా ఇరాన్ పొరుగున ఉన్న ఖతార్‌లోని అమెరికన్ స్థావరాలపై దాడులు చేసింది. అది కూడా అమెరికాకు ముందుగానే చెప్పి! ఇందుకు ట్రంప్ స్వయంగా ఇరాన్‌కు ధన్యవాదాలూ చెప్పారు. ఏదైతేనేమి... ప్రస్తుతానికైతే శాంతి నెలకొన్నట్టుగానే కనిపిస్తోంది. ప్రపంచ చమురు ఉత్పత్తిలో 20 శాతం కంటే ఎక్కువ రవాణా అయ్యే హోర్ముజ్ జలసంధిని ఇరాన్ పార్లమెంట్ బంద్ చేయాలని తీర్మానించినా ప్రస్తుతానికి ఆ నిర్ణయం అమల్లోకైతే రాలేదు.

మధ్యప్రాచ్యంలో యుద్ధమంటే సహజంగానే చమురు ధరల్లో పెరుగుదల ఉంటుంది. తద్వారా ద్రవ్యోల్బణం పెరగడం, పెట్టుబడిదారులు సంశయంలో పడిపోవడం, వాణిజ్యంపై దుష్ప్రభావం సహజంగా కనిపిస్తాయి. అయితే ఇక్కడో విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఇప్పుడు ప్రపంచ చమురు షేక్ అమెరికా! ఐదో వంతు ముడిచమురు అక్కడే ఉత్పత్తి అవుతోంది. సొంత అవసరాలు పోను ఎగుమతి చేస్తోంది కూడా! ఈ కారణంగానే ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం మొదలైన తరువాత కూడా చమురు ధర మునుపటిలా బ్యారెల్‌కు 100 – 150 డాలర్ల స్థాయికి చేరలేదు.

రెండూ కావాల్సిన దేశాలే!

వీటన్నింటి ప్రభావం భారత్‌పై ఎలా ఉండబోతోంది? భారత్ ఇప్పుడు జాగరూకతతో, ఆచితూచి వ్యవహరించాల్సి ఉంటుంది. ఇరు దేశాలతో సత్సంబంధాలున్న దేశంగా మరింత బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలి. రక్షణ, నిఘా ఉత్పత్తుల విషయంలో ఇజ్రాయెల్ ఇప్పుడు భారత్‌కు కీలకంగా మారిన విషయం తెలిసిందే. హైఫా నౌకాశ్రయంలో భారతీయుల పెట్టుబడులున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనలో ఇరు దేశాలూ పరస్పరం సహకరించుకుంటున్నాయి. ఇజ్రాయెల్‌తో మన వ్యాపారం గణనీయంగా పెరిగి 500 కోట్ల డాలర్లకు చేరుకుంది. మరోవైపు ఇరాన్ మనకు చమురు సరఫరా చేస్తూండటం గమనార్హం. మన రూపాయిల్లోనే ముడిచమురు కొనుగోలుకు అవకాశం కల్పించిన దేశం కూడా ఇరానే!



మిడిల్ ఈస్ట్ యూరప్ ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా చాబహార్ నౌకాశ్రయాన్ని ఇండియా అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. మన దిగుమతుల్లో 32 శాతం చమురు, 52 శాతం ఎల్ఎన్‌జీ హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా అవుతోంది. ఇందులో తేడా వస్తే దాని ప్రభావం మన వంటింటి గ్యాస్ సిలిండర్లపై పడుతుంది. ఎరువుల ఉత్పత్తిలోనూ తేడాలొస్తాయి. రష్యా నుంచి చమురు తెచ్చుకోవడం సులువు కాదు. ఇలా చేయడం అమెరికాకు ఆగ్రహం తెప్పించేదే. చమురు ధరలు ద్రవ్యోల్బణాన్ని మాత్రమే కాకుండా, విదేశీ మారక ద్రవ్య నిల్వలపై, ద్రవ్య లోటుపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువను 87 కంటే దిగువకు చేర్చవచ్చు.

> ఇండియా వైఖరిని... ఇజ్రాయెల్, అమెరికాలతో ఉన్న సంబంధాలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న వాస్తవిక రాజకీయం అనాలి. అయితే ఇది గ్లోబల్ సౌత్‌కు నాయకత్వం వహించాలన్న భారత్ కాంక్షను తక్కువ చేసేది కూడా!

ముడి చమురు బ్యారెల్ ధర పది డాలర్లు పెరిగితే భారత స్థూల జాతీయోత్పత్తి 0.3 శాతం వరకూ తగ్గవచ్చుననీ, ద్రవ్యోల్బణం 0.4 శాతం పెరుగుతుందనీ ఒక అంచనా. స్టాక్ మార్కెట్లు కూడా పెరిగే చమురు ధరలకు స్పందించి పెట్టుబడులు ఉపసంహరించుకునే అవకాశం ఉంది.

నైతిక ప్రశ్నలూ ఉన్నాయి...

రాజకీయాల్లో నైతికత లేని రోజులివి. అయితే, ఏమాత్రం రెచ్చగొట్టే చర్యలకు దిగకున్నా ఒక సార్వభౌమ దేశంపై జరిగిన దాడిని ఖండించరాదా అన్న ప్రశ్న వస్తోందిక్కడ. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడిని 'షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్' తన ప్రకటనలో ఖండించింది. ఇండియా ఆ ప్రకటనపై సంతకం చేయకుండా దూరం జరిగింది. ఇంతకంటే ఆశ్చర్యకరమైన విషయం: గాజా ప్రాంతంలో వెంటనే బేషరతుగా కాల్పుల విరమణ జరగాలన్న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానంపై జరిగిన ఓటింగ్‌లోనూ భారత్ పాల్గొనకపోవడం. ఈ తీర్మానానికి అమెరికా భాగస్వాములైన ఆస్ట్రేలియా, జపాన్, యూకేలతోపాటు 149 దేశాలు మద్దతిచ్చాయి. అమెరికా, ఇజ్రాయెల్‌తో పాటు 12 దేశాలు వ్యతిరేకించాయి. భారత్ ఉద్దేశం ఏమిటి అంటే... ఇజ్రాయెల్, అమెరికాలతో ఉన్న సంబంధాలను దృష్టిలో పెట్టుకుని చేస్తున్న వాస్తవిక రాజకీయం అనాలి. అయితే ఇది గ్లోబల్ సౌత్‌కు నాయకత్వం వహించాలన్న భారత్ కాంక్షను తక్కువ చేసేది కూడా! ప్రస్తుత పరిస్థితుల్లో వాస్తవిక రాజకీయం చేయడం మన సైద్ధాంతిక మార్గాన్ని తప్పినట్లు అవుతుంది. మన ట్రాక్ రికార్డులో మచ్చగా మిగులుతుంది. ఏ కూటమితోనూ జతకట్ట కూడదన్న అలీనోద్యమ స్ఫూర్తిని దెబ్బతీసినట్లవుతుంది.

ప్రస్తుతం భారతదేశం చాలా సంతులనంతో వ్యవహరిస్తోందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కానీ మన విధానాన్ని స్పష్టం చేసేందుకు ఇదో మంచి అవకాశం కూడా. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను నడిపించే మూలభూత విలువలను నిర్వచించుకోవాల్సిన తరుణమిది. వ్యూహాత్మక స్వావలంబన, దేశీ ఆర్థిక వ్యవస్థ బలోపేతం వంటివి అంతర్జాతీయ స్థాయిలో అసందిగ్ధతకు, పిరికితనానికి కారణం కారాదు. రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్– పాలస్తీనా– ఇరాన్ ఘర్షణలు భారత ఆర్థిక, దౌత్య, రాజకీయ నైపుణ్యానికి సవాలు విసురుతున్న మాట వాస్తవం.

వ్యాసకర్త ఆర్థికవేత్త

శాంతి ఎండమావి

విశ్లేషణ



అలీ చౌగులే

ఇజ్రాయెల్, పాలస్తీనా పోరుకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. ప్రపంచ సుదీర్ఘ పోరాటాల్లో ఇదొకటి. ఇజ్రాయెల్‌కూ, గాజాలోని హమాస్‌కూ నడుమ భూమి, సరిహద్దులు, హక్కుల విషయంలో తలెత్తిన వివాదం ఇప్పటికీ రగులుతోంది. దీని విపరిణామాలే తాజా ఇజ్రాయెల్ – ఇరాన్ ఘర్షణ రూపంలో పడగ విప్పాయి. తమకు ముప్పుగా పరిణమించిన ఇరాన్ అణుశక్తి కార్యక్రమాన్ని పూర్తిగా రూపుమాపే వరకూ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రకటించారు. తమ దేశాన్ని నేరుగా ఈ ఘర్షణలో భాగస్వామిగా చేసిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రెండు రోజుల అనంతరం ఇజ్రాయెల్, ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించి, మధ్యప్రాచ్యం అంతటా యుద్ధం విస్తరిస్తుందన్న భయాలను రేకెత్తించిన 12 రోజుల పోరుకు తెర దించారు.

అయితే, ప్రపంచానికి 'శాంతిప్రదాత' అవుతానని చెప్పుకొని అధికార పీఠం ఎక్కిన ట్రంప్ పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పడంలో విఫలమయ్యారు. అక్కడి వివాదాన్ని పరిష్కరించలేకపోయారు. ఆ ప్రాంతంలో ముందుందు మరింత భయంకరమైన యుద్ధం వచ్చే ప్రమాదం ఉంది. ఇరాన్ అణు స్థావరాలపై మెగా బాంబులు వేసి వాటిని సర్వనాశనం చేసిన తన చర్యతో ఆ దేశం అణురహితంగా మారి సుస్థిర శాంతికి బాటలు పడతాయన్న ఆయన ఆశలు నెరవేరినట్లు లేవు. దశాబ్దాలుగా సాగుతున్న శాంతి చర్చలు ఆ ప్రాంతంలో హింసను నిలువరించలేకపోయాయి. ట్రంప్ సహా ఎవరూ ఆ చారిత్రక వివాదానికి పరిష్కారం సాధించలేక పోయారు. 1948 నుంచీ అనేక సార్లు జరిగిన యుద్ధాల్లో విజేతలుగా నిలిచిన ఇజ్రాయెల్ ప్రభుత్వాలు అరబ్ ప్రపంచంతో రాజకీయ పరిష్కారం కుదుర్చుకోలేక పోయాయి.

ముందున్నదాన్ని శాంతి అనవచ్చా?

గడచిన ఏడాదిన్నర కాలంలో చోటుచేసుకున్న ఘటనల పరిణామాలు... ఇజ్రాయెల్, పాలస్తీనా, ఇరాన్, అమెరికా, మధ్యప్రాచ్యాలకు ఏ విధంగా దాపురిస్తాయో పలువిధాలుగా విశ్లేషించవచ్చు. కానీ, ఒకటి మాత్రం విస్మరించలేం. ఇజ్రాయెల్, దాని పశ్చిమ దేశాల మిత్రులు కలిసి చేసిన అన్యాయానికి పాలస్తీనా పౌరులు దారుణంగా బలయ్యారు. ఈ మొత్తం వ్యవహారంలో అరబ్ దేశాలు సైతం కావాలనో లేదా తప్పనిసరి అయ్యో పాటించిన మౌనం మరో గమనించదగిన అంశం.

ఇరాన్, ఇజ్రాయెల్, గాజా పరిణామాలు అర్థం చేసుకోవాలంటే అనేక అంశాలు పరిశీలించాల్సి ఉంటుంది. తాజా ఘర్షణలు ఎందుకు చోటుచేసుకున్నాయి? అక్టోబర్ 7 నాటి హమాస్ దాడి వీటిని రేపెట్టినట్టు పైకి కనబడుతుంది. అయితే, ఈ హమాస్ దాడిని కూడా మధ్యప్రాచ్య చరిత్రకు కొనసాగింపుగానే పరిగణించాలి. అక్కడ ఒడుదొడుకులతో కూడిన యథాతథ స్థితి నెలకొని ఉండేది. నిజమైన శాంతి కాదు! ఆ ప్రాంతంలోని పరస్పర విరుద్ధ ప్రయోజనాల మధ్య సమతుల్యత ఏర్పడినందున నెలకొన్న శాంతి అది. అది ఎప్పుడైనా చెదిరిపోయేటంత బలహీనమైనది.

> అనేక దశాబ్దాలుగా సాగుతున్న శాంతి చర్చలు మధ్య ప్రాచ్యంలో హింసను నిలువరించడంలో సఫలం కాలేక పోయాయి. ట్రంప్ సహా ఎవరూ ఇజ్రాయెల్–పాలస్తీనా చారిత్రక వివాదానికి పరిష్కారం సాధించలేకపోయారు.

దుర్బలమైన ఈ యథాతథ స్థితి పాలస్తీనా ప్రజల హక్కులను గుర్తించలేదు. మరోవంక ఇజ్రాయెల్ ఈ ప్రాంతాన్ని అస్థిరపరచేలా స్వేచ్ఛగా తన ఎజెండా అమలు చేయగలిగింది. 'టెర్రర్ మీద వార్', 'స్వీయ రక్షణ హక్కు' అనే తప్పుడు వాదనలతో గాజాలో జాతిహననానికి పాల్పడింది. మిత్ర రాజ్యాలు, ఆయుధ సరఫరాదారులు అయిన అమెరికా, యూకే, జర్మనీ, మరికొన్ని ఈయూ సభ్యదేశాలు ఇజ్రాయెల్ జాతినిర్మూలన యత్నం పట్ల ఉదాసీనంగా వ్యవహరించాయి. ఒకవంక యుద్ధనేరాలను, జాతి హననాన్ని ఖండిస్తూనే ఇజ్రాయెల్‌కు భారీస్థాయిలో సైనిక, ఆర్థిక, రాజకీయ మద్దతును అందించాయి.

మార్పు సులభం కాదు!

గాజాపై ఇజ్రాయెల్ అవిరామంగా సాగించిన బాంబుదాడుల్లో 55,000 మంది పాలస్తీనా ప్రజలు చనిపోయారు. ఇంత దారుణానికి ఒడిగట్టినా కూడా... హమాస్ వ్యవస్థను ధ్వంసం చేసి బందీలను విడిపించుకు వస్తానని తన ప్రజలకు చేసిన వాగ్దానం నెరవేర్చడంలో నెతన్యాహూ ఘోరంగా విఫలమయ్యారు. లెబనాన్, సిరియాల మీదా దురాక్రమణ చేశారు. చివరిగా ఇరాన్‌ను లక్ష్యం చేసుకున్నారు. ఇరాన్‌తో యుద్ధం అనివార్యమేం కాదు. నిరోధించి ఉండొచ్చు. దౌత్యస్థాయి చర్చలు పురోగతిలో ఉండగానే, అణుకార్యక్రమాన్ని శాశ్వతంగా నివారించాలంటూ దాడులకు దిగారు. ఇది స్థావరాలకే పరిమితమైన యుద్ధం కాదు. ఇరు దేశాల్లో పౌరులు హతమయ్యారు. ఈ ఆకస్మిక విస్ఫోటనానికి ఎవరు కారకులు? నెతన్యాహూ? ట్రంప్? లేదా ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా ఖొమేనీ?

దశాబ్దాల క్రితం జరిగిన ప్రధాన ఘర్షణలను పరిశీలిస్తే యుద్ధానికి ఎందుకు దిగుతున్నామో ఆ దేశాలు ఏదో ఒక కారణం చెప్పాయి. 'సామూహిక జనహనన ఆయుధాలను గుర్తించేందుకు' ఇరాక్‌పై అమెరికా చేసిన దాడిని గుర్తు చేసుకోండి. అయితే, ఆ యుద్ధం అసలు లక్ష్యం పాలకులను మార్చడమే! అలాగే గడాఫీ హత్య, లిబియాలో కొత్తవారికి అధికారం కట్టబెట్టడం, సిరియా, లెబనాన్‌లలో అంతర్యుద్ధాలు. ఇరాక్, అఫ్గానిస్తాన్, లిబియా తప్పిదాల నుంచి యుద్ధోన్మాదులు పాఠాలు నేర్చుకోలేదు. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని కూలదోయడం ఇజ్రాయెల్, అమెరికాల అంతిమ లక్ష్యమో కాదో చెప్పడం కష్టం. అయితే, ఇరాన్ అంతు తేల్చాలని ఎన్నో ఏళ్లుగా నెతన్యాహూ ఉబలాటపడుతున్నారు. ఇరాన్ రాజకీయ సంకల్ప బలం, సైనిక పాటవం చూస్తే, ఈ పని ఇప్పటికీ ఇజ్రాయెల్ వల్ల అవదు. ఇరాన్‌లో పాలకులను మార్చేయాలనే ఆయన ఆలోచన ఒక కల.

వ్యాసకర్త సీనియర్ స్వతంత్ర జర్నలిస్ట్
('ద ఫ్రీ ప్రెస్ జర్నల్' సౌజన్యంతో)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహశకలం నేలను ఢీ కొంటే...

ఆస్టరాయిడ్స్ అంటే గ్రహ శకలాలు. ఇవి సూర్యుని చుట్టూ దీర్ఘవలయాకార కక్ష్యలో తిరుగుతుంటాయి. గురు గ్రహానికీ, అంగారక గ్రహానికీ మధ్యగల మండలంలో ఇవి ఎక్కువగా ఉన్నాయి. 2016 డిసెంబర్‌లో ప్రతి ఏడాదీ జూన్ 30వ తేదీని అంతర్జాతీయ గ్రహ శకల దినోత్సవంగా జరపాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఇది 1908 జూన్ 30న రష్యాలోని సైబీరియా ప్రాంతంలో ఉన్న తుంగస్కా నదిపై జరిగిన ఓ సంఘటనను గుర్తుచేసుకునే వార్షికోత్సవంగా చెప్పవచ్చు. ఈ నదిపై ఓ గ్రహశకలం పేలిపోయింది. పెద్ద గ్రహశకలం ఒకటి గంటకు 53,913 కిలోమీటర్ల వేగంతో వాతావరణాన్ని ఢీకొట్టింది. ఈ గ్రహశకలం వాతావరణంలో ప్రవేశించడం వలన ఏర్పడిన 'రాతి విస్ఫోటనం' థర్మో న్యూక్లియర్ పేలుడు అని గమనించారు. ఈ పేలుడు వలన విస్తారమైన అటవీ ప్రాంతంలోని చెట్లన్నీ కూలిపోయాయి. ఈ పేలుడులో విడుదలైన శక్తి 1,000 హిరోషిమా అణుబాంబులకు సమానం. అయినా అక్కడ ఎటువంటి బిలం ఏర్పడలేదు. అంటే గ్రహ శకలం భూమిని ఢీకొట్టకుండా వాతావరణంలో పేలిపోయిందన్నమాట. ఈ సమయంలో ప్రకాశవంతమైన కాంతి, పెద్ద శబ్దాలు, భూప్రకంపనలు పశ్చిమ ఐరోపా వరకు నమోదు అయ్యాయి.



'గ్రహశకలాలు – అవి భూమి చరిత్రలో, భవిష్యత్తులో పోషించే పాత్ర, దానిపై అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టడం' ఈ ఏడాది దినోత్సవ ఇతివృత్తం. అంటే ఈ రోజున గ్రహ శకలాల ద్వారా సంభవించే ప్రమాదాల గురించి అవగాహన పెరిగేందుకు ప్రపంచవ్యాప్తంగా సదస్సులు, ప్రదర్శనలు జరుపుతారు. గ్రహ శకలాల వల్ల కలిగే ప్రమాదాల నుండి భూమిని రక్షించుకోవడానికి చేపట్టాల్సిన చర్యల గురించి చర్చిస్తారు.

ఏటా దాదాపు 17,000 గ్రహశకలాలు భూమి వైపు పడతాయని ఒక అంచనా. ఇవి వాతావరణంలో ప్రవేశించిన తరువాత చిన్న కణాలు లేదా దుమ్ముగా మారి పోతాయి. అందువల్ల అవి మనకు కన్పించవు. అను దినం 44,000 కిలోల గ్రహశకలాల పదార్థం భూమిపై పడుతుందని ఒక అంచనా. గ్రహశకలం నేల వైపు పడేటప్పుడు ముందుగా అది వాతావరణం లోకి వస్తుంది. వాతావరణంతో కలిగే ఘర్షణ వల్ల ఈ రాతి ముక్క బాగా వేడెక్కుతుంది. చివరకు అది కాలిపోయి ఆవిరిగా మారుతుంది.

ఈ క్రమంలో ఆకాశంలో ప్రకాశవంతమైన గీత కన్పిస్తుంది. మన వాతావరణం చాలా గ్రహశకలాలను ఇలా నాశనం చేస్తుంది కాబట్టి దాదాపు 95 శాతం ఈ రాతి ముక్కలు భూమిని చేరవు. ఈ విధంగా వాతావరణం గ్రహశకలాల బారి నుండి భూమిని కాపాడుతోంది. గ్రహశకలం భూమిని తాకితే వాతావరణంలో దుమ్ము, పొగ పెరుగుతాయి. వీటివల్ల ఆ ప్రాంతంలో సూర్యరశ్మి చేరక ఉష్ణోగ్రత తగ్గిపోతుంది. ఫలితంగా అనేక జీవులు మరణిస్తాయి. ఒక అపార్టుమెంటు పరిమాణంలో ఉన్న గ్రహశకలం భూమిని తాకితే ఒక చిన్న నగరం నాశనం అయిపోతుంది.

– డా౹౹ సి.వి. సర్వేశ్వర శర్మ । పాపులర్ సైన్స్ రచయిత (నేడు అంతర్జాతీయ గ్రహశకల దినోత్సవం)

చేయాల్సింది చాలా ఉంది!

ఈ దశాబ్ద కాలంలో భారత్ ప్రపంచంలో ఒక బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగటమే కాదు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో కూడా తన స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ మొదటిసారి వంద లోపు ర్యాంకు సాధించటం ఆహ్వానించదగిన పరిణామమే. 2030 నాటికి వాతావరణం, జీవుల పరిరక్షణ, పేదరిక నిర్మూలన, గౌరవప్రదమైన ఉపాధి, నాణ్యమైన విద్య, ఆహార భద్రత, ఆరోగ్య సంరక్షణ, అసమానతల నిర్మూలన, లింగ సమానత్వం, సురక్షితమైన త్రాగునీరు, మౌలిక సదుపాయాల కల్పన లాంటి 17 లక్ష్యాలను సాధించాలనే సంకల్పంతో 2015లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ప్రకటించింది. అభివృద్ధి, వనరుల వినియోగం అనేది ప్రస్తుత తరానికే కాదు భవిష్యత్ తరాలకు కూడా అనే విస్తృత అర్థంలో సుస్థిరాభివృద్ధి భావనను ఉపయోగించటం జరుగుతుంది.



సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ 2017లో 116వ ర్యాంకును, 2022లో 121వ ర్యాంకును, 2024లో 109వ ర్యాంకును సాధించింది. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి సొల్యూషన్స్ నెట్‌వర్క్ నివేదిక ప్రకారంగా 2025లో భారత్ తన ర్యాంకును మెరుగుపరుచుకుని 167 దేశాలలో 67 స్కోర్‌తో 99వ ర్యాంకును సాధించింది. ఎప్పటిలాగానే 85 నుండి 86 స్కోర్‌తో గత మూడు పర్యాయాలుగా ఫిన్లాండ్, స్వీడన్, డెన్మార్క్ దేశాలు మొదటి మూడు స్థానాలలో కొనసాగుతున్నాయి. ప్రపంచంలోనే మొదటి మూడు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా 44, చైనా 49, జర్మనీ 4 ర్యాంకులు సాధించాయి. భారత్ సమీప దేశాలైన మాల్దీవులు (53), శ్రీలంక (93), భూటాన్ (74), నేపాల్ (85)లు భారత్ కంటే మెరుగైన ర్యాంకులను సాధిస్తే... బంగ్లాదేశ్ 114, పాకిస్తాన్ 140 ర్యాంకులతో సరిపెట్టుకున్నాయి.

గత దశాబ్ద కాలంగా దేశంలో ఆహార భద్రతా చర్యలలో భాగంగా 'ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన', 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన', 'ప్రధాన మంత్రి ఉజ్వల యోజన', జాతీయ ఆరోగ్య మిషన్' లాంటి పథకాలను అమలు చేయడం ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ తన ర్యాంకుని మెరుగుపరచుకోగలిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఆర్థిక అభివృద్ధిని కొలిచే ప్రమాణాలలో ఒకటైన మానవాభివృద్ధి సూచిక (హెచ్‌డీఐ)లో భారత్ మెరుగైన ర్యాంకుని సాధించలేక పోతోంది. 2025 సంవత్సరానికి గాను యూఎన్‌డీపీ ప్రకటించిన హెచ్‌డీఐ ర్యాంకులలో భారత్ తన ర్యాంకును 134 నుండి 130కి మెరుగుపరచుకోగలిగినా, 193 దేశాలలో భారత్ హెచ్‌డీఐలో 130వ స్థానంలో నిలవటం శోచనీయం.

అమెరికా, చైనా, జర్మనీల తరువాత భారత్ ప్రపంచంలో నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోంది. కానీ ఆర్థిక అభివృద్ధికి ప్రమాణాలుగా భావిస్తున్న తలసరి ఆదాయంలో 141వ ర్యాంకు, ఆకలి సూచీలో 105వ ర్యాంకు, స్థూల సంతోష సూచిలో 118వ ర్యాంకుతో ప్రపంచంలో అత్యధిక పేదలు ఉన్న (23.4 కోట్లు) దేశంగా భారత్ నిలవటం శోచ నీయం . ఈ సూచికలలో భారత్ సామర్థ్యం మెరుగుపడకుండా 2028 నాటికి భారత్ ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా అభివృద్ధి ఫలాలు కింది వర్గాల ప్రజలకి చేరకపోవచ్చు.

– డా౹౹ తిరునహరి శేషు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ విశ్వవిద్యాలయం । 98854 65877

అంతరార్థం

ఉమా మహేశ్వర సంవాదంలో పార్వతీ దేవి శివ రూపంలోని అంతరార్థాన్ని గురించి ప్రశ్నిస్తుంది. శివుని ధనుస్సు 'పినాకం'. చేతిలో ఆ ధనుస్సు ఉండటం వల్ల శివున్ని పినాకపాణి అని అంటారు. 'పినాకాన్ని అన్ని ఆయుధాల కంటె ఎక్కువ ఇష్టంతో పట్టుకుని ఉంటావు? ఎందుకని?' అని శివుని పార్వతి అడిగింది.

శివుడు 'కణ్వుడు' అనే మహర్షి మహానిష్ఠతో తపస్సు చేస్తుంటే అతని శరీరంపై పుట్ట పెరిగి దాని మీద ఒక వెదురు కూడా పుట్టింది. అది చాలా పొడవు, వెడల్పులతో విలక్షణంగా ఉంది. బ్రహ్మ ఆ మహర్షికి వరం ఇచ్చి, ఆ వెదురు తాను తీసుకుని లోక కల్యాణార్థం మూడు తునకలు చేసి, ఒక తునకతో నాకు పినాకాన్ని, ఇంకో దానితో విష్ణువుకు 'శార్ఙ్గం' అనే విల్లును చేసి మాకు ఇచ్చి, మూడవ తునకతో గాండీవం చేసి తాను గ్రహించాడు. బ్రహ్మ నిర్మించి ఇచ్చినందున నాకు ఇది చాలా ప్రియమైనది' అని చెప్పాడు.



అప్పుడు పార్వతి 'శుచిగా, మనోహరంగా ఉండే నివాసంలో ఉండకుండా అశుభ్రంగా ఎముకలు, పుర్రెలతో నిండివున్న శ్మశాన వాటికలో నువ్వు ఎందుకు ఉంటావు?' అని అడిగింది. అందుకు శివుడు 'మోక్షం పట్ల ఆసక్తి కలవారు నిర్జనంగా ఉండే శ్మశానాన్ని పవిత్ర స్థానం అని పొగడుతారు. అందుకని నాకు ఆ ప్రదేశం ఇష్టమైనది. అక్కడనే ఉండి, సమస్త లోకాలనూ మనసులో భావించి, రక్షణ చేస్తూ ఉంటాను. సర్వ ప్రాణులూ మరణం తర్వాత భేదాలు లేకుండా తిరిగే ప్రదేశం కాబట్టి శ్మశానం నాకు ఇష్టమైన స్థానం' అని చెబుతాడు.

మరి 'బూడిద, ఎముకలు, నాగాభరణాలు, శూలం వంటి వాటితో భయంకర రూపాన్ని ఎందుకు ధరించావు?' అని అడుగుతుంది. అందుకు 'ఈ విశ్వం సౌమ్యం, ఆగ్నేయం అనే రెండింటి కలయికతో కూడి ఉంది. సౌమ్యమైన దానిని విష్ణువు, ఆగ్నేయమైన దానిని నేను ధరిస్తున్నాము. అందుకే నా రూపం ఆ విధంగా ఉంటుంది' అని చెప్పాడు శివుడు. అలాగే, తాను తలపై చంద్రుని ధరించటానికి, కంఠం నీలంగా ఉండటానికి కారణాలను పార్వతి అడగగా శివుడు చెబుతాడు.

ఈ ప్రశ్నలన్నీ పార్వతీదేవి భక్త జనులకు తెలియజేయటానికే అడిగింది. జగదాంబకు తెలియని వేముంటాయి?

– డా౹౹ చెంగల్వ రామలక్ష్మి



తాను వివాహం చేసుకోబోయే వ్యక్తి క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉందని ఓ యువతి పెళ్లికి నిరాకరించింది. మహారాష్ట్రలో ఈ ఏడాది ఫిబ్రవరిలో వెలుగు చూసిన ఈ ఘటన అందరినీ నివ్వెరపోయేలా చేసింది. మరో సంఘటనలో క్రెడిట్ స్కోర్ తక్కువగా ఉన్న వ్యక్తి ఉద్యోగ నియామకాన్ని రద్దు చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయాన్ని మద్రాస్ హైకోర్టు సమర్థించింది. ఈ రెండు సందర్భాల్లోనూ రెండు జీవితాలను క్రెడిట్ స్కోర్ మార్చేసింది. క్రెడిట్ స్కోర్ అంత ముఖ్యమా.. ఇంతకీ ఈ స్కోర్ ఏమిటి.. ఎవరు, ఎలా నిర్ణయిస్తారు.. సామాన్యుల మదిలో ఉన్న సందేహాలకు జవాబు తెలుసుకుందాం. - సాక్షి, స్పెషల్ డెస్క్

స్కోరుంటేనే.. లోన్

- రుణాలకు క్రెడిట్ స్కోరే ప్రామాణికం
- స్కోరు తక్కువని పెళ్లి వద్దన్న ఓ యువతి
- ఉద్యోగ నియామకాన్నే రద్దు చేసిన ఎస్‌బీఐ
- ఆర్బీఐ నియంత్రణలోనే క్రెడిట్ ఇన్ఫో కంపెనీలు
- సిబిల్‌తో సహా 4 సంస్థలకు లైసెన్సులు
- సామాన్యుల అపోహలేంటి? వాస్తవాలేంటి?

నాకు లోన్ కావాలి. క్రెడిట్ స్కోర్ ఉంటేనే ఇస్తామన్నారు. ఏమిటీ స్కోర్?


ఓసారి మీ స్నేహితులనో, బంధువులనో ఓ రూ.లక్షో.. 2 లక్షలో చేబదులు అడిగి చూడండి! ఎంతమంది ఇచ్చి ఉంటారు? ఎంతమంది బంగారమో, ఇంటి పత్రాల వంటి హామీలు అడిగి ఉంటారు? మీరు బాగా తెలిసినవారే అయినా మీరు తిరిగి చెల్లించగలరా అని వంద సార్లు ఆలోచిస్తారు. అలాంటిది మీరెవరో తెలియకుండా ఓ బ్యాంకు లేదా లోన్ యాప్ మిమ్మల్ని నమ్మి, ఎలాంటి తనఖా లేకుండా అప్పు ఎలా ఇస్తాయి? అందుకే, మీరేంటి.. గతంలో ఏదైనా బ్యాంక్ నుంచి లోన్ తీసుకుంటే తిరిగి ఎలా చెల్లించారు.. చెల్లించకుండా ఎగ్గొట్టారా.. వంటి అంశాలన్నీ వారు చూస్తారు. ఇలా వినియోగదారుడి రుణ అర్హతను సూచించే సంఖ్యే క్రెడిట్ స్కోర్. దీని ఆధారంగానే బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) ఒకరికి రుణం ఇవ్వాలా లేదా అని నిర్ణయిస్తాయి. చెల్లింపుల చరిత్ర, రుణ అర్హత–తీసుకున్న మొత్తాలు, కాల పరిమితి, తరచూ లోన్లకు దరఖాస్తులు, విభిన్న రుణాలు.. వీటి ఆధారంగా స్కోర్ మారుతుంది. మనదేశంలో తొలి క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ ట్రాన్స్‌యూనియన్ సిబిల్. ఈ కంపెనీ ఇచ్చే క్రెడిట్ స్కోర్.. సిబిల్ స్కోర్‌గా జనంలో బాగా పాపులర్ అయింది.

నా క్రెడిట్ స్కోరు తక్కువైతే రుణం రాదా?

ఒక వ్యక్తి తాను తీసుకున్న రుణాలను నిర్వహించిన తీరు ఆధారంగా క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ/క్రెడిట్ బ్యూరోలు 300 నుంచి 900 వరకు స్కోర్ ఇస్తున్నాయి. స్కోర్ ఎంత ఎక్కువ ఉంటే రుణం లభించే అవకాశాలు అంత మెరుగ్గా ఉంటాయి. 90 శాతం లోన్స్ 750కిపైగా స్కోర్ ఉన్నవారికే మంజూరు అవుతున్నాయి. ఆదాయం, ప్రస్తుత ఈఎంఐలు, క్రెడిట్ స్కోర్ ఆధారంగా రుణ అర్హతను ఆర్థిక సంస్థలు నిర్ణయిస్తాయి.

ఏ కంపెనీలు ఈ స్కోర్ ఇస్తున్నాయి? వాటికి ఆర్‌బీఐ అనుమతి ఉందా?

క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ లేదా క్రెడిట్ బ్యూరోలు వ్యక్తులు, కంపెనీల రుణ సమాచారాన్ని ఆర్థిక సంస్థల నుంచి నెలవారీ ప్రాతిపదికన సేకరించి, నిర్వహణతోపాటు విశ్లేషిస్తాయి. ఈ రుణ సమాచారాన్ని ఉపయోగించి వ్యక్తుల కోసం క్రెడిట్ ఇన్ఫర్మేషన్ రిపోర్టులు, కంపెనీల కోసం క్రెడిట్ కంపెనీ రిపోర్టులు రూపొందిస్తాయి. రుణ అర్హత, గత రుణ చరిత్ర ఆధారంగా వ్యక్తుల కోసం క్రెడిట్ స్కోర్, కంపెనీలకు క్రెడిట్ ర్యాంక్‌లను జారీ చేస్తాయి. ఆర్‌బీఐ లైసెన్స్ పొందిన క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు భారత్‌లో ట్రాన్స్‌యూనియన్ సిబిల్, ఈక్విఫ్యాక్స్ ఇండియా, ఎక్స్‌పీరియన్ ఇండియా, సీఆర్ఐఎఫ్ హై మార్క్. ఆర్‌బీఐ నియంత్రణలోనే ఇవి పనిచేస్తాయి.



క్రెడిట్ హిస్టరీ లేని ఉద్యోగులు అయితే కనీసం మూడు నెలల పే స్లిప్స్‌ను సమర్పించాలి. ఎన్‌బీఎఫ్‌సీలు చిన్న మొత్తాల్లో రుణం ఇస్తాయి. సకాలంలో చెల్లిస్తే క్రెడిట్ లిమిట్ (రుణ మొత్తం) పెంచుతాయి. యూపీఐ వాడుతున్న చిరు వ్యాపారులు, కార్మికులకు కూడా ఆదాయం, యూపీఐ చెల్లింపులను విశ్లేషించి ఎన్‌బీఎఫ్‌సీలు చిన్న మొత్తాల్లో అప్పులు ఇస్తున్నాయి.

స్కోర్ ఎక్కువగా ఉంటే ప్రయోజనం ఏమిటి?

ట్రాన్స్‌యూనియన్ సిబిల్ గణాంకాల ప్రకారం 2025 జనవరి–మార్చిలో కొత్తగా మంజూరైన రుణాల్లో 57.6 శాతం వినియోగదారుల స్కోర్ 800లకుపైగా ఉంది. 22.8 శాతం మంది స్కోర్ 750–799 మధ్య, 9.7 శాతం వినియోగదారులకు 700–749 మధ్య, 5.2 శాతం కస్టమర్లకు 650–699 మధ్య, 4.7 శాతం మందికి 650 కంటే తక్కువ స్కోర్ ఉంది. స్కోర్ ఎక్కువగా ఉన్నవారికే లోన్ లభిస్తోందనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. గృహ, వాహన రుణాల వంటి సెక్యూర్డ్ లోన్స్‌కు సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నా, క్రెడిట్ హిస్టరీ లేకున్నా రుణ సంస్థలు ముందుకు వస్తున్నాయి. వ్యక్తిగత రుణం, విద్యా రుణాల వంటి అన్‌సెక్యూర్డ్ లోన్స్‌కు క్రెడిట్ స్కోర్ ఉండాల్సిందే.

కొత్త వాళ్లకు రుణం రాదంటున్నారు. నిజమేనా?

అలాంటిది ఏమీ లేదు. ఈ ఏడాది జనవరి–మార్చి కాలంలో లోన్లు తీసుకున్నవారిలో 16 శాతం మంది కొత్తవారే. ఉద్యోగులైతే వారు పనిచేస్తున్న కంపెనీని బట్టి రుణ సంస్థలు సూపర్–ఏ, కేటగిరీ–ఏ, బీ, సీ, డీ అని విభజించి రుణ మొత్తాన్ని, కాల పరిమితిని నిర్ణయిస్తున్నాయి. కంపెనీ పనితీరు కూడా లోన్ అప్లికేషన్‌ను ప్రభావితం చేస్తుంది.

ఏది మంచి స్కోర్?

851-900 (అద్భుతం)	751-850 (మంచిది)	651-750 (సగటు)	501- 650 (పేలవమైనది)	300-500 (చాలా పేలవమైనది)
బకాయిలు లేని రుణగ్రహీతలు.	సకాలంలో చెల్లింపులతో బలమైన క్రెడిట్ చరిత్ర ఉన్నవారు.	తగిన రుణ నిర్వహణతో సగటు రుణ చరిత్ర కలిగినవారు.	సమయానికి పూర్తికాని చెల్లింపులు, అధిక రుణ వినియోగం కారణంగా ఎక్కువ రిస్క్ ఉన్నవారు.	బకాయిలు, రుణం పొందడంలో ఇబ్బందులతో దారుణమైన రుణ చరిత్ర ఉన్నవారు.

రూ.50 లక్షల వరకు..

దరఖాస్తుదారు పనిచేస్తున్న కంపెనీ సూపర్–ఏ ప్లస్ విభాగంలో ఉండి, స్కోర్ మెరుగ్గా ఉంటే.. ఎన్‌బీఎఫ్‌సీలు 8 ఏళ్ల కాల పరిమితితో రూ.50 లక్షల వరకు అన్‌సెక్యూర్డ్ లోన్స్ ఇస్తున్నాయి. గతంలో ఈ కాల పరిమితి అయిదేళ్లు ఉండేది. కంపెనీల స్థిరత్వం, లాభ, నష్టాలు, ఆదాయం కూడా వారి ఉద్యోగులు పొందే రుణ మొత్తాన్ని నిర్ణయిస్తోంది. అంతిమంగా దరఖాస్తుదారు క్రెడిట్ స్కోరే ముఖ్యం. **- సాయి కుమార్ మామిడి, ప్రైవేట్ బ్యాంక్ సీనియర్ సేల్స్ అడ్వైజర్, హైదరాబాద్**

చోరీకి వచ్చి.. విద్యుత్ షాక్‌తో మృతి

- మృతుడు నిజామాబాద్ జిల్లా వాసి



విద్యుత్ తీగలకు వేలాడుతున్న రమేశ్ మృతదేహం


మంచిర్యాల క్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఓ ఇంట్లో దొంగతనానికి వచ్చిన దొంగ.. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. స్థానికులు, స్థానిక సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి ఓ దొంగ పట్టణంలోని ఇస్లాంపురాలో చోరీ చేసేందుకు ఓ భవనం పైకి ఎక్కాడు. అక్కడ వీలుకాకపోవడంతో మరో బంగ్లాపైకి దూకాడు. ఈ క్రమంలో శబ్దం రావడంతో స్థానికులు గమనించి దొంగాదొంగ అని అరిచారు. దీంతో సదరు చోరుడు పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు మెడకు చుట్టుకోవడం, కరెంటు ప్రసారం కావడంతో షాక్‌తో మృతిచెందాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు మృతదేహాన్ని కిందకు దింపి పరిశీలించారు. అతని వద్ద ఆధార్ కార్డు, బస్ టికెట్ లభించింది. మృతుడు నిజామాబాద్ జిల్లా గాంధారి మండలం యాచారం గ్రామానికి చెందిన మాలోత్ రమేశ్‌గా గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

‘తాటికాయల’ ఘటన నిందితులకు రిమాండ్!

- 14 మందిపై నాన్‌బెయిలబుల్ కేసులు

ధర్మసాగర్: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన సంఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. బాధిత మహిళ భర్త నాగరాజు ఫిర్యాదుతో స్థానిక పోలీసులు.. మొత్తం 14మందిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. నిందితుల్లో 8 మంది మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నట్లు.. వారిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా.. సమాధానం చెప్పడానికి నిరాకరించారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు



గాయపడిన చిన్నారి జయశ్రీ

కుల్కచర్ల: వీధి కుక్కల దాడిలో ఒక చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల పరిధిలో జరిగిన ఈ సంఘటనపై బాధితులు తెలిపిన వివరాలివి. ఈర్ల వాగు తండా గ్రామ పంచాయతీ పాచావ్ కుంట తండాలో నీల, నాగేష్‌ల కూతురు జయశ్రీ (3) ఆదివారం ఇంటి ఎదుట ఆడుకుంటోంది. అదే సమయంలో రెండు వీధి కుక్కలు చిన్నారిపై దాడి చేశాయి. దగ్గరలో ఉన్న వ్యక్తి రాయితో కొట్టగా.. ఒక కుక్క పారిపోయింది. మరొకటి మాత్రం బాలికపై తీవ్రంగా దాడి చేసి గాయ పరిచింది. కుటుంబ సభ్యులు త్వరగా స్పందించడంతో ఆమెను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉంది.

మా నినాదం ‘ఇన్వెంట్ ఇన్ తెలంగాణ’

ఐఐటీఈఎక్స్–2025 కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: ఇన్వెంట్ ఇన్ తెలంగాణ.. అన్నది తమ ప్రభుత్వ నినాదమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ హబ్‌గా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైటెక్స్‌లో ‘ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ)’ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ‘ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో (ఐఐటీఈఎక్స్)–2025’కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో తెలంగాణ ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ కంపౌండ్ నెలవారీ పురోగతి రేటు 2.9 శాతమని, జాతీయ సగటు మాత్రం 0.52 శాతమే ఉందని అన్నారు. ఇది జాతీయ సగటు కంటే 6 రెట్లు అధికం కావడం గమనార్హమన్నారు.

పరిశ్రమలపై కొందరి విష ప్రచారం..

తెలంగాణ నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయంటూ కొందరూ విష ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి ఏడాదిన్నర కాలంలోనే తాము రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చామని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. ‘లైఫ్ సైన్సెస్ రంగంలోనే రూ.40 వేల కోట్ల పెట్టుబడులొచ్చాయి. 150 కొత్త ప్రాజెక్టులు మొదలయ్యాయి. 51 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 1.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, లైఫ్ సైన్సెస్ సిటీ, గ్రీన్ ఇండస్ట్రియల్ కారిడార్స్‌ను అభివృద్ధి చేస్తున్నాం’అని శ్రీధర్‌బాబు చెప్పారు. గత 18 నెలల్లో కొత్తగా 15 వేల ఎంఎస్ఎంఈలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రాల్లోనూ ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు డా.సురేశ్ కుమార్ సింఘాల్, సీనియర్ ఉపాధ్యక్షుడు ఆర్. రవికుమార్, ఉపాధ్యక్షుడు కేకే మహేశ్వరి, ఐఐటీఈఎక్స్ 2025 కన్వీనర్ విమలేశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యవర్గం



రాష్ట్ర అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న పురుషోత్తమరావు. చిత్రంలో వద్దిరాజు

ఖైరతాబాద్ (హైదరాబాద్): మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా సర్దార్ పుటం పురుషోత్తమ రావు, ప్రధాన కార్యదర్శిగా పెద్ది పెంటయ్య, కోశాధికారిగా కంచె సత్యనారాయణలు ఎన్నికయ్యారు. జలవిహార్ వేదికగా ఆదివారం మున్నూరు కాపు సంఘం అత్యున్నత నిర్ణాయక మండలి అపెక్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కమిషన్ ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల ప్రధాన అధికారులుగా జేడీ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి మంగపతిబాబు, రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ ఎర్రా నాగేంద్రబాబులు వ్యవహరించారు. అనంతరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులతో జేడీ లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగుతుందని తెలిపారు. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షునిగా వేణుగోపాల్ పటేల్, డాక్టర్ జీఎన్ వెంకట్ పటేల్, చల్లా హరిశంకర్, పటేల్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా బండి పద్మక్క పటేల్ నియమితులయ్యారు.

మున్నూరుకాపు మంత్రి లేని కేబినెట్ ఇదే: ఎంపీ వద్దిరాజు

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో మున్నూరుకాపుల నుంచి బీఆర్ఎస్ తరఫున 10మంది ఎమ్మెల్యేలుగా ఎన్నికైతే, కాంగ్రెస్ నుంచి 2023లో ఒక్కరు మాత్రమే ఎన్నికయ్యారని గుర్తు చేశారు. గత 75 ఏళ్లలో మున్నూరు కాపు మంత్రి లేని కేబినెట్ ఇదొక్కటేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కులగణన సందర్భంగా పాలకులు మున్నూరుకాపు జనాభాను తక్కువ చేసి చూపడం కూడా ఒక కుట్రేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, సంఘం మాజీ అధ్యక్షుడు కొండా దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

యాంకర్ మృతి ఘటనలో నిందితుడిపై ‘పోక్సో’ కేసు

- మరో రెండు అదనపు సెక్షన్లు కూడా నమోదు
- తొలుత అనుమానాస్పద మృతిగా కేసు

చిక్కడపల్లి (హైదరాబాద్): న్యూస్ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య కేసులో చిక్కడపల్లి పోలీసులు అదనపు సెక్షన్లు నమోదు చేశారు. శుక్రవారం రాంనగర్‌లోని తన ఇంట్లో యాంకర్ స్వేచ్ఛ ఉరి వేసుకుని చనిపోయిన విషయం తెలిసిందే. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. మరోపక్క ఈ కేసులో నిందితుడిగా ఉన్న పూర్ణచందర్ నాయక్ శనివారం రాత్రి న్యాయవాదితో వచ్చి చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో లొంగిపోయారు. మృతురాలి తండ్రి చెప్పిన వివరాలు, దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా బీఎన్ఎస్‌లోని 69 (వివాహం చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడి చేయడం), 108 (ఆత్మహత్యకు ప్రేరేపించడం) సెక్షన్లను కేసులో జోడించారు. అలాగే యాంకర్‌తో సహజీవనం చేసిన పూర్ణచందర్.. మృతురాలి కుమార్తె అయిన బాలిక తోనూ అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు రావడంతో కేసులో పోక్సో చట్టంలోని సెక్షన్లను కూడా నమోదు చేశారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు పూర్ణచందర్‌ను వివిధ కోణాల్లో విచారించారు. ఆపై అరెస్టు చేసి గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా, 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు అనుమతితో పూర్ణ చందర్‌ను మళ్లీ తమ కస్టడీలోని తీసుకుని విచారించాలని పోలీసులు నిర్ణయించారు. పూర్ణచందర్ సహజీవనం చేసి మోసం చేయడమేకాక, అతని వేధింపుల కారణంగానే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి వాంగ్మూలం ఇచ్చినట్లు పోలీసు అధికారులు తెలిపారు. మృతురాలి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా ల్యాప్‌టాప్‌లోని సమాచారాన్ని విశ్లేషించడంతోపాటు సెల్‌ఫోన్స్ కాల్ డేటాను సేకరించనున్నారు. ఈ కేసును చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేశ్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

హౌసింగ్ సొసైటీకి 50 ఎకరాలివ్వండి

- సీఎంకు హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ విజ్ఞప్తి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న హెచ్‌సీఏఏ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: కొత్తగా నిర్మిస్తున్న హైకోర్టు చుట్టుపక్కల ప్రాంతాల్లో న్యాయవాదుల హౌసింగ్ సొసైటీకి 50 ఎకరాల భూమిని కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) విజ్ఞప్తి చేసింది. న్యాయవాదుల సంక్షేమం కోసం హెచ్‌సీఏఏ చేపడుతున్న కార్యకలాపాలకు.. ఏటా రూ.5 కోట్లు ఇవ్వాలని కోరారు. హెచ్‌సీఏఏ కార్యవర్గం ఆదివారం ముఖ్యమంత్రిని కలిసింది. రాజేంద్రనగర్‌లో కొత్త హైకోర్టు నిర్మాణం కోసం రూ.1,028 కోట్లు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపింది. 2019 తర్వాత నమోదు చేసుకున్న న్యాయవాదులకు కూడా ఆరోగ్య బీమా వర్తించేలా రూ.100 కోట్లు అందించాలని సంఘ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. జూనియర్ న్యాయవాదుల స్టైపెండ్‌ను రూ.1000 నుంచి రూ.5 వేలకు పెంచాలని అభ్యర్థించారు. న్యాయవాదులపై దాడుల నివారణకు రక్షణ చట్టం తేవాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఎ.జగన్, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు ఖాజా విజారత్ అలీ, ఇంద్రసేనారెడ్డి, అదనపు కార్యదర్శి అనిరుధ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణహిత పరుగు



కాళేశ్వరం: మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం వద్ద ప్రాణహిత వరద నీరు పోటెత్తింది. దీంతో గోదావరి నీటిమట్టం భారీగా పెరుగుతోంది. ఆదివారం సాయంత్రం కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద నీటి మట్టం 8,500 క్యూసెక్కుల వరద ప్రవాహం దిగువకు తరలిపోతోంది. గోదావరికి వరద తాకిడి కనిపించడం లేదు. ప్రాణహిత ద్వారానే వరద వస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద 85 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పదోన్నతుల్లో పంచాయితీ

▶ మొదటి పేజీ తరువాయి

పనిచేయాల్సి వస్తోంది. కాగా జీహెచ్ఎం బదిలీ కోరుకోవాలంటే పనిచేస్తున్న స్కూల్‌లో కనీసం రెండేళ్ళ సర్వీస్ పూర్తిచేసి ఉండాలి. గరిష్టంగా 5 ఏళ్ళు నిండితే ప్రభుత్వమే బదిలీ చేయడానికి హక్కు ఉంటుంది. ఇక్కడే అసలు సమస్య వచ్చింది. పదోన్నతుల ద్వారా 2023లో దూర ప్రాంతాలకు వెళ్ళిన టీచర్లకు ఇంకా రెండు నెలలు పూర్తయితేనే బదిలీకి దరఖాస్తు చేసుకునే అర్హత వస్తుంది. ఈ నేపథ్యంలోనే పదోన్నతులపై జీహెచ్ఎంలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

కోర్టుకెళ్ళే యోచనలో హెచ్ఎంలు

ప్రభుత్వ నిర్ణయం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని జీహెచ్ఎంలు అంటున్నారు. ఇప్పుడు తమకు బదిలీ అవకాశం ఇవ్వకపోతే కొత్తగా పదోన్నతులు పొందేవారు జీహెచ్ఎం పోస్టుల్లో భర్తీ అవుతారని, అప్పుడు తాము సొంత జిల్లాలకు రాకుండా దూర ప్రాంతాల్లోనే రిటైర్ అవ్వాల్సి వస్తుందని చెబుతున్నారు. 2023లో ప్రమోషన్లు ఇచ్చేనాటికే 90 శాతం హెచ్ఎంలు రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్నారని, వయోభారంతో ఉన్న వాళ్ళు దూర ప్రాంతాల్లో ఎలా పనిచేస్తారని ప్రశ్నిస్తున్నారు. చాలామంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని, కుటుంబాలు సొంత జిల్లాల్లో ఉండగా, తాము పనిచేసే ప్రాంతాల్లో ఒంటరిగా ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను ప్రభుత్వం మానవతా దృక్పథంతో అర్థం చేసుకుంటుందని భావించామని, కానీ ఈ ప్రయత్నాలు ఫలించలేదని, దీంతో కోర్టును ఆశ్రయించడమే ఏకైక మార్గమని స్పష్టం చేస్తున్నారు.

ముందుగా బదిలీలు చేపట్టాలి



ముందుగా బదిలీలు చేపట్టాలి. ఆ తర్వాతే పదోన్నతులు ఇవ్వాలి. 2023లో దూర ప్రాంతాలకు వెళ్ళిన హెచ్ఎంలకు బదిలీల్లో అవకాశం కల్పించాలి. కనీస అర్హత వయసును ఏడాదికి తగ్గించాలి. ఇంకో రెండు నెలల్లో వీరి బదిలీకి అర్హత వస్తుందని తెలిసీ, ఎస్ఏలకు ప్రమోషన్లు ఇవ్వడం అన్యాయం. దీనివల్ల అనేక మంది హెచ్ఎంలకు ఇబ్బంది కలుగుతుంది.
–ఆర్.రాజగంగారెడ్డి (తెలంగాణ గెజిటెడ్ హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు)

ప్రమోషన్ల హక్కును అడ్డుకోవద్దు



గెజిటెడ్ ఉపాధ్యాయుల డిమాండ్ ఆమోదయోగ్యమే. దూర ప్రాంతాల హెచ్ఎంలు సొంత జిల్లాలకు రావాలనుకోవడమనేది వారికున్న ఒక హక్కుగానే చూడాలి. కానీ కొత్తవారికి ప్రమోషన్లు కూడా వారి హక్కు అని మర్చిపోవద్దు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సర్వీసును పరిగణనలోకి తీసుకోకుండా బదిలీలు చేపట్టాలి. – చావా రవి (టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు)

ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. కానీ ఇంతవరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఉపాధ్యాయ సంఘాల భిన్న వాదనలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం.
– డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ (పాఠశాల విద్య డైరెక్టర్)



కావేరి.. సొగసుల ఝరి

కావేరీ పరీవాహక ప్రాంతాలతో పాటు కేరళలో కుంభవృష్టి కారణంగా ఇటీవలి సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా కన్నడనాట కావేరీ పరవళ్లు తొక్కుతోంది. ఆదివారం మాండ్య జిల్లాలోని మళవళ్లి వద్ద అటవీ ప్రాంతంలో నయన మనోహరంగా కనిపిస్తూ కావేరి పర్యాటకులను అలరిస్తోంది. – మాండ్య

వేధింపులు ఇక భరించలేం!

- వివాహేతర సంబంధం అంటగట్టారని లేఖ రాసి..
- వివాహితుల బలవన్మరణం

బీబీనగర్: తమ మధ్య వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో కుటుంబ సభ్యులు మానసిక క్షోభకు గురి చేస్తున్నారని మనోవేదనకు గురైన ఇద్దరు వివాహితులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాదకర ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు పరిధిలో ఉన్న రాగల రిసార్టులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. నల్లగొండ జిల్లా కేతపల్లికి చెందిన బంధ బాలసుధాకర్ (39) హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో కుటుంబంతో నివాసం ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన పసల సుష్మిల (35) కూడా తన కుటుంబంతో కలిసి ఉప్పల్‌లో నివాసం ఉంటూ సీఎంఆర్ కాలేజీలో అకౌంటెంట్‌గా పని చేస్తోంది. ఇరు కుటుంబాల మధ్య చాలాకాలంగా పరిచయం ఉండటంతో సుధాకర్, సుష్మిల స్నేహపూర్వకంగా మెలుగుతున్నారు. వీరు తరచూ మాట్లాడుకోవడం చూసి ఇరువురి కుటుంబసభ్యులు అనుమానంతో పలుమార్లు హెచ్చరించారు. దీంతో మనస్తాపానికి గురైన సుధాకర్, సుష్మిల ఈ నెల 27న కారులో రాగల రిసార్ట్‌కు వచ్చి గది అద్దెకు తీసుకున్నారు. రెండు రోజులపాటు అక్కడే ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఇద్దరూ తమ కుటుంబాలకు వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపారు. తమ మధ్య వివాహేతర సంబంధం లేదని లేఖ రాసిపెట్టి ఇద్దరూ పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇరు కుటుంబాలు వెంటనే ఉప్పల్ పోలీసులకు సమాచారం ఇచ్చి రిసార్ట్‌కు చేరుకున్నారు. అప్పటికే గదిలో ఇద్దరు విగతజీవులుగా పడి ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఐ రమేశ్ తెలిపారు.

సిలికాన్ లేకుండానే కంప్యూటర్

ప్రపంచంలోనే తొలిసారి • ద్విమితీయ మూలకాలతో రూపొందించిన పెన్సిల్వేనియా వర్సిటీ బృందం


సుభీర్ ఘోష్, సప్తర్షి దాస్

న్యూఢిల్లీ: సెమీకండక్టర్ టెక్నాలజీలో రారాజుగా వెలుగొందుతున్న సిలికాన్ మూలకానికి ఉన్న ప్రాభవం భవిష్యత్తులో తగ్గిపోనుందని తాజా పరిశోధన ఒకటి స్పష్టంచేస్తోంది. ఆధునిక ఎలక్ట్రానిక్, సాంకేతిక ప్రపంచానికి ప్రాణాధారంగా నిలుస్తున్న స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లలో సిలికాన్ మూలకం అత్యంత కీలకం. ఈ మూలకం లేకుండా ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువు పురుడుపోసుకోదన్న వాదనను బద్దలుకొడుతూ అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ పరిశోధనా బృందం ప్రపంచంలోనే తొలిసారిగా సిలికాన్‌రహిత కంప్యూటర్‌ను అభివృద్ధిచేసింది. గత అర్ధశతాబ్దకాలంతో పోలిస్తే నేటి కంప్యూటర్ల పరిమాణం తగ్గడానికి, స్మార్ట్‌ఫోన్లు, విద్యుత్ వాహనాల సర్క్యూట్‌లలో సిలికాన్ అత్యంత ప్రధానమైన మూలకం. అలాంటి సిలికాన్ లేకుండానే 'కాంప్లిమెటరీ మెటల్ -ఆక్సైడ్ సెమీకండక్టర్' కంప్యూటర్‌ను తయారుచేశామని వర్సిటీ శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ పరిశోధనా తాలూకు వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. తక్కువ పరిమాణంలో విద్యుత్‌తో వినియోగించుకుంటూ అత్యంత పల్చటి, వేగవంతమైన ఎలక్ట్రానిక్స్ తయారీకి ఈ ద్విమితీయ వస్తువులు బాటలు వేస్తాయని పరిశోధకులు చెప్పారు. సర్క్యూట్‌లో ట్రాన్సిస్టర్‌లు ముఖ్యమైనవి. ఈ ట్రాన్సిస్టర్‌లను అత్యంత శుద్ధమైన సిలికాన్‌తో తయారుచేస్తారు. అయితే తాజా పెన్సిల్వేనియా వర్సిటీ పరిశోధకులు సిలికాన్‌కు బదులుగా ఎన్-టైప్ ట్రాన్సిస్టర్ కోసం మాలిబ్డినమ్ డైసల్ఫైడ్, పీ-టైప్ టాన్సిస్టర్ కోసం టంగ్‌స్టన్ డైసెలినైడ్‌ను ఉపయోగించారు.

సారథ్యం వహించిన భారతీయుడు

ఈ పరిశోధనకు పెన్సిల్వేనియా వర్సిటీలోని ఇంజనీరింగ్ సైన్స్, మెకానిక్స్ విభాగ ప్రొఫెసర్, భారతీయ మూలాలున్న సప్తర్షి దాస్ సారథ్యం వహించారు. ఈయన నేతృత్వంలోని బృందం తాజాగా ప్రాథమిక స్థాయిలో కాంప్లిమెంటరీ మెటల్-ఆక్సైడ్ సెమీకండక్టర్ (సీఎంఓఎస్)కంప్యూటర్‌ను తయారుచేసింది. ''సిలికాన్ పాడైతే ఆ ఎలక్ట్రానిక్ సర్క్యూట్ సామర్థ్యం కూడా దెబ్బతింటుంది. అదే ఈ ద్విమితీయ వస్తువులతో తయారైన సర్క్యూట్.. విద్యుత్ ప్రవాహాన్ని స్థిరీకరిస్తుంది. దాంతో సర్క్యూట్ ఎక్కువకాలం మన్నుతుంది. ఎలక్ట్రానిక్ సర్క్యూట్ రంగంలో ఇదొక మైలురాయి. భవిష్యత్తులో సిలికాన్‌రహిత సర్క్యూట్‌ల తయారీకి ఇది బాటలువేస్తుంది'' అని సప్తర్షి దాస్ వివరించారు. మెటల్-ఆర్గానిక్ కెమికల్ వేపర్ డిపోజిషన్(ఎంఓసీవీడీ) విధానంలో అత్యంత పల్చని పొరల మీద మాలిబ్డినమ్ డైసల్ఫైడ్, టంగ్‌స్టన్ డైసెలినైడ్ పరుచుకునేలా చేస్తారు. తద్వారా ఈ వినూత్న ట్రాన్సిస్టర్‌లను తయారుచేశారు. రెండు అంగుళాల పొరమీద సైతం ఈ ట్రాన్సిసర్‌ను అభివృద్ధిచేయొచ్చు. ఈ కంప్యూటర్ అత్యంత తక్కువ కరెంట్‌ను ఉపయోగించుకుంటూ 25 కిలోహెడ్జ్ సామర్థ్యంతో పనిచేస్తుందని పరిశోధనలో కీలకపాత్ర పోషించిన డాక్టోరల్ విద్యార్థి, భారతీయ మూలాలున్న సుభీర్ ఘోష్ చెప్పారు. ఈ ప్రాథమిక స్థాయి కంప్యూటర్ ప్రస్తుతానికి సింపుల్ లాజిక్ ఆపరేషన్స్‌ను సమర్థవంతంగా పూర్తిచేయగలదు.

భవిష్యత్తు అంతా 2డీదే

''మీరొక బహుళ అంతస్తుల భవనం కట్టాలంటే పటిష్టమైన ఇటుకలను వాడతారు. కానీ ఇప్పుడు అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతికతను ఉపయోగించి పటిష్టమైన పల్చటి పేపర్లతోనూ నిర్మాణం పూర్తిచేయొచ్చు. పల్చని, వేగవంతమైన ట్రాన్సిస్టర్‌లతో కంప్యూటర్‌నూ రూపొందించవచ్చు'' అని సప్తర్షి వ్యాఖ్యానించారు. సిలికాన్ సాంకేతికత గత 80 ఏళ్లుగా సరైన అభివృద్ధికి నోచుకోలేదు. కానీ 2డీ టెక్నాలజీ 2010లో మొదలైనా వెనువెంటనే అభివృద్ధిచెందుతోంది. భవిష్యత్తు అంతా 2డీ టెక్నాలజీదే'' అని పరిశోధకులు చెప్పారు. ఈ పరిశోధనకు అమెరికా నేషనల్ సైన్స్ ఫౌండేషన్, ది ఆర్మీ రీసెర్చ్ ఆఫీస్, నేవీ రీసెర్చ్ ఆఫీస్‌లు సైతం ఆర్థికసాయం అందిస్తున్నాయి.

ప్రయాణానికి 8 గంటల ముందే రిజర్వేషన్ చార్ట్

రైల్వే శాఖ నిర్ణయం

న్యూఢిల్లీ: రైలు ప్రయాణికులకు శుభవార్త. రైలు బయలుదేరడానికి 8 గంటల ముందే రిజర్వేషన్ చార్ట్ సిద్ధం చేయాలని నిర్ణయించినట్లు రైల్వే శాఖ ఆదివారం వెల్లడించింది. ప్రస్తుతం 4 గంటల ముందు రిజర్వేషన్ చార్ట్ ప్రకటిస్తున్నారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం ఇకపై 8 గంటల ముందే చార్ట్ విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ప్రయాణం విషయంలో గందరగోళానికి తెరపడనుంది. రిజర్వేషన్ ఖరారు అయ్యిందో లేదో 8 గంటల ముందే తెలిసిపోతుంది కాబట్టి దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోవచ్చు. ముఖ్యంగా వెయిటింగ్ లిస్టు ప్రయాణీలకు లబ్ధి చేకూరనుంది. టికెట్ బుకింగ్ వ్యవస్థలో చేపట్టాల్సిన సంస్కరణపై రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఇటీవల సమీక్ష నిర్వహించారు. టికెటింగ్ వ్యవస్థ పూర్తి పారదర్శకంగా, ప్రభావవంతంగా, ప్రయాణికులకు సౌలభ్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగానే రిజర్వేషన్ చార్ట్‌ను ప్రయాణానికి 8 గంటల ముందు ప్రకటించాలని నిర్ణయించారు. ఈ విధానాన్ని దశల వారీగా అమల్లోకి తీసుకొస్తారు.

477 డ్రోన్లు.. 60 మిస్సైళ్లు..!

ఉక్రెయిన్‌పై రష్యా అతిపెద్ద దాడి

కీవ్: రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య మూడేళ్లగా సాగుతున్న యుద్ధానికి సమీప భవిష్యత్తులో ముగిసేలా లేదు. రష్యా తాజాగా మరోమారు ఉక్రెయిన్‌పై భీకరదాడులు తెరతీసింది. శనివారం రాత్రి ఏకంగా 477 డ్రోన్లు, 60 క్షిపణులతో ఉక్రెయిన్ వ్యాప్తంగా దాడి చేసింది. వీటిలో 249 డ్రోన్లు, 38 క్షిపణులను కూల్చేశామని ఉక్రెయిన్‌ఆర్మీ ప్రకటించింది. 2022 ఫిబ్రవరిలో రష్యా దురాక్రమణ మొదలయ్యాక జరిగిన అతిపెద్ద దాడి ఇదేనని తెలిపింది. కొన్ని డ్రోన్లు యుద్ధక్షేత్రానికి అత్యంత దూరంలో జనావాసాలపై పడి విధ్వంసం సృష్టించాయంది. ఈ దాడి నేపథ్యంలో పొరుగునే ఉన్న పోలెండ్ తమ గగనతలంపై యుద్ధ విమానాలను గస్తీని పెంచింది. రష్యా దాడుల్లో ఇద్దరు చనిపోగా ఆరుగురు గాయపడ్డారు. లీవ్ ప్రాంతంలో జరిగిన దాడిలో పారిశ్రామిక ప్రాంతంలో మంటలు చెలరేగి, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తుర్కియే మధ్యవర్తిత్వంలో ఉక్రెయిన్‌తో మరోదఫా చర్చలకు తాము సిద్ధమని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించిన వెంటనే తాజా దాడులకు తెరలేపడం గమనార్హం. రష్యా దాడులను తిప్పికొట్టే క్రమంలో దెబ్బతిన్న తమ ఎఫ్-16 విమానం కుప్పకూలి పైలట్ చనిపోయారని ఉక్రెయిన్ ఎయిర్ ఫోర్స్ ఆదివారం వెల్లడించింది. ఇది ఈ యుద్ధంలో తాము కోల్పోయిన మూడో ఎఫ్-16 అని పేర్కొంది. పైలట్ వెంట తీసుకెళ్లిన ఆయుధాలన్నిటినీ వినియోగించి, ఏడు లక్ష్యాలను ధ్వంసం చేశారంది. చిట్టచివరి లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో యుద్ధ విమానం దెబ్బతిని కూలిపోయిందని తెలిపింది. విమానం నుంచి బయటపడేందుకు ఆయనకు తగు వ్యవధి దొరక్కపోవడంతో ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేసింది.

రథయాత్రలో తొక్కిసలాట

పూరీలో విషాదం • ముగ్గురి మృతి • 50 మందికి గాయాలు


రథయాత్రలో తొక్కిసలాట దృశ్యం


రోదిస్తున్న మృతుల కుటుంబీకులు

పూరీ: ఒడిశాలో విఖ్యాత పూరీ జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారుజామున 4.20 గంటల సమయంలో గుండిచా ఆలయం ఎదుట తొక్కిసలాట జరగడంతో ముగ్గురు భక్తులు ప్రాణాలు కోల్పోయారు. 50 మంది గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించామని, ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు మహిళలు. మూడు రథాల్లో కొలువుదీరిన జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రను దగ్గరి నుంచి తిలకించడానికి గుండిచా ఆలయం వద్ద భక్తులు ఇసకేస్తే రాలనంతగా గుమిగూడారు. అంతలో యాత్రా సామగ్రితో రెండు ట్రక్కులు జనం మధ్యలోకి దూసుకొచ్చాయి. దాంతో భయాందోళనకు గురై వారంతా ఒక్కసారిగా చెల్లాచెదురయ్యారు. ఒకరిపై ఒకరు పడిపోయారు. తొక్కిసలాటలో బోలాగఢ్‌కు చెందిన బసంతి సాహూ (36), బాలిపాట్నాకు చెందిన ప్రేమకాంత్ మొహంతీ (80), ప్రవతి దాస్ (42) మరణించారు.

అధికారులపై వేటు

తొక్కిసలాటపై ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. తొక్కిసలాటకు బాధ్యులుగా జిల్లా కలెక్టర్ సిద్ధార్థ శంకర్ స్వెయిన్, ఎస్పీ వినీత్ అగర్వాల్‌పై బదిలీ వేటు వేశారు. డీసీపీ బిష్ణు పాటీ, కమాండెంట్ అజయ్ పాఢీని సస్పెండ్ చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించారు. జగన్నాథుడి భక్తులు క్షమించాలంటూ 'ఎక్స్'లో సీఎం పోస్టు చేశారు. రథయాత్రలో తొక్కిసలాటకు భద్రతా లోపాలే కారణమని దర్యాప్తులో తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు ఒడిశా ప్రభుత్వం ప్రకటించింది. రథయాత్ర ఇన్‌చార్జిగా సీనియర్ అధికారి అరవింద్ అగర్వాల్‌ను నియమించింది. పరిస్థితి అదుపులోకి వచ్చిందని న్యాయ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ వెల్లడించారు. తొక్కిసలాటలో భక్తులు మరణించడం మనసును కలచివేసిందని పూరీ రాజు, శ్రీజగన్నాథాలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ చెప్పారు. ఇవి పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ తదితరులు సంతాపం ప్రకటించారు. ప్రభుత్వం సరైన ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఘోరం జరిగిందని విమర్శించారు. పూరీలో రథయాత్ర శుక్రవారం ప్రారంభమైంది. సంప్రదాయం ప్రకారం మూడు రథాలు ప్రధానాలయం నుంచి 2.6 కిలోమీటర్ల దూరంలోని గుండిచా మందిరానికి శనివారం చేరుకున్నాయి. గుండిచా మాతను జగన్నాథ, బలభద్ర, సుభద్రల తల్లిగా భావిస్తారు. రథాలు జూలై 5 దాకా అక్కడే ఉంటాయి. అనంతరం బహుదా యాత్ర ద్వారా ఆలయంలోకి తిరుగు ప్రయాణం అవుతాయి.

2026 ఏప్రిల్ 1 నుంచి తొలిదశ జనగణన

మొదటి దశలో హౌస్ లిస్టింగ్ ఆపరేషన్

న్యూఢిల్లీ: దేశ చరిత్రలో 16వ జన గణన, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 8వ జన గణనకు రంగం సిద్ధమవుతోంది. 2026 ఏప్రిల్ 1 నుంచి జన గణన అధికారికంగా ప్రారంభం కానుంది. జనాభా లెక్కల సేకరణ వీలుగా పరిపాలనా యూనిట్ల సరిహద్దుల్లో మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటే ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీలోగా ప్రతిపాదించాలని కేంద్రం సూచించింది. జన గణన ప్రక్రియకు మార్పులు చేసిన పరిపాలనా యూనిట్లను పరిగణనలోకి తీసుకుంటామని వెల్లడించింది. డిసెంబర్ 31న సరిహద్దులు ఖరారు చేస్తామన్నారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్, సెన్సెస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ నారాయణ్ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, పట్టణాలను ఏకరూప ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించనున్నట్లు తెలిపారు. ఒక్కో బ్లాక్‌కు ఒక ఎన్యూమరేటర్‌ను నియమిస్తారు. జనాభా లెక్కల సేకరణలో పొరపాట్లు జరగకుండా వీరు చర్యలు తీసుకుంటారని వివరించారు. 3 నెలల్లోగా జన గణన పూర్తిచేయాల్సి ఉంటుంది. 2027 మార్చి 1వ తేదీలోగా రెండు దశల్లో జనాభా లెక్కల సేకరణ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశలో హౌజ్‌లిస్టింగ్ ఆపరేషన్, రెండో దశలో పాపులేషన్ ఎన్యూమరేషన్ నిర్వహిస్తారు. హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ 2026 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. ఈసారి జన గణనతో పాటు కుల గణన కూడా చేపట్టనున్నారు. ఎన్యూమరేషన్ బ్లాక్‌లు ఖరారైన తర్వాత పరిపాలనా యూనిట్ల సరిహద్దుల్లో మార్పులు చేయడానికి వీలుండదు. దేశంలో చివరిసారిగా 2011లో జన గణన జరిగింది. మళ్లీ 16 ఏళ్ల తర్వాత.. 2027లో జరగబోతోంది.

రెండు విమానాల దారి మళ్లింపు

న్యూఢిల్లీ: దేశంలోని విమానాయన వ్యవస్థలో సమస్యల పర్వం కొనసాగుతోంది. ఆదివారం రెండు విమానాలను మళ్లించాల్సి వచ్చింది. ఎయిర్ ట్రాఫిక్‌లో సమస్యల వల్ల విజయవాడకు ఒక విమానాన్ని మళ్లిస్తే.. కేబిన్‌లో ఉష్ణోగ్రతలు వేడెక్కడంతో మరో విమానాన్ని దారి మళ్లించి కోల్‌కతాలో అత్యవసర ల్యాండింగ్ చేయాల్సి వచ్చింది. హైదరాబాద్‌కు వస్తున్న ఇండిగో వస్తున్న విమానం ఆదివారం ఉదయం 8:43 గంటలకు పూణే విమానాశ్రయం నుంచి బయలుదేరింది. హైదరాబాద్ గగనతలంలో రద్దీ ఎక్కువగా ఉండటతో విమానాన్ని దారి మళ్లించాలని పైలట్ నిర్ణయించారు. పరిస్థితులు అనుకూలించిన తర్వాత, విమానం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వచ్చింది. ఈ సంఘటనపై విమానయాన సంస్థ ఇంకా ఎటువంటి ప్రకటన విడుదల చేయలేదు. ఇక, జపాన్‌లోని హనేడా విమానాశ్రయం నుంచి ఢిల్లీకి వస్తున్న విమానాన్ని కూడా మళ్లించాల్సి వచ్చింది. బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం 357లో ఉష్ణోగ్రతలు పెరిగాయి. కేబిన్ వేడెక్కడంతో ముందుజాగ్రత్తగా కోల్‌కతాలో సురక్షితంగా ల్యాండ్ అయింది. ప్రస్తుతం తనిఖీలు జరుగుతున్నాయని ఎయిర్ ఇండియా తెలిపింది. ప్రయాణీకులను వీలైనంత త్వరగా ఢిల్లీకి తరలించడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎయిరిండియా తెలిపింది. శనివారం తెల్లవారుజామున, ముంబై నుంచి చెన్నైకి బయలుదేరిన ఎయిరిండియా విమానం కేబిన్‌లో కాలిన వాసన రావడంతో విమానాన్ని తిరిగి ముంబైలోనే ల్యాండ్ చేశారు.

భారత్‌పై మరోసారి నోరుపారేసుకున్న మునీర్

కరాచీ: పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ మరోసారి భారత్‌పై తన అక్కసును వెళ్లగక్కారు. పాకిస్తాన్‌ను రెచ్చగొట్టేలా భారత్ రెండుసార్లు యుద్ధాలకు తెగించిందని ఆరోపణలు గుప్పించారు. శనివారం కరాచీలోని పాకిస్తాన్ నావల్ అకాడమీలో మునీర్ ప్రసంగించారు. ఈ సందర్భంగా భారత్‌పై విమర్శల విషం చల్లారు. '' భారత్ అనవసరంగా రెండు సార్లు పాక్‌తో యుద్ధాలకు దిగింది. వ్యూహాత్మక ముందుచూపులేక భారత్ సమస్యల వలయంలో చిక్కుకుంది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తత పరిస్థితులకు ఇండియానే కారణం. ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతలకు పాక్ పాటుపడుతోంది. భారత గత సైనిక చర్యలకు పాక్ తగు రీతిలో స్పందించింది. ఎంతగా కవ్వించినా, రెచ్చగొట్టినా పాక్ పరిణతితో వ్యవహరిస్తోంది. ప్రాంతీయ శాంతి స్థాపనకు పాక్ కృషిచేస్తోంది. పాక్‌లో ఉగ్రవాదులను తుదముట్టించేందుకు మేం కష్టపడుతుంటే వాళ్లను భారత్ రెచ్చగొడుతోంది'' అని మునీర్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడారు.


ఎమర్జెన్సీ యోధులు చిరస్మరణీయులు

రాజ్యాంగ పరిరక్షణలో వారి పోరాటమే స్ఫూర్తి • మన్‌కీ బాత్‌లో మోదీ

న్యూఢిల్లీ: దేశంలో అత్యవసర పరిస్థితి విధించిన వ్యక్తులు రాజ్యాంగాన్ని హత్య చేయడంతోపాటు న్యాయ వ్యవస్థను చెరబట్టారని, కీలుబొమ్మను చేసి ఆడించారని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. ఎమర్జెన్సీ పేరిట అప్పటి ప్రభుత్వం ప్రజలను వేధింపులకు గురి చేసిందని, లెక్కలేనన్ని అఘాయిత్యాలు జరిగాయని ఆరోపించారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం సాగించిన నాయకులు చిరస్మరణీయులని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ విషయంలో వారి పోరాటమే మనకు స్ఫూర్తి అని ఉద్ఘాటించారు. ఆదివారం 123వ 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యం, వారి సమ్మిళిత శక్తితో ఎలాంటి సంక్షోభాలనైనా ఎదుర్కోవచ్చని అన్నారు. కొన్ని ఆడియో రికార్డులను ప్రధానమంత్రి వినిపించారు. సంక్షోభం అంటే ఎంత భయకరంగా ఉంటుందో వీటిద్వారా తెలుస్తుందని అన్నారు. ఎమర్జెన్సీ తర్వాత ప్రధానమంత్రిగా పనిచేసిన మొరార్జీ దేశాయ్ మాట్లాడిన ఆడియో, ఎమర్జెన్సీ దారుణాల గురించి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయ్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ మాట్లాడిన ఆడియోలు ఇందులో ఉన్నాయి.

నాటి దారుణాలు మరవలేం

''ఇందిర హయాంలో ప్రజలపై దమనకాండ కొన్ని సంవత్సరాలపాటు నిరంతరాయంగా కొనసాగింది. ఎమర్జెన్సీ ప్రకటించిన తర్వాత రెండేళ్లపాటు మరింత తీవ్రంగా మారింది. ప్రజల హక్కులను హరించారు. స్వాతంత్ర్యపు హక్కును అణచివేశారు. వార్తాపత్రికలపై కఠిన ఆంక్షలు విధించారు. కోర్టులను సైతం వదల్లేదు. వాటికి అధికారాలు లేకుండా చేశారు. లక్ష మందికిపైగా జనాన్ని జైళ్లలో పెట్టారు. అక్షరాలా రాక్షస పాలన సాగించారు'' అని మొరార్జీ దేశాయ్ మాట్లాడిన ఆడియోలో వినిపించింది. 1975 నుంచి 1977 దాకా 21 నెలలపాటు ప్రజలను చిత్రహింసలకు గురి చేశారని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. అప్పటి దారుణాలను ఎప్పటికీ మర్చిపోలేమని అన్నారు. జార్జి ఫెర్నాండెజ్ చేతులకు సంకెళ్లు వేశారని, మీసా చట్టం కింద వేలాది మందిని నిర్బంధించి, వారిపట్ల అమానవీయంగా ప్రవర్తించారని గుర్తుచేశారు. కానీ, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాటం చేశారని, చివరకు విజయం సాధించారని చెప్పారు. ఎమర్జెన్సీ విధించినవారికి గట్టిగా బుద్ధి చెప్పారని అన్నారు. ఎమర్జెన్సీకి 50 ఏళ్లయిన సందర్భంగా ఇటీవల 'సంవిధాన్ హత్య దివస్' జరుపుకున్నామని మోదీ తెలిపారు. 1977 ఎన్నికల్లో ఇందిరా గాంధీ ప్రభుత్వం ఓడిపోయిన తర్వాత వాజ్‌పేయ్ ఏం మాట్లాడారంటే.. ''దేశంలో ఇప్పుడు జరిగిన దాన్ని కేవలం ఎన్నికలు అనలేం. ఇదొక శాంతియుత విప్లవం. ప్రజా వెల్లువ ప్రజాస్వామ్య హంతకులను కుర్చీ నుంచి కూలదోసింది. వారిని చెత్తబుట్టలోకి విసిరేసింది'' దీనిపై మోదీ స్పందిస్తూ.. అత్యవసర పరిస్థితిని ఎదిరించి పోరాడిన వారిని మనం ఎప్పటికీ గుర్తుంచుకోవాలని చెప్పారు.



ట్రకోమా రహిత దేశంగా భారత్

బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ 'ట్రకోమా' రహిత దేశంగా భారత్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని ప్రధాన మోదీ అన్నారు. ఇందుకోసం కృషి చేసినవారికి అభినందనలు తెలియజేశారు. అస్సాంలోని బోడోలాండ్ ఫుట్‌బాల్ క్రీడాకారులుకు కేంద్రంగా మారిందని హర్షం వ్యక్తంచేశారు. మేఘాలయాలో ఎరీ సిల్క్‌కు భౌగోళిక గుర్తింపు(జీఐ) ట్యాగ్ లభించిందని ప్రత్యేకంగా ప్రస్తావించారు. పట్టు పురుగులను చంపకుండా అక్కడ వస్త్రాలు తయారు చేస్తున్నారని ప్రధాని వెల్లడించారు.

ఇజ్రాయెల్ దాడుల్లో హమాస్ అగ్ర నేత మృతి



జెరూసలేం: గాజా నగరంలోని సబ్రా ప్రాంతంపై శుక్రవారం ఇజ్రాయెల్ దళాలు చేపట్టిన ఆపరేషన్‌లో హమాస్ వ్యవస్థాపక సభ్యుడు, సీనియర్ కమాండర్ హకమ్ మహ్మద్ ఇస్సా అల్ ఇస్సా మృతి చెందారు. హమాస్ మిలటరీ ప్లానింగ్, హమాస్ నిర్మాణం, దళాల శిక్షణలో అత్యంత కీలకమైన నేతగా భావిస్తున్నారు. గాజాలో మిగిలున్న సీనియర్ నేతల్లో అల్ ఇస్సా ఒకరని ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. 2023 అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతాలపై చేపట్టిన మెరుపుదాడి సూత్రధారుల్లో అల్ ఇస్సా కూడా ఉన్నట్లు పేర్కొంది. ఇటీవలి వరకు ఇజ్రాయెల్ పౌరులు, సైనికులపై జరిపే దాడులను అల్ ఇస్సా సమన్వయకర్తగా ఉన్నారంది. ఇజ్రాయెల్ ఎడతెగని దాడులతో దెబ్బతిన్న హమాస్‌ను సంస్థాగతంగా పునర్నిర్మించే పనిలో ప్రస్తుతం నిమగ్నమైనట్లు ఇజ్రాయెల్ ఆర్మీ వివరించింది. ఇలా ఉండగా, గాజాలో ఆహార పంపిణీ కేంద్రాల వద్ద ఆదివారం ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన కాల్పుల్లో 9 మంది చిన్నారులు సహా 37 మంది ప్రాణాలు కోల్పోయారని ఆరోగ్య విభాగం తెలిపింది.

భారతీయ యువతి అమెరికాలో అదృశ్యం



వాషింగ్టన్: పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకొనేందుకు ఇండియా నుంచి అమెరికా వచ్చిన యువతి సిమ్రన్(24) కనిపించకుండాపోయింది. ఈ ఘటనపై న్యూజెర్సీ పోలీసు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. స్థానికంగా సీసీటీవీ కెమెరాల ఫుటేజీని జల్లెడ పడుతున్నారు. సిమ్రన్ ఈ నెల 20 భారత్ నుంచి అమెరికా చేరుకుంది. 25వ తేదీన అదృశ్యమైంది. ఆమె చివరిసారిగా కనిపించిన సీసీటీవీ ఫుటేజీ లభ్యమైంది. సిమ్రన్ తన ఫోన్ చూసుకుంటూ చుట్టుపక్కల పరికిస్తూ ఎవరి కోసమో ఆతృతగా వేచి చూస్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. ఆమె ఆ సమయంలో ప్రశాంతంగానే ఉందని, ఎలాంటి ఆందోళనకు గురి కాలేదని పోలీసులు చెబుతున్నారు. పెళ్లి చేసుకొనేందుకే యువతి అమెరికా వచ్చినట్లు ఒక కథనం వినిపిస్తోంది. కానీ, అందులో నిజం లేకపోవచ్చని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. ఆమెకు ఆంగ్ల భాష రాదని, ఇక్కడ బంధువులెవరూ లేరని అంటున్నారు. ఇండియాలోని బంధువులను సంప్రదించడానికి ప్రయత్నించగా ఎవరూ అందుబాటులోకి రాలేదు. సిమ్రన్ గురించి తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని న్యూజెర్సీ పోలీసులు కోరారు. మొత్తానికి సిమ్రన్ అదృశ్యం ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది.

దేశమంతటా రుతుపవనాలు

ఈసారి ముందుగానే విస్తరించాయి: ఐఎండీ

న్యూఢిల్లీ: నైరుతీ రుతుపవనాలు ఈ సీజన్‌లో తొమ్మిది రోజులు ముందుగానే దేశమంతటా విస్తరించాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) ఆదివారం తెలిపింది. సాధారణంగా జూన్ ఒకటిన కేరళ మీదుగా దేశంలోకి ప్రవేశించే రుతుపవనాలు జూలై 8వ తేదీనాటికి దేశవ్యాప్తంగా విస్తరిస్తా యని పేర్కొంది. ఈసారి మాత్రం ముందుగానే ప్రవేశించడంతో పాటు విస్తరించాయంది. 2020లో జూన్ 26వ తేదీకల్లా దేశమంతటా రుతు పవనాల విస్తరణ పూర్తయిందని గుర్తు చేసింది. ఆదివారం దేశ రాజధాని ఢిల్లీతోపాటు రాజస్తాన్, పశ్చిమ యూపీ, హరియాణాల్లో వ్యాపించాయని వివరించింది. వచ్చే వారం రోజుల్లో దేశంలోని వాయవ్య, మధ్య, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని స్పష్టం చేసింది. అరేబియా సముద్రం, బంగాళాఖాతం మీదుగా బలమైన అల్పపీడన వ్యవస్థల మద్దతుతో, రుతుపవనాలు వేగంగా ముందుకు సాగాయని తెలిపింది..అయితే, మే 29 నుంచి జూన్ 16 వరకు దాదాపు 18 రోజుల పాటు రుతు పవనాల కదలికలో స్తబ్దత ఏర్పడిందని పేర్కొంది. జూన్-సెప్టెంబర్ మధ్య ఈసారి సాధారణానికి మించి వర్షాలు కురిసే అవకాశాలున్నాయంది.


గల్లంతైన వారి కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ గాలింపు దృశ్యం

ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టి.. ఇద్దరు మృతి

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో ఆదివారం ఉదయం కురిసిన కుంభవృష్టి నిర్మాణ కార్మికులిద్దర్ని బలి తీసుకుంది. మరో ఏడుగురు గల్లంతయ్యారు. యమునోత్రి జాతీయ రహదారి పక్కన ఓ హోటల్ నిర్మాణం పక్కనే కార్మికులు తాత్కాలిక నివాసాల్లో ఉంటున్నారు. భారీ వర్షంతో కొండచరియలు విరిగి ఈ నివాసాలపై పడ్డాయి. ఈ ఘటనలో ఘటనలో ఇద్దరు చనిపోయారు. గల్లంతైన వారి కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టాయి. హైవే దెబ్బతినడంతో ఛార్ ధామ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోనూ కుంభవృష్టి కారణంగా సిమ్లా-కల్కా రైలు మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. జార్ఖండ్‌లోని ఈస్ట్ సింగ్‌భుమ్ జిల్లాలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. పండర్‌సోలిలోని ప్రైవేటు స్కూల్ ఆవరణలోకి వరద చేరడంతో లోపల కనీసం 162 మంది విద్యార్థులు చిక్కుబడిపోయారు.

నెగ్గిన 'బిగ్' బిల్లు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పంతం నెగ్గించుకున్నారు. దేశంలో పన్నుల తగ్గింపు, ప్రభుత్వ వ్యయంలో గణనీయంగా కోతలు విధించడంతోపాటు వలసదారులను బయటకు వెళ్లగొట్టడానికి భారీగా నిధులు కేటాయిస్తూ ట్రంప్ సర్కారు తీసుకొచ్చిన బిగ్, బ్యూటీఫుల్ బిల్లు సెనేట్‌లో ఆమోదం పొందింది. 940 పేజీల బిల్లుపై తొలుత చర్చ జరిగింది. కొందరు సభ్యులు పలు సవరణలు సూచించారు. శనివారం అర్ధరాత్రి నాటకీయ పరిణామాల మధ్య ఓటింగ్ జరిగింది. బిల్లుకు అనుకూలంగా 51, వ్యతిరేకంగా 49 ఓట్లు వచ్చాయి. తుది ఓటింగ్ కోసం ఈ బిల్లును ప్రతినిధుల సభకు పంపించనున్నారు. అనంతరం ట్రంప్ ఆమోదం కోసం వైట్‌హౌజ్‌కు పంపిస్తారు. ట్రంప్ ఆమోద ముద్ర వేస్తే బిల్లు చట్టంగా మారి అమల్లోకి వస్తుంది. ''సెనేట్‌లో ఈ రోజు గొప్ప విజయం మనం కళ్లారా చూశాం'' అంటూ ట్రంప్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు.

రిపబ్లికన్ పార్టీకి రాజకీయ ఆత్మహత్య: మస్క్

డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన బిగ్, బ్యూటీఫుల్ బిల్లుపై టెస్లా, స్పేస్‌ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ సెనేట్ డ్రాఫ్ట్ బిల్లు కారణంగా దేశంలో ఉద్యోగాలు గణనీయంగా తగ్గిపోతాయని, పరిశ్రమలు దెబ్బతింటాయని, అంతిమంగా అమెరికా దారుణంగా నష్టపోతుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శనివారం 'ఎక్స్'లో పోస్టుచేశారు. అధికార రిపబ్లికన్ పార్టీకి ఇది రాజకీయ ఆత్మహత్యేనని తేల్చిచెప్పారు. ట్రంప్ ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 30 । జూన్ । 2025

విజన్-2047 మా లక్ష్యం



విజన్- 2047 లక్ష్యంగా మహా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ కోసం సీవరేజీ, తాగునీటి ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ డీపీఆర్ రూపకల్పనకు కసరత్తు చేస్తున్నామని జల మండలి ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. -10లో



పచ్చదనానికి.. మియావా'కీ'..

నగరంలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు తమ ప్రాంగణాలను పచ్చగా మార్చేందుకు శ్రద్ధ చూపిస్తున్నాయి. ఈ క్రమంలో మియావాకీ అత్యుత్తమ అనుసరణీయ విధానంగా మారింది. -సిటీప్లస్‌లో

వాతావరణం


గరిష్టం/కనిష్టం
35.0/24.0

నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

ఘనం.. రెండో బోనం

గోల్కొండ కోటకు వెల్లువెత్తిన భక్తజనం

గోల్కొండ కోటలో శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి ఆదివారం 2వ బోనం పూజ ఘనంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కోటలోని నగినాబాగ్, రాణీమహల్ తదితర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. మహిళలు నాగదేవత పుట్టకు పూజలు నిర్వహించారు. అనంతరం తలలపై అందంగా అలంకరించిన బోనం కుండలతో కోటపైకి అమ్మవారి దర్శనానికి బయల్దేరి వెళ్లారు. గోల్కొండ ఫతే దర్వాజా నుంచి భక్తులు తొట్టెలతో ఊరేగింపుగా వచ్చారు. కోట చౌరస్తా శివసత్తుల పూనకాలతో ఆధ్యాత్మిక వాతావరణంతో నెలకొంది. ఆలయ కార్యనిర్వహణాధికారి వసంత, బోనాల ఉత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. -గోల్కొండ



అమ్మవారికి రెండో బోనం సందర్భంగా గోల్కొండ కోటకు పోటెత్తిన భక్తజనం



బోనాల ఉత్సవంలో శివసత్తుల సందడి



వయోవృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ప్రవేశం

నేడు బల్కంపేట ఎల్లమ్మ దర్శనానికి అనుమతి



ప్రత్యేక దర్శనానికి అనుమతి కోరుతూ ఈఓకు వినతి పత్రం సమర్పించిన రాయల సేవాసమితి ప్రతినిధులు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాల ప్రారంభం తొలిరోజే వయోవృద్ధులు, దివ్యాంగులు దర్శనం చేసుకునే అవకాశం కల్పించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్ గౌడ్ తెలిపారు. రాయల సేవా సమితి, శ్రీరామ్‌నగర్ కాలనీ అసోసియేషన్ నాయకులు ఆదివారం ఆలయంలో ఈఓను కలిశారు. అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవాల నేపథ్యంలో 60 ఏళ్లు పైబడిన వారితో పాటు దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి నిర్ణీత సమయంలో దర్శనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఈఓ సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా దర్శనాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వృద్ధులు వికలాంగులు ఆధార్ గుర్తింపు కార్డు, డిజబిలిటీ సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉంటుందని సూచించారు. ఆలయ అధికారులకు రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హైమావతి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బల్కంపేటలో ట్రాఫిక్ ఆంక్షలు

సనత్‌నగర్/అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవాల సందర్భంగా ఆలయ మార్గంలో వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీస్ కమిషనర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.

మళ్లింపులు ఇలా..

- గ్రీన్‌లాండ్స్, మాతా టెంపుల్, సత్యం థియేటర్ నుంచి ఫతేనగర్ వైపు వెళ్లే ట్రాఫిక్‌కు ఎస్‌ఆర్ నగర్ టీ జంక్షన్ వద్ద మళ్లించి ఎస్‌ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్, అభిలాష టవర్స్, బీకే గూడ ఎక్స్ రోడ్డు, శ్రీరాం నగర్ ఎక్స్ రోడ్డుల మీదుగా సనత్‌నగర్, ఫతేనగర్ రోడ్డుకు అనుమతిస్తారు.
- ఫతేనగర్ ఫ్లై ఓవర్ నుంచి బల్కంపేట వైపు వెళ్లే వాహనాలను అనుమతించరు. ఈ వాహనాలను బేగంపేట కొత్త బ్రిడ్జి మీదుగా కట్టమైసమ్మ ఆలయం బేగంపేట వైపు అనుమతిస్తారు.
- గ్రీన్‌లాండ్స్, బకుళ్ అపార్టుమెంట్స్, ఫుడ్ వరల్డ్ నుంచి వచ్చే ట్రాఫిక్‌ను బల్కంపేట వైపు అనుమతించరు. ఫుడ్ వరల్డ్ క్రాస్ రోడ్డు నుంచి సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, మైత్రి వనం మీదుగా ఎస్‌ఆర్‌నగర్ టీ జంక్షన్ వైపు మళ్లిస్తారు. బేగంపేట కట్ట మైసమ్మ ఆలయం నుంచి బల్కంపేట వైపు వచ్చే వాహనాలను అనుమతించరు. అటు నుంచి వచ్చే వాహనాలు గ్రీన్‌లాండ్స్, మాతా ఆలయం, సత్యం థియేటర్, ఎస్‌ఆర్‌నగర్ టీ జంక్షన్ వైపు, ఎస్‌ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ వైపు మళ్లిస్తారు. ఎస్‌ఆర్ నగర్ టీ జంక్షన్ నుంచి ఫతేనగర్ వరకు ఉన్న బై లైన్లు, లింక్ రోడ్లు మూసివేస్తారు.

భక్తుల వాహనాల పార్కింగ్ ఇలా..

అమ్మవారి కల్యాణ మహోత్సవాలకు హాజరయ్యే భక్తులు వాహనాల కోసం కేటాయించిన స్థలాల్లోనే పార్కింగ్ చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. అవి ఎక్కడ అంటే.. బల్కంపేట ఆర్‌అండ్‌బీ కార్యాలయం, అమీర్‌పేట జీహెచ్ఎంసీ మైదానం, పద్మశ్రీ అపార్ట్‌మెంట్స్ నుంచి ప్రకృతి ఆసుపత్రి వెళ్లే రోడ్డు మార్గం, ఫతేనగర్ అండర్ రైల్వే బ్రిడ్జి, ప్రకృతి ఆసుపత్రి పార్కింగ్ స్థలం. వాహనదారులు హెల్ప్‌లైన్ నంబర్ 90102 03626ను సంప్రదించవచ్చు.

నిబంధనలు నీరుగారి.. అక్రమాల సవారీ

దళారుల గుప్పిట్లో డ్రైవింగ్ లైసెన్సులు

- మొక్కుబడిగా స్పీడ్‌పోస్టు సేవలు
- నకిలీ అడ్రస్‌లపై లైసెన్సులు, ఆర్సీలు
- ఇష్టారాజ్యంగా ఆర్టీఏ పౌరసేవలు

సాక్షి, సిటీబ్యూరో: డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను నేరుగా వాహనదారులకు చేరవేసే స్పీడ్‌పోస్టు సేవలు నీరుగారుతున్నాయి. రవాణాశాఖ అందజేసే వివిధ రకాల పౌరసేవలు నకిలీ అడ్రస్‌లపై, తప్పుడు వ్యక్తులకు చేరకుండా ఉండేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన స్పీడ్‌పోస్ట్ పద్ధతి విఫలమవుతోంది. ఇటీవల ఏసీబీ దాడుల్లో దళారుల వద్ద పెద్ద ఎత్తున డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ స్మార్ట్‌కార్డులు లభించడమే ఇందుకు నిదర్శనం.

కార్డుకు ఇంత ధర..

నేరుగా వాహనదారు ఇంటి చిరునామాకు స్మార్ట్ కార్డులను పోస్టు చేయాలి. కానీ.. ఇందుకు భిన్నంగా ప్రతి స్మార్ట్‌కార్డుకు కొంత ధర నిర్ణయించి ఏజెంట్లు, దళారుల చేతుల్లో పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా తమ చేతికి వచ్చిన కార్డులపై ఏజెంట్లు మరికొంత ధర పెంచి వాహనదారులకు విక్రయిస్తున్నారు. నిజానికి వాహనాల రిజిస్ట్రేషన్‌లు, డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల బదిలీలు, చిరునామా మార్పు, డూప్లికేట్ ఆర్సీ వంటి వివిధ రకాల పౌరసేవల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకొనే సమయంలోనే వాహనదారులు ఆర్టీఏకు చెల్లించాల్సినన ఫీజు సహా స్పీడ్ పోస్టు చార్జీలు కూడా చెల్లిస్తారు. ఈ మేరకు ప్రతి స్మార్ట్‌కార్డును వాహనదారు ఇంటి అడ్రస్‌కు పోస్ట్ చేయాలి. కానీ.. గ్రేటర్‌లోని పలు ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ఈ ప్రక్రియ ఒక ప్రహసనంలా మారింది. స్మార్ట్ కార్డులను పోస్ట్ చేయకుండానే దళారులు, ఏజెంట్‌ల ద్వారా వాహన యజమానులకు కట్టబెడుతున్నారు. పలుచోట్ల ఇది వ్యాపారంగా మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నకిలీ చిరునామాలపైనా సర్వీసులు..

సాధారణంగా వాహనదారులు ఏ ఆర్టీఏ కార్యాలయం పరిధిలో నివసిస్తే ఆ కార్యాలయంలోనే ఆర్టీఏ పౌరసేవలు లభిస్తాయి. కొన్నిచోట్ల ఈ నిబంధన అమలుకు నోచుకోవడం లేదు. నకిలీ చిరునామాపై అడ్డగోలుగా ఆర్టీఏ పౌరసేవలను అందజేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాహనదారులు



నగరంలోని ఏ ఆర్టీఏ పరిధిలో నివసిస్తున్నారనే అంశంతో సంబంధం లేకుండా కొన్ని చోట్ల నిబంధనలకు విరుద్ధంగా డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు వంటివి అందజేస్తున్నారు. ఏజెంట్లు, దళారుల ద్వారా ఈ తతంగం యథేచ్ఛగా కొనసాగుతోంది. కొద్ది రోజుల క్రితం బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయంలో తప్పుడు పద్ధతుల్లో స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు అధికారుల పరిశీలనలో వెల్లడైంది. ఒక్క బండ్లగూడలోనే కాకుండా నగరంలోని పలు కార్యాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

మీ సేవ ద్వారా పంపిణీ మేలు..

- స్మార్ట్‌కార్డులను స్పీడ్‌పోస్ట్ చేయడంలో రెండు రకాల తప్పిదాలు జరుగుతున్నాయి. ఒకవైపు దళారులు, ఏజెంట్‌ల ద్వారా విక్రయాలకు పాల్పడుతుండగా, మరోవైపు స్పీడ్‌పోస్ట్ చేసినప్పటికీ వాహనదారుడికి చేరడం లేదు. పోస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణం. సదరు వ్యక్తులకు ఇవ్వకుండానే 'ఆ అడ్రస్‌లో లేరు' అని వెనక్కి పంపిస్తున్నారు. ఇలా వచ్చిన స్మార్ట్‌కార్డులు ఆర్టీఏ కార్యాలయాల్లోనే కుప్పలు తెప్పలుగా పడి ఉన్నాయి. వీటి కోసం వచ్చే వాహనదారులు ఎంతోకొంత సమర్పించుకుంటే తప్ప పత్రాలు అందడం లేదు.
- కొన్ని చోట్ల అసలు పోస్ట్ చేయకుండానే చేసినట్లుగా రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. ఇలా వివిధ రకాలుగా విఫలమైన స్పీడ్‌పోస్ట్ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ఆధార్, ఓటర్ గుర్తింపు కార్డులు, రేషన్ కార్డుల తరహాలో మీ సేవ కేంద్రాల ద్వారా అందజేయాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ అమలు కావడం లేదు. ఇలాకాకుండా ఏదైనా ఓ కొరియర్ సంస్థకు అప్పగించాలనే ప్రతిపాదన కూడా ఉంది. కానీ నిర్లక్ష్యానికి గురవుతోంది.

బోనాల ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఘనంగా ఉజ్జయినీ మహాకాళి ఘటం ఎదుర్కోలు

బన్సీలాల్‌పేట్: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అమ్మవారి బోనాల వేడుకలను నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించడానికి ప్రభుత్వం విస్తృతమైన ఏర్పాట్లు చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి దేవాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన అమ్మవారి ఘటం ఎదుర్కోలు కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. అమ్మవారి ఘటం



తయారీ వస్తువులు, ఆభరణాలను ఫౌండర్ ట్రస్టీ ఫ్యామిలీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల వేడుకల సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేవాదాయ, పోలీసు, జీహెచ్ఎంసీ, విద్యుత్తు, సాంస్కృతిక, రవాణా, వైద్య ఆరోగ్య విభాగాలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాయన్నారు. మంత్రి వెంట దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, ఈవో మనోహర్ రెడ్డి ఉన్నారు.



డప్పుల దరువులకు స్టెప్పులేసిన పొన్నం..

మంత్రి పొన్నం ప్రభాకర్ డప్పు చప్పుళ్లకు ఆనందంతో పోతురాజుల ఈరగోళలను తీసుకొని నృత్యం చేశారు. మహాకాళి అమ్మవారి ఘటం ఎదుర్కోలు వేడుకల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా కనిపించాయి. అంతకు ముందు అమ్మవారి ఆలయాన్ని శ్రీ విద్యా శంకర భారతి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అమ్మవారి ఘటం ఉత్సవాల ఎదుర్కోలు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సనత్‌నగర్ కాంగ్రెస్ మహిళా నేత డాక్టర్ కోట నీలిమ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయం వద్ద భక్తుల కోలాహలం

రెండు నెలలు ఆగాల్సిందే..

- కొత్త కార్డులకు సెప్టెంబర్‌లో రేషన్
- జూన్‌లో భారీ సంఖ్యలో కార్డుల మంజూరు
- కుటుంబ సభ్యుల చేర్పులకు సైతం ఆమోదం

సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా (జూన్‌లో) మంజూరైన ఆహార భద్రత (రేషన్) కార్డుదారులకు సెప్టెంబర్‌లో ఉచిత బియ్యం కోటా అందనుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ఒకేసారి మూడు (జూన్, జులై, ఆగస్టు) నెలల ఉచిత బియ్యం కోటా పంపిణీ కొనసాగుతోంది. ముందస్తుగానే రెండు నెలల బియ్యం కోటా కేటాయించి అందిస్తున్న కారణంగా తిరిగి సెప్టెంబర్‌లోనే నెలవారీ కోటా విడుదల కానుంది. ఈ నెలలో కొత్తగా మంజూరైన కార్డుదారులకు సైతం పాత కార్డుదారులతో కలిపి సెప్టెంబర్‌లోనే బియ్యం కోటా కేటాయింపు ఉంటుందని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. పాత కార్డుదారులు సైతం ఈ నెల 30 వరకు మాత్రమే మూడు నెలల కోటాను డ్రా చేసుకోవచ్చని, ఆ



తర్వాత అవకాశం ఉండదని స్పష్టం చేస్తున్నారు.

కొత్తవి లక్షకుపైగానే..

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో సుమారు లక్షకు పైగా కొత్త రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలుస్తోంది. మరోవైపు పాత కార్డుల్లో సుమారు రెండు లక్షల కొత్త సభ్యులు (యూనిట్లు) పెరిగినట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మూడు నెలల నుంచి మీ సేవ ఆన్‌లైన్ ద్వారా కొత్త కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తుండటంతో ఎఫ్ఎస్‌సీ లాగిన్‌లో సుమారు మూడు లక్షలకు పైగా నమోదైనట్లు తెలుస్తోంది. మరోవైపు సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో మగ్గుతున్న పాత కార్డుల్లో కొత్త సభ్యుల చేర్పులకు సైతం ఆమోదం లభిస్తోంది. దీంతో కొత్త కార్డులతో పాటు పాత కార్డుల్లో సభ్యుల సంఖ్య భారీగా పెరిగినట్లు తెలుస్తోంది.

సర్కిల్ కార్యాలయాలకు తాకిడి..

గత పదేళ్లలో అంతగా రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంతో కొత్త కార్డుల కోసం మీ సేవ ఆన్‌లైన్ కేంద్రాలతో పాటు సివిల్ సప్లయ్ సర్కిల్ కార్యాలయాలకు తాకిడి పెరిగినట్లయింది. గత నెల 24లోపు మంజూరైన కొత్త కార్డులకు, పాత కార్డుల్లో ఆమోదానికి గురైన కొత్త యూనిట్లకు మూడు నెలల కోటా విడుదలైంది. ఆ తర్వాత మంజూరవుతున్న కార్డులకు మాత్రం సెప్టెంబర్‌లో బియ్యం కోటా విడుదలయ్యే అవకాశం కనిపిస్తోంది.

గ్రేటర్ పరిధిలో ప్రస్తుతం ఆహార భద్రత కార్డులు ఇలా

జిల్లా	రేషన్ కార్డులు	యూనిట్లు
హైదరాబాద్	6,47,282	24,24,824
రంగారెడ్డి	5,72,792	19,36,346
మేడ్చల్-మల్కాజిగిరి	5,37,810	18,65,353

విజయవాడ కనకదుర్గమ్మకు జోడు బోనాలు



బంగారు బోనంతో గోపిశెట్టి సంగీత

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం విజయవాడ కనక దుర్గ అమ్మవారికి బంగారు బోనాన్ని సమర్పించారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని వివిధ దేవాలయాలకు చెందిన ప్రతినిధుల బృందంతో పాటు అక్కన్న మాదన్న దేవాలయం కమిటీ సభ్యులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. జోగిని శ్యామల వెండి బోనం ఎత్తారు. ఈసారి బంగారు బోనాన్ని కమిటీ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ సతీమణి సంగీత ఎత్తుకున్నారు. ఈసారి విజయవాడ కనక దుర్గమ్మకు బంగారు, వెండి పాత్రల్లో జోడు బోనాలు సమర్పించారు.

ఇంటికి వస్తున్నానని ఫోన్ చేసిన కాసేపటికే కబళించిన మృత్యువు

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం



సురేష్ (ఫైల్)

మూసాపేట: కాసేపట్లో ఇంటికి వస్తున్నానంటూ ఫోన్ చేసి చెప్పిన కుమారుడు.. అంతలోనే చనిపోయాడని పోలీసులు ఫోన్ చేయడంతో ఆ తల్లిదండ్రులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు. ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందిన ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ రాజీవ్ నగర్‌కు చెందిన తిరుపతయ్య కుమారుడు సురేష్ (24) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కూకట్‌పల్లిలోని ఫ్రెండ్స్ వద్దకు వెళ్లి షాపింగ్ చేసుకుని వస్తానని శనివారం సాయంత్రం 5 గంటలకు బోడుప్పల్ నుంచి బయలుదేరాడు. రాత్రి 10 గంటలకు ఆలస్యం కావడంతో రాత్రి ఫ్రెండ్ వద్ద ఉండి ఉదయం వస్తానని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పాడు. మళ్లీ ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు వస్తున్నానంటూ తల్లిదండ్రులకు చెప్పి బయలుదేరాడు. 5 గంటలకు కూకట్‌పల్లి పోలీసులు ఫోన్ చేసి కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద మెట్రో పిల్లర్ నెంబర్ 839 వద్ద రోడ్డు ప్రమాదంలో మీ కుమారుడు చనిపోయాడని తెలిపారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహుభాషా కోవిదుడు పీవీ నరసింహారావు

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

సుల్తాన్‌బజార్: మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు బహుభాషా కోవిదుడని ఎమ్మెల్సీ సురభి వాణీదేవి అన్నారు. శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని కార్యాలయంలో భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా హాజరైన వాణీదేవి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో పీవీ పాత్ర ఎనలేనిదన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాఠశాల స్థాయి విద్యార్థుల వ్యాసరచన పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు డాక్టర్ కె.శ్రీనివాస్.. పీవీ నరసింహారావు బహుముఖ వ్యక్తిత్వంపై స్మారక ఉపన్యాసం చేశారు. శ్రీనివాస్‌ను వాణీదేవి సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ దేవారాయ భాషా నిలయం అధ్యక్షుడు డాక్టర్ కేవీ రమణాచారి, పీవీ కుమారుడు పీవీ ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.చంద్రప్రకాష్‌రావు, గౌరవ కార్యదర్శి టి.ఉదయవర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తి మృతి



ఆకుల భరత్ మృతదేహం

దుండిగల్: వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు వెనుక నుండి బైక్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దుండిగల్‌కు చెందిన వీరయ్య కుమారుడు ఆకుల భరత్ (39) ఆదివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో గండిమైసమ్మ నుండి దుండిగల్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోటరీ–1 బ్రిడ్జి సమీపంలోకి రాగానే వెనుక నుండి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు భరత్ బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కష్టమర్లకూ కటకటాలే!

డ్రగ్స్ కేసుల్లో కఠిన వైఖరికి పోలీసుల నిర్ణయం

- ఇప్పటి వరకు చిక్కిన వినియోగదారులకు నోటీసులు
- ఇకపై అరెస్ట్... కొన్ని కేసుల్లో మాత్రం రీహ్యాబ్‌కు సిఫార్సు
- డిమాండ్ తగ్గింపుతోనే సరఫరాకు అడ్డుకట్ట వేయొచ్చని ఈ మార్పు
- రాష్ట్రంలో నాలుగున్నర ఏళ్లలో రూ.508 కోట్ల 'సరుకు' సీజ్



సాక్షి, సిటీబ్యూరో: 'డ్రగ్ ఫ్రీ తెలంగాణ' దిశగా అడుగులు వేస్తున్న పోలీసు విభాగం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మాదకద్రవ్యాల సంబంధిత కేసుల్లో ఇకపై వినియోగదారులనూ అరెస్టు చేయనుంది. కేవలం కొన్ని కేసుల్లో..అర్హులైన కస్టమర్లను మాత్రం రీహ్యాబ్‌కు పంపనుంది. ఇప్పటి వరకు అమలవుతున్న స్టేషన్ బెయిల్ విధానానికి పూర్తిస్థాయిలో స్వస్తి చెప్పాలని యోచిస్తోంది. గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో రూ.508.5 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు పట్టుపడటం, డిమాండ్‌ను తగ్గిస్తేనే సప్లెకి పూర్తిస్థాయిలో చెక్ చెప్పే అవకాశం ఉందనే ఉద్దేశంతో ఈ దిశలో ముందుకు వెళ్తోంది.

వినియోగదారులే విక్రేతలుగా మారుతూ...

చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లో మాదకద్రవ్యాలకు అలవాటుపడి వినియోగదారుడైన ఓ వ్యక్తి చదువు పూర్తి చేసుకుని బెంగళూరు చేరిన తర్వాత సరఫరాదారుడిగా మారాడు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన వారి నుంచి ఎండీఎంఏ డ్రగ్ సేకరిస్తూ, నగరంలో నలుగురు పెడ్లర్స్‌కు విక్రయించాడు. ఇతడి వ్యవహారాలపై సమాచారం అందుకున్న పోలీసులు అరెస్టు చేసి భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి ఘటనల్ని పరిగణనలోకి తీసుకున్న పోలీసులు మాదకద్రవ్యాల వినియోగదారులపై కఠినంగా ఉంటే వాళ్ల విక్రేతలుగా మారే అవకాశం ఉండదని నిర్ణయించారు. ఇప్పటి వరకు వినియోగదారులుగా చిక్కిన వారికి నోటీసులు, స్టేషన్ బెయిల్ ఇస్తున్నారు. ఇకపై వీరినీ ఇతర నిందితుల మాదిరిగా అరెస్టు చేయనున్నారు. అనుకోని పరిణామాలు, అనివార్య కారణాల వల్ల డ్రగ్స్‌కు బానిసలుగా మారిన వారిని మాత్రం రీహ్యాబిలిటేషన్ సెంటర్లకు పంపనున్నారు.

మార్గాలు మారుస్తూ డ్రగ్స్ సరఫరా...

నగరంలో డ్రగ్స్‌కు డిమాండ్ ఉన్నంత కాలం సరఫరా చేయడానికి సప్లయర్స్ వివిధ మార్గాలు అన్వేషిస్తున్నారు. గోవాలో ఉన్న డ్రగ్ డాన్లపై దాడులు చేస్తే... ముంబై, బెంగళూరు కేంద్రంగా ఉన్న వాళ్లు సరఫరా చేస్తున్నారు. పోలీసుల ఊహకు అందని మార్గాల్లో నగరానికి చేరుస్తున్నారు. నేరుగా వస్తూ, పార్శిల్స్, కొరియర్స్ ద్వారా సప్లై చేస్తున్నారు. ఇటీవల కాలంలో ఓ ప్రాంతంలో డ్రగ్స్ ఉంచి ఆ లొకేషన్‌ను వినియోగదారుడికి పంపే డెడ్ డ్రాప్ విధానం కూడా పెరిగింది. గంజాయికి బదులుగా తేలిగ్గా రవాణా చేయగలిగే హష్ ఆయిల్, సింథటిక్ డ్రగ్స్‌లో ఎల్ఎస్డీ బోల్ట్స్ వంటివి సరఫరా ఎక్కువగా జరుగుతోంది. పోలీసుల నిఘా, దాడులు పెరిగే కొద్దీ మాకదద్రవ్యాల రేట్లు పెంచి మరీ సరఫరా చేస్తున్న సూత్రధారులు అనేక మంది ఉంటున్నారు. ఓ పక్క ఈ సరఫరా చైన్‌ను దెబ్బతీస్తూ, మరోపక్క సూత్రధారులను సైతం అరెస్టు చేస్తున్న అధికారులు డిమాండ్ తగ్గించడం కోసం కస్టమర్లపై కఠిన చర్యలకు నిర్ణయించారు. నోటీసు, స్టేషన్ బెయిల్ అందుకున్న వారి కంటే జైలుకు వెళ్లి, బెయిల్‌పై వచ్చిన వారిలోనే మార్పు ఎక్కువగా వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత సైతం నిఘా...

ఇలా జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా వారిపై నిఘా ఉంచనున్నారు. తల్లిదండ్రుల సమ్మతితో వారిని స్క్రీనింగ్ చేస్తారు. అవసరమైన వారికి ఇన్‌పేషెంట్స్‌గా మిగిలిన వారికి ఔట్ పేషెంట్స్‌గా చికిత్స అందిస్తారు. మొదటి నెల వారానికి రెండు సార్లు, రెండో నెల వారానికి ఒకసారి చొప్పున కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ఈ కాలంలో వారి సమ్మతితోనే ప్రతి వారం మాత్రం, రక్త పరీక్షలు చేసి ఇంకా డ్రగ్స్ వాడుతున్నారా? లేదా? అనేది గుర్తిస్తారు. ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక వైద్యశాల ద్వారానూ రీ-హ్యాబ్ ప్రక్రియ చేయిస్తారు. ఆల్కహాల్ నుంచి బయటపడిన వారి మాదిరిగానే భవిష్యత్తులో నార్కోటిక్ అనామక్స్ గ్రూపులు ఏర్పాటు చేసి, వారంతట వారే తమపై నిఘా ఉంచుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఇవీ డ్రగ్స్ కేసుల గణాంకాలు

ఏడాది	కేసులు	అరెస్టైన నిందితులు	స్వాధీనమైన డ్రగ్స్ విలువ
202	1331	2919	రూ.95.5 కోట్లు
2022	1279	3053	రూ.90 కోట్లు
2023	1487	3074	రూ.94 కోట్లు
2024	2168	5202	రూ.139 కోట్లు
2025 (జూన్	1514	2244	రూ.90 కోట్లు
మొత్తం	7779	16492	రూ.508.5

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

చార్మినార్/బహదూర్‌పురా: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బహదూర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...నందిముస్లాయి గూడలోని తేజస్విని నగర్ కు చెందిన శ్రీకాంత్ రెడ్డి (35), సురేఖ భార్యా భర్తలు. ఇటీవల వీరిమధ్య మనస్పర్థలు ఏర్పడి గొడవలు జరిగాయి. శనివారం రాత్రి కూడా భార్యాభర్తలిద్దరూ గొడవ పడ్డారు. కొద్దిసేపటి తర్వాత భార్య కిందికి రాగా భర్త శ్రీకాంత్‌రెడ్డి ఫస్ట్ ఫ్లోర్లోనే ఉన్నాడు. ఎంతకూ కిందికి రాకపోవడంతో అనుమానించిన భార్య పై అంతస్తుకు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో ఇరుగుపొరుగు వారు కిందికి దించగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న బహదూర్‌పురా పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

పోలీస్ స్టేషన్ల మధ్య సరిహద్దు వివాదం..

శ్రీకాంత్‌రెడ్డి ఆత్యహత్య విషయం తెలుసుకున్న బహదూర్‌పురా పోలీసులు తేజస్విని నగర్‌కు చేరుకున్నారు. ఈ ప్రాంతం అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధికి వస్తుందని భావించి వారికి సమాచారం అందించారు. అత్తాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ అనంతరం ఇది తమ పరిధి కాదన్నారు. దీంతో బాధిత కుటుంబంతో పాటు స్థానికులు కొంతసేపు అయోమయానికి గురయ్యారు. ఈలోపు క్లూస్ టీమ్స్‌ను రప్పించి వివరాలు సేకరించారు. చివరికి బాధితుని ఇంటి నెంబర్‌ను పరిగణనలోకి తీసుకొని బహదూర్‌పురా పోలీస్ స్టేషన్ పరిధికి వస్తుందని నిర్ధారించిన అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

పెయింటింగ్‌పై శిక్షణ శిబిరాలు భేష్



40 అడుగుల పెయింటింగ్ వద్ద మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: చిన్నారులలో పెయింటింగ్‌పై ఆసక్తిని కలిగించేందుకు ఉచిత శిక్షణా శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కళాకుంభం హార్ట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో డ్రాయింగ్, పెయింటింగ్‌పై 45 రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు సభను ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ శిబిరంలో విద్యార్థులు నేర్చుకొని గీసిన చిత్రాలతో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పండుగలను తెలుపుతూ వేసిన 40 అడుగుల చర్యాల్ స్క్రోల్ పెయింటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో నాటకరంగ దర్శకుడు ఎం.అజయ్, కళాకుంభం సంస్థ వ్యవస్థాపకుడు ముసి కిరీటి, కచ్చకాయల అనూష, మహేష్, మురళి, దివ్య, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

'సంభాషణ, కవిత్వం' పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య వకుళాభరణం రామకృష్ణ తదితరులు

హిమాయత్‌నగర్: కొత్తవి, విజ్ఞాన పరమైన అంశాలు కొప్పర్తి 'సంభాషణ' పుస్తకంలో ఉన్నాయని పలువురు వక్తలు కొనియాడారు. చరిత్ర, కవిత్వం వేర్వేరు అని అరిస్టాటిల్ అనే వారని, కానీ చరిత్రకు, సాహిత్యానికి ఉన్న సరిహద్దుల్ని కొప్పర్తి సంభాషణ చెరిపి వేసిందన్నారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ప్రముఖ కవి కొప్పర్తి రచించిన చరిత్ర, సామాజిక వ్యాసాల సంపుటి 'సంభాషణ' పుస్తకాన్ని ప్రముఖ చరిత్రకారుడు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ ఆవిష్కరించి మాట్లాడారు. హిస్టరీ కాంగ్రెస్‌కు ఈ 'సంభాషణ' ఒక దిక్సూచిగా నిలిచిందన్నారు. ఆసక్తికరమైన అంశాలను రచయిత సంభాషణలుగా పొందుపరిచారని, ఈ పుస్తకం చదివితే కొప్పర్తి రచనా నైపుణ్యం తెలుస్తుందన్నారు. కొప్పర్తి మూడు కవిత్వ సంపుటాల సంకలనం 'కవిత్వం' పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ ఆవిష్కరించి మాట్లాడారు. 'కవిత్వం' పుస్తకం మూర్తీభవించిన సజీవప్రాణిగా నిలిచిందన్నారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందర్, ప్రముఖ కవి, విమర్శకులు వాడ్రేవు చినవీరభద్రుడు, దర్భశయనం శ్రీనివాసాచార్య, యువకవి సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీలో బోనాలకు తరలిన లాల్‌దర్వాజా ఆలయ కమిటీ



లాల్‌దర్వాజా నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఆలయ కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట: దేశ రాజధాని ఢిల్లీలో లాల్‌దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ 11వ బోనాల ఉత్సవాలను మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించేందుకు కమిటీ ప్రతినిధులు ఆదివారం ఇక్కడి నుంచి బయల్దేరారు. ఈ నెల 30, జూలై 1, 2 తేదీలలో బోనాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతియాదవ్ ఆధ్వర్యంలో ఆలయంలో కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి...లాల్‌దర్వాజా మోడ్ వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సికింద్రాబాద్ నుంచి రైలులో ఢిల్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా చైర్మన్ మారుతియాదవ్ మాట్లాడుతూ.30న తెలంగాణ భవన్‌లో బోనాల విశిష్టతకు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్, 1వ తేదీన ఇండియా గేట్ నుంచి తెలంగాన భవన్ వరకు అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి స్థాపన, 2వ తేదీ పోతరాజులతో స్వాగతం, అమ్మవారికి బంగారు బోనం, పట్టు వస్త్రాల సమర్పణ తదితర కార్యక్రమాలుంటాయన్నారు. ఢిల్లీ బయల్దేరిన వారిలో ఆలయ కమిటీ ప్రతినిధులు కె.విష్ణు గౌడ్, సి.వెంకటేష్, పోసాని సతీష్ ముదిరాజ్, ఎ.చంద్ర కుమార్, ఎ.వినోద్ కుమార్, ఎస్.శేషు నారాయణ తదితరులున్నారు.

హస్తం.. నిర్వేదం!

కాంగ్రెస్ పార్టీలో అసంతృప్త జ్వాలలు

- ఎమ్మెల్యేల నుంచి కార్యకర్తల దాకా..
- పదవులు ఆశించి భంగపడిన నేతలు
- డీసీసీ పీఠంపై పలువురి గురి
- ఆశావహుల ఎదురుచూపులు
- సంస్థాగత కమిటీల్లోనైనా సముచిత స్థానం దక్కేనా?



సాక్షి, రంగారెడ్డిజిల్లా: హస్తం పార్టీలో అసంతృప్తి జ్వాల రగులుతోంది. ఎమ్మెల్యేలు మొదలు చోటా మోటా లీడర్ల వరకు అంతా నారాజ్‌లో ఉన్నారు. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో తమ కష్టానికి ప్రతిఫలం దక్కుతుందని ఆశించారు. పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు దాటినా ఇప్పటి వరకు ఎలాంటి అవకాశాలు రాకపోవడంతో వారంతా నైరాశ్యంలోకి వెళ్లారు. అధినాయకుల వద్ద తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. వారు కూడా ఏమీ చేయలేక నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి పదవి ఆశించి..

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రి పదవిని ఆశించారు. ఇప్పటికే రెండు విడతలుగా జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఆయనకు చోటు దక్కలేదు. దీంతో ఆయన ఇటీవల అలకపాన్పు ఎక్కడం, అవసరమైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని ప్రకటించడంతో పీసీసీ చీఫ్ సహా ఇతర నేతలు బుజ్జగించారు. తాత్కాలికంగా శాంతించినప్పటికీ పదవి దక్కలేదనే అసంతృప్తి మాత్రం వెంటాడుతోంది. ఇక వికారాబాద్ ఎమ్మెల్యే, ప్రస్తుత స్పీకర్ గడ్డం ప్రసాద్ సహా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సైతం మంత్రి పదవి ఆశించి భంగపడ్డారు.

డీసీసీ పీఠంపై సీనియర్ల కన్ను

ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందిన ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డిని పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన డీసీసీని గాలికొదిలేశారు. నియోజకవర్గాల్లో ఎవరైనా సమావేశాలు ఏర్పాటు చేస్తే వెళ్లి రావడం మినహా పార్టీ పటిష్టత కోసం తీసుకుంటున్న చర్యలు కూడా ఏమీ లేవు. ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడిని నియమించనున్నారనే ప్రచారం కూడా జరిగింది. దీంతో మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన ముఖ్య నేత దేవభాస్కర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గానికి చెం దిన గౌరీసతీష్, భీంభరత్ మరికొంత మంది నేతలు ఈ పీఠాన్ని ఆశించారు. ఆ మేరకు వారు ముఖ్యనేతలను కలిసి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేశారు. అధిష్టానం నుంచి స్పష్టత లేకపోవడంతో ఇప్పటికీ వారి ఆశలు అడియాసలుగానే మిగిలిపోయాయి.

పుట్టిముంచనున్న సమన్వయ లేమి

ఉమ్మడి ఏపీలోనూ జిల్లా నేతలకు సముచిత స్థానం లభించేది. ఇటు మంత్రి వర్గంలోనే కాదు అటు పార్టీలోనూ జిల్లా నేతలు కీలకంగా వ్యవహరించేవారు. సీఎం రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జిల్లా నేతలను పూర్తిగా విస్మరించింది. ఒకరిద్దరు తమ అనుచరులకు కార్పొరేషన్ పదవులు కట్టబెట్టడం మినహా ముఖ్య పదవులేవీ కేటాయించలేదు. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. ఆయా నియోజకవర్గాల్లో పాత కాంగ్రెస్ లీడర్లకు బీఆర్ఎస్ నుంచి కొత్తగా చేరిన నేతలకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ వర్గం ఏకంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్‌కు ఫిర్యాదు చేసింది. కొత్త, పాత నేతల మధ్య సమన్వయం లేకపోవడం, ప్రస్తుత డీసీసీ చీఫ్ కూడా వారిని ఒక్క తాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేయకపోవడంతో ఆయా మండలాలు, గ్రామాల్లో పార్టీ రెండుగా చీలిపోయి కన్పిస్తోంది. అంతర్గత విభేదాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పుట్టిముంచే ప్రమాదం లేకపోలేదు.

సామాజిక న్యాయం దక్కేనా..?

ఇప్పటి వరకు పార్టీలో రెడ్డి సామాజిక వర్గం ఆధిపత్యమే కొనసాగుతూ వస్తోంది. నామినేటెడ్ పదవుల్లోనూ వారే కీలకంగా ఉన్నారు. పార్టీ అధినేత రాహుల్ గాంధీ సంస్థాగత పదవుల్లోనూ 42 శాతం రిజర్వేషన్ పాటించి తీరాలని ఆదేశిస్తున్నా జిల్లాలో ఇప్పటి వరకు ఈ సూత్రం అమలు కాలేదు. కనీసం గ్రామ, మండల, బ్లాక్, జిల్లా కమిటీల్లోనైనా ఇతర నేతలకు సముచిత స్థానం దక్కుతుందో లేదో తేలిపోనుంది. జూలై 4లోగా సంస్థాగత కమిటీల ఏర్పాటు పూర్తి చేయాల్సిందిగా ఇప్పటికే అధిష్టానం ఆదేశించింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జూలై మొదటి వారంలో రాష్ట్రానికి రానున్నారు. గ్రామ, మండల, బ్లాకు, జిల్లా, రాష్ట్ర కమిటీల ముఖ్యనేతలతో ఆయన సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకుని పని చేస్తున్న సామాన్య ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్యకర్తలు, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నాయకులకు గుర్తింపు లభిస్తుందా అనేది వేచిచూడాలి.

అర్ధరాత్రి విహరిస్తే కఠిన చర్యలు

- అనవసరంగా రోడ్లపైకి రావొద్దు
- మీర్‌పేట సీఐ నాగరాజు

మీర్‌పేట: వేడుకలు, ఇతర కారణాలతో అనవసరంగా అర్ధరాత్రి రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మీర్‌పేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు యువతను హెచ్చరించారు. శనివారం అర్ధరాత్రి తరువాత స్టేషన్ పరిధి నందనవనం, ఆర్ఎన్‌రెడ్డినగర్, భూపేష్‌గుప్తానగర్‌లలో పోలీసులు ఆపరేషన్ చబుత్ర చేపట్టారు. ఈ సందర్భంగా రాత్రిళ్లు రోడ్లపై తిరుగుతున్న 122 మంది యువకులను గుర్తించారు. జన్మదిన వేడుకల పేరుతో కాలనీ కూడళ్లు, ప్రధాన రహదారులపైకి రావడం, అదే విధంగా రాత్రంతా బాక్స్ టైపు క్రికెట్ ఆడుతూ ఇతరులను ఇబ్బందులకు గురి చేయవద్దని ఇన్‌స్పెక్టర్ సూచించారు. ఏ కారణం లేకున్నా యువత రోడ్లపై ద్విచక్ర వాహనాలను విచ్చలవిడిగా నడపడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పాటు గొడవలకు కారణమవుతాయని అవగాహన కల్పించారు. ఆపరేషన్ చబుత్రలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గౌరునాయుడు, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

పహాడీషరీఫ్: తలసేమియా బాధితులను ఆదుకునేందుకు రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని సరూర్‌నగర్ మండల మాజీ వైస్ ఎంపీపీ ఉమర్ బామ్ అన్నారు. మజ్లిస్-ఏ-ఉలమాయే హుఫాజ్‌వా దానిశ్వరనే మిల్లత్ ఆధ్వర్యంలో షాహీన్‌నగర్‌లో ఆదివారం ఉచిత రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నెల నెల రక్తమార్పిడి అవసరమయ్యే వారికి రక్తదానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏటా మనదేశంలో 10–12 వేల మంది తలసేమియా పిల్లలు జన్మిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు కూడా తలసేమియాను ప్రజారోగ్య సమస్యగా ప్రకటించాలన్నారు. ఎర్ర రక్తకణాలలో హీమోగ్లోబిన్ లోపం వల్ల ఒక మాదిరి నుంచి తీవ్రమైన రక్తహీనత లక్షణాలు కలిగి, రక్త సంబంధమైన అనువంశిక రుగ్మతే తలసేమియా మేజర్‌గా పేర్కొంటారన్నారు. దాదాపు 390 మంది దాతలు రక్తదానం చేసి తలసేమియా సికిల్ సెల్ సొసైటీకి అందజేశారు. కార్యక్రమంలో హాఫీజ్ అబ్దుల్ హాది, డాక్టర్ ముస్తఫా అలీ సుఫియానీ, సయ్యద్ యూసుఫ్ పటేల్, అబ్దుల్ రవూఫ్, ఎం.ఎ.బారీ, అలీం బేగ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు..

బంజారాహిల్స్: రోడ్డునెంబర్–22, రోడ్డునెంబర్–2, కృష్ణానగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు రోడ్డునెంబర్–10, 10సీ, 25, డీకే బస్తీ ఏరియా, బంజారాహిల్స్ రోడ్డునెంబర్–5, గవర్నమెంట్ స్కూల్ ఏరియా, ఎస్‌బీఐ క్వార్టర్స్, పోచమ్మ టెంపుల్, మసీదు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోడ్డునెంబర్-2, 3, యూబీఐ కాలనీ,పేజ్ కాలేజ్ ఏరియా లైన్, లుంబినీ మాల్ ఎదురు ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వెంగళరావునగర్ పరిధిలో..

శ్రీరామ్‌నగర్, ఆర్‌బీఐ క్వార్టర్స్ 11కేవీ ఫీడర్లు, కళ్యాణ్‌నగర్, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిల్లో మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు.

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రాజీవ్‌నగర్‌కాలనీ, శ్రీరాంనగర్, తాతాచారి కాలనీ, బాంబే ఆల్వాల కాంపౌండ్, పోచమ్మ బస్తీ, వాణి ప్రింటర్స్ ప్రాంతాలు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు జ్యోతినగర్, నాట్కో, సునీల్‌నగర్, హైటెక్ హోటల్, జయవంత్‌నగర్, అన్నానగర్, పెద్దమ్మనగర్, గురుమూర్తి లైన్, ఐజీపురం, బేగంపేట బస్తీ, మైసమ్మ టెంపుల్, హెచ్‌పీఎస్ మెయిన్‌రోడ్డు, శివం పెట్రోలు పంపు, శ్యామలా బిల్డింగ్స్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

1న ఆలయ కమిటీ చైర్మన్ ఎన్నిక

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌కాలనీలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ ఎన్నిక జులై 1న మంగళవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి శ్రీనివాస్‌శర్మ తెలిపారు. దేవస్థానం పాలకమండలి నియామకం ఇప్పటికే పూర్తయ్యిందని, చైర్మన్ ఎన్నిక కోసం మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ ఉత్తర్వులను అనుసరించి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

బంగారం వ్యాపారి అదృశ్యం

వెంగళరావునగర్ : బంగారు నగల వ్యాపారి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన భాస్కర్, ఉమా దంపతులు కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి బంగారు నగలు తయారు చేసి జీవనం సాగిస్తున్నరు. తొలుత చిన్న షాపుల వద్ద ఆర్డర్లు తీసుకుని వస్తువులు తయారు చేసి ఇచ్చేవారు. ఈ క్రమంలో సికింద్రాబాద్‌కు చెందిన సచిన్‌తో పరిచయం కావడంతో అతని వద్ద గోల్డ్‌బిస్కెట్లు తీసుకుని వస్తువులు తయారు చేసి ఇస్తున్నాడు. నగదు విషయమై సచిన్ ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి లోనైన భాస్కర్ ఈ నెల 28న ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో అతడి భార్య ఉమ ఆదివారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం స్వాధీనం



పంజగుట్ట: గుర్తుతెలియని మృతదేహాన్ని పంజగుట్ట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం ఉదయం 6:30 ప్రాంతంలో బేగంపేట మెట్రో స్టేషన్ పిల్లర్ నెంబర్ సి 1404 సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు అతడిని పరిశీలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. సదరు వ్యక్తికి సుమారు 50 నుండి 55 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రిలో భద్రపరిచామని, ఆచూకి తెలిసిన వారు 8712661275 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బండ విష్ణుకు నివాళి

రహమత్‌నగర్: గుండెపోటుతో మృతి చెందిన సినియర్ కాంగ్రెస్ నాయకుడు బండ విష్ణు (50) అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. జీహెచ్ఎంసీ స్టాడింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి,నగర కాంగ్రెస్ నాయకులు భవానిశంకర్, నవీన్‌యాదవ్, వివిద పార్టీలకు చెందిన నాయకులు, బస్తీ వాసులు ప్రతిభానగర్‌లోని విష్ణు నివాసంలో ఆయన మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

పత్తాలేని స్పెషల్ డ్రైవ్

- యాచకుల తరలింపుపై నిర్లక్ష్యం
- ఖైరతాబాద్‌లోని పలు ప్రధాన కూడళ్లలో భిక్షాటన
- పట్టించుకోని అధికారులు



ఫుట్‌పాత్ నిరాశ్రయులకు కౌన్సెలింగ్ ఇస్తున్న బంజారాహిల్స్ పోలీసులు

బంజారాహిల్స్: హైదరాబాద్‌ను బెగ్గర్ ఫ్రీ సిటీగా మార్చేందుకు జీహెచ్ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నగరంలోని వివిధ కూడళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు యాచకులను గుర్తించి వారిని షెల్టర్ హోమ్స్‌కు తరలిస్తున్నారు. కొందరు యాచకుల వివరాలను తీసుకుని వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. చౌరస్తాల్లో యాచకులందరినీ గుర్తించి షెల్టర్ హోమ్స్‌కు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17, జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లలోని చౌరస్తాల్లో మాత్రం ఈ స్పెషల్ డ్రైవ్ ప్రహసనంగా మారుతోంది. జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారులు, సిబ్బంది ఇంతవరకు ఈ డివిజన్లలోని కూడళ్లలో తనిఖీలు చేపట్టలేదు. ఖైరతాబాద్, లక్డీకాపూల్, పంజగుట్ట, అమీర్‌పేట, బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చౌరస్తా, జూబ్లీహిల్స్ చౌరస్తా, ఇందిరానగర్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి, విరించి ఆస్పత్రి, తాజ్‌కృష్ణ చౌరస్తా తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో యాచకులు ఉండగా, ఇప్పటి వరకు వీరిని గుర్తించే పని కూడా యూసీడీ విభాగం అధికారులు సరిగా చేపట్టలేదు. వందల సంఖ్యలో యాచకులు నిత్యం ఆయా కూడళ్లలో చేతులు చాపుతూ వాహనదారులను ఇబ్బంది పెడుతున్నారు. అయితే ఖైరతాబాద్ సర్కిల్‌లో ఇప్పటి వరకు 15 మందిని, జూబ్లీహిల్స్ సర్కిల్‌లో 18 మందిని మాత్రమే యూసీడీ విభాగం గుర్తించింది. వీరందరినీ తాము గతంలోనే షెల్టర్ హోమ్స్‌కు తరలించామని, తిరిగి వస్తున్నారంటూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. షెల్టర్ హోమ్స్‌లలో సౌకర్యాలు సరిగా లేనందునే తాము తిరిగి చౌరస్తాలకు చేరుకుంటున్నామని యాచకులు పేర్కొంటున్నారు. నగరాన్ని బెగ్గర్ ఫ్రీ సిటీగా మార్చే ప్రక్రియలో ప్రభుత్వం చేపడుతున్న కార్యాచరణ ప్రణాళిక స్వయంగా ముఖ్యమంత్రి నివసిస్తున్న సర్కిల్‌లోనే అమలుకు నోచుకోవడం లేదు. యూసీడీ విభాగం గత 5 రోజులుగా ఈ ఆపరేషన్‌లో భాగంగా నగరంలోని ప్రధాన జంక్షన్లు, దేవాలయాలు, ఆస్పత్రులు, జనసమూహ ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేసి జీహెచ్ఎంసీ షెల్టర్ హోమ్‌కు తరలిస్తున్నారు. జూబ్లీహిల్స్ చౌరస్తా, కేబీఆర్ పార్కు చౌరస్తా, పంజగుట్ట చౌరస్తా, బంజారాహిల్స్ బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి చౌరస్తా, పెద్దమ్మ గుడి తదితర ప్రాంతాల్లో ఇప్పటిదాకా స్పెషల్ డ్రైవ్ చేపట్టలేదు. యాచకులతో పాటు ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న నిరాశ్రయులను కూడా తరలించే ప్రక్రియ రెగ్యులర్‌గా కొనసాగుతుందని జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ స్పష్టం చేశారు. అయితే బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ముందు మాత్రం నిరాశ్రయులను హోమ్స్‌కు తరలించే ప్రకియ సరిగ్గా జరగడం లేదు. గత కొంతకాలంగా బంజారాహిల్స్ పోలీసులు ఇక్కడ ఫుట్‌పాత్‌లపై నిద్రిస్తున్న నిరాశ్రయులకు కౌన్సెలింగ్ ఇచ్చి హమ్స్‌కు తరలిస్తున్నారు. అయితే వారిలో చాలామంది హోమ్స్‌కు వెళ్లిన మూడు రోజుల్లోనే తిరిగి బసవతారకం వైపు వస్తున్నారు. దీంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ప్రతిరోజూ బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాలు, రాత్రి భోజనాలు ఉచితంగా లభిస్తుండడంతో చాలా మంది అక్కడి నుంచి కదలడం లేదు. దీంతో పోలీసులు ఈ ప్రాంతంలో పికెటింగ్ ఏర్పాటు చేసినా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. జీహెచ్ఎంసీ నిర్వాకం వల్లనే పరిస్థితి మారడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారులు ప్రధాన కూడళ్లలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి యాచకులను గుర్తించి వారికి మంచి సౌకర్యాలతో హోమ్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనంగా గణాంక దినోత్సవం



స్టాటిస్టిక్స్ డే వేడుకల్లో పాల్గొన్న అతిథులు

బంజారాహిల్స్: జాతీయ గణాంక, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఆధీనంలోని జాతీయ గణాంక శాఖ రీజనల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం 19వ స్టాటిస్టిక్స్ డేను యూసుఫ్‌గూడలో ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శిక్షణ కేంద్రం (ఎంఎస్‌ఎంఈ)లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతిని సంహిత (ఆర్‌డివిఆర్ఆర్ మహిళా డిగ్రీ కళాశాల), ద్వితీయ బహుమతిని ఎం. మహేశ్వరి (గవర్నమెంట్ సిటీ కాలేజి), తృతీయ బహుమతిని సాత్విక (సాంఘిక సంక్షేమ కళాశాల, భువనగిరి) సాధించారు. ఉపన్యాస పోటీల్లో ప్రథమ బహుమతి రీతి దత్తా (హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటి), ద్వితీయ బహుమతి మౌనిక (సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజి, బేగంపేట్), తృతీయ బహుమతి బి. అక్షిత (లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్) సాధించారు. 75 ఏళ్ల ఎన్ఎస్ఎస్ సర్వేలో భాగంగా ఏప్రిల్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ స్లోగన్ పోటీల్లో ప్రథమ బహుమతి కొడాలి అక్షయ (కొత్తగూడెం, సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల), ద్వితీయ బహుమతి రుద్ర ప్రియ రాజ్‌పుత్, తృతీయ బహుమతి ధ్రువ అందుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ సంఖ్యా శాస్త్రం ప్రొఫెసర్ జయశ్రీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఖ్యా శాస్త్ర గొప్పతనాన్ని, మహానవలోబిస్ కృషిని వివరించారు. డిప్యూటి డైరెక్టర్ జనరల్ అజిత్‌కుమార్ మాట్లాడుతూ సంఖ్యా శాస్త్రం దేశ అభివృద్ధిలో దాని పాత్రను వివరించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ అనితా పార్థ సారథి, డిప్యూటి డైరెక్టర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ డైరెక్టర్ పద్మనాభస్వామి,నోడల్ ఆఫీసర్ భరత్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న స్థలంలో మొక్కలు నాటిన జీహెచ్ఎంసీ అధికారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని ఫిలింనగర్ ఎఫ్ఎన్‌సీసీ ఎదురుగా సుమారు 100 గజాల స్థలాన్ని ఓ వ్యక్తి తనదంటూ తన స్థలంలో కలుపుకునే ప్రయత్నించడంతో స్థానికులతో పాటు సొసైటీ ప్రతినిధులు పోలీసులకు, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు కబ్జా చేసిన స్థలాన్ని స్వాధీనం చేసుకుని అందులో మొక్కలు నాటారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ఘనంగా వారాహి నవరాత్రి ఉత్సవాలు



హోమం చేస్తున్న అర్చకులు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని ఫిలింనగర్ దైవసన్నిధానంలో శ్రీ వారాహి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కిరాత వారాహి(శ్రీ వైష్ణవి దేవి) మూల మంత్ర హోమం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉదయం ఆలయంలో గురువందనం, గణపతి పూజ, మంటప షోడశోపచారాలు, శ్రీ వారాహి అమ్మవారికి విశేష అభిషేకం, పుష్పార్చన, నిత్య అవతారదేవి మూల మంత్ర హోమం, ఆజ్య పూర్ణాహుతి నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగిసిన సౌత్ ఏషియన్ టెన్నిస్ టోర్నీ



విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న జేహెచ్ఐసీ సెక్రటరీ కిలారు రాజేశ్వర్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఈ నెల 23 నుంచి ఏషియన్ టెన్నిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సౌత్ ఏషియా టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన ముగింపు వేడుకల్లో జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ సెక్రటరీ కిలారు రాజేశ్వర్‌రావు విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ తాము క్లబ్ తరపున మరిన్ని క్రీడా టోర్నమెంట్లు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



బోరబండలో పర్యటిస్తున్న జలమండలి మేనేజర్ రాజేందర్

రహమత్‌నగర్: బస్తీల్లో నీటి, సివరేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు జలమండలి డీజీఎం వహాబ్ అన్నారు. బీజేపీ నాయకులు బోరబండ జలమండలి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన నేపథ్యంలో స్పందించిన అధికారులు గత మూడు రోజులుగా బస్తీల్లో పర్యటిస్తూ లీకేజీలు, కలుషిత నీటి సరఫరా, లోప్రెషర్ తదితర సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. జలమండలి డీజీఎం వాహబ్ ఆదేశాల మేరకు బోరబండ మేనేజర్ రాజేందర్ తన సిబ్బందితో కలిసి సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ ఆధ్వర్యంలో నాయకులు ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో మేనేజర్ రాజేందర్ ఆదివారం బోరబండ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని నీటి, సివరేజ్ సమస్యలను గుర్తించడం జరిగిందని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు.తమ సిబ్బంది సైతం బస్తీల్లో పర్యటించి సమస్యలను గుర్తిస్తున్నరన్నారు.కొన్ని సమస్యలు తమ పరిధిలోకి రావని,అవి జీహెచ్ఎంసీ పరిధిలోకి వస్తాయని తెలిపారు.సాధ్యమైనంత త్వరగా డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.

నియామకం

హిమాయత్‌నగర్ : తెలంగాణ మన ముదిరాజ్ మహా సభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా గండె సదానందం నియమితులయ్యారు. ఆదివారం హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఆయనకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తుల ఐక్యతతో పాటు అభివృద్ధి, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జిల్లా కమిటీలు, అనుబంధ సంఘాల ఏర్పాటు, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి తెలంగాణ మన ముదిరాజ్ మహాసభను మరింత బలోపేతం చేస్తామన్నారు.

మంత్రి వివేక్‌కు ఘన సత్కారం



వివేక్ వెంకటస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

పంజగుట్ట: ప్రజలకు గడ్డం కుటుంబంపై ఉన్న ప్రేమతోనే తమ తండ్రి, తాను, తన కుమారుడు వంశీ రాజకీయాల్లో విజయం సాధిస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఇటీవల కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వివేక్ వెంకటస్వామిని ఆయన అభిమానులు, భీం సైనిక్ దళ్ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. తన తండ్రి ఎప్పుడూ ప్రజల మనిషి అని ఆయన తమకు నిత్యం ప్రజాసేవ చేయాలని చెప్పేవారని ఆయన మార్గంలోనే తాము నడుస్తున్నామన్నారు. విశాఖ ట్రస్ట్ ప్రారంభించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అందుకే తమను ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎమ్.సిద్దిక్, సీనియర్ జర్నలిస్టు టి.తిరుమల్, జైభీం సైనిక్ పౌండేషన్ వ్యవస్థాపకులు కలకోట సత్యనారాయణ, ఝాన్సీ, గోసంఘి సంఘం ప్రతినిధులు నిషాని శంకర్, సంపత్, రాము, కమలరాణి తదితరులు పాల్గొన్నారు.

జలమండలి జీఎంకు సత్కారం..



హరిశంకర్‌ను సత్కరిస్తున్న వివిధ బస్తీల నేతలు

ఫిలింనగర్: ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందించిన జలమండలి డివిజన్–6 జీఎం బదిలీ కావడంతో ఆయనను ఫిలింనగర్‌కు చెందిన వివిధ బస్తీల నేతలు ఘనంగా సత్కరించారు. జలమండలి డివిజన్–6 జీఎంగా హరిశంకర్ గత మూడున్నర సంవత్సరాలుగా ప్రజలతో కలిసిమెలిసి ఉంటూ సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఆయన సేవలను బస్తీవాసులు కొనియాడారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–10లోని తట్టిఖానా వాటర్ సెక్షన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గుంటి నాగేష్‌సాగర్, ఓర్సు శ్రీనివాస్, జి.శంకర్, వరికుప్పల ఆంజనేయులు, శ్రీను తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో నేతలు శాలువాతో సత్కరించారు. డివిజన్–6 జీఎంగా బాధ్యతలు స్వీకరించిన ప్రభాకర్‌రావును కూడా ఈ సందర్భంగా సత్కరించారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



అజారుద్దీన్‌కు వినతి పత్రం అందజేస్తున్న బ్రిగేడ్ కమ్యూనిటీవాసులు

శ్రీనగర్‌కాలనీ: బస్తీలు, కాలనీలు, కమ్యూనిటీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మాజీ ఎంపీ మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఎర్రగడ్డలోని బ్రిగేడ్ గేటెడ్ కమ్యూనిటీని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బ్రిగేడ్‌కు వెళ్ళే దారి సమస్యను వివరించారు. దశాబ్దాలుగా సింగిల్ వేతో ఇబ్బంది పడుతున్నామని, తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రోడ్డు విస్తరణతో పాటు నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. బ్రిగేడ్ కమ్యూనిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, లక్ష్మీప్రసాద్, నార్నె సుధాకర్, చేకూరు హనుమంతనాయుడు, శ్రీనివాసగుప్తా, రవిగౌడ్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

మోదీ హయాంలోనే అన్ని రంగాల అభివృద్ధి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: ప్రధాని మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నడిపిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కళ్యాణ్‌నగర్ వెంచర్–3 పార్కులో మన్‌కీ భాత్ 123 ఎపిసోడ్‌ను బీజేపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ 11ఏళ్ళపాటు దేశాన్ని సుభిక్షంగా ఉంచారన్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ దేశాభివృద్ధి, సంక్షేమపథకాలు, టెక్నాలజీ, ఆర్థికవ్యవస్థ, మహిళాభివృద్ధితో పాటు పలు విషయాలను వెల్లడించారు.కార్యక్రమంలో నేతలు మోహన్‌రావు, గౌతమ్‌రావు, లంకల దీపక్‌రెడ్డి, కిలారి మనోహర్, ప్రేమ్‌కుమార్, కుంబాల గంగరాజు, శ్రీనివాసరెడ్డి, అనంతలక్ష్మి, కళ్యాణ్‌నగర్ వెంఛర్–3 కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.23, నల్లవంకాయ.28, పొడుగు వంకాయ.28, బెండకాయ.55, పచ్చిమిర్చి.35, బజ్జిమిర్చి.23, క్యాప్సికం.60, పచ్చి కాకరకాయ.38, పందిరి బీర.28, క్యాబేజీ.18, క్యారెట్.40, దొండకాయ.28, గుండు బీన్స్.85, గింజచిక్కుడు.55, గోకరకాయ.35, కీర.23, దోసకాయ.18, బీట్‌రూట్.25, ఉల్లిగడ్డ.22, ఆలుగడ్డ.25, చామగడ్డ.28, మొరంగడ్డ.23, కందగడ్డ.45, క్యాలిఫ్లవర్.23, సొరకాయ.10, పొట్లకాయ.23, అరిటికాయ.11, మునగకాయ.4, మామిడికాయ.40, ముల్లంగి.4–5, ఉల్లిపొరక.45. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

కనుల పండువగా హిందూ సేవా సమితి వేడుకలు



మహిళల సామూహిక వీణా కచేరీ

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం హిందూ సేవా సమితి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ధార్మిక, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గా మైత్రేయి నేతృత్వంలో 100 మందితో వీణా వాదన, 150 మందిచే భగవద్గీత పారాయణం, కూచిపూడి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాలాచారి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సామాజిక, సామరస్యత, సాంస్కృతిక, చైతన్యం పెంపొందుతుందన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు.....

ఈ సందర్భంగా హిందూ సేవాసమితి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమితి అధ్యక్షుడిగా డి.వి.రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బిసీఎస్‌వీ సుబ్రమణ్యం, కార్యదర్శిగా డి.నిర్మల, సంయుక్త కార్యదర్శిగా యు.లక్ష్మణ్, ఖజాంచీగా పి.నాగశిరోమణి బాధ్యతలు స్వీకరించారు. దుర్గామైత్రేయి, టి.రాజ్‌కుమార్, డి.నిరంజన్‌కుమార్, కె.ఉమామహేశ్వరి, కె.సుజాత, కె.సుబ్రమణ్యం, హనుమ్‌కుమార్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

బోరబండ ఠాణాలో ఎన్ఎస్‌యూఐ నేతల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ కార్యకర్తలు

రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఎన్ఎస్‌యూఐ నాయకులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్పీఆర్ హిల్స్ టి.అంజయ్యనగర్ బస్తీ ఎన్నికల విషయమై స్థానిక నాయకుడు శివకుమార్‌ను బోరబండ పోలీసులు ఆదివారం ఉదయం స్టేషన్‌కు పిలిపించారు. ఈ విషయం తెలియడంతో డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బోరబండ ఎస్‌హెచ్‌ఓ సురేందర్‌కు ఫోన్ చేయగా నిన్ను కూడా లోపల వేస్తానని చెప్పడంతో రాత్రి అతను తన అనుచరులు, యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి బోరబండ స్టేషన్‌కు వచ్చారు. ఎస్‌హెచ్‌ఓ అందుబాటులో లేక పోవడంతో ఆయనను పిలిపించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అడ్మిన్ ఎస్సై నాగూల్‌మీరాతో ఆందోళనకారులు వాగ్వాదానికి దిగడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ రాఘవేంద్రరావు , బోరబండ ఎస్‌హెచ్‌ఓ అక్కడికి వచ్చి వెంకటస్వామితో పాటు నాయకులతో కలిసి చర్చించి సమస్య సద్దుమనిగేలా చేశారు.

నగరంలో నేడు

- వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో బోనాలు- చేతివృత్తుల మేళా పేరిట నెక్లెస్ రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం పక్కన గ్రౌండ్‌లో ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు బీసీ చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన అందుబాటులో ఉంటుంది.
- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట వేసవికాలం, వివాహ ప్రత్యేక కలెక్షన్ ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ కమ్ సేల్
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

రేపు ఉద్యాన వన విశ్వవిద్యాయలం కాన్వొకేషన్

ఏజీ వర్సిటీ: కొండా లక్ష్మణ్ ఉద్యాన వన విశ్వవిద్యాలయం నాలుగో కాన్వొకేషన్ జూలై ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాయం అసోసియేట్ డీన్ పిడిగం సైదయ్య తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

'అగరు ధూపం ఊదు పొగ' పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ కవి జాబెర్ పాషా రాసిన 'అగరు ధూపం ఊదు పొగ'పుస్తకాన్ని ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, విమర్శకుడు జి.లక్ష్మీనరసయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది గల్ఫ్ బతుకుల అవస్థ మీద పాషా రాసిన కవిత్వమని అన్నారు. యుద్ధం, మానవ సంబంధాలు, విప్లవ ఉద్యమాలు, సమకాలీన ఘటనలపై ఎంతో అద్భుతంగా కవితలు రాశారని కొనియాడారు. తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి మాట్లాడుతూ దేశం కానీ దేశంలో ఉంటూ కూడా గొప్ప కవిత్వాన్ని రాశారని అన్నారు. కవి సంగమం నుంచి ఇలాంటి మంచి పుస్తకం రావడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి నాంపల్లి సుజాత, నాగిళ్ల రమేష్, తగుళ్ల గోపాల్, అనంతోజు మోహన్‌కృష్ణ, ప్రముఖ కవి యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు తూమాటి దోణప్ప శత జయంతి ఉత్సవాలు ప్రారంభం

నాంపల్లి: సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో జూలై ఒకటిన విశ్వవిద్యాలయం తొలి ఉపాధ్యక్షుడు ఆచార్య తూమాటి దోణప్ప శత జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఉత్సవాల్లో దోణప్ప రచన వ్యాస భారతి గ్రంథాన్ని విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, సాహితీవేత్తలు, ఎం.శంకర్‌రెడ్డి, కసిరెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరించి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు బిట్టు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సదస్సులో 'దోణప్ప జీవితం-వ్యక్తిత్వం'అనే అంశంపై కవి శంకరనారాయణ, 'ఆంధ్ర సంస్థానములు సాహిత్య పోషణ' అనే అంశంపై ఆచార్య భమిడిపాటి విశ్వనాథం, భాషా చారిత్రక వ్యాసావళి అనే అంశంపై ఆచార్య అయినవోలు ఉషాదేవి ప్రసంగించనున్నట్లు తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు చిగిచెర్ల కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగే రెండవ సదస్సులో 'తెలుగులో హరికథ సర్వస్వం'అనే అంశంపై ఆచార్య పులికొండ సుబ్బాచారి ప్రసంగిస్తారని, ముగింపు సభకు అతిథిగా పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు 2025 జూలై 1న ప్రారంభమై 2026 జూలై ఒకటిన ముగుస్తాయని, ఏడాదిపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా సభ, సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు.

విజన్-2047 మా లక్ష్యం

సీవరేజీ, వాటర్ మాస్టర్ ప్లాన్‌లతో ప్రజలకు మెరుగైన సేవలు

- కోర్ అర్బన్ రీజియన్ పరిధి వరకు సేవల విస్తరణ
- ఇక జలమండలి పరిధి 2050 చదరపు కిలోమీటర్ల పైనే..
- ఇప్పటికే ప్రభుత్వానికి పలు కొత్త ప్రాజెక్టు డీపీఆర్‌ల సమర్పణ
- 'సాక్షి'తో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు విజన్-2047 లక్ష్యంగా మహా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ కోసం సీవరేజీ, తాగునీటి ప్రాజెక్టు మాస్టర్ ప్లాన్ డీపీఆర్ రూపకల్పనకు కసరత్తు చేస్తున్నామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. మేనేజింగ్ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఆయన 'సాక్షి' కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- హైదరాబాద్ మహానగరం నాలుగు దిక్కులా విస్తరిస్తోంది. అందుకు అనుగుణంగా సీవరేజీ, తాగునీటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నత స్థాయి సమావేశంలో భవిష్యత్తు అవసరాలను దృష్టి పెట్టుకొని పెరుగనున్న అంచనా జనాభాను అనుగుణంగా సీవరేజీ, వాటర్ ప్రాజెక్టు సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపకల్పన కోసం ఆదేశించారు. ప్రస్తుతం జలమండలి పరిధి కేవలం 1400 చదరపు కిలోమీటర్ల వరకు మాత్రమే ఉండగా, వాటిని 2050 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించాలని నిర్ణయించాం. మాస్టర్ ప్లాన్ కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించి మూడు నెలల్లోగా ప్రభుత్వానికి సమర్పించే విధంగా కసరత్తు చేస్తున్నాం. కోర్ అర్బన్ పరిధిలో డ్రింకింగ్ వాటర్, సీవరేజ్ పైప్‌లైన్లతో పాటు ఎస్టీపీల నిర్మాణాలు చేపట్టి శుద్ధిచేసిన నీటిని పునర్వినియోగం కోసం సహితం దీర్ఘకాలిక ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం.

మంజీరా రెండోలైన్ కోసం ప్రణాళిక

మహానగర భవిష్యత్తు తాగు నీటి అవసరాల కోసం మంజీరా మంచినీటి సరఫరా పథకం మరో పైప్‌లైన్ నిర్మాణం పనులు చేపట్టాలని నిర్ణయించాం. మంంజీరా ఫేజ్ 1,2 సరఫరా పైపులైన్ల ఆధునికీకరణతోపాటు మరో కొత్త పైపులైన్లకు సుమారు రూ. 600 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాం. 2050 జనాభాకు అనుగణంగా తాగు నీటి అవసరాల కోసం కోసం గోదావరి ఫేజ్ 2,3 ప్రాజెక్టు, హిమాయత్‌సాగర్, ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్ల నుంచి వేర్వేరుగా దాదాపు 20 ఎంజీడీల అదనపు నీటిని తరలించేందుకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేశాం. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతులు మీదుగా పనులు ప్రారంభించనున్నాం.

నిర్మాణ పనులు వేగవంతం...

జలమండలి పరిధిలోని పురోగతిలో ఉన్న సీవరేజీ, నీటి సరఫరా ప్రాజెక్టుల పనులు వేగవంతం చేశాం . పాతబస్తీలో సుమారు రూ.301 కోట్లతో చేపట్టిన సీవరేజీ జోన్-2 నెట్‌వర్క్ పనులు తదిదశకు చేరుకున్నాయి. ఓఆర్‌ఆర్ ఫేజ్-2 పూర్తి చేశాం. వంద శాతం మురుగు శుద్ధిలో భాగంగా నిర్మించిన ఎస్టీపీలు ఇప్పటికే 12 పూర్తి చేసి అందుబాటులో తెచ్చాం. మరో 8 త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లలో మరో నాలుగు ఎస్టీపీలు నిర్మిస్తున్నాం. అమృత్ పథకం కింద మంజూరైన 39 కొత్త ఎస్టీపీల టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాం.

తుది దశలో సీవరేజ్ టన్నెలింగ్ ప్రాజెక్టు...

సీవరేజ్ టన్నెలింగ్ ప్రాజెక్టు పనులు తుదిదశకు చేరుకున్నాయి. 20 ఏళ్ల క్రితం నగరంలో సుమారు ఐదు కిలోమీటర్లవరకు 1800 ఎంఎం డయా భారీ పైప్‌లైన్ నిర్మాణం లక్ష్యంగా ప్రాజెక్టు పనులు చేపట్టగా..వివిధ కారణాలతో మధ్యలో నిలిచిపోయాయి. గత పదినెలలుగా ట్రెంచ్‌లెస్ టెక్నాలజీతో సీవర్ ట్రంక్ మెయిన్స్‌పనులు చకచకా ముందుకు సాగుతున్నాయి. ఇప్పటికే 92 శాతం పూర్తయ్యాయి. మరో మూడు నెలల్లో ప్రాజెక్టు అందుబాటులో తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.

సంపూర్ణ సహకారంతో స్పెషల్ డ్రైవ్‌లు...

ఏడాది కాలంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లు అందరి సహకారంతో సత్ఫలితాలు ఇస్తున్నాయి. దీంతో నిరంతర కార్యక్రమంగా కొనసాగిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనితీరు..జలమండలి గుర్తింపుగా భావిస్తున్నాం. సేవలను మరింత వేగివంతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తున్నాం. వాటిని నిరంతర పక్రియగా కొనసాగిస్తాం.

ఐటీ పర్యవేక్షణ.. మేటి ఫలితాలు!

మెరుగైన సేవలకు జలమండలి సాంకేతిక సంస్కరణలు

సాక్షి,సిటీ బ్యూరో: ఐటీ బాట పట్టిన జలమండలి మేటి ఫలితాలు సాధిస్తోంది. అధికారులు మొదలు క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరులో మార్పు కనిపిస్తోంది. ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయి. సీవరేజీ, వాటర్ నెట్‌వర్కింగ్‌కు జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్) మ్యాపింగ్, ఫీల్డ్ వర్క్‌పై డ్యాష్ బోర్డు ద్వారా పర్యవేక్షణ సునాయాసమైంది. కొత్త పనులకు యూనిక్ కోడ్ జవాబుదారీతనం పెంచుతోంది. సరిగ్గా ఏడాది క్రితం మేనేజింగ్ డైరెక్టర్‌గా బ్యాధతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి అశోక్‌రెడ్డి ఆధునిక సాంకేతిక సమాచార పరిజ్ఞానం ద్వారా సరికొత్త సంస్కరణల అమలు చేస్తూ జలమండలిపై తనదైన ముద్ర వేశారు. ఆకస్మిక క్షేత్రస్థాయి పర్యటనలతో బోర్డు డైరెక్టర్ నుంచి కిందిస్థాయి వాటర్ లైన్‌మెన్ల వరకు విధుల పట్ల అప్రమత్తత పెరిగింది. తొలి మూడు నెలలు 'రోడ్లపై సీవరేజి ఓవర్ ఫ్లో, నీటి సరఫరాలో లో- ప్రెషర్ తదితర సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారానికిగాను ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.

రెగ్యులర్ డ్యూటీ చార్ట్‌గా... డీసిల్టింగ్

సంస్కరణలో తొలి మెట్టుగా సిటీలో సీవరేజీ ఓవర్ ఫ్లో కట్టడికి గతేడాది గాంధీ జయంతి (అక్టోబర్ 2)న సీఎం చేతుల మీదుగా '90 రోజుల సీవరేజీ స్పెషల్ డ్రైవ్- ప్రతి ఇంటా ఇంకుడు గుంత'కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జలమండలి నిరంత కార్యక్రమంగా కొనసాగిస్తోంది. సిటీలో భూగర్భజలాల పెంపే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 3,620 కిలో మీటర్ల వరకు సీవరేజీ పైప్‌లైన్ క్లీనింగ్‌తోపాటు సుమారు 28,076 ప్రాంతాల్లో 2,86,132 మ్యాన్ హోళ్ల నుంచి డీ సిల్టింగ్ నిర్వహించినట్లు జలమండలి అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.



వేసవిలో లో-ప్రెషర్‌కు చెక్...

వేసవిలో పెరిగే వినియోగంతో నీటిఎద్దడి అధిగమించేందుకు ఎండీ అశోక్ రెడ్డి నల్లా నీటి, ట్యాంకర్ల సరఫరా తీరుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. వేసవిలో 45 రోజుల 'మోటార్ ఫ్రీ టాప్ వాటర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతో నల్లాలకు బిగించిన మోటార్లు కుప్పలుతెప్పలుగా బయటపడ్డాయి. చాలామంది భవన యాజమానులు స్వచ్ఛందంగా వాటిని తొలగించుకోవడంతో లో ప్రెషర్ తాగు నీటి సమస్యకు చెక్ పెట్టినట్లయింది.

పెండెన్సీ లేకుండా ట్యాంకర్ల సరఫరా...

వేసవి కాలం కంటే ముందే అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్లు, ట్యాంకర్ల సంఖ్యను పెంచారు. ట్యాంకర్ల సరఫరాలో పెండెన్సీ లేకుండా కనీసం 12 నుంచి 24 గంటల్లో డెలివరీ జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. ట్యాంకర్లు పక్కదారి పట్టకుండా విజిలెన్స్ విభాగం పెట్రోలింగ్‌తో నిఘా పెంచారు. తాజాగా వర్షాకాలంలో సైతం కలుషిత నీరు సరఫరా కాకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి కార్యాచరణకు దిగింది.

సుగుణమ్మ మృతి మహిళా ఉద్యమాలకు లోటు



చందానగర్: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు శాకమూరి సుగుణమ్మ మరణం మహిళా ఉద్యమాలకు తీరని లోటని పలువురు వక్తలు అన్నారు. సుగుణమ్మ సంస్మరణ సభ ఆదివారం కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో నిర్వహించారు. ఈ సభకు సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు, సభ్యులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నారాయణ మాట్లాడుతూ సుగుణమ్మ చివరి శ్వాస వరకు ఉద్యమాల కోసం పని చేశారని గుర్తుచేశారు. కందిమళ్ల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చిన సుగుణమ్మ ఉద్యమకాలంలో ఎన్నో కష్టాలను అనుభవించారన్నారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కలవాలని ప్రజలు బలంగా కోరుతున్నారని, సుగుణమ్మ కోరిక కూడా అదేనని అన్నారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వర్‌రావు, కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, కోశాధికారి చెన్నకేశవరావు, సీపీఐ నాయకురాలు ప్రేమ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జ్యోతి, సీఆర్ ఫౌండేషన్ పాలిక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ రజిని, నేదునూరి జ్యోతి, సుగుణమ్మ సంతానం డాక్టర్ శాఖమూరి శోభ, డాక్టర్ శాఖమూరి రవి, రమేష్, సంరక్షకులు జిలాని, మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రావు, డాక్టర్ బీవీ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'దస్ పైసా కా పోస్ట్ కార్డు' పుస్తకావిష్కరణ



'దస్ పైసా కా పోస్ట్ కార్డు' ఆవిష్కరణలో వినయ్ వర్మ, సంజనా షా,అహ్మద్

సనత్‌నగర్: రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్, రచయిత కెప్టెన్ ఎస్.ఎన్. అహ్మద్ ''దస్ పైసా కా పోస్ట్ కార్డు''పేరుతో రచించిన పుస్తకాన్ని ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో ఆవిష్కరించారు. దర్శకుడు వినయ్ వర్మ, బిఎస్‌బి హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహ్మద్ తన పుస్తకం గురించి చెబుతుంటే.. చేతితో ఉత్తరాలు రాసిన రోజులకు తనను తీసుకువెళ్లిందన్నారు. తన చిన్ననాటి రోజులు, నానమ్మ, అన్నలకు ఉత్తరాలు రాయమని అడిగిన విషయాలు గుర్తుకు వచ్చాయని చెప్పారు. 'మీరు ఎలా ఉన్నారు'అనే చిన్న, చిన్న మాటలే అయినా, ఆ ఉత్తరాల్లో ఎంతో మమకారం, ఆశ, ప్రేమ నిండి ఉండేవని అన్నారు. ఇప్పటి వేగవంతమైన వాట్సాప్ సందేశాలతో పోలిస్తే అప్పటి ఉత్తరాలు హృదయాలను కదిలించేవని పేర్కొన్నారు. ఇందులోని కథలు కేవలం జ్ఞాపకాలు మాత్రమే కాదని, అవి సమాజంపై ప్రభావం చూపే సందేశాలు కూడా అని అన్నారు. పుస్తక రచయిత ఎస్.ఎన్.అహ్మద్ మాట్లాడుతూ ఈ పుస్తకం ప్రేక్షకులను 1960 నాటికి తీసుకువెళుతుందన్నారు. ఇది మన దేశ రక్షణ సిబ్బందికి అంకితంగా రాసిన పుస్తకమని చెప్పారు. సరిహద్దుల్లో ఉన్న జవాన్లకు ఇళ్ల నుంచి వచ్చిన లేఖలు భావోద్వేగానికి గురిచేస్తాయని, ఒక్కో పదం వీరులకుప్రేరణగా నిలుస్తాయన్నారు.

ఎల్లారెడ్డిగూడలో ఆక్రమణల తొలగింపు


పార్కు స్థలంలో నిర్మాణాలను కూల్చిన హైడ్రా



సాక్షి, సిటీబ్యూరో: మధురానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న ఎల్లారెడ్డిగూడ పార్కులోని ఆక్రమణల్ని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) ఆదివారం తొలగించింది. 1961 నుంచి ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చేసిన హైడ్రా పార్కు అభివృద్ధికి అవకాశం కల్పించింది. దీంతో సాయి సారథినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పార్కు కబ్జాపై ఇటీవల కాలనీ అసోసియేషన్ నేతలు ప్రజావాణిలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో, రికార్డుల ఆధారంగా విచారణ చేపట్టారు. 1961లో 35 ప్లాట్లతో సాయి సారథినగర్ ఏర్పాటైంది. అప్పట్లో 1,533 గజాల స్థలాన్ని పార్కుగా చూపించారు. ఆ పార్కు స్థలంలో నారాయణ ప్రసాద్ వారసులు షెడ్లు నిర్మించి ఖాళీ చేయట్లేదు. వ్యవస్థలను మేనేజ్ చేసుకుని ఇంటికి నంబర్ కూడా తెచ్చుకున్నట్టు హైడ్రా అధికారులు గుర్తించారు. ఈ లేఔట్‌లో ఆరు రోడ్లను అభివృద్ధి చేసినా పార్కును మాత్రం ఖాళీ చేయించలేదని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో చివరకు హైడ్రాను ఆశ్రయించారు.

ప్రతి ట్రాన్స్‌ప్లాంట్ విజయానికి నర్సులే ఆధారం

స్టార్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న రెండు తెలుగు రాష్ట్రాల నర్సులు

రాయదుర్గం: ప్రతి ట్రాన్స్‌ప్లాంట్ విజయానికి తమ నర్సులే ఆధారమని స్టార్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రిలో 'డోనర్ నుంచి రిసిపియంట్ వరకూ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ కేర్‌లో నర్సుల పాత్ర'అనే అంశంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నర్సుల్లో విశ్వాసం, ఖచ్చితత్వంతో ప్రపంచ స్థాయి సేవలందించే శక్తిని పెంచుతాయన్నారు. లివర్ ట్రాన్స్‌ప్లాంట్‌లో నర్సింగ్ ఒక అత్యంత ప్రత్యేకత కలిగిన విభాగమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ట్రాన్స్‌ప్లాంట్ వైద్యం విస్తరిస్తున్న వేళ స్టార్ ఆస్పత్రులు ఈ రంగంలో నర్సుల శక్తీకరణకు దారి తీసే శిక్షణా కార్యక్రమాల్లో ముందుంటోందన్నారు. స్టార్ ఆస్పత్రుల గ్రూప్ సీఈఓ డాక్టర్ రాహుల్ మెడక్కర్ మాట్లాడుతూ స్టార్ ఆస్పత్రులు అధునాతన వైద్య విద్యలో మార్గనిర్దేశకంగా నిలుస్తోందని చెప్పారు. నర్సులు కూడా అత్యున్నత చికిత్స సేవల్లో భాగస్వాములుగా మారే హెల్త్ కేర్ ఫ్యూచర్‌ను నిర్మిస్తున్నామన్నారు. అనంతరం డోనర్ నుంచి రిసిపియంట్ వరకు సంబంధించిన ప్రీ-పోస్ట్ ట్రాన్స్‌ప్లాంట్ నర్సింగ్ కేర్ అంశాలను వివరించారు. నిరంతర నర్సింగ్ విద్యా(సీఎన్‌ఈ) కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నర్సులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

బాలికల అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

డీజీపీకి మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు

సిటీ కోర్టులు: మైనర్ బాలికల అక్రమ రవాణాపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా మండిపడింది. ఇంతటి నీచానికి పాల్పడిన వారిపై విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. ఆదిలాబాద్ జిల్లాలో 'అమ్మకానికి నిరుపేద అమ్మాయిలు'అని పత్రికల్లో వచ్చిన కథనాన్ని రాష్ట మానవ హక్కుల కమిషన్ సూమోటోగా కేసు స్వీకరించింది. దీనిపై పూర్తి వివరాలను నేడు (సోమవారం) అందజేయాలని రాష్ట్ర డీజీపీతోపాటు ఆదిలాబాద్, కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రలోని యవత్‌మల్ జిల్లా ఘాటంజీ తాలూకా కిని గ్రామానికి చెందిన ఆత్రం నిర్మల, బాపుణ్య భార్యాభర్తలు. వీరు గత నెలలో ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని ఒక గ్రామానికి కూలీ పనులకని వచ్చి కొన్నాళ్లు తెలిసిన వారి ఇంట్లో ఉన్నారు. ఆ ఇంట్లో ఉన్న 16 ఏళ్ల బాలికను మచ్చిగా చేసుకున్నారు. కొంతకాలం తర్వాత మహారాష్ట్రలోని తమ ఊరిలో జరిగే పండుగకు ఆ బాలికను తీసుకెళ్లారు. అనంతరం రాజస్థాన్‌లోని కోటా సమీపాన ఉన్న ఓ గ్రామంలో కరణ్ అనే వ్యక్తికి రూ.10 వేలకు అమ్మేశారు. ఆ బాలిక వివరాలు ఇన్‌స్టాగామ్ ద్వారా బయటికి రావడంతో ఆదిలాబాద్ భీంపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మొదటి భార్యను వదిలేసిన కరణ్ ఆ బాలికను వివాహం చేసుకున్నట్లు పోలీసులు తేల్చారు.

కాచిగూడలో రెండు రైళ్ల స్వర్ణోత్సవాలు



కాచిగూడ: కాచిగూడ- అశోకపురం -కాచిగూడ (రైలు నెంబర్. 12785/12786) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ -చిత్తూరు -కాచిగూడ (రైలు నెంబర్ 12797/12798) వెంకటాద్రి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్వర్ణోత్సవాలను ఆదివారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. దక్షిణ మధ్య రైల్వే రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో రైళ్ల అభిమానులు, రైల్వే అధికారులు పాల్గొని ప్రయాణికులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. రైళ్లను పూలతో అందగా అలంకరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, సీనియర్ డీటీఎం వి.విద్యాధర్, స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ, స్టేషన్ మేనేజర్ ఆర్.బి.మీనా, ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ గోరక్‌నాథ్ మల్, పిఆర్‌ఐ కె.వెంకటరామ శైలేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెట్లకు చట్టాలపై అవగాహన అవసరం

సాక్షి, సిటీబ్యూరో: లైంగిక వేధింపులు, ఫోక్సో చట్టాలపై అథ్లెట్లు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని డిగ్నిటీ డ్రైవ్ ఫౌండర్ రేనే గ్రేస్ అన్నారు. గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫోక్సో యాక్ట్‌లపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వంద మందికిపైగా అథ్లెట్లు, 20 మంది కోచ్‌లు పాల్గొన్నారు. చట్టాలపై అవగాహన లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని చెప్పారు. చట్టాలపై అవగాహన వల్ల గౌరవం, అనుభూతి, ధైర్యం అనే విలువలతో కూడిన మనోభావాన్ని అథ్లెట్లు సొంతం చేసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ నిషా, మనోజ్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన మీడియేషన్ సెంటర్ల అవసరం

రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి పంచాక్షరి



కార్యక్రమంలో పాల్గొన్న పంచాక్షరి, ఏక్తా వివేక్ వర్మ, ఏజే జావెద్ తదితరులు

రాయదుర్గం: సామాజిక మధ్యస్థతా కేంద్రాల అవసరం పెరుగుతోందని జిల్లా అండ్ సెషన్ న్యాయమూర్తి, రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ హైకోర్టు సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్(ఐఏఎంసీ) కేంద్రంలో ఏడు రోజులపాటు నిర్వహించిన ఫ్యామిలీ మీడియేషన్ శిక్షణా శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశంలో మొదటి కుటుంబ మధ్యస్థతా శిక్షణా కార్యక్రమం హైదరాబాద్‌లో విజయవంతంగా ముగిసిందన్నారు. ఇప్పుడు భార్యాభర్తలు తేలికపాటి విషయాలకే గొడవ పడుతున్నారని, ఇలాంటి విషయాలు చర్చల ద్వారా పరిష్కరించగలిగితే కోర్టుల్లో కేసుల భారాన్ని తగ్గించవచ్చన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ శిఖాగోయల్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి అత్యంత అవసరమన్నారు. ఇన్విజిబుల్ స్కార్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు ఏక్తా వివేక్ వర్మ మాట్లాడుతూ మీడియేషన్ కేవలం న్యాయపద్ధతి కాదని, అది నయం చేసే ప్రక్రియ అని పేర్కొన్నారు. ఐఏఎంసీ రిజిస్ట్రార్, లీడ్ ఫ్యాకల్టీ ఏజే జవాద్, మీడియేటర్, ట్రైనర్ తను మెహతా, కేఏస్ శర్మ, డాక్టర్ వరూధిని కొంకిపాటి తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 32 మంది సామాజిక కార్యకర్తలు వివాహ, కుటుంబ వివాదాలను పరిష్కరించడానికి సర్టిఫికెట్ ప్రోగ్రామ్ పూర్తి చేశారు.

సంక్లిష్ట చికిత్సల నిర్వహణపై 'నిమ్స్'లో సదస్సు



సదస్సును ప్రారంభించిన నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప

లక్డీకాపూల్: సంక్లిష్టమైన శస్త్రచికిత్సలను సైతం నిమ్స్ సునాయాసంగా విజయవంతం చేస్తుందని నిమ్స్ సంచాలకుడు ప్రొఫెసర్ నగరి బీరప్ప అన్నారు. ప్రభుత్వ సహకారంతో అత్యాధునిక వైద్య విధానాలతో పేదలకు ఉచితంగా వైద్యచికిత్సలను అందిస్తున్నామన్నారు. ఆదివారం నిమ్స్ ట్రామా బ్లాక్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ఇంటర్వెన్షనల్ కాంప్లికేషన్స్- మేనేజ్‌మెంట్ ఆఫ్ క్యాథ్ ల్యాబ్ కాంప్లికేషన్ సదస్సును ఆయన ప్రారంభించారు. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో నిమ్స్ కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో కార్డియాలజిస్టులు, ఇంటర్వెన్షనల్ నిపుణులు క్యాథ్ ల్యాబ్ సమస్యల నివారణ, నిర్వహణలపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాథెటరైజేషన్ లాబొరేటరీ విధానాల్లో తలెత్తే సమస్యలు, ప్రభావవంతమైన నిర్వహణపై కీలక చర్చ జరిగింది. సదస్సులో డాక్టర్ ఓ. సాయిసతీష్, డా.ఎ.శ్రీనివాస్ కుమార్, డా.పి.కృష్ణంరాజు, డా.ఎ.ఆర్.జీ.రాజు, డా.ఎస్. రమా కుమారి, డా.శశికాంత్, డా.శరత్ రెడ్డి, డా.సి. విజయ్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ కేఎంకే రెడ్డి, డాక్టర్ జె. రామకృష్ణ, డాక్టర్ రాజేంద్ర కుమార్, పెద్ది రాజధర్‌రెడ్డి, డాక్టర్ గోకుల్‌రెడ్డి పాల్గొన్నారు.

9 నెలల బాలుడికి అరుదైన వ్యాధి

ఇంజక్షన్ ఖరీదు రూ.9 కోట్లుపై మాటే.. ● ఆదుకోవాలంటూ తల్లిదండ్రుల వేడుకోలు

లక్డీకాపూల్: ఏపీలోని నూజివీడుకు చెందిన సాయిరాం, నవ్య దంపతులకు ఒక్కగానొక్క కొడుకు దేవ్(9 నెలలు). వయసు పెరుగుతున్న కొద్దీ శరీరంలో కదలికలు లేకపోవడం, నీరసించిపోవడం, మంచానికే పరిమితం కావడం, శ్వాస తీసుకోవడం కూడా కష్టంగా మారడంతో తల్లిదండ్రులు వైద్యులను సంప్రదించారు. ప్రపంచంలోనే అరుదైన జన్యుపరమైన వ్యాధి ఎస్ఎంఏ (స్పైనల్ మస్కులర్ అట్రోఫీ) దేవ్‌కు సోకిందని వైద్యులు నిర్ధారించారు. దీనికి శాశ్వతంగా (జీవిత కాలం పనిచేసే) ఔషధం జోల్జెన్స్మా అనేది ఉంది. కానీ, దాని ధర సుమారు రూ.9 కోట్లుపైమాటే ఉంటుందని వైద్యులు చెప్పారు. రూ.9 కోట్లు పెట్టి ఇంజక్షన్ కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత ఆ పేద కుటుంబానికి లేదు. దీంతో క్రౌడ్ ఫండింగ్ ప్లాట్‌ఫాం ద్వారా నిధులు సమకూర్చాలని తల్లిదండ్రులు భావించారు. దయార్ద్ర హృదయులు సేవా దృక్పథంతో ఆర్థిక సాయం చేయాలని వేడుకుంటున్నారు. విరాళం ఇవ్వాలనుకున్నవారు అకౌంట్ నెంబరు: 50100820441712, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఏఈఊఇ0009698, వివరాలకు 9866228299, 9490969055 నెంబర్లను సంప్రదించాలని ప్రాధేయపడుతున్నారు.

తెలంగాణ నాయర్ సేవా సొసైటీ ప్రారంభం



టీఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్న గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై

కాప్రా: తెలంగాణ రాష్ట్ర నాయర్ సేవా సొసైటీ ఏర్పాటు చేయడం అభినందనీయమని గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై అన్నారు. ఆదివారం కాప్రా ఎర్ర లలిత ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ నాయర్ సేవా సొసైటీ(టీఎన్ఎస్ఎస్)ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధరన్ పిళ్లై మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న నాయర్ కమ్యూనిటీని సంయుక్త పర్చడమే కాకుండా కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు చేపట్టడడం గొప్ప విషయమన్నారు. అనంతరం కేరళ ఎంపీ ప్రేమచందరన్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి కేరళకు రైలు సేవలు చాలా తక్కువగా ఉన్నాయని, రైలు సేవలు పెంచేందుకు కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్తానని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రన్, ఉపాధ్యక్షుడు మోహన్ నాయర్, ప్రధాన కార్యదర్శి ఎం.కె. శశికుమార్, సి.కె.పి మీనన్, సేతుమాధవన్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 30, జూన్, 2025





ఆకట్టుకున్న.. క్రియేటర్స్ కలెక్ట్..

800 గ్రాడ్యుయేట్ విద్యార్థుల భాగస్వామ్యం

ఫ్యాషన్, ఇంటీరియర్, ఫొటోగ్రఫీ రంగాల్లో ప్రతిభ





సాక్షి, సిటీబ్యూరో : మోడల్స్ ధరించిన దుస్తులు యువ ఫ్యాషన్ డిజైనర్ల క్రియేటివిటీకి పట్టం కడితే.. వైవిధ్యభరితమైన గృహాలంకరణ ఉత్పత్తులు రేపటి ఇంటీరియర్ డిజైనర్ల సత్తాను కళ్లకుకట్టాయి. నగరానికి చెందిన ఫ్యాషన్, ఇంటీరియర్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ హామ్స్టెక్, మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో తన వార్షిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన హామ్స్టెక్ క్రియేటర్స్ కలెక్ట్ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో 800 మందికిపైగా గ్రాడ్యుయేషన్ విద్యార్థులు ఫ్యాషన్, ఇంటీరియర్ డిజైన్‌లు మాత్రమే కాకుండా ఫొటోగ్రఫీ, గ్రాఫిక్ డిజైన్, మేకప్ ఆర్టిస్ట్రీ వంటి కళల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. పూర్తి వైవిధ్యానికి అద్దం పట్టిన ఈ ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇది ప్రతిభ, అవకాశాల మేలు కలయికగా నిలిచే వేదిక అని సంస్థ నిర్వాహకులు అజితారెడ్డి పేర్కొన్నారు.

ప్రముఖుల సారథ్యంలో..

జాతీయ అవార్డు గెలుచుకున్న ఫ్యాషన్ డిజైనర్ నీతా ఉల్లా విద్యార్థుల ఫ్యాషన్ షోకు సారథ్యం వహించారు. అదే విధంగా సెలబ్రిటీ ఇంటీరియర్ డిజైనర్ షబ్నమ్ గుప్తా మార్గదర్శకత్వంలో ఇంటీరియర్ డిజైన్ షోకేస్ జరిగింది. సెలబ్రిటీ ఫొటోగ్రాఫర్ అవినాష్ గోవారికర్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్, డిజైనర్ కైలాష్ నాయక్ సమర్పణలో గ్రాఫిక్ డిజైన్ డిస్‌ప్లే, లైవ్ మేకప్ ఆర్టిస్ట్రీ ప్రదర్శనలు కూడా ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు.



పచ్చదనానికి.. మియావాకీ..

- నగరంలో ప్రపంచపు అతిపెద్ద మియావాకీ అడవి
- కన్హాశాంతి వనంలోనూ వేల ఎకరాల్లో పెంపకం
- సిటీ గ్రీనరీకి బెస్ట్ రూట్‌గా అవతరించిన జపనీస్ టెక్నిక్
- పచ్చదనం ఆవశ్యకతపై పెరుగుతున్న అవగాహన

నలుదిశలా వేగంగా విస్తరిస్తున్న మియావాకీ అడవులు



నగరంలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు తమ ప్రాంగణాలను పచ్చగా మార్చేందుకు శ్రద్ధ చూపిస్తున్నాయి. ఈ క్రమంలో జపనీస్ టెక్నిక్ అయిన మియావాకీ అత్యుత్తమ అనుసరణీయ విధానంగా మారింది. గత ఐదేళ్లుగా ఈ విధానం ఊపందుకోవడంతో నగరం నలుదిశలా ఇప్పుడు పచ్చగా ప్రతిఫలిస్తున్నాయి. ఓ వైపు పెరుగుతున్న కాలుష్యం.. మరోవైపు వాతావరణంలో ఏర్పడుతున్న సమతుల్యత వెరసి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో పచ్చదనం ఆవశ్యకతపై అవగాహన పెరుగుతోంది.. దీంతో విస్తారంగా మియావాకీ అడవుల పెరుగుదలకు దోహదపడుతోంది. - సాక్షి, సిటీబ్యూరో

తనను తాను పోషించుకునే, పెంపొందించుకునే సత్తా ఉన్న మియావాకీకి స్వల్పకాలం మాత్రమే పోషణ అవసరం. దీంతో పచ్చని ప్రదేశాలను విస్తరణ కోసం మియావాకీ అటవీకరణ విధానం ప్రస్తుతం విస్తృతంగా ఆదరణ పొందుతోంది. జపనీస్ వృక్ష శాస్త్రజ్ఞుడు అకిరా మియావాకీ అభివృద్ధి చేసిన డెన్స్ నేటివ్ మినీ ఫారెస్ట్ కాన్సెప్ట్.. ఈ విధానంలో భాగంగా ఒక చిన్న ప్రాంతంలో వివిధ రకాల స్థానిక చెట్ల జాతులను దగ్గరగా నాటడం జరుగుతోంది. ఫలితంగా దట్టమైన, వేగంగా పెరిగే అడవులు ఏర్పడనున్నాయి. దీనిని విజయవంతంగా అనుసరిస్తూ నగరంతో పాటు చుట్టుపక్కల అనేక మియావాకీ అడవులు పచ్చగా వర్ధిల్లుతున్నాయి.

> **రెండేళ్లలో స్వయం పోషకంగా..**
>
> 
>
> వ్యక్తిగత ఆసక్తితో బెంగళూరులో దీని కోసం ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. అప్పటి నుంచి ఇప్పటి వరకూ దాదాపు 15 ప్రాజెక్టుల అభివృద్ధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాలు పంచుకున్నాను. మియావాకీ పద్ధతిలో మొక్కల పెంపకం వల్ల ప్రధాన ప్రయోజనం ఏమిటంటే కేవలం రెండేళ్ల స్వల్ప కాలంలోనే ఇవి స్వయం పోషకాలుగా మారతాయి. ఆ తర్వాత వాటి పరిరక్షణకు ఏమీ చేయాల్సిన అవసరం ఉండదు. అయితే ఈ విధానానికి తగినట్టుగా మొక్కలు పెంచే స్థలంలో పలు రకాల మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటుంది. ఇదంతా ఒక శాస్త్రీయ పద్ధతి ప్రకారం జరుగుతుంది. అలాగే ఈ విధానంలో తొలి దశలో వ్యయప్రయాసలు కూడా ఎక్కువే ఉంటాయి. - మహేష్ తలారి, ఎన్‌జీఓ ఎవర్‌గ్రీన్ ఎగెయిన్, మియావాకీ నిపుణులు

జయహో గ్రీనరీ..

ప్రభుత్వ హరితహారం కార్యక్రమంతో పాటు, పెద్ద ఎత్తున అటవీకరణ ప్రాజెక్టుల కోసం అనేక ప్రయివేటు సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు మియావాకీ పద్ధతిని అవలంభిస్తున్నాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా గచ్చిబౌలి స్టేడియం సమీపంలో ఉన్నటువంటి పలు కంపెనీలు మియావాకీ తోటల పెంపకంలో తాము కూడా పాల్గొంటున్నాయి.

- ప్రముఖ బయోఫిలిక్ డెవలపర్ ఎకో-రియాల్టీ ఫర్మ్‌గా పేర్కొంటున్న స్టార్టప్ స్టోన్ క్రాఫ్ట్ గ్రూప్, ప్రపంచంలోనే అతిపెద్ద మియావాకీ అటవీప్రాంతాన్ని శంషాబాద్‌లో అభివృద్ధి చేసింది. ప్రస్తుతం దీనిని అదనంగా 100 ఎకరాల్లో విస్తరించనున్నారు.
- రాచకొండ పోలీసులు 40,000 మొక్కలతో మియావాకీ తోటను ఏర్పాటు చేశారు. ఇది ఇప్పుడు దట్టమైన అడవిగా పెరిగింది.
- కొత్తపేటలో 10 ఎకరాల మియావాకీ పార్కును కూడా అభివృద్ధి చేస్తున్నారు. రైల్వే శాఖ ఆధ్వర్యంలో నార్త్ లాలాగూడలోని శాంతినగర్ రైల్వే కాలనీలోనూ ఈ పద్ధతిలో మొక్కలు నాటారు.. దీనిలో సేట్రీస్ ఎన్విరాన్మెంటల్ ట్రస్ట్ అనే ఎన్‌జీఓ కూడా భాగం పంచుకుంది.
- హైదరాబాద్ యూనివర్సిటీలో 4వేల మొక్కలతో మినీ ఫారెస్ట్‌ను సృష్టించారు.







మియావాకీ విశేషాలు..

మియావాకీ పద్ధతి తక్కువ సమయంలో దట్టమైన అడవులను సృష్టించగలదు. ఈ విధానంలో చెట్లు 10 రెట్లు వేగంగా పెరుగుతాయి అంతేకాక ఈ అడవి సంప్రదాయకంగా నాటిన అడవుల కంటే 30 రెట్లు దట్టంగా ఉంటాయి. ఈ చిన్న అడవులు వివిధ జాతుల పక్షులు, సీతాకోక చిలుకలు, ఇతర వన్యప్రాణులను ఆకర్షించడానికి జీవవైవిధ్యానికి దోహదం చేస్తాయి. ప్రధాన మియావాకీ సూత్రాలను అనుసరిస్తూ స్థానిక నేల వృక్షజాతులకు అనుగుణంగా మార్పు చేర్పులు చేస్తున్నారు.

రమణీయం.. కూచిపూడి నృత్యం

రవీంద్రభారతిలో స్మృతి, సిరిమాల నాట్యరంగ ప్రవేశం



గన్‌ఫౌండ్రీ : ప్రముఖ నాట్య శిక్షణాలయం శారద నృత్య నికేతం ఆధ్వర్యంలో నాట్య గురువు శైలజప్రసాద్ శిష్యులు స్మృతిరెడ్డి, సిరిమా రెడ్డిల కూచిపూడి నాట్య రంగప్రవేశం రవీంద్రభారతిలో ఆదివారం కన్నుల పండువగా జరిగింది. రంగపూజ, శివస్తుతి, అన్నమాచార్య కీర్తన, భామా కలాపం, నందన గోపాల, బాలమురళీకృష్ణ థిల్లాన, మంగళం వంటి అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు అహూతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాచీన శాస్త్రీయ సంగీత కళలు మన వారసత్వ సంపదన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తూ శాస్త్రీయ కళలను అభ్యసించడం అభినందించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సంగీత నాటక అకాడమీ చైర్మన్ అలేఖ్య పుంజాల మాట్లాడుతూ కళాకారులు ఇద్దరూ చదువుతో పాటు నాట్యం, క్రీడల్లోనూ రాణించడం ఎంతో గొప్ప విషయమన్నారు. మాజీ ఎమ్మెల్యే గణేష్‌గుప్తా, విశ్రాంత డీజీపీ ఆంజనేయరెడ్డి, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, అపోలో హెల్త్ సిటీ ఎండీ డాక్టర్ జె.శ్రీకాంత్‌తో పాటు కుటుంబ సభ్యులు, నాట్యప్రియులు పాల్గొన్నారు.

సినిమాటోగ్రాఫర్‌కు విజన్ ముఖ్యం..

- ఇండస్ట్రీపై మక్కువతో 2002లో అడుగులు
- '105 మినిట్స్' చిత్రానికి ఐకానిక్ అవార్డు
- పలువురు అగ్రహీరోల యాడ్ ఫిలింస్‌కి సినిమాటోగ్రఫీ



డైరెక్టర్ విజన్ ఒకటైతే.. సినిమాటోగ్రాఫర్ విజన్ మరోలా ఉంటుంది. సినిమాకు కళను తెచ్చే సినిమాటోగ్రఫీ చేయడం కష్టతరమైన పని.. కానీ నచ్చిన, మెచ్చిన పనిలో తన కష్టాన్ని చూపిన కిషోర్ బొయిదాపు ఇంటర్నేషనల్ ఐకానిక్ సినిమాటోగ్రాఫర్ అవార్డు అందుకున్నాడు. ఇటీవలే నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో '105 మినిట్స్' చిత్రానికి అవార్డు లభించింది. తన కుంటుంబ సినిమా నేపథ్యాన్ని, సినిమాటోగ్రఫీ విషయాలను 'సాక్షి'తో పంచుకున్నాడు. - బంజారాహిల్స్



బోరబండలోని గాయత్రినగర్‌కు చెందిన కిషోర్ స్వస్థలం విజయవాడ. ఆయన కుటుంబానిది సినిమా నేపథ్యం. తన ఇద్దరు బాబాయిర్లు ఒకరు ప్రముఖ పీఆర్‌ఓ దివంగత బీఏ రాజు, మరో బాబాయి కెమెరామెన్ రామ్‌కుమార్, తన అన్నల్లో ఒకరు కెమెరామెన్ రవి, మరో అన్న అనిల్ దర్శకుడిగా పనిచేస్తున్నారు. కుటుంబం మొత్తం సినిమా నేపథ్యం అవడంతో సినిమాలపై మక్కువతో 2002లో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు. రవిప్రసాద్ యూనిట్‌లో మొదట కెమెరా అసిస్టెంట్‌గా కెరీర్ ప్రారంభించాడు. మెచ్చిన, నచ్చిన పనిలో కష్టాన్ని నమ్మిన కిషోర్ త్వరగానే స్లమ్‌డాగ్ మిలీనియర్, మిషన్ ఇంపాజిబుల్-4, లెటర్స్, సూటబుల్ బాయ్స్ వంటి హాలీవుడ్ ప్రాజెక్టులకు సెకండ్ యూనిట్ కెమెరామెన్‌గా ప్రతిభను కనబరిచాడు. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ అనిల్ మెహతా ప్రియ శిష్యుడిగా సీక్రెట్ సూపర్ స్టార్, ఏ దిల్‌హై ముష్కిల్, బియాండ్ ది క్లౌడ్స్, హిందీ జెర్సీ వంటి అగ్రచిత్రాలతో పాటు అగ్రహీరోల యాడ్ ఫిల్మ్స్‌కి సినిమాటోగ్రాఫర్‌గా సత్తాచాటాడు.

కెమెరామెన్‌గా..

బోయ్ మీట్స్ గరల్స్ చిత్రంతో కెమెరామెన్‌గా మారిన కిషోర్ 'కిరాక్, వశం, కర్త-కర్మ-క్రియ, 105 మినిట్స్, మైనేమ్ ఈజ్ శృతి'తో పాటు పలు నూతన చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేశాడు. 105 మినిట్స్ చిత్రానికి ఐకానిక్ అవార్డు అందుకున్నాడు. ముంబై నుండి నగరానికి షిఫ్ట్ అయిన కిషోర్ తన ఫోకస్ అంతా తెలుగు చిత్రాలపైనే అని పేర్కొన్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సినిమాటోగ్రాఫర్‌గా రాణించడమే లక్ష్యమని తెలిపాడు.



ముగిసిన చేతివృత్తుల ప్రదర్శన..

ఆకట్టుకున్న మట్టి, వెదురు, తాటి ఉత్పత్తులు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన చేతి వృత్తుల ప్రదర్శన ఆదివారం ముగిసింది. ఐదురోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ట్యాంక్ బండ్ సమీపంలో నిర్వహించిన ప్రదర్శనలో వివిధ చేతి వృత్తుల వారు మొత్తం 30 స్టాల్స్ ఏర్పాటు చేశారు. నగర ప్రజల నుంచి దీనికి అద్భుత స్పందన లభించింది. మట్టిపాత్రలు, వెదురు వస్తువులు, పోచంపల్లి, గద్వాల్, నారాయణ పేట చేనేత ఉత్పత్తులు, నీరా స్టాల్స్‌లో ఉత్పత్తులను సందర్శకులు కొనుగోలు చేశారు.

> **తాటి ఉత్పత్తుల్లో శిక్షణ..**
>
> తాటి ఆకులతో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నాం. ఐదు దశాబ్దాల నుంచి వేలాది మందికి శిక్షణ ఇచ్చాను. ఇప్పుడు మార్కెటింగ్ కల్పించడం ఆనందంగా ఉంది. - కేబీటీ సుందరి, తాటి ఉత్పత్తుల ట్రైనింగ్ హెడ్

> **ఇంటికీ, ఒంటికీ మంచిది..**
>
> మట్టి గణపతులు, నగలు చేసేందుకు బీసీ కార్పొరేషన్ శిక్షణ ఇచ్చింది. స్వయంగా తయారు చేసిన ఉత్పత్తులను నేరుగా ప్రజలకు అందించే వీలు కలిగింది. మట్టి కుండలు తయారు చేయడం సంతోషంగా అనిపించింది. మట్టి ఇంటికీ, ఒంటికీ మంచిది అన్నవిషయం అందరికీ తెలియాలన్నదే మా ఉద్దేశం. - ధనలక్ష్మి, వర్షిణి, కుమ్మరి కళాకారులు, సంగారెడ్డి



ఆరోహణ్ ఆధ్వర్యంలో..

నో యువర్ హిస్టరీ అండ్ నిజాం..

ప్రత్యేక ఆకర్షణగా గజల్, షాయరీ ప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో: అనాదిగా సామాజిక అభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషించారని ఆసిఫ్ జాహీ వంశానికి చెందిన నిజాం వారసుడు రౌనక్ యార్ ఖాన్ తెలిపారు. ముఖ్యంగా ఆసిఫ్ జాహీ పాలనలో లింగసమానత్వానికి సంబంధించి అవగాహన పెరిగిందని ఆయన పేర్కొన్నారు. కోకాపేటలోని బెంగాలీ సాంస్కృతిక సంస్థ ఆరోహణ్ నిర్వహించిన 'నో యువర్ హిస్టరీ అండ్ నిజాం' కార్యక్రమంలో రౌనక్ యార్ ఖాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారత చరిత్రలో మహిళల పాత్రపై అవగాహన పెంచే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంబంధిత వివరాలను గణాంకాలతో సహా చర్చించారు. నిజాం పాలనలో మహిళల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన పలు అంశాలను ప్రస్తావించారు. కార్యక్రమాన్ని ఆరోహణ్ మహిళా బృందం నిర్వహించగా, వారు అందించిన గజల్, షాయరీ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సభ్యులు ఈ కార్యక్రమం ద్వారా నిజాం పాలనలో మహిళల పాత్రపై కొత్త విషయాలు తెలుసుకున్నట్టు తెలిపారు.

క్లుప్తంగా...

పీసీసీలో పని విభజన

ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)లో పని విభజన జరిగింది. కొత్తగా నియమితులైన పీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు లోక్‌సభ నియోజకవర్గాల వారీగా బాధ్యతలు అప్పగించారు. ఒక్కో ఉపాధ్యక్షుడికి ఒక్కో నియోజకవర్గం అప్పగించగా, ఆ లోక్‌సభ పరిధిలోని పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలను ముగ్గురు ప్రధాన కార్యదర్శులకు అప్పగించారు. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం కె.రఘువీర్‌రెడ్డి (ఆదిలాబాద్), గాలి అనిల్‌కుమార్ (పెద్దపల్లి), నాయిని రాజేందర్‌రెడ్డి (కరీంనగర్), బల్మూరి వెంకట్ (నిజామాబాద్), బండి రమేశ్ (జహీరాబాద్), ముజాహిద్ ఆలంఖాన్ (మెదక్), బస్వరాజు సారయ్య (మల్కాజ్‌గిరి), హనుమాండ్ల ఝాన్సీరెడ్డి (సికింద్రాబాద్), సీహెచ్.సంగమేశ్వర్ (హైదరాబాద్), బొంతు రామ్మోహన్ (చేవెళ్ల), ఎం.వేణుగౌడ్ (మహబూబ్‌నగర్), కొండేటి మల్లయ్య (నాగర్‌కర్నూల్), నమిండ్ల శ్రీనివాస్ (నల్లగొండ), కోటంరెడ్డి వినయ్‌రెడ్డి (భువనగిరి), చిట్ల సత్యనారాయణ (వరంగల్)లను ఇన్‌చార్జీలుగా నియమించారు. వీరితోపాటు మాజీ ఉపాధ్యక్షులు పోట్ల నాగేశ్వరరావు (మహబూబాబాద్), పి.శ్రవణ్‌కుమార్‌రెడ్డి (ఖమ్మం)లకు కూడా లోక్‌సభ బాధ్యతలు అప్పగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జెడ్పీటీసీగా ఓడిన 'కొండా'.. ఎమ్మెల్యేలను గెలిపించారా?

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య



హనుమకొండ చౌరస్తా: జెడ్పీటీసీగా ఓడిపోయిన కొండా మురళి, గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. ఆదివారం హనుమకొండలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.. కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, 'కుడా'చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సమావేశమయ్యారు. సుమారు రెండు గంటలకు పైగా ఉమ్మడి జిల్లా పార్టీలో చోటు చేసుకున్న తాజా పరిణామాలపై చర్చించారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, ఎమ్మెల్యే నాగరాజు, 'కుడా'చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ సారయ్య మీడియాతో మాట్లాడారు. ఇటీవల కొండా మురళి చేసిన వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ, వివరణ కోసం ఆయనను పిలిస్తే.. తనను ఎవరూ పిలవలేదని మాట్లాడటం గమనిస్తే క్రమశిక్షణ కమిటీపై ఆయనకు విశ్వాసం లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తోందని అన్నారు.

కాంగ్రెస్‌వి డైవర్షన్ పాలిటిక్స్

బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్.ప్రవీణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ డిసెప్షన్, డైవర్షన్, డిస్ట్రాక్షన్ పాలిటిక్స్ చేస్తోందని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీతో కలిసి కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందని, నేరచరిత్ర ఉన్న వ్యక్తి సీఎం, హోంమంత్రిగా ఉండి ప్రజల హక్కులు కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అరెస్టును ఖండిస్తున్నట్టు తెలిపారు. మీడియాపై దాడి దురదృష్టకరమని, అయితే తెలంగాణ ఉద్యమకాలం నుంచి కొన్ని ప్రసార మాధ్యమాలు తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేశాయన్నారు. ఒక న్యూస్ చానల్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అసభ్యకరంగా తంబ్ నెయిల్స్ పెట్టారని, యూట్యూబ్‌లో అసభ్యకర తంబ్ నెయిల్స్ పెడితే సైబర్ సెక్యూరిటీ సెల్ ఏం చేస్తోందని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభం అయిందని, ఫోన్ ట్యాపింగ్ ఎందుకు చేయాలనేది టెలిఫోన్ యాక్ట్‌లో స్పష్టంగా ఉందన్నారు. ఏ విధంగా అయినా కేసీఆర్ కుటుంబం నుంచి ఎవరినో ఒకరిని జైలుకు పంపాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారని ఆయన ఆరోపించారు.

బీఆర్‌ఎస్ నేతలపై కేసు నమోదు

- పోలీసు విధులను అడ్డుకున్నారని ఆరోపణ

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అరెస్టు సందర్భంగా శనివారం రాత్రి పోలీసులతో వాగ్వాదానికి దిగిన పలువురు బీఆర్‌ఎస్ నేతలపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. శనివారం రాత్రి గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌ను అరెస్టు చేసేందుకు పోలీసులు పెద్దసంఖ్యలో వచ్చి తెలంగాణ భవన్‌లోకి వెళ్లేందుకు యత్నించగా కార్యకర్తలు వారిని అడ్డుకున్నారు. దీంతో గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు బీఆర్‌ఎస్ నేతలు మధుసూదనాచారి, తాత మధు, బాల్క సుమన్, అభిలాష్‌రావు, మన్నె గోవర్ధన్‌రెడ్డి, సునీత, పావనిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని వీరిపై పోలీసులు సుమోటో కేసు నమోదు చేశారు.

అణుహత్యలు!

14 మంది ఇరాన్ శాస్త్రవేత్తల హత్య

- తామే చంపామని ప్రకటించిన ఇజ్రాయెల్
- సైంటిస్టులపై దాడి కూడా యుద్ధ వ్యూహమే
- 80 ఏళ్లలో 100 మంది శాస్త్రవేత్తల దుర్మరణం
- 'ఆ నాలుగే' ప్రధాన హంతక దేశాలు

ఇరాన్ అణు బలాన్ని దెబ్బతీసే లక్ష్యంతో జూన్ 13న ఇజ్రాయెల్ ప్రారంభించిన 'ఆపరేషన్ రైజింగ్ లయన్', కనీసం 14 మంది అణు శాస్త్రవేత్తలను హతమార్చింది. ఇరాన్ అణు సిద్ధాంత భౌతిక శాస్త్రవేత్త, 'ఇస్లామిక్ ఆజాద్ యూనివర్సిటీ' అధిపతి అయిన మొహమ్మద్ మెహదీ టెహ్రాన్చి, ఆ దేశ అణుశక్తి సంస్థ మాజీ అధిపతి ఫెరెడౌన్ అబ్బాసి-దవానీ వంటి ప్రముఖులు కూడా మరణించినవారిలో ఉన్నారు. ఇజ్రాయెల్ కానీ, మరో దేశంగానీ ఎందుకిలా అణు శాస్త్రవేత్తల్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తుంటాయి?!

\- సాక్షి, స్పెషల్ డెస్క్



యుద్ధం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కొన్నిసార్లు నేరుగా సైనికులతోనూ పోరాడరు. ఆయుధాలకు ఆయువుపట్టులా ఉన్న శాస్త్రవేత్తలనూ లక్ష్యంగా చేసుకుంటారు. ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధంలో ఇదే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అణు స్థావరాల కంటే ముందు, అణు శాస్త్రవేత్తలను లక్ష్యంగా చేసుకోవడం వెనుక ఉండే వ్యూహం ఒకటే. కీలకమైన సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వ్యక్తులను నిర్మూలించటం ద్వారా అణు కార్యక్రమాలను ముందుకు సాగకుండా నిలువరింపజేయటం, సంస్థాగతమైన ఆయువు పట్టును పూర్తిగా దెబ్బతీయడం. ఇరాన్ విషయంలో ఇప్పుడు ఇదే జరిగింది. 2020లో ఇరాన్ అణు సూత్రధారి మొహ్సేన్ ఫక్రిజాదేను చంపడం వెనుక ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ పన్నిన వ్యూహ లక్ష్యం కూడా సరిగ్గా ఇటువంటిదే.

ఇప్పటి వరకు 100 హత్యలు

అణు శాస్త్రవేత్తలను ప్రధాన లక్ష్యంగా చేసుకుని దాడులు చేయటం అన్నది 'అణు'యుగం ప్రారంభం నుంచీ ఉన్నదే. 1944 నుంచి 2025 వరకు ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 100 మంది శాస్త్రవేత్తలు శత్రుదేశాల దాడుల్లో హతమయ్యారు. అయితే ఈసారి ఇజ్రాయెల్, మునుపటి రహస్య కార్యకలాపాల మాదిరిగా కాకుండా, బహిరంగంగానే ఇరాన్ శాస్త్రవేత్తల్ని హతమార్చింది. ఇరాన్ అణు మౌలిక సదుపాయాలు, వాయుసేన రక్షణ వ్యవస్థలు, ఇంధన వనరులపైన కూడా చెప్పి మరీ ప్రత్యక్ష దాడులు జరిపింది.

నాలుగు 'హంతక' దేశాలు

చరిత్రలో పొందుపరిచి ఉన్న వివరాలను బట్టి చూస్తే ప్రపంచంలో ప్రధానంగా నాలుగు దేశాలు తమ శత్రు దేశాలకు చెందిన తొమ్మిది వేర్వేరు అణు కార్యక్రమాలపై పనిచేస్తున్న శాస్త్రవేత్తలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ నాలుగు దేశాలలో మొదటి వరుసలో ఇజ్రాయెల్, అమెరికా; రెండో వరుసలో బ్రిటన్, సోవియెట్ యూనియన్ ఉన్నాయి. ముఖ్యంగా ఇరాన్, ఇరాక్, ఈజిప్టుల కోసం పనిచేస్తున్న శాస్త్రవేత్తల్ని ఆ నాలుగు దేశాలు లక్ష్యంగా చేసుకున్నాయి. తాజా ఇజ్రాయెల్ దాడులకు ముందు వరకు 20 07 నుంచి 10 మంది ఇరాన్ అణు శాస్త్రవేత్తలు హత్యకు గురయ్యారు. శాస్త్రవేత్తలను లక్ష్యంగా చేసుకోవడం అన్నది సంబంధిత దేశంలోని శాస్త్రవేత్తలకే పరిమితం కాలేదు. ఉదాహరణకు, ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 'మోసాద్' 1980 లో ఇటలీ ఇంజనీరు మారియో ఫియోరెల్లి ఇంటిపై బాంబు దాడి చేసి, ఇరాక్ అణు స్థావరాలకు కోసం పని చేస్తున్న ఐరోపా సంస్థలను పరోక్షంగా హెచ్చరించింది.

ఏఐతో చంపేశారు

శాస్త్రవేత్తలను 'మట్టుపెట్టటం'లో మునుపటి విధానాలు మారిపోయాయి. గతంలో వ్యక్తులపై నేరుగా కాల్పులు, లేదంటే బాంబు దాడులు చేసేవారు. ఆ పద్ధతులే ఇప్పుడు మరింత అధునాతనంగా మారాయి. ఉదాహరణకు, తాజా ఆపరేషన్‌లో మరణించిన ఫెరెడౌన్ అబ్బాసి గతంలో 2010 కారు బాంబు దాడి నుండి బయటపడిన వారే. ఇరాన్‌కు చెందిన సుప్రసిద్ధ అణుశాస్త్రవేత్త ఫక్రిజాదే హత్య అప్పట్లో ఓ సంచలనం. అతడి కదలికలపై ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ సంస్థ మొసాద్ 2019 నుంచీ నిఘా వేసింది. 2020లో అతడి హత్య కోసం.. ఇప్పటి పరిభాషలో చెప్పాలంటే ఏఐను ఉపయోగించింది. ఒక టన్ను బరువు ఉండే రిమోట్ కంట్రోల్డ్ మెషీన్ గన్ ఇందుకోసం వాడారు. అత్యంత రహస్యంగా ఆ గన్ విడి భాగాలను ఇరాన్‌లోకి తీసుకొచ్చారు. వాటిని ఒకచోట అమర్చి, ఫక్రిజాదే ప్రయాణిస్తున్న దారిలో ఒక పాడుబడిన వాహనంలో ఉంచారు. అతడు భార్యతో సహా ప్రయాణిస్తుంటే.. కేవలం ఒక్కడికే గురిపెట్టారు. మొత్తం 15 బుల్లెట్లను కేవలం నిమిషం వ్యవధిలో ప్రయోగించారు. కారులో అతడి పక్కనున్న భార్యకు ఏమీ కాలేదట. హత్య జరిగిన మరుక్షణమే మెషీన్ గన్ ఉంచిన వాహనం కూడా పేలిపోయి, అందులో ఎలాంటి ఆనవాలూ లభించలేదట. ఈ మొత్తం ఆపరేషన్‌ను ఇరాన్ వెలుపల ఒక కమాండ్ సెంటర్ నుంచి నిర్వహించడం విశేషం.

చెప్పి చేయటం మొదలైంది!

సైనిక చర్యలతో పాటు, దౌత్యం, ఆంక్షలు, సైబర్ దాడులు, నిఘా కార్యకలాపాలు అన్నవి విస్తృతమైన అణ్వస్త్రవ్యాప్తి నిరోధక వ్యూహంలో భాగంగా ఉంటాయి. అయితే ప్రధానంగా శాస్త్రవేత్తలను లక్ష్యంగా చేసుకోవడం వెనుక ఉన్న కారణం ఏమిటంటే – దౌత్యపరమైన ప్రయత్నాలన్నిటినీ జాప్యం అయ్యేలా చేయటం, తద్వారా అణ్వస్త్రాల తయారీ ఖర్చులు పెరిగేలా చేయటం, అలాంటి కార్యక్రమాలకు ఇతరులకు సహకరించకుండా నిరోధించడం.



ఈ నెల 22న దాడి తర్వాత ధ్వంసమైన ఇస్ఫహాన్ అణు కేంద్రం ఉపగ్రహ ఛాయా చిత్రాలు (ఫైల్)

ఎంత ప్రభావం ఉంటుంది?

శాస్త్రవేత్తలను హతమార్చటం అన్నది బలమైన సందేశాన్ని పంపుతుందని, శత్రువు దూకుడును తగ్గిస్తుందని పరిశీలకులు అంటున్నారు. ఇజ్రాయెల్ సైన్యం ఇటీవలి తన దాడులను 'సామూహిక విధ్వంసక ఆయుధాలను సమకూర్చుకునే సామర్థ్యానికి గట్టి దెబ్బ'గా అభివర్ణించింది. అయితే, ఇరాన్ అణు కార్యక్రమంలో వేలాది మంది శాస్త్రవేత్తలు పాల్గొంటూ ఉండొచ్చనే మాట ఎప్పటి నుంచో వినిపిస్తూ ఉన్నదే. ఒకరిద్దరు శాస్త్రవేత్తలను హతమార్చటం వల్ల అణ్వస్త్ర దేశ గమనం పెద్దగా మారకపోవచ్చు. పైగా ఇటువంటి హత్యలు నైతికమైన, చట్టపరమైన, మానవతాపరమైన ఆందోళనలను పెంచుతాయి. శాస్త్రవేత్తల హత్యలు వారిని అమరవీరుల స్థాయికి పెంచే అవకాశం ఉండటంతో అణు అభివృద్ధికి ప్రజల మద్దతు లభించవచ్చు కూడా.

దక్షిణ 'రింగు'.. కేంద్రానిదా, రాష్ట్రానిదా?

- కేంద్ర ప్రభుత్వ విజన్–2047 జాబితాలో చోటు
- అలైన్‌మెంట్ కూడా సిద్ధం..ఇప్పుడు వేరే అలైన్‌మెంట్‌ను సొంతంగా రూపొందించిన రాష్ట్ర ప్రభుత్వం
- సమాచారం లేదని, తమ అనుమతి కూడా లేదంటున్న ఎన్‌హెచ్‌ఏఐ
- రాష్ట్ర ప్రభుత్వ తీరుతో గందరగోళం

రీజనల్ రింగురోడ్డు ఉత్తర భాగంతోపాటే దక్షిణ భాగ నిర్మాణం కూడా చేపట్టండి. ఈ ప్రాజెక్టులో జాప్యం లేకుండా చూడండి

– ఇది గతేదాది చివరలో సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి చేసిన విన్నపం. ఢిల్లీలో కేంద్ర మంత్రిని స్వయంగా కలిసి ఓ లేఖ కూడా రాశారు.

రీజనల్ రింగురోడ్డు దక్షిణ భాగానికి ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ రూపొందించిన 208 కి.మీ. నిడివి గల అలైన్‌మెంట్‌కు వారం రోజుల క్రితం రాష్ట్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఇప్పుడు దాని డీపీఆర్ తయారీకి ఏర్పాట్లు చేస్తోంది.

ఇప్పుడీ రెండు విరుద్ధ అంశాలు ఇటు ఎన్‌హెచ్‌ఏఐ, అటు రాష్ట్రప్రభుత్వ అధీనంలోని ఎన్‌హెచ్ యంత్రాంగంలో అయోమయానికి కారణమవుతోంది.



సాక్షి, హైదరాబాద్: రీజనల్ రింగురోడ్డు ఉత్తర భాగాన్ని ఎన్‌హెచ్‌ఏఐ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దక్షిణ భాగం కూడా అధికారికంగా ఎన్‌హెచ్‌ఏఐ పరిధిలోనే ఉంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విజన్–2047 జాబితాలో అది కొనసాగుతోంది. సాధారణంగా ఎన్‌హెచ్‌ఏఐ చేపట్టే ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని ప్రక్రియలు ఆ విభాగమే పర్యవేక్షిస్తుంది. వాటిల్లో రాష్ట్ర ప్రభుత్వ జోక్యం ఉండదు. అందుకే, దక్షిణ భాగానికి సంబంధించి ఢిల్లీ సంస్థ రూపొందించిన మూడు అలైన్‌మెంట్లలో ఒకదాన్ని ఎంపిక చేయగా, తుది ఆమోదం కోసం పెండింగ్‌లో ఉంది. ఇప్పటికీ, ఢిల్లీ సంస్థతో ఎన్‌హెచ్‌ఏఐ ఒప్పందం కొనసాగుతోంది. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా మరో కన్సల్టెన్సీతో అలైన్‌మెంట్‌ను రూపొందింపజేసి ఆమోదం కూడా తెలపడం చర్చనీయాంశంగా మారింది.

కేంద్రమే కొనసాగించాలంటూ లేఖ

ఈ ప్రాజెక్టుకు దాదాపు రూ.21 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనాలున్నాయి. ఉన్న నిధుల్లో సింహభాగం రాష్ట్ర ప్రభుత్వ పథకాలకే కేటాయించాల్సి వస్తోంది. ఇలాంటి తరుణంలో దక్షిణ రింగును సొంతంగా చేపట్టడం అసాధారణ విషయమే. అందుకే దక్షిణ రింగును కూడా కేంద్రమే కొనసాగించాలని లేఖ రాసింది. ఇదే సమయంలో ఎన్‌హెచ్‌ఏఐ అధీనంలోని ఆ ప్రాజెక్టుకు తాను సొంతంగా అలైన్‌మెంట్, డీపీఆర్ తయారీ చేయటం ఇప్పుడు గందరగోళంగా మారింది. దీంతో అసలు ఈ ప్రాజెక్టు కేంద్రం పరిధిలో ఉందా, రాష్ట్రం పరిధిలో ఉందా అన్న సందిగ్ధత నెలకొంది.

రాష్ట్రప్రభుత్వ ఉద్దేశమేంటో మాకు తెలియదు: ఎన్‌హెచ్‌ఏఐ

'దక్షిణ రింగుకు రాష్ట్ర ప్రభుత్వంఅలైన్‌మెంట్ చేసుకోవటం, డీపీఆర్ తయారు చేస్తుండటం ఎందుకో మాకు తెలియదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా మాకు ఎలాంటి కమ్యూనికేషన్ లేదు. ప్రాజెక్టు నిర్వహణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏం ఆలోచిస్తోందో మాకు తెలియదు'అని ఎన్‌హెచ్‌ఏఐ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'తో చెప్పారు.

జాప్యం జరుగుతోందని మేం చేస్తున్నాం: రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని ఎన్‌హెచ్

'దక్షిణ రింగు విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో భూముల ధరలు పెరిగి భూసేకరణ భారం పెరుగుతుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అలైన్‌మెంట్‌ను రూపొందించుకుంటోంది. డీపీఆర్ కూడా తయారు చేస్తోంది. ఇదంతా ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనలననుసరించే జరుగుతున్నాయి. ప్రాజెక్టు విషయంలో తదుపరి నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి'అని రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని ఎన్‌హెచ్ విభాగం ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

ఆ అలైన్‌మెంట్ ప్రకారం పనులు చేపట్టమని కోరే అవకాశం

ఉత్తర–దక్షిణ రింగులను తనే చేపట్టేందుకు గతంలోనే కసరత్తు ప్రారంభించిన ఎన్‌హెచ్‌ఏఐ దాన్ని కొనసాగిస్తోంది. అయితే, ప్రాధాన్యతాక్రమంలో ఉత్తర రింగుకు ముందు ఓకే చెప్పింది. ట్రాఫిక్ రద్దీ దక్షిణ రింగుపై అంతగా ఉండదని భావిస్తూ దాన్ని తదుపరి చేపట్టేందుకు తాత్కాలికంగా పెండింగ్‌లో పెట్టింది. అప్పట్లో ఎన్‌హెచ్‌ఏఐ రూపొందించిన అలైన్‌మెంట్‌తో విభేదిస్తున్న రాష్ట్రప్రభుత్వం, తాను కోరుకుంటున్నట్టు ఫ్యూచర్ సిటీకి అనుసంధానమయ్యేలా కొత్త అలైన్‌మెంట్‌ను తానే రూపొందించి, దాని ప్రకారం రోడ్డును నిర్మించాలని కేంద్రాన్ని కోరబోతున్నట్టు తెలిసింది. దీనికి కేంద్రం ఓకే చెబుతుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

మెదక్ ఎంపీకి మళ్లీ బెదిరింపులు

- ఆపరేషన్ కగార్ ఆపాలంటూ ఫోన్‌కాల్స్



మెదక్‌జోన్: మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి మావోయిస్టులమంటూ బెదిరింపు కాల్స్ వచ్చాయి. ఈనెల 23న బెదిరింపు కాల్ రావటంతో ఆయన డీజీపీతోపాటు మెదక్, సంగారెడ్డి ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. కాల్స్‌పై విచారణ చేపట్టిన పోలీసులు ఎంపీ రక్షణ కోసం ఆర్మ్‌డ్ పోలీస్ సిబ్బందిని పెంచారు. కాగా ఆయన కాలికి గాయం కావడంతో హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతిలో ఉన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఐదు నిమిషాల వ్యవధిలో రెండుసార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయి. 12.10 నిమిషాలకు 9489556347 నంబర్‌నుంచి, మరోసారి 12.15 నిమిషాలకు 7365035440 నంబర్ల నుంచి కాల్స్ చేసి బెదిరించినట్లు ఎంపీ చెప్పారు. ఏపీ మావోయిస్టు కమిటీ ఆదేశాల మేరకు మిమ్మల్ని చంపేందుకు హైదరాబాద్‌లో ఐదు బృందాలు తిరుగుతున్నాయని హెచ్చరించినట్లు తెలిసింది. ఆపరేషన్ కగార్ ఆపాలంటూ వారు డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంపీ రఘునందన్‌రావు ఆస్పత్రి నుంచే డీజీపీతో పాటు మోండా మార్కెట్ పోలీసులకు, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. కాగా ప్రస్తుతం పార్లమెంట్ సెక్యూరిటీ ఇచ్చారని, వారిని పర్మనెంట్ సెక్యూరిటీగా కొనసాగించాలని ఉన్నతాధికారులను కోరినట్లు ఎంపీ తెలిపారు.

బంజారా ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో చోటు కల్పించాలి

- 'ఆత్మీయ సమ్మేళనం'లో బంజారా ప్రముఖుల తీర్మానం



ఆత్మీయ సమ్మేళనంలో బంజారా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు

సనత్‌నగర్ (హైదరాబాద్): బంజారా ఎమ్మెల్యేలకు కేబినెట్‌లో చోటు కల్పించాలంటూ రాష్ట్రంలోని బంజారా ప్రజా ప్రతినిధులు, మేధావులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆదివారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో 'బంజారా ఆత్మీయ సమ్మేళనం'నిర్వహించారు. గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్ చౌహాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ రామచంద్ర నాయక్, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు నేనావత్ బాలు నాయక్, రాందాస్ నాయక్, మాజీ మంత్రి రవీందర్ నాయక్, మేధావుల సంఘం అధ్యక్షుడు ధనుంజయ్ నాయక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ హరిచరణ్‌తోపాటు పలువురు ఉద్యోగులు, విద్యావంతులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో 7 తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్రంలోని గిరిజనుల్లో 70 శాతం జనాభా కలిగిన బంజారా ప్రజాప్రతినిధులకు కేబినెట్‌లో స్థానం కల్పించాలని ప్రధాన తీర్మానం చేశారు. అలాగే గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రేపు బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

- ప్రజాభవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఇవ్వనున్న మంత్రి ఉత్తమ్
- హాజరుకానున్న సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు



సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై జూలై 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనుంది. రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులందరికీ వాస్తవాలు తెలిసే విధంగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందుకుగాను ఆయన సంబంధిత నీటిపారుదలరంగ నిపుణులు, అధికారులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బతింటాయన్న వివరాలు సమగ్రంగా సేకరిస్తున్నారని ఆయన కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ప్రజాభవన్‌లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు జరగనున్న ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కసహా రాష్ట్ర మంత్రులు, రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు, శాసనమండలి, శాసనసభ్యులతో పాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు వివిధ విభాగాలకు చెందిన కమిషన్ల చైర్మన్లు హాజరవుతారని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపాయి.

కేసీఆర్, కేటీఆర్ వ్యక్తిత్వాలను హననం చేసేలా దాడులు

- సీఎంలు చంద్రబాబు, రేవంత్‌లను చూసి మురుస్తున్న వారిని భవిష్యత్‌లో ఎవ్వరూ కాపాడలేరు : మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: మీడియా ముసుగులో కొంతమంది స్లాటర్ హౌస్‌లు నడుపుతున్నారని, కేసీఆర్, కేటీఆర్ వ్యక్తిత్వాలను హననం చేసే దాడులు జరుగుతున్నాయని మాజీమంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మీడియా ముసుగులో దాడి చేస్తే కేసీఆర్ అభిమానులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. 'మీ దాడులకు మేము ప్రతి దాడులు చేస్తే తట్టుకోలేరు'అని అన్నారు. ఏడాదిన్నరగా మీడియాను అడ్డం పెట్టుకొని కేసీఆర్‌పై కుట్రలు చేస్తున్నారని, మమ్మల్ని ఇబ్బందిపెట్టే వారిని ఎవ్వరినీ వదిలిపెట్టమని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడుని, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిలను చూసి మురుస్తున్న వారిని భవిష్యత్‌లో ఎవ్వరూ కాపాడలేరని పేర్కొన్నారు. పథకం ప్రకారమే బీఆర్‌ఎస్‌పై దుర్మార్గానికి పాల్పడుతున్నారని తెలిపారు. మహాన్యూస్‌పై దాడి చేశారని మొసలికన్నీరు కారుస్తున్నారని, కేసీఆర్, కేటీఆర్‌పై అక్కసుతో.. అదేపనిగా పెట్టుకొని దాడులు చేస్తున్నారన్నారు. నిన్న జరిగింది దాడి కాదు.. నిరసన మాత్రమేనని అన్నారు. సాగునీటి విషయంలో ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి అజ్ఞానులని, మంత్రులకు పాలన చేతకాక రోజూ కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని చెప్పారు.

తెలంగాణ జాగృతి మరింత విస్తృతం

- వివిధ దేశాల్లో సంస్థ శాఖల ఏర్పాటు
- అధ్యక్షులను నియమించిన ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా వ్యవహరించిన తెలంగాణ జాగృతి సంస్థ మరింత విస్తృతమవుతోంది. సమాజంలోని అన్ని వర్గాలకు చేరువయ్యేందుకు, సంస్థ కార్యక్రమాలను వివిధ రంగాలలో మరింత సమర్థవంతంగా నిర్వహించాలని నాయత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తెలంగాణ జాగృతి.. వివిధ దేశాల్లో శాఖలను ఏర్పాటు చేసింది. అలాగే ఆయా శాఖలకు అధ్యక్షులను నియమించింది. ఈ మేరకు సంస్థ అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదివారం అధ్యక్షుల జాబితా విడుదల చేశారు. అదేవిధంగా మహారాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా శ్రీనివాస్ సుల్గే నియమితులయ్యారు. ఈ నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని, త్వరలోనే ఆయా దేశాల్లో పూర్తి స్థాయి కమిటీలను ప్రకటిస్తామని తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వివిధ దేశాల జాగృతి అధ్యక్షులు వీరే..

న్యూజిలాండ్: అరుణ జ్యోతి ముద్దం, **గల్ఫ్ అధ్యక్షుడు:** చెల్లంశెట్టి హరిప్రసాద్, **ఖతార్:** మూకల ప్రవీణలక్ష్మి, అడ్వైజర్– నందిని అబ్బగోని, **యూఏఈ:** పీచర వేంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి శేఖర్ గౌడ్, **కువైట్:** మర్క ప్రమోద్ కుమార్, **సౌదీ అరేబియా:** మహమ్మద్ మొజ్జం అలీ ఇఫ్తెకార్, **ఒమన్:** గుండు రాజేందర్ నేత, **యునైటెడ్ కింగ్ డమ్:** సుమన్ రావు బల్మూరి, **ఇటలీ:** తానింకి కిశోర్ యాదవ్, **ఫిన్లాండ్:** ఐరెడ్డి సందీప్ రెడ్డి, **పోర్చుగల్:** ప్రకాశ్ పొన్నకంటి, **మాల్టా:** పింటు ఘోష్, **కెన్యా:** స్వప్న రెడ్డి గంట్ల, **ఇరాక్, కుర్దిస్తాన్:** మహ్మద్ సల్మాన్ ఖాన్, ప్రధాన కార్యదర్శి నాయక్వార్ రాంచందర్.

ఫైసా ఆదాయం పెరగలే!

- వరుసగా రెండో నెలలోనూ రూ.16 వేల కోట్ల రాబడే
- ఏప్రిల్, మే నెలల్లో కలిపి వచ్చింది రూ.33 వేల కోట్లే
- అందులోనూ అప్పులు దాదాపు రూ.10 వేల కోట్లు
- ఖర్చులో మాత్రం పెరుగుదల.. ప్రభుత్వ నివేదికలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: కొత్త ఆర్థిక సంవత్సరం రాష్ట్ర ఖజానాకు అంతగా కలిసిరావడం లేదు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో వరుసగా రెండో నెలలో కూడా ఆదాయ పరిస్థితిలో మార్పు రాలేదు. రాష్ట్ర సొంత పన్నులు, కేంద్రం ఇచ్చే నిధులు, అప్పులు, పన్నేతర ఆదాయాలు.. అన్నీ కలిపి ఏప్రిల్ నెల తరహాలోనే మే నెలలోనూ రూ.16 వేల కోట్లు మాత్రమే సమకూరాయి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు రాష్ట్ర ప్రభుత్వం మే–2025 నాటికి రాష్ట్ర రాబడులు, వ్యయాలపై ఇచ్చిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం ఏప్రిల్ నెలలో మొత్తం రూ.16,473.99 కోట్లు ఖజానాకు సమకూరగా, మే నెలలో రూ.16,349.46 కోట్లు వచ్చాయి. మొత్తం కలిపి రెండు నెలల్లో రాబడులు రూ. 32,823.45 కోట్లు కాగా, వ్యయం 31,740.08 కోట్లుగా నమోదైంది. అయితే, ఇందులో అప్పులే రూ.10 వేల కోట్ల వరకు ఉండగా, గత ఏడాదితో పోలిస్తే పన్ను ఆదాయం తగ్గింది. కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రాకపోవడం వల్ల కూడా ఖజానా కళ తప్పిందని ఆర్థిక శాఖ వర్గాలంటున్నాయి. పన్నేతర ఆదాయం ఆశించిన మేర రాకపోవడం, కేంద్ర పన్నుల వాటాలో కూడా పెద్దగా మార్పు లేకపోవడంతో వరుసగా రెండో నెలలో కూడా రాష్ట్ర ప్రభుత్వ అంచనాలకు, రాబడులకు మధ్య వ్యత్యాసం రూ.9 వేల కోట్లు కొనసాగుతుండడం గమనార్హం.

2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ఖజానా గణాంకాలివి (రూ.కోట్లలో)

రాబడి మార్గం	ఏప్రిల్	మే	మొత్తం
జీఎస్టీ	4,054.14	3,865.24	7,919.38
రిజిస్ట్రేషన్లు	1,126.18	1,387.26	2,513.44
అమ్మకపు పన్ను	2,703.53	2,896.88	5,600.41
ఎక్సైజ్	1,288.00	1,772.16	3,060.16
కేంద్ర పన్నుల్లో వాటా	1,096.31	1,096.31	2,192.62
ఇతర పన్నులు	648.27	674.45	1,322.72
పన్నేతర ఆదాయం	253.60	476.33	729.93
గ్రాంట్ ఇన్ ఎయిడ్	68.85	17.88	86.73
అప్పులు	5,230.99	4,158.91	9,389.90
మొత్తం	16,473.99	16,349.46	32,823.45

సన్నిధి

మంచిమాట



పెద్దల సూచనలు, సలహాలు స్వీకరించడం అంటే, యువతకు ఏమీ తెలియదని కాదు. మారుతున్న కాలగతిలో, సాంకేతిక పురోగతిలో తమకున్న పరిజ్ఞానానికి గురువులు అందించే సూచనలు ఆచరిస్తే, కలిగే ప్రయోజనమే వేరు. ఈ విధమైన సమన్వయంతో జీవితాన్ని నడిపే యువత అత్యంత ప్రతిభాశాలురుగా నిలవడం మనకు తెలిసిన విషయమే.

అనుభవసారం

పెద్దలు లేక గురువులు మనకు ఏదైనా విషయాన్ని బోధిస్తే, అది మన మంచికే అన్న సంగతిని యువత ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. ఎందుకంటే అనుభవంతో వారు చెప్పే మాటల్లో వెలకట్టలేని విలువైన సమాచారం దాగి ఉంటుంది. కాబట్టి వీలైనంతవరకు వాటిని పాటిస్తే జీవితంలో వచ్చే ఎన్నో సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. గురువు అంటే వయసులోనే పెద్దవాళ్ళు కాదు, ఎంతో అనుభవం తమ సొంతం చేసుకున్న వారు. ఎన్నో సంక్లిష్ట పరిస్థితులను దాటి ఒక స్థాయికి వచ్చిన వాళ్ళు. పరిణామ క్రమంలో కాలంలో వచ్చే మార్పుల్లో, అలవాట్ల విషయంలో గురువులకూ, శిష్యులకూ కొంత భేదం తప్పకుండా ఉంటుంది. అంత మాత్రాన మన జీవితానికి సంబంధించి వాళ్ళు చెప్పే విషయాలను పాత చింతకాయ పచ్చడి అన్న చందాన పరిగణించ కూడదు. ఎందుకంటే, వాళ్ళు మనకు మంచిని బోధించే సమయంలో గానీ, ఏదైనా సూచనలు, సలహాలు ఇచ్చినప్పుడు గానీ, గతంలో తమకు ఎదురైన అనుభవాలను ఉదాహరణలుగా బోధించడం మనకు తెలిసిన విషయమే. యువత గమనించవలసినది ఏమిటంటే, ఒక ప్రత్యేకమైన సమస్య చదువులో కానీ, తమ జీవితానికి సంబంధించి గానీ ఎదురైనప్పుడు పెద్దవాళ్ళతో లేక గురువులతో చర్చిస్తే, దానివల్ల ఒనగూడే లాభమే వేరు. దాదాపుగా ఇటువంటి సమస్యనో, ఉత్పాతాన్నో గతంలో వాళ్ళు ఎదుర్కొనే ఉంటారు కాబట్టి, వెంటనే ఆ గడ్డు సమస్యను ఏ విధంగా అధిగమించాలో మనకు చక్కగా సూచిస్తారు.

పాండవ మధ్యముడైన అర్జునుడు మిగిలిన పాండవుల మాదిరిగా, కౌరవుల మాదిరిగా అందరిలాంటి యోధుడే. కానీ, పార్థునిలో ఉన్న విశేషగుణం విలువిద్యలో అతనికొక ప్రత్యేకతను సంతరించింది. చీకటిలో కూడా బాణాలు వేయగలగడం, శబ్దాన్ని అనుసరించి అస్త్రాలను సంధించడం, ఎడం చేతితోనూ బాణాన్ని అవలీలగా ఉపయోగించగలగడం వంటివి గురువు చెప్పిన సూచనలను పాటించడం ద్వారా గొప్ప విలుకాడయ్యాడు. ద్రోణుడు తాను అస్త్రవిద్యను నేర్చుకునే సందర్భంలో ఎదుర్కొన్న సమస్యలను అర్జునునికి తెలపడం, అర్జునుడు ఆ సమస్యలను ఎలా అధిగమించాలి అన్న విషయాన్ని గురువు చెప్పిన విధంగా పాటించడం చేశాడు. నిత్యమూ జరిగే, సాధారణమైన అస్త్ర బోధన పూర్తి చేశాక గురువు చెప్పిన విషయాలను తేలికగా తీసుకోక,అత్యంత నిజాయితీగా ఆచరణలో పెట్టి సవ్యసాచిగా నిలిచి, యువతకు నేటికీ చక్కటి ఉదాహరణగా నిలిచాడు.

నిత్య జీవితంలో ఎన్నో సమస్యలతో, సందేహాలతో సతమతమయ్యే నరేంద్రుడు, గురువైన రామకృష్ణులు అనుభవంతో చెప్పిన ప్రతి పాఠాన్ని అత్యంత శ్రద్ధతో విని, వారు చెప్పిన సూచనలను చక్కగా ఆచరణలో పెట్టాడు. మహితమైన తన లక్షణాలతో జాతి మొత్తం గర్వించే స్వామి వివేకానందగా అందరి మన్ననలూ నిత్యమూ అందుకుంటున్నాడు. నరేంద్రుడు తెలివైన వాడే అయినా, పెద్దరికంతో గురువుగా రామకృష్ణులు చెప్పిన మాటలను అత్యంత వినయవిధేయతలతో అనుసరించాడు కాబట్టే, భరతజాతి మొత్తానికే ఆదర్శప్రాయుడయ్యాడు.


నేటి తరంలో ఈ పంథాలో చక్కగా చెప్పుకోగలిగే ఒక ఉదాహరణ క్రికెటర్ సచిన్ టెండూల్కర్. సచిన్ చిన్నతనంలో సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా, క్రికెట్ ఆటలో తనకున్న ప్రతిభకు గురువు చెప్పే సూచనలకు ఎంతో విలువిచ్చి, తన బ్యాటింగ్ టెక్నిక్‌ను ఉన్నత స్థాయికి తీసుకెళ్ళాడు. ఫలితంగా ప్రత్యర్థి ఎవరైనా, బౌలర్ ఎవరైనా సచిన్ నిర్భీతితో బ్యాటింగ్ చేసిన విధం విశ్వమంతా ఎరిగిన విషయమే. చివరికి తన ఆట తీరుకు, అద్భుత బాటింగ్ శైలికి సచిన్ 'క్రికెట్ దేవుడు' గా పేరు పొందాడు. ఈ విధంగా చెప్పుకుంటూ పోతే, ఎన్నో చక్కటి ఉదాహరణలు మనకు తారసపడతాయి.

అందుకే గురువులు తమ అనుభవసారంతో చెప్పే సలహాలు, వాటిని నిజాయితీగా పాటించే యువతకు విజయహారంగా మారతాయని చెప్పడంలో ఎటువంటి సందేహమూ లేదు.

– వ్యాఖ్యాన విశారద
వెంకట్ గరికపాటి

తాత్వికథ

ఆనంద రహస్యం



తొండమనాడు రాజు ఓ పర్వదినాన శేషాచలం కొండలలోని అద్భుత సహజ శిల్పకళా చమత్కారమైన తుంబురు తీర్థం దర్శించడానికి వెళ్ళాడు. సనక సనంద తీర్థం, నల్లగుండాల మీదుగా దట్టమైన అటవీలోయలో నడుచుకుంటూ తుంబురు తీర్థం చేరాడు. భూ పరిణామ క్రమంలో భాగంగా ఓ కొండ కొబ్బరిచిప్పలా రెండుగా విచ్చుకుని చివర్లో జలజల పారుతున్న తుంబురు తీర్థం జలపాతాన్ని చూస్తూ గంటల కొద్దీ గడిపినాడు. పక్కనే వున్న తరిగొండ వెంగమాంబ గుహ వద్ద వున్న నిశ్చలానంద స్వామిని దర్శించుకున్నాడు.

తనకు అష్టైశ్వర్యాలున్నా ఎందులోనూ ఆనందం కనిపించడం లేదని బాధను వ్యక్తం చేశాడు. నిశ్చలానంద స్వామి చిరునవ్వు నవ్వాడు.

అప్పుడే కాలినడకన కొందరు భక్తులు గోవిందలు చెప్పుకుంటూ తిరుమల కొండకి నడిచి వెళుతున్నారు. వారు నడిచి నడిచి అలసిపోయి ఉన్నారు. వారికి కడుపు నిండా అన్నం పెట్టి, వారు భోజనం చేసి వెళ్లేటప్పుడు రాజును వారి కళ్ళలోకి చూడమన్నాడు.

వెంటనే రాజు తనతో వచ్చిన వంటవాళ్లను, భటులను పురమాయించి చకాచకా వంటలు చేయించాడు. వేడివేడిగా అరటి ఆకులో వడ్డించిన వంటలను కాలి నడక భక్తులు ఆవురావురుమని తినసాగారు. అలా తింటున్న వారిని చూస్తున్న రాజుకు తాను తినకుండానే కడుపు నిండిపోయినట్లనిపించింది.

భోజనమయ్యాక భక్తులు ఒక్కొక్కరూ వచ్చి 'అన్నదాతా సుఖీభవా' అని చెప్పి వెళ్తుంటే రాజు తృప్తిగా తియ్యటి గుటకలు మింగాడు. రాజు ముఖంలోకి మెరుపు వచ్చింది. తనకి తెలియకుండానే కళ్ల నుంచి ఆనంద భాష్పాలు రాలాయి.

అదే అదునుగా భావించిన నిశ్చలానంద స్వామి ''మనం ఒకరికి ఏదైనా ఇస్తున్నామంటే మనం శక్తి మంతులమవుతున్నామని గుర్తుంచుకోవాలి. అందుకే మనం ఎవరికైనా ఏదైనా ఇవ్వడంలో సహజమైన ఆనందం వుంటుంది. తీసుకోవడం కన్నా ఇవ్వడంలో వున్న ఆనందం పదింతల గొప్పది'' అని ఇవ్వడంలో వున్న గొప్పదనాన్ని రాజుకు విశదీకరించి చెప్పినాడు.

ఆనంద రహస్యం ఇవ్వడంలోనూ.... దాన గుణంలోనూ వుందని గుర్తించిన రాజు మరిన్ని దానాలు చేయాలని నిర్ణయించుకుని స్వామి పాదాలకు నమస్కరించి తన రాజ్యానికి బయలుదేరాడు.

– ఆర్.సి. కృష్ణస్వామి రాజు

సినిమా

2025

నేటితో సగం పూర్తయింది. అయితే ఈ ప్రథమార్ధంలో వచ్చిన స్టార్ హీరోల చిత్రాల సంఖ్య తక్కువే. కానీ ద్వితీయార్ధం ధూమ్ ధామ్‌గా ఉండబోతోంది. పలువురు స్టార్స్ వెండితెరపైకి దూసుకు రావడానికి రెడీ అయ్యారు. సో... 2025 సెకండాఫ్ హీరోల అభిమానులకు పండగే. అలాగే హీరోయిన్ల ఫ్యాన్స్‌కి కూడా. 'ముందుంది మస్త్ మజా' అంటూ థియేటర్లకు రానున్న ఆ చిత్రాల గురించి...

ముందుంది మస్త్ మజా







ఈ ఏడాదే విశ్వంభర

ఈ ఏడాది సంక్రాంతికి విడుదల కావాల్సిన 'విశ్వంభర' వాయిదా పడింది. చిరంజీవి హీరోగా మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచరస్ ఫిల్మ్ ఇది. త్రిష హీరోయిన్‌గా నటించగా, ఆషికా రంగనాథ్, కునాల్ కపూర్ లీడ్ రోల్స్‌లో నటించారు. ఈ చిత్రంలో ఆంజనేయస్వామి భక్తుడు దొరబాబు పాత్రలో చిరంజీవి కనిపిస్తారని, 'విశ్వంభర' అనే పుస్తకం, 'విశ్వంభర' ప్రపంచం సినిమాలో కీలకంగా ఉంటాయని తెలిసింది. ప్రస్తుతం వీఎఫ్ఎక్స్ వర్క్స్‌తో యూనిట్ బిజీగా ఉంది. 'విశ్వంభర' ఈ ఏడాదే విడుదలయ్యే అవకాశం ఉంది.

అఖండ తాండవం

హీరో బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రానున్న తాజా చిత్రం 'అఖండ 2'. 2021లో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ'కు సీక్వెల్‌గా 'అఖండ 2: తాండవం' తెరకెక్కుతోంది. సంయుక్త ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ సినిమాలో ఆది పినిశెట్టి విలన్ రోల్ చేస్తున్నారని టీజర్ స్పష్టం చేస్తోంది. ఎం. తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబరు 25న రిలీజ్ కానుంది.

సైమన్ ఈజ్ కమింగ్

ధనుష్‌తో కలిసి 'కుబేర' సినిమాతో థియేటర్స్‌లోకి వచ్చారు నాగార్జున. శేఖర్ కమ్ముల దర్శకత్వంలోని ఈ మూవీలో నాగార్జున చేసిన లీడ్ రోల్ ప్రేక్షకులను మెప్పించింది. అయితే ఈసారి అంతకంటే ఎక్కువ ఇంపాక్ట్ ఉండే రోల్‌ని నాగార్జున 'కూలీ'లో చేశారు. రజనీకాంత్ హీరోగా నటించిన ఈ చిత్రంలో సైమన్ అనే పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నాగార్జున కనిపిస్తారు. నాగార్జున పూర్తి స్థాయి విలన్‌గా కనిపించనున్న ఈ సినిమా ఆగస్టు 14న రిలీజ్ కానుంది.









ఇటు వీరమల్లు... అటు ఓజీ

పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు, ఓజీ'... ఈ రెండు సినిమాలూ ఈ ఏడాదే విడుదల కాన్నాయి. 17వ శతాబ్దం నేపథ్యంలో సాగే 'హరిహర వీరమల్లు' రెండు భాగాలుగా రిలీజ్ కానుంది. తొలి భాగం 'హరిహర వీరమల్లు: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్'గా జూలై 24న విడుదల కానుంది. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నిధీ అగర్వాల్ హీరోయిన్. ఏయం రత్నం సమర్పణలో అద్దంకి దయాకర్ రావు నిర్మించారు. ఇక పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న మరో చిత్రం 'ఓజీ'. ఇందులో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్. ఈ గ్యాంగ్‌స్టర్ సినిమాను సుజీత్ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్ నిర్మిస్తున్నారు. సెప్టెంబరు 25న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

పోలీసాఫీసర్ లక్ష్మణ్ భేరీ

రవితేజ పోలీసాఫీసర్‌గా నటిస్తున్న చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో లక్ష్మణ్ భేరీ అనే పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో రవితేజ కనిపిస్తారు. 'ధమాకా' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో రవితేజ, హీరోయిన్ శ్రీలీల జంటగా నటిస్తున్న చిత్రం ఇది. షూటింగ్ దాదాపు పూర్తయింది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా ఆగస్టు 27న విడుదల కానుంది.

రాజా సాబ్ రెడీ

విష్ణు మంచు టైటిల్ రోల్ చేసిన 'కన్నప్ప' సినిమాలో రుద్రగా కనిపించి ప్రేక్షకులను అలరించారు ప్రభాస్. కాగా ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ది రాజా సాబ్' డిసెంబరు 5న విడుదల కానుంది. ఈ హారర్ కామెడీ యాక్షన్ సినిమాను మారుతి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్దికుమార్ హీరోయిన్లు. తాతా మనవళ్ల అనుబంధం నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో ప్రభాస్ తాతగా సంజయ్ దత్ కనిపిస్తారు.

ఆంధ్రా కింగ్ తాలూకా...

ఓ సినిమా హీరోకి, ఆ హీరో ఫ్యాన్‌కి మధ్యలో జరిగే సంఘటనలతో 'ఆంధ్రా కింగ్ తాలూకా' సినిమా రూపొందుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ చిత్రంలో హీరో అభిమానిగా రామ్, సినిమా స్టార్ సూర్యకుమార్‌గా ఉపేంద్ర కనిపిస్తారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం తాజా షెడ్యూల్ రాజమండ్రిలో ఆరంభమైంది. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలో స్పష్టత రానుంది.

సెంటిమెంటల్ తమ్ముడు

ఈ ఏడాది మార్చిలో నితిన్ నుంచి 'రాబిన్‌హుడ్' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. జూలైలో 'తమ్ముడు' సినిమాతో మరోసారి వస్తున్నారు నితిన్. అక్కా తమ్ముడు సెంటిమెంట్‌తో వస్తున్న ఈ సినిమాలో సప్తమీ గౌడ, వర్ష బొల్లమ్మ, లయ కీలక పాత్రధారులు. లయ తమ్ముడి పాత్రలో నితిన్ కనిపిస్తారు. వేణు శ్రీరామ్ దర్శకత్వంలో 'దిల్' రాజు నిర్మించిన ఈ చిత్రం జూలై 4న రిలీజ్ కానుంది.

త్వరలో కింగ్‌డమ్

విజయ్ దేవరకొండ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'కింగ్‌డమ్'. ఈ సినిమా రిలీజ్ పలుమార్లు వాయిదా పడింది. కొత్త రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి ఇంకా స్పష్టత రాలేదు కానీ జూలై చివర్లో లేదా ఆగస్టులో 'కింగ్‌డమ్' సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. ఈ మూవీలో విజయ్ దేవరకొండ క్యారెక్టర్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని తెలిసింది. అంతేకాదు... ఈ సినిమా రెండు డిఫరెంట్ టైమ్‌లైన్స్‌లో సాగుతుందని టాక్. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు.

ప్రేమికులు క్రైమ్ చేయాల్సి వస్తే!

ఈ ఏడాది మే 1న నాని హీరోగా చేసిన 'హిట్ 3' సినిమాలో అడవి శేష్ గెస్ట్ రోల్ చేశారు. ఇక ఆయన సోలో హీరోగా నటిస్తున్న 'డెకాయిట్: ఏ లవ్‌స్టోరీ' డిసెంబరు 25న రిలీజ్ కానుంది. ఈ క్రైమ్ లవ్‌స్టోరీ థ్రిల్లర్ మూవీలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, అనురాగ్ కశ్యప్ మరో లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. బ్రేకప్ చేప్పుకున్న ప్రేమికులు కలిసి ఓ క్రైమ్ చేయాల్సి వస్తే ఏం జరుగుతుంది? అన్నదే ఈ సినిమా కథనం అని తెలిసింది. సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ సినిమాకు సునీల్ నారంగ్ సహ-నిర్మాత.

కిష్కింధపురిలో...

బెల్లకొండ సాయిశ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'కిష్కింధపురి'. కౌశిక్ పెగల్లపాటి దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ హారర్ థ్రిల్లర్ చిత్రం ఈ ఏడాదే విడుదల కానుంది. అలాగే లుధీర్ బైరెడ్డి దర్శకత్వంలో 'హైందవ', సాగర్ కె. చంద్ర దర్శకత్వంలో 'టైసన్ నాయుడు' సినిమాలు కూడా చేస్తున్నారు సాయిశ్రీనివాస్. ఈ రెండు చిత్రాల్లో ఏదో ఒక చిత్రం ఈ ఏడాదే విడుదలయ్యే అవకాశం ఉంది.

సోషియో ఫ్యాంటసీ 'స్వయంభూ'

నిఖిల్ హీరోగా నటిస్తున్న పాన్-ఇండియా మూవీ 'స్వయంభూ'. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సోషియో ఫ్యాంటసీ చిత్రంలో నిఖిల్ ఒక యోధుడిగా కనిపించనున్నారు. ఈ చిత్రంలో సంయుక్త, నభా నటేశ్ హీరోయిన్లు. ఇందులో హీరో మాత్రమే కాదు... హీరోయిన్లు కూడా యాక్షన్ సన్నివేశాల్లో కనిపిస్తారు. 'ఠాగూర్' మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే విడుదలయ్యే అవకాశం ఉంది.

లవ్‌స్టోరీ తెలుసు కదా

ఈ ఏడాది వేసవిలో 'జాక్' సినిమాతో సిద్ధు జొన్నలగడ్డ థియేటర్స్‌కి వచ్చారు. ఇక ఈ దీపావళికి 'తెలుసు కదా' అనే లవ్‌స్టోరీతో రానున్నారు సిద్ధు. స్టైలిస్ట్ నీరజ కోన దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధీ శెట్టి హీరోయిన్లు. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 17న రిలీజ్ కానుంది. ముక్కోణపు ప్రేమకథగా 'తెలుసు కదా' ఉంటుందట.

ఏటిగట్టు సంబరాలు

సాయిదుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న యాక్షన్ మూవీ 'సంబరాల ఏటిగట్టు'. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రోహిత్ కేపీ దర్శకత్వంలో కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఐశ్వర్యా లక్ష్మి, అనన్య నాగళ్ల, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఆల్రెడీ 75 శాతం పూర్తయింది. ఈ సినిమా సెప్టెంబరు 25న రిలీజ్ కానుంది.

మిరాయ్ అడ్వెంచర్

'హను-మాన్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రం తర్వాత హీరో తేజ సజ్జా నటిస్తున్న అడ్వెంచరస్ యాక్షన్ మూవీ 'మిరాయ్'. ఈ సినిమాలో రితికా నాయక్ హీరోయిన్. మంచు మనోజ్ విలన్‌గా చేస్తున్నారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదల కానుంది. ఇంకా నవీన్‌చంద్ర 'షో టైమ్', ఆది సాయికుమార్ 'శంబాల', సుహాస్ 'ఓ భామ అయ్యో రామ'తో పాటు పలు మీడియమ్, స్మాల్ బడ్జెట్ చిత్రాలు ఈ ఏడాది విడుదల కానున్నాయి.

ఉమన్ పవర్



ఒకవైపు స్టార్ హీరోల చిత్రాలు వరుసగా విడుదలవుతుంటే... స్టార్ హీరోయిన్ల చిత్రాలూ దూసుకు వస్తున్నాయి. లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో తమ పవర్ చూపించడానికి అనుష్క, లావణ్యా త్రిపాఠి, రష్మికా మందన్నా వంటి తారలు రెడీ అయ్యారు.

- పగ, ప్రతీకారం తీర్చుకోవడానికి సిద్ధమైన ఓ బాధిత గిరిజన మహిళ నేర ప్రపంచంలోకి అడుగుపెట్టి, లెజెండ్‌గా ఎలా ఎదిగింది? అనే కథాంశంతో అనుష్క 'ఘాటీ' రూపొందింది. క్రిష్ దర్శకత్వంలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో జూలై 11న విడుదల కానుంది. ఈ చిత్రంలో తమిళ హీరో విక్రమ్ ప్రభు లీడ్ రోల్ చేశారు.



- కుటుంబ బంధాలను నిలపడానికి సతీ లీలావతి ఏం చేసింది? అనే కథాంశంతో రూపొందిన చిత్రం 'సతీ లీలావతి'. లావణ్యా త్రిపాఠి టైటిల్ రోల్ చేసిన ఈ చిత్రంలో దేవ్ మోహన్ ఆమె భర్త పాత్ర చేశారు. భార్యాభర్తల అనుబంధాన్ని ఎమోషనల్‌గా, ఎంటర్‌టైనింగ్‌గా చూపిస్తూ, తాతినేని సత్య ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఆనంది ఆర్ట్స్ సమర్పణలో నాగమోహన్ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. .



- స్టార్ హీరోల చిత్రాల్లోనూ గుర్తింపు తెచ్చుకునే పాత్రలు చేస్తూ దూసుకెళుతున్న రష్మికా మందన్నా నటించిన తొలి ఉమన్ సెంట్రిక్ మూవీ 'ది గర్ల్ ఫ్రెండ్'. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించిన ఈ చిత్రం విడుదల తేదీపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ చిత్రంలో దీక్షిత్ శెట్టి ఓ లీడ్ రోల్ చేశారు. ఈ ప్రేమకథా చిత్రంలో క్లిష్టమైన రిలేషన్‌షిప్‌ని ఎదుర్కొనే కాలేజీ విద్యార్థినిగా రష్మిక నటించారు. ఇక ఇది కాకుండా 'మైసా' అనే మరో ఫిమేల్ సెంట్రిక్ మూవీ కూడా రష్మిక డైరీలో ఉంది.



- అనుపమా పరమేశ్వరన్, దర్శనా రాజేంద్రన్, సంగీత ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'పరదా'. ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో విజయ్ డొంకాడ, పీవీ శ్రీనివాసులు, శ్రీధర్ మక్కువ ఈ సినిమాను నిర్మించారు. మూఢ నమ్మకాలు, మహిళా సాధికారిత వంటి అంశాలతో రూపొందిన 'పరదా' ఈ ఏడాదే రిలీజ్ కానుంది.
- ఇంకా కీర్తీ సురేష్ 'రివాల్వర్ రీటా' అంటూ టైటిల్ రోల్‌లో ఆగస్టు 27న థియేటర్స్‌కు రానున్నారు. జేకే చంద్రు దర్శకత్వంలో రూపొందిన ఈ తమిళ చిత్రం తెలుగులోనూ రిలీజ్ అయ్యే చాన్స్ ఉంది. అలాగే వరలక్ష్మి పోలీసాఫీసర్‌గా నటించిన 'పోలీస్ కంప్లైంట్' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. సంజీవ్ మేగోటి దర్శకత్వంలో సింగపూర్ బాలకృష్ణ, మల్లెల ప్రభాకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇంకా మరికొందరు నాయికలు లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లో తమ పవర్‌ని నిరూపించుకోనున్నారు.


కన్యారాశి టైమ్ వచ్చింది



తరుణ్ భాస్కర్, విశ్వక్ సేన్

హిట్ మూవీ 'ఈ నగరానికి ఏమైంది' (2018)కి సీక్వెల్‌గా 'ఈఎన్ఈ రిపీట్' సినిమా రానుంది. 'ఏలినాటి శని పోయింది.. కన్యారాశి టైమ్ వచ్చింది' అనేది ఈ సినిమా ట్యాగ్ లైన్. తొలి భాగంలో నటించిన విశ్వక్ సేన్, సాయి సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమఠం, వెంకటేశ్ కాకుమాను సీక్వెల్‌లోనూ నటించనున్నారు. తొలి భాగానికి దర్శకత్వం వహించిన తరుణ్ భాస్కర్ సీక్వెల్‌కు దర్శకత్వం వహించనున్నారు. డి. సురేష్‌బాబు, సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి ఈ సినిమాను నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమాకు సంగీతం: వివేక్ సాగర్.

ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ



నరేశ్ అగస్త్య

నరేశ్ అగస్త్య హీరోగా విపిన్ దర్శకత్వంలో ఉమా దేవి కోట నిర్మించిన చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమ కథ'. ఈ మ్యూజికల్ రొమాంటిక్ డ్రామాలో రబియా ఖతూన్ కథానాయికగా నటించారు. ఈ సినిమాను జూలై 17న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీతో రూపొందించిన ఈ చిత్రంలో మ్యూజిక్‌కి మంచి స్కోప్ ఉంది. జస్టిన్ ప్రభాకరన్ మంచి ట్యూన్స్ ఇచ్చారు. ఈ చిత్రం మంచి అనుభూతినిచ్చేలా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.



సెమీఫైనల్లో నిఖత్ జరీన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ తేజం, రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన నిఖత్ జరీన్ సొంతగడ్డపై జరుగుతున్న ఎలైట్ మహిళల బాక్సింగ్ టోర్నమెంట్‌లో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన 51 కేజీల కేటగిరీ క్వార్టర్ ఫైనల్లో నిఖత్ 5-0తో కల్పన (సాయ్)పై ఏకపక్ష విజయం సాధించింది. మాజీ యూత్ ప్రపంచ చాంపియన్ అంకుశిత బొరో (టాప్స్) కూడా సెమీఫైనల్‌కు చేరింది. 65 కేజీ కేటగిరీలో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆమె 5-0తో రాజస్తాన్ బాక్సర్ పార్థవిపై గెలిచింది. తెలంగాణ బాక్సర్లలో 65 కేజీల విభాగంలో యశి శర్మ 3-2తో సరిత రాయ్ (ఉత్తరప్రదేశ్)పై గెలుపొందగా, 60 కేజీల విభాగంలో గోనెళ్ల నిహారిక 5-0తో ప్రియాంక (ఛత్తీస్‌గఢ్)పై విజయం సాధించింది. అయితే నిరూపమ, చిలువేరు అపర్ణలకు క్వార్టర్స్‌లోనే చుక్కెదురైంది. 57 కేజీ కేటగిరీలో అపర్ణ 0-5తో కమల్జీత్ కౌర్ (ఏఐపీ) చేతిలో, 54 కేజీ కేటగిరీలో నిరూపమ 0-5తో తను (ఎస్ఎస్‌సీబీ) చేతిలో పరాజయం చవిచూశారు. 48 కేజీల్లో వహి వజీర్ 0-5తో మంజురాణి చేతిలో ఓడింది.



ఆయుశ్



తన్వీ

టైటిల్‌కు చేరువలో...

యూఎస్ ఓపెన్ టోర్నీ ఫైనల్లో ఆయుశ్, తన్వీ శర్మ

అయోవా (అమెరికా): ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) టూర్‌లో ఈ ఏడాది భారత క్రీడాకారులెవరూ 'సూపర్' స్థాయి టోర్నీల్లో టైటిల్ సాధించలేదు. అంతా అనుకున్నట్లు జరిగితే ... ఒకేసారి రెండు టైటిల్స్‌తో భారత షట్లర్లు 'డబుల్' ధమాకా సృష్టించే అవకాశముంది. ఏమాత్రం అంచనాలు లేకుండా యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీలో బరిలోకి దిగిన భారత యువ షట్లర్లు ఆయుశ్ శెట్టి, తన్వీ శర్మ టైటిల్‌కు కేవలం విజయం దూరంలో నిలిచారు. పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ 34వ ర్యాంకర్ ఆయుశ్ శెట్టి... మహిళల సింగిల్స్‌లో విభాగంలో ప్రపంచ 66వ ర్యాంకర్ తన్వీ శర్మ ఫైనల్లోకి దూసుకెళ్లారు. పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్లో ఆయుశ్ శెట్టి 21-23, 21-15, 21-14తో టాప్ సీడ్, ప్రపంచ ఆరో ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)పై సంచలన విజయం సాధించగా... 16 ఏళ్ల తన్వీ శర్మ 21-14, 21-16తో ఏడో సీడ్, ప్రపంచ 40వ ర్యాంకర్ పాలీనా (ఉక్రెయిన్)ను బోల్తా కొట్టించింది. ఫైనల్స్‌లో బ్రియాన్ యాంగ్ (కెనడా)తో ఆయుశ్; బీవెన్ జాంగ్ (అమెరికా)తో తన్వీ తలపడతారు. గత నెలలో శ్రీకాంత్ మలేసియా ఓపెన్ టోర్నీలో ఫైనల్‌కు చేరి రన్నరప్‌గా నిలవడమే ఈ ఏడాది భారత షట్లర్ల అత్యుత్తమ ప్రదర్శన. ఫైనల్లో ఆయుశ్, తన్వీ విజయం సాధిస్తే భారత్‌కు 'టైటిల్' లోటు తీరుతుంది.

ప్రొ లీగ్ నుంచి భారత జట్టు అవుట్

బెర్లిన్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్ నుంచి భారత మహిళల జట్టు నిష్క్రమించింది. ఆదివారం 2024-2025 సీజన్ ముగిసింది. చివరిదైన యూరోపియన్ అంచె పోటీల్లో ఆడిన అన్ని మ్యాచ్‌లు ఓడిపోయిన భారత్ చివరిదైన తొమ్మిదో స్థానంలో నిలిచి ప్రొ లీగ్ నుంచి అవుటైంది. చైనాతో జరిగిన ఆఖరి మ్యాచ్‌లో భారత్ 2-3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత జట్టుకు సునెలితా టొప్పో (9వ నిమిషంలో), రుతుజా (38వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. చైనా నుంచి జంగ్ ఇంగ్ (19వ, 39 నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... జు వెన్ యు (53వ నిమిషంలో) ఒక గోల్ సాధించింది. నిజానికి శనివారం చైనాతో జరిగిన తొలి మ్యాచ్ ఓటమితోనే ప్రొ లీగ్ బెర్త్ గల్లంతయ్యింది. అయితే అసాధ్యమైన భారీ గోల్స్ తేడాతో పేపర్లో ఉన్న అవకాశం తాజా పరాజయంతో దూరమైంది. తొమ్మిది జట్లు పోటీ పడిన ఈ లీగ్‌లో భారత్ 16 మ్యాచ్‌లాడి 10 పాయింట్లతో అట్టడుగున నిలిచింది. ఇలా ఆఖరి స్థానంలో నిలిచిన జట్టు ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్ నుంచి అనర్హతకు గురవుతుంది. మళ్లీ లీగ్‌లోకి అర్హత సంపాదించాలంటే వచ్చే ఏడాది ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో ఆడిన అందులో మెరుగైన స్థానం సాధిస్తేనే ప్రొ లీగ్ బెర్త్ లభిస్తుంది.


జొకోవిచ్ సాధించేనా?

రెండేళ్ల క్రితం యూఎస్ ఓపెన్‌లో విజేతగా నిలిచి సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ తన కెరీర్‌లో 24వ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ సాధించాడు. ఈ క్రమంలో టెన్నిస్ చరిత్రలోఅత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన ప్లేయర్‌గా మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియా) పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ సమం చేశాడు. మరొక్క గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధిస్తే జొకోవిచ్ ఎవరికీ సాధ్యం కాని ఘనతను తన పేరిట లిఖించుకుంటాడు. అయితే గత ఆరు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో ఈ సెర్బియా స్టార్‌కు నిరాశే ఎదురైంది. గతేడాది యూఎస్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లో నిష్క్రమించిన జొకోవిచ్ మిగతా ఐదు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో కనీసం సెమీఫైనల్ చేరుకున్నాడు. నిరుడు వింబుల్డన్ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించిన జొకోవిచ్ స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ దూకుడుకు రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకున్నాడు. ఈ సంవత్సరం ఆస్ట్రేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్‌లలో సెమీఫైనల్ చేరిన జొకోవిచ్ తనకెంతో కలిసొచ్చిన వింబుల్డన్ టోర్నీలో 'రికార్డు' టైటిల్‌ను అందుకోవాలని మరోసారి ప్రయత్నించనున్నాడు.

25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో సెర్బియా దిగ్గజం

అల్‌కరాజ్, సినెర్‌ల నుంచి గట్టిపోటీ ● నేటి నుంచి వింబుల్డన్ టోర్నీ

● మధ్యాహ్నం గం. 3:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



జొకోవిచ్

లండన్: గత ఆరు వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ఫైనల్ చేరుకున్నాడు. నాలుగుసార్లు గెలిచి, రెండుసార్లు రన్నరప్‌గా నిలిచాడు. ఏడోసారి కూడా టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకరిగా జొకోవిచ్ బరిలోకి దిగుతున్నాడు. నేటి నుంచి మొదలయ్యే ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో జొకోవిచ్ స్థాయికి తగ్గట్టు ఆడితే సెమీఫైనల్ వరకు చేరుకోవడం ఖాయం. అయితే తన 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కల నిజం కావాలంటే మాత్రం సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌ల్లో జొకోవిచ్ తన అత్యుత్తమ ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. అంతా అనుకున్నట్లు జరిగితే సెమీఫైనల్లో జొకోవిచ్ ప్రత్యర్థిగా ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ), ఫైనల్లో రెండో సీడ్, డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్) ఎదురవుతారు. గత రెండేళ్లలో జొకోవిచ్ తుది పోరులో అల్‌కరాజ్ చేతిలోనే ఓడిపోయి రన్నరప్ ట్రోఫీలతో సరిపెట్టుకున్నాడు. ఇప్పటికే ఏడుసార్లు వింబుల్డన్ చాంపియన్‌గా నిలిచిన 38 ఏళ్ల జొకోవిచ్ వచ్చే ఏడాదికల్లా ఏమేరకు ఫిట్‌గా ఉంటాడో చెప్పలేం. సినెర్, అల్‌కరాజ్ రూపంలో ఇద్దరు స్టార్స్ దూసుకురావడంతో జొకోవిచ్ 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నిజం కావాలంటే వింబుల్డన్‌కు మించిన మరో అవకాశం లేదనే చెప్పాలి. మంగళవారం జరిగే తొలి రౌండ్‌లో ప్రపంచ 40వ ర్యాంకర్ అలెగ్జాండర్ ముల్లర్ (ఫ్రాన్స్)తో జొకోవిచ్ ఆడనున్నాడు. మరోవైపు కెరీర్‌లో ఫైనల్ చేరిన ఐదు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ విజేతగా నిలిచిన అల్‌కరాజ్‌పై మరోసారి అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈసారి అల్‌కరాజ్ విజేతగా నిలిస్తే జాన్ బోర్గ్ (స్వీడన్), పీట్ సంప్రాస్ (అమెరికా), రోజర్ ఫెడరర్ (స్విట్జర్లాండ్), జొకోవిచ్ తర్వాత వింబుల్డన్ టోర్నీలో 'హ్యాట్రిక్ టైటిల్స్' నెగ్గిన ఐదో ప్లేయర్‌గా నిలుస్తాడు. నేడు జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌లో ఫాబియో ఫాగ్నిని (ఇటలీ)తో అల్‌కరాజ్ పోటీ పడతాడు. టాప్ సీడ్ సినెర్ తొలి రౌండ్‌లో తన దేశానికి చెందిన లుకా నార్డీతో ఆడతాడు.



అల్‌కరాజ్

ఈసారీ కొత్త చాంపియన్ వచ్చేనా!

మహిళల సింగిల్స్ విభాగంలో కచ్చితమైన ఫేవరెట్స్ ఎవరూ కనిపించడం లేదు. పచ్చిక కోర్టులపై జరిగే వింబుల్డన్ టోర్నీలో 2017 నుంచి ప్రతి ఏడాది మహిళల సింగిల్స్‌లో కొత్త చాంపియన్ అవతరించారు. ఈ నేపథ్యంలో డిఫెండింగ్ చాంపియన్ బార్బరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్) తన టైటిల్‌ను నిలబెట్టుకుంటుందా లేదో వేచి చూడాలి. తొలి రౌండ్‌లో ఫిలిప్పీన్స్ సంచలనం అలెగ్జాండ్రా ఇయాలాతో క్రెజికోవా తలపడుతుంది. ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ సబలెంకా (బెలారస్), రెండో సీడ్ కోకో గాఫ్ (అమెరికా)తోపాటు మాజీ చాంపియన్స్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్), రిబాకినా (కజకిస్తాన్), జాస్మిన్ పావోలిని (ఇటలీ), మాడిసన్ కీస్ (అమెరికా), స్వియాటెక్ (పోలాండ్) ఈసారి టైటిల్ రేసులో ఉన్నారు.



ఎదురులేని భారత్

ఆసియా కప్ మహిళల ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ టోర్నీలో రెండో విజయం

చియాంగ్ మాయ్ (థాయ్‌లాండ్): ఆసియా కప్-2026 మహిళల క్వాలిఫయింగ్ టోర్నీలో భారత ఫుట్‌బాల్ జట్టు జోరు కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో మంగోలియాపై 13-0తో నెగ్గిన భారత జట్టు... ఆదివారం రెండో మ్యాచ్‌లో 4-0తో తిమోర్ లెస్టెపై జయభేరి మోగించింది. టీమిండియా తరఫున మనీషా కల్యాణ్ (12వ, 80వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో చెలరేగగా... అంజు తమాంగ్ (58వ నిమిషంలో), లిండా కోమ్ సెర్టో (86వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. మ్యాచ్ ఆరంభం నుంచే సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన భారత్... తొలి అర్ధ భాగం ముగిసేసరికి 1-0తో ముందంజలో నిలిచింది. ద్వితీయార్ధంలోనూ ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా అదే జోరు కొనసాగిస్తూ ఏకపక్ష విజయం నమోదు చేసుకుంది. ఐదు జట్లు పోటీపడుతున్న గ్రూప్ 'బి'లో... ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ 6 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మ్యాచ్ ఆరంభమైన ఆరో నిమిషంలోనే భారత్‌కు చక్కటి అవకాశం దక్కగా... అంజు కొట్టిన బంతిని తిమోర్ లెస్టె గోల్ కీపర్ సమర్థవంతంగా అడ్డుకుంది. కాసేపటికి మనీషా గోల్‌తో భారత్ ఖాతా తెరవగా... ఆ తర్వాత కూడా మన స్ట్రయికర్లు ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై వరుస దాడులు కొనసాగించారు. ఈ క్రమంలో తెలంగాణ ప్లేయర్ గుగులోత్ సౌమ్య, ప్యారీ జక్సా కొట్టిన షాట్లు గురితప్పడంతో టీమిండియాకు మరింత ఆధిక్యం దక్కే అవకాశం చేజారింది. తదుపరి మ్యాచ్‌లో బుధవారం ఇరాక్‌తో భారత్ తలపడుతుంది. చివరిసారి భారత జట్టు 2003లో ఆసియా కప్ ప్రధాన టోర్నీలో ఆడింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఇస్రోలో 39 సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) వివిధ విభాగాల్లో సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 39.
» **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, ఆర్కిటెక్చర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **గరిష్ఠ వయోపరిమితి:** 14.07.2025 నాటికి 28 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.56,100.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**14.07.2025
» **వెబ్‌సైట్:** https://www.isro.gov.in

బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్‌లో 32 సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులు

బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్ వివిధ విభాగాల్లో సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 32.
» **విభాగాలు:** మెకానికల్, కెమికల్, పెట్రోకెమికల్, ఎలక్ట్రికల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.23,000 నుంచి 26,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.07.2025
» **పరీక్ష కేంద్రాలు:** సిల్వస్సా, దాద్రానగర్ హవేలీ అండ్ డామన్ డయ్యు, తలోజ, గ్రేటర్ ముంబై, మహారాష్ట్ర, చెన్నై, తమిళనాడు, కోల్‌కతా, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ.
» **వెబ్‌సైట్:** www.balmerlawrie.com

ఎఫ్ఎస్ఐ, డెహ్రాడూన్‌లో 15 టెక్నికల్ అసోసియేట్ పోస్టులు

డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్)లోని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఐ).. ఒప్పంద ప్రాతిపదికన టెక్నికల్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15.
» **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్ విభాగంలో పీజీ లేదా ఎంసీఏ, ఎంఎస్సీ(ఐటీ/కంప్యూటర్ సైన్స్)/బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణతతో పాటు డిప్లొమా లేదా రిమోట్ సెన్సింగ్/జీఐఎస్ సర్టిఫికేట్ కోర్సు కలిగి ఉండాలి. ఇంటర్మీడియట్ స్థాయిలో ఫిజిక్స్ సబ్జెక్టు చదివి ఉండాలి.
» **వయసు:** 15.06.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.37,000.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్, విద్యార్హతలు, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025.
» **వెబ్‌సైట్:** https://fsi.nic.in

డీఎంహెచ్‌వో అన్నమయ్య జిల్లాలో 1294 ఆశా వర్కర్ పోస్టులు

అన్నమయ్య జిల్లా వైద్య-ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మహిళా అభివృద్ధి కోసం గ్రామీణ ప్రాంతాల్లో ఏఎస్‌హెచ్‌ఏ(అక్రెడిటేడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్ట్) వర్కర్ల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది. గ్రామీణ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1294.
» **అర్హత:** అభ్యర్థి సంబంధిత గ్రామానికి నివాసిగా ఉండాలి. కనీసం పదో తరగతి పాసై ఉండాలి. మెరుగైన సంచార నైపుణ్యాలు, ప్రజలతో కలిసిమెలసి పని చేయగల సామర్థ్యం అవసరం.
» **వయసు:** 25 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్థానికత, విద్యార్హత, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025.
» **వెబ్‌సైట్:** http://annamayya.ap.gov.in

ఇంటర్‌తో కేంద్ర కొలువు

ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతోనే కేంద్ర ప్రభుత్వ కొలువు కోరుకునే వారికి సువర్ణావకాశం! కేంద్ర ప్రభుత్వ నియామకాల సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ).. కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవెల్ ఎగ్జామ్ 2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా మొత్తం 3131 గ్రూప్ సీ స్థాయి పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్సీ సీహెచ్ఎస్ఎల్ 2025 ద్వారా భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, వేతనాలు తదితర వివరాలు..

» కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవెల్ ఎగ్జామ్ 2025 నోటిఫికేషన్
» మొత్తం 3131 గ్రూప్ సీ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ

ఎస్ఎస్సీ విడుదల చేసిన కంబైన్డ్ సెకండరీ లెవెల్ ఎగ్జామినేషన్ 2025 ద్వారా.. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వశాఖలు/విభాగాలు/కార్యాలయాల్లో లోయర్ డివిజనల్ క్లర్క్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణతతో ఈ పోస్టులకు పోటీ పడొచ్చు. అర్హత ఉన్న వారు జూలై 18వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **పరీక్ష:** ఎస్ఎస్సీ కంబైన్డ్ హయ్యర్ సెకండరీ లెవెల్ ఎగ్జామ్ 2025
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 3131

పోస్టుల వివరాలు

డేటా ఎంట్రీ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్ ఏ, లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జేఎస్ఏ).

అర్హతలు

కేంద్ర వినియోగదారులు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ, కేంద్ర సాంస్కృతిక శాఖ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లోని డేటా ఎంట్రీ ఆపరేటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్ ఏ పోస్టులకు ఇంటర్మీడియెట్‌లో సైన్స్ గ్రూప్‌తో మ్యాథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. మిగతా అన్ని పోస్టులకు ఏదైనా గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన అర్హత ఉండాలి. ఇంటర్మీడియెట్ ఫైనల్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు 01.01.1026 నాటికి అర్హత కోర్సు పూర్తి చేసుకోవాలి.

వయసు

01.01.1026 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. అంటే 02.01.1999 నుంచి 01.01.2008 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు 10ఏళ్లు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనాలు

- **లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ)/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్(జేఎస్ఏ):** పే లెవెల్-2 రూ.19,900- రూ.63,200
- **డేటా ఎంట్రీ ఆపరేటర్:** పే లెవెల్-4 రూ.25,500 -రూ.81,100, పే లెవెల్-5 రూ.29,200-రూ.92,300
- **డేటా ఎంట్రీ ఆపరేటర్ గ్రేడ్ ఏ:** పే లెవెల్ -4 రూ.25,500-రూ.81,100

ఎంపిక విధానం

టైర్ 1, టైర్ 2 పరీక్షలు, స్కిల్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపిక చేస్తారు.


పరీక్ష విధానం

టైర్ 1 పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో 100 ప్రశ్నలు- 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో నాలుగు విభాగాల నుంచి మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (బేసిక్ నాలెడ్జ్)లో 25 ప్రశ్నలు- 50 మార్కులకు, జనరల్ ఇంటెలిజెన్స్‌లో 25 ప్రశ్నలు- 50 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్(బేసిక్ అరిథమెటిక్ స్కిల్స్) నుంచి 25 ప్రశ్నలు-50 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్‌పై 25 ప్రశ్నలు-50 మార్కులకు అడుగుతారు. పరీక్ష సమయం 60 నిమిషాలు. ప్రశ్న హిందీ/ఇంగ్లిష్‌లో ఉంటుంది. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.50 మార్కులు తగ్గిస్తారు.

టైర్2లో నాలుగు సెక్షన్‌లు

- టైర్ 2 పరీక్ష ప్రశ్న పత్రంలో నాలుగు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్ 1లో మ్యాథమెటికల్ ఎబిలిటీస్ నుంచి 30 ప్రశ్నలు, రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్ నుంచి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 60 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 180 మార్కులకు సెక్షన్ 1 జరుగుతుంది. ఈ సెక్షన్‌కు కేటాయించిన సమయం ఒక గంట.
- అదేవిధంగా సెక్షన్ 2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌పై 40 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్‌పై 20 ప్రశ్నలు.. మొత్తం 60 ప్రశ్నలు ఉంటాయి. వీటికి ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున మొత్తం 180 మార్కులు కేటాయించారు. ఈ సెక్షన్‌కు కేటాయించిన సమయం ఒక గంట.
- సెక్షన్ 3లో కంప్యూటర్ నాలెడ్జ్ టెస్ట్ ఉంటుంది. ఇందులో మొత్తం 15 ప్రశ్నలు.. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 45 మార్కులు ఉంటాయి. దీనికి కేటాయించిన పరీక్ష సమయం 15 నిమిషాలు. ఈ పరీక్షకు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. అయితే ఇది అర్హత పరీక్ష మాత్రమే. ఇందులో సాధించిన మార్కులను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు.
- సెక్షన్ 4లో స్కిల్ టెస్ట్/టైపింగ్ టెస్ట్ ఉంటాయి. ఇది అర్హత పరీక్ష మాత్రమే.
- సెక్షన్1, 2, 3ల్లో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

ఎస్ఎస్సీ జాబ్స్



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 18.07.2025
- **దరఖాస్తులకు సవరణ తేదీలు:** జూలై 23, 24
- **టైర్1(సీబీటీ) పరీక్ష తేదీ:** 08.09.2025 నుంచి 18.09.2025
- **టైర్ 2(సీబీటీ)పరీక్ష తేదీ:**ఫిబ్రవరి-మార్చి 2026
- **వెబ్‌సైట్:** https://ssc.gov.in

ప్రిపరేషన్ ఇలా

- టైర్ 1 పరీక్ష సిలబస్‌లో ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్‌పై ప్రశ్నలు అడుగుతారు.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో.. స్పాటింగ్ ద ఎర్రర్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, సినానిమ్స్/హోమోనిమ్స్, ఆంటోనిమ్స్, స్పెల్లింగ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్, యాక్టివ్/పాసివ్ వాయిసెస్ ఆఫ్ వెర్బ్స్, కన్వర్షన్ ఇంటు డైరెక్ట్/ఇన్‌డైరెక్ట్ నెరేషన్, షఫ్లింగ్ ఆఫ్ సెంటెన్స్ పార్ట్స్, షఫ్లింగ్ ఆఫ్ సెంటెన్సెస్ ఇన్ ప్యాసెజ్, క్లోజ్ ప్యాసెజ్, కాంప్రెహెన్షన్ ప్యాసెజ్‌లపై ప్రశ్నలు ఉంటాయి.
- జనరల్ ఇంటెలిజెన్స్ విభాగంలో.. వెర్బల్, నాన్ వెర్బల్ టైప్ ప్రశ్నలు అడుగుతారు. ఇందులో సిమాంటిక్ అనాలజీ, సింబాలిక్ ఆపరేషన్స్, సింబాలిక్/నంబర్ అనాలజీ, ట్రెండ్స్, ఫైనల్ అనాలజీ, స్పేస్ ఓరియెంటేషన్, సిమాంటిక్ క్లాసిఫికేషన్, వెన్ డయాగ్రమ్స్, సింబాలిక్/నంబర్ క్లాసిఫికేషన్, డ్రాయింగ్ ఇన్ఫరెన్సెస్, ఫిగరల్ క్లాసిఫికేషన్, పంచడ్ హోల్/ప్యాట్రన్ ఫోల్డింగ్ -అన్ ఫోల్డింగ్, సిమాంటిక్ సిరీస్, ఫిగరల్ ప్యాట్రన్ ఫోల్డింగ్ అండ్ కంప్లీషన్, నంబర్ సిరీస్, ఎంబెడెడ్ ఫిగర్స్, ఫిగరల్ సిరీస్, క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లం సాల్వింగ్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, వర్డ్ బిల్డింగ్, సోషల్ ఇంటెలిజెన్స్, కోడింగ్ -డీకోడింగ్, న్యూమరికల్ ఆపరేషన్స్ తదితర అంశాలపై ప్రశ్నలు అడుగుతారు.
- క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ విభాగంలో.. నంబర్ సిస్టమ్, అరిథమెటికల్ ఆపరేషన్స్, ఆల్జీబ్రా, జామెట్రీ, మెన్సురేషన్, ట్రిగనోమెట్రీ, స్టాటిస్టికల్ చార్ట్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- జనరల్ అవేర్‌నెస్ విభాగంలో.. అభ్యర్థికి తన చుట్టూ జరుగుతున్న పరిణామాలపై ఉన్న అవగాహనను పరీక్షించేలా ప్రశ్నలు అడుగుతారు. అంతర్జాతీయంగా, జాతీయంగా, ప్రాంతీయంగా తాజా సంఘటనలు, కరెంట్ అఫైర్స్, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, భారత చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.
- టైర్ 2లో మ్యాథమెటికల్ ఎబిలిటీస్, రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్, జనరల్ అవేర్‌నెస్, కంప్యూటర్ నాలెడ్జ్/ప్రొఫిసియన్సీపై లోతుగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉంటుంది.
- అభ్యర్థులు తొలుత సిలబస్‌ను విశ్లేషించి.. గత ప్రశ్న పత్రాల ఆధారంగా ఎక్కువ వెయిటేజీ ఉన్న టాపిక్స్‌పై ప్రధానంగా దృష్టి సారించాలి. మొదట సిలబస్‌లోని ఆయా టాపిక్స్‌కు సంబంధించిన ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. అనంతరం సాధ్యమైనన్ని ఎక్కువ మోడల్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. కరెంట్ అఫైర్స్ కోసం ప్రతి రోజూ ఏదైనా ఒక ప్రామాణిక దినపత్రికను అనుసరించడం మేలు చేస్తుంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- కెమిస్ట్రీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-ఇండియన్ జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-రీజనింగ్

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	303	84,059
నిఫ్టీ ▲	89	25,638

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	20,274	▲	105
డోజోన్స్	43,819	▲	432
ఎఫ్‌టీఎస్ఈ 100	8,799	▲	63
డాక్స్	24,033	▲	384
హాంగ్‌షెంగ్	3,424	▼	24
నికాయ్	40,151	▲	566

●అమెరికా ●బ్రిటన్ ●జర్మనీ ●చైనా ●జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.30	119.17
€	యూరో	ఎస్‌బీఐ	98.86	101.60
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.56	60.09
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.01	57.23
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.74	69.44
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.89	23.40
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.38	24.16
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.05	12.87

రూపాయి లేకపోయినా.. యూపీఐ చెల్లింపులు!

రూపే క్రెడిట్ కార్డుతో చక్కని వెసులుబాటు

జీపే, ఫోన్‌పే, పేటీఎంతో అనుసంధానం ● ప్రతీ రూ.100 చెల్లింపులపై రివార్డులు
బ్యాంకుల మధ్య పోటీతో మెరుగైన ప్రోత్సాహకాలు ● అన్నీ తెలుసుకున్న తర్వాతే ఎంపిక



ప్రీతి ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. వేతనంతోపాటు ఖర్చులూ ఎక్కువే. దీంతో క్రెడిట్ కార్డును వినియోగిస్తోంది. దీనిపై రివార్డు పాయింట్లతో పాటు, తర్వాత చెల్లించే వెసులుబాటు ఆమెకు సౌకర్యంగా అనిపించింది. కానీ, చిన్న చిన్న చెల్లింపులకు, కొన్ని షాపుల్లో క్రెడిట్ కార్డు స్వైప్‌నకు అవకాశం ఉండకపోవడం అసౌకర్యంగా భావించింది. ఇదే సమయంలో రూపే కార్డు గురించి విన్న ఆమె వెంటనే దానికి దరఖాస్తు చేసుకుంది. రూపే క్రెడిట్ కార్డు అయితే యూపీఐకి లింక్ చేసుకుని సులభంగా చెల్లించడం ప్రీతిని ఎంతగానో ఆకర్షించింది. ఇప్పుడు దాదాపు అన్ని చెల్లింపులను రూపే కార్డు నుంచే చేస్తోంది. నిజమే సాధారణ క్రెడిట్ కార్డులతో పోల్చితే.. రూపే క్రెడిట్ కార్డుతో ఎక్కడైనా యూపీఐ ద్వారా సులభంగా చెల్లింపులకు అవకాశం ఉండడం ఎంతో మందికి అనుకూలించే అంశం. ఇందుకు ఆర్‌బీఐ ఎప్పుడో అవకాశం కల్పించింది. ఈ కార్డ్‌తో వచ్చే ప్రయోజనాలు, రిస్కుల గురించి అవగాహన కల్పించే కథనమే ఇది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

అన్ని క్రెడిట్ కార్డుల మాదిరే యూపీఐ కార్డు కూడా పనిచేస్తుంది. ఒక్క రూపే క్రెడిట్ కార్డ్‌ను మాత్రం యూపీఐతో లింక్ చేసుకుని సులభంగా చెల్లింపులు చేసుకోవచ్చు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా రూపే క్రెడిట్ కార్డు చెల్లింపులకు అనుమతిస్తూ 2022 జూలైలోనే ఆర్‌బీఐ నిర్ణయం ప్రకటించింది. నాన్ రూపే క్రెడిట్ కార్డులకు ఈ వెసులుబాటు లభించలేదు. దాంతో రూపే క్రెడిట్ కార్డులు ఆకర్షణీయంగా మారాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉన్న క్రెడిట్ కార్డులకు బ్యాంకులు అదనపు (యాడ్-ఆన్) రూపే కార్డులను ఇవ్వడం ప్రారంభించాయి. కొన్ని బ్యాంకులు ఇప్పుడు నేరుగా కో-బ్రాండెడ్, సొంత రూపే కార్డులనే కొత్త కస్టమర్లకు జారీ చేస్తున్నాయి. సాధారణంగా యూపీఐ చెల్లింపులు ఏ ప్లాట్‌ఫామ్ ద్వారా చేసినా.. బ్యాంక్ ఖాతా నుంచే ఆ మొత్తం వెళుతుంది. రూపే క్రెడిట్ కార్డును అనుసంధానం చేసుకుంటే.. యూపీఐ చెల్లింపుల సమయంలో బ్యాంక్ ఖాతా లేదంటే రూపే క్రెడిట్ కార్డును ఎంపిక చేసుకుని లావాదేవీలను పూర్తి చేయొచ్చు.

అనుకూలతలు

రూపే క్రెడిట్ కార్డుతో ఉన్న ప్రధాన సౌకర్యం.. కార్డును వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. ఎందుకంటే చెల్లింపుల సమయంలో స్వైప్ చేయాల్సిన అవసరాన్ని ఇది తప్పిస్తుంది. యూపీఐ యాప్‌నకు ఒక్కసారి లింక్ చేస్తే చాలు. భౌతిక కార్డు లేకుండానే లావాదేవీ ముగించొచ్చు. పీవోఎస్‌పై క్రెడిట్ కార్డు స్వైప్‌నకు కొందరు వర్తకులు అంగీకరించరు. మర్చంట్ డిస్కౌంట్ రేటు చెల్లించాల్సి వస్తుందని సుముఖత చూపించరు. రూపే క్రెడిట్ కార్డు విషయంలో యూపీఐ ద్వారా చెల్లిస్తారు కనుక ఈ ఇబ్బంది ఉండదు. ఒక రూపే క్రెడిట్ కార్డును ఒకటికి మించి యూపీఐ యాప్‌లపై లింక్ చేసుకోవచ్చు. బ్యాంక్ ఖాతాలో బ్యాలన్స్ లేని సందర్భాల్లోనూ రూపే క్రెడిట్ కార్డు సాయంతో చెల్లింపులు చేయొచ్చు. ఎంత చిన్న మొత్తం అయినా క్యూఆర్ కోడ్‌పై స్కాన్ చేసి చెల్లించొచ్చు. దీనివల్ల ప్రతీ లావాదేవీ బ్యాంక్ ఖాతాలో బదులు క్రెడిట్ కార్డు, యూపీఐ ప్లాట్‌ఫామ్‌లో నమోదవుతుంది. బ్యాంక్ ఖాతాలో చిన్న చిన్న లావాదేవీలు లేకుండా చేసుకోవచ్చు.

యూపీఐ క్రెడిట్ కార్డుపై ఇప్పుడు చాలా బ్యాంక్‌లు ఆకర్షణీయమైన ప్రయోజనాలను అందిస్తున్నాయి. వీటన్నింటినీ పరిశీలించాక మెరుగైన ప్రయోజనాలతో కూడిన కార్డ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. బ్యాంకుల మధ్య ఈ ప్రయోజనాలు, ఫీజులు వేర్వేరుగా ఉన్నాయి. ప్రతి రూ.100 వ్యయంపై సాధారణంగా ఒక పాయింటు రివార్డుగా లభిస్తుంది. ఉదాహరణకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ అయితే.. 'ఫస్ట్ డిజిటల్ రూపే క్రెడిట్ కార్డు'పై రూ.2,000 లావాదేవీపై రూ.60 రివార్డు పాయింట్లను ఆఫర్ చేస్తోంది. ఈ రివార్డు పాయింట్లతో బహుమతులు కొనుగోలు చేసుకోవచ్చు. లేదంటే డిస్కౌంట్ పొందొచ్చు. కొన్ని బ్యాంక్‌లు క్యాష్‌బ్యాక్ ఆఫర్ చేస్తున్నాయి. సకాలంలో బిల్లు చెల్లింపులు చేయడం ద్వారా క్రెడిట్ స్కోరును బలోపేతం చేసుకోవచ్చు. దీని వల్ల భవిష్యత్తులో రుణాలను సులభంగా చౌక రేటుకే పొందొచ్చు. రోజువారీ యూపీఐ చెల్లింపులు చేసే వారికి రూపే క్రెడిట్ కార్డు ఎంతో సౌకర్యం, అనుకూలం. ఒక యూపీఐ యాప్‌పై ఎన్ని రూపే క్రెడిట్‌కార్డులను అయినా లింక్ చేసుకోవచ్చు. ఇందుకు ఎలాంటి చార్జీలు ఉండవు.

పరిమితులు

- రూపే క్రెడిట్ కార్డుతో ఒక వ్యక్తి మరో వ్యక్తికి యూపీఐ ద్వారా నగదు బదిలీకి అవకాశం లేదు.
- క్రెడిట్ కార్డు ద్వారా యూపీఐ యాప్ నుంచి చెల్లింపులకు పిన్ తప్పనిసరి. పిన్ లేకుండా చెల్లింపులు కేవలం యూపీఐ లైట్ ద్వారానే సాధ్యం. యూపీఐ లైట్‌లో బ్యాలన్స్ లోడ్ చేసుకోవడం అన్నది రూపే క్రెడిట్ కార్డుతో సాధ్యపడదు. కేవలం యూపీఐ లింక్ సేవింగ్స్ ఖాతా నుంచే చేసుకోవాల్సి ఉంటుంది.
- యూపీఐ ద్వారా రూపే క్రెడిట్ కార్డు నుంచి ఒక రోజులో గరిష్ఠంగా రూ.లక్ష వరకే చెల్లించగలరు. ఎందుకంటే దాదాపు అన్ని యూపీఐ యాప్‌లు, బ్యాంక్‌లు రోజువారీ యూపీఐ పరిమితి రూ.లక్షగానే అమలు చేస్తున్నాయి. విడిగా రూపే క్రెడిట్ కార్డు రోజువారీ లిమిట్ ఇంకా తక్కువ ఉండొచ్చు. రూ.లక్షకు మించి ఉన్నప్పటికీ యూపీఐ ద్వారా రూ.లక్ష వరకే చెల్లింపులు చేయగలరు.
- విద్య, ఆరోగ్యం, బీమా తదితర కొన్ని విభాగాల చెల్లింపులకు రోజువారీ యూపీఐ పరిమితి రూ.లక్షకు బదులు రూ.2 లక్షలుగా ఉంటుంది.
- విదేశీ ప్రయాణాలు చేసే వారికి రూపే క్రెడిట్‌కార్డు కంటే రెగ్యులర్ కార్డులు అనుకూలం.
- రూపే క్రెడిట్ కార్డుతో ఫ్యుయెల్ స్టేషన్లలో చెల్లింపులు చేస్తే సర్‌చార్జీ పడుతుంది. చాలా బ్యాంక్‌లు వీటిని మాఫీ చేస్తున్నాయి.

క్రెడిట్ లిమిట్

కార్డు వినియోగ పరిమితి (రుణం) వ్యక్తిగత రుణ చరిత్ర, ఆదాయంపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయంలో రెగ్యులర్ క్రెడిట్ కార్డులకు వర్తించే నిబంధనలే వీటికీ అమలవుతాయి. కొన్ని బ్యాంక్‌లు ఆరంభంలో తక్కువ లిమిట్‌తో కార్డులు జారీ చేస్తాయి. వినియోగ తీరు, చెల్లింపుల ఆధారంగా భవిష్యత్తులో ఈ లిమిట్‌ను క్రమంగా పెంచుకునేందుకు అనుమతిస్తుంటాయి.



కొన్ని భద్రతా చర్యలు

- రూపే క్రెడిట్ కార్డు చెల్లింపులను ప్రతి రోజూ ఒకసారి పరిశీలించుకోవాలి. కార్డు స్టేట్‌మెంట్‌ను చూడడం వల్ల ఏవైనా మోసపూరిత లావాదేవీలు ఉంటే వెంటనే గుర్తించొచ్చు.
- యూపీఐ యాప్‌లకు తప్పకుండా ఫింగర్‌ప్రింట్ లేదా పిన్ నంబర్ పెట్టుకోవాలి. పిన్ అయితే ఊహించడానికి సులభంగా ఉండకూడదు.
- యూపీఐ చెల్లింపులకు పేరొందిన గూగుల్ పే, ఫోన్‌పే, అమెజాన్ పే, పేటీఎం, బ్యాంక్ యూపీఐ యాప్‌లను వినియోగించడం మంచిది.

చార్జీలు

- రూపే కార్డుతో చేసే యూపీఐ చెల్లింపులపై ఎలాంటి చార్జీల్లేవు. కానీ, కొన్ని యూపీఐ ప్లాట్‌ఫామ్‌లు రూపే కార్డు ఆధారిత యూపీఐ చెల్లింపులు, రీచార్జ్‌లపై కన్వీనియెన్స్ చార్జీలు విధించొచ్చు.
- క్రెడిట్ బిల్లును సకాలంలో చెల్లించకపోతే లేట్ పేమెంట్ చార్జీలు పడతాయి. గడువులోపు చెల్లించని మొత్తంపై వడ్డీ 18 శాతం నుంచి 48 శాతం మధ్య పడుతుంది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ అయితే క్రెడిట్ స్కోరు ఆధారంగా 9 శాతం రేటును కూడా ఆఫర్ చేస్తోంది. అదే యాక్సిస్ బ్యాంక్ అయితే నెలవారీ 45 శాతం వడ్డీ రేటును యూపీఐ క్రెడిట్‌పై అమలు చేస్తోంది.
- కొన్ని చెల్లింపులను ఈఎంఐ కింద మార్చుకునేందుకు బ్యాంక్‌లు అనుమతిస్తుంటాయి. అలాంటి సమయంలో రెగ్యులర్ క్రెడిట్‌కార్డుల మాదిరే ప్రాసెసింగ్ ఫీజు పడుతుంది.
- కొన్ని బ్యాంక్‌లు జీవితకాలం పాటు ఎలాంటి వార్షిక ఫీజులు లేకుండా రూపే కార్డులను ఆఫర్ చేస్తున్నాయి. కొన్ని వార్షిక చార్జీలు అమలు చేస్తున్నాయి.

కార్డులు - ప్రయోజనాలు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యూపీఐ రూపే క్రెడిట్ కార్డ్

- పేజాప్ (హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాప్), గ్రోసరీలు, సూపర్ మార్కెట్, డైనింగ్, యూపీఐ లావాదేవీలపై 3 శాతం క్యాష్ రివార్డు పాయింట్లు లభిస్తాయి. నెలవారీ గరిష్ఠ పాయింట్లు 500.
- యుటిలిటీ చెల్లింపులపై 2 శాతం క్యాష్ పాయింట్లు (నెలకు గరిష్ఠంగా రూ.500), ఇతర వ్యయాలపై 1 శాతం క్యాష్ పాయింట్లు (నెలవారీ గరిష్ఠ పాయింట్లు 500) లభిస్తాయి.
- ఏడాదిలో కార్డుపై వ్యయం కనీసం రూ.25వేలు చేస్తే వార్షిక ఫీజు మాఫీ అవుతుంది.

మింత్రా కోటక్ క్రెడిట్ కార్డు

- మింత్రాపై రూ.750 వరకు లావాదేవీలపై 7.5 శాతం తగ్గింపు లభిస్తుంది.
- స్విగ్గీ, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్, పీవీఆర్, క్లియర్‌ట్రిప్, అర్బన్ కంపెనీ ప్లాట్‌ఫామ్‌లపై నెలలో రూ.1,000 వరకు చేసే వ్యయాలపై 5 శాతం క్యాష్ బ్యాక్ లభిస్తుంది.
- ఇతర లావాదేవీలపై 1.25 అపరిమిత క్యాష్ బ్యాక్ లభిస్తుంది.
- త్రైమాసికంలో కార్డుపై వ్యయం రూ.50,000 తక్కువ కాకుండా ఉంటే, రెండు పీవీఆర్ టికెట్లు (ఒక్కోటీ రూ.250 చొప్పున) ఉచితంగా లభిస్తాయి.

యస్ బ్యాంక్ పైసా బజార్ పైసాసేవ్ క్రెడిట్ కార్డు

- ఆన్‌లైన్ కొనుగోళ్లపై 3 శాతం క్యాష్ బ్యాక్ పాయింట్లు (నెలకు గరిష్ఠంగా 5,000 పాయింట్లు) అందుకోవచ్చు. 5,000 పాయింట్ల పరిమితి తర్వాత చేసే చెల్లింపులపై 1.5 శాతం క్యాష్ బ్యాక్ పాయింట్లు వస్తాయి.
- ఇతర చెల్లింపులు, యూపీఐ చెల్లింపులపై 1.5 శాతం క్యాష్ బ్యాక్ పాయింట్లు లభిస్తాయి.
- ఈ పాయింట్లను క్రెడిట్ బిల్లులో సర్దుబాటు చేసుకోవచ్చు.
- ఏడాదిలో రూ.1.2 లక్షల వ్యయం చేస్తే రెన్యువల్ ఫీజు రూ.499 మాఫీ అవుతుంది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ డిజిటల్ రూపే క్రెడిట్ కార్డు

- జాయినింగ్ ఫీజు రూ.200, రెండో ఏడాది నుంచి వార్షిక ఫీజు రూ.199 అమలవుతుంది.
- రూ.2,000లోపు యూపీఐ చెల్లింపులపై ఒక శాతం రివార్డులు, రూ.2,000 మించి చేసే చెల్లింపులపై 3 శాతం రివార్డు పాయింట్లు లభిస్తాయి.
- అన్ని యుటిలిటీ, బీమా చెల్లింపులపై ఒక శాతం రివార్డు పాయింట్లు లభిస్తాయి.

హిందుస్తాన్ జింక్ | బ్రోకరేజ్: దోలట్ క్యాపిటల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 451 టార్గెట్: రూ. 564



ఎందుకంటే: మైనింగ్ రంగ దేశీ దిగ్గజం హిందుస్తాన్ జింక్ రెండేళ్ల కాలంలో ఎకనమిక్ విలువ(ఈవీ), నిర్వహణ లాభం(ఇబిటా) అంచనాల ప్రకారం 10 రెట్లు విలువ ప్రాతిపదికన కొనుగోలుకి సిఫారసు చేస్తూ టార్గెట్ ధరను నిర్ణయించాం. భారత్‌తోపాటు.. ప్రపంచంలోనే జింక్ ఉత్పత్తికి సమీకృత సౌకర్యాలున్న అతిపెద్ద కంపెనీ ఇది! అంతేకాకుండా వెండి(సిల్వర్) తయారీలోనూ ప్రపంచవ్యాప్తంగా టాప్-5 దిగ్గజాలలో ఒకటిగా నిలుస్తోంది! అంతర్జాతీయంగా జింక్ మైనింగ్‌లో తొలితరం కంపెనీగానేకాకుండా అత్యంత తక్కువ వ్యయంతో ఉత్పత్తి చేస్తున్న కంపెనీగా అవతరించింది. దీర్ఘకాలిక లక్ష్యంలో భాగంగా బేస్ మెటల్ తయారీ సామర్థ్యాన్ని 2,000 కేటీపీఏకు పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తోంది. దీంతోపాటు 2030కల్లా సిల్వర్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సైతం ప్రస్తుతం 800 టీపీఏ నుంచి 1,500 టీపీఏకు పెంచుకునే సన్నాహాల్లో ఉంది. ఈ బాటలో ఎక్స్‌రాయల్టీ జింక్ ఉత్పత్తి వ్యయాలను టన్నుకి 1,000 డాలర్ల దిగువకు చేర్చుకునే దిశలో ప్రయత్నిస్తోంది. తద్వారా లాభదాయకత మెరుగుకు మరింత మద్దతివ్వాలని చూస్తోంది. టెక్నాలజీ, వాణిజ్య ప్రాతిపదికన అధ్యయనం చేపట్టింది. వెరసి దీర్ఘకాలంలో ఉత్పత్తిని రెట్టింపునకు పెంచుకునే లక్ష్యంతో సాగుతోంది. దీంతో తగినంత అమ్మకాల పరిమాణంతో నిలకడగా ఆదాయం పెంచుకునేందుకు వీలుంటుంది. రానున్న రెండేళ్ల(2025-27) కాలంలో ఆదాయం 4 శాతం, ఇబిటా 8.4 శాతం, నికర లాభం 7 శాతం చొప్పున పుంజుకోగలవని భావిస్తున్నాం. కాగా.. 2025 కేలండర్ ఏడాదికి ప్రపంచ స్థాయిలో జింక్, లెడ్ ఉత్పత్తి, డిమాండ్ మధ్య స్వల్ప మిగులుకు వీలున్నట్లు అంచనా.

ఆస్టర్ డీఎం హెల్త్ | బ్రోకరేజ్: బీఎన్‌పీ పారిబా | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 588 టార్గెట్: రూ. 691




ఎందుకంటే: ఆరోగ్య పరిరక్షణ రంగ కంపెనీ ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్ గతేడాది (2024-25) చివరి త్రైమాసికంలో ఆదాయంలో వృద్ధి మా అంచనాల కంటే 7% తక్కువగా నమోదైంది. ప్రధానంగా కేరళలో పనితీరు నీరసించడం(వార్షికంగా 4% క్షీణత) కారణమైంది. ఇందుకు అంతర్జాతీయ రోగులు తగ్గడంతోపాటు.. రంజాన్ పండుగ సీజన్ ప్రభావం చూపింది. అయితే ఆదాయంలో కర్ణాటక, మహారాష్ట్ర నుంచి 16%, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 10% చొప్పున వృద్ధిని అందుకుంది. నిర్వహణ లాభం(ఇబిటా) అంచనాలకంటే సగటున 7 శాతం వెనకడుగు వేసింది. మరోపక్క క్యూ4(జనవరి-మార్చి)లో క్వాలిటీ కేర్ ఆదాయం 12%, ఇబిటా 14% పుంజుకున్నాయి. 20.5% ఇబిటా మార్జిన్ సాధించింది. ప్రస్తుతం కేరళలో బిజినెస్ మార్పులకు లోనవడంతోపాటు.. పోటీకి తెరలేచింది. ఇది కంపెనీకి లబ్ధిని చేకూర్చగలదు. కేరళలో రోగులకు ఆస్టర్ డీఎం తొలి ప్రాధాన్యతకాగా.. కొత్త సంస్థలు కంపెనీ విస్తృత స్థాయిని, నాణ్యతను అందుకోవడంలో సవాళ్లు ఎదుర్కోనున్నాయి. ఈ ఏడాది (2025-26) కేరళ ప్రాంతంలో సగటున 16% వృద్ధిని సాధించగలమని యాజమాన్యం అంచనా వేస్తోంది. కేరళలో కొత్తగా పలు సంస్థలు ఏర్పాటవుతున్న నేపథ్యంలో పోటీ తీవ్రతరం కానుంది. అయితే కంపెనీపరంగా క్వాలిటీ కేర్ విలీనం, రోగుల సంఖ్యను పెంచుకోవడం, కీలక ఆసుపత్రులలో ఒక్కో పడకపై సగటు ఆదాయం పుంజుకోవడం వంటి సానుకూలతలు ఉన్నాయి. దీంతో మార్జిన్లు బలపడటం, నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడేందుకు వీలుంది. కొత్తగా ఏర్పాటైన కాసరగోడ్, త్రివేండ్రం ఆసుపత్రుల పనితీరు నిరాశపరచడం వంటి రిస్కులు ఎదురుకావచ్చు.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఈ వారం మార్కెట్ మరింత స్పీడు! | పోర్ట్‌ఫోలియోకి మరింత స్థిరత్వం!

స్వల్పకాల పెట్టుబడికి మెరుగైన సాధనం?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను స్వల్పకాలం కోసం పెట్టుబడి పెట్టాలని అనుకుంటున్నాను. ఇందుకు అనుకూలమైన సాధనాలు ఏవి?
– నళినీ ప్రకాశ్

స్వల్పకాలం కోసం పెట్టుబడులు పెట్టే వారు పెట్టుబడిని కాపాడుకోవడానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. పెట్టుబడి భద్రంగా ఉన్నప్పుడే రాబడులు సాధ్యపడతాయి. స్వల్పకాల పెట్టుబడులకు సంబంధించి ఇన్వెస్టర్ల ముందు పలు ఆప్షన్లు ఉన్నాయి. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేయడం ఒక మార్గం. సేవింగ్స్ ఖాతాలో ఉంచడం వల్ల వచ్చే రాబడి కంటే ఎఫ్‌డీలోనే అధికంగా లభిస్తుంది. కచ్చితమైన రాబడి కావాలని కోరుకునే వారికి ఎఫ్‌డీ కంటే మెరుగైన సాధనం లేదు. బ్యాంకులో రూ.5 లక్షల వరకు డిపాజిట్‌పై బీమా రక్షణ ఉంటుంది. డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ స్కీమ్ (డీఐసీజీసీ) రూపంలో ఆర్‌బీఐ ద్వారా ఈ బీమా సదుపాయం లభిస్తుంది. ఒకవేళ బ్యాంకు సంక్షోభంలో పడినా రూ.5 లక్షల వరకు ఒక వ్యక్తికి భరోసా ఉంటుంది. కానీ, ఈ తరహా సందర్భాలు చాలా అరుదనే చెప్పుకోవాలి. ఎఫ్‌డీల రూపంలో వచ్చే వడ్డీ ఆదాయం సంబంధిత పెట్టుబడిదారుడి వార్షిక ఆదాయానికి కలుస్తుంది. కనుక ఎఫ్‌డీపై రాబడి పన్ను వర్తించే ఆదాయం కిందకే వస్తుంది. 30 శాతం పన్ను పరిధిలో ఉంటే కనుక ఎఫ్‌డీ ద్వారా వచ్చే నికర ఆదాయం పెద్దగా ఉండదని అర్థం చేసుకోవాలి.

ఇక స్వల్పకాల పెట్టుబడుల కోసం డెట్ మ్యూచువల్ ఫండ్స్‌ను కూడా పరిశీలించొచ్చు. ఫండ్స్ నుంచి పెట్టుబడిని వెనక్కి తీసుకున్నప్పుడే రాబడులపై పన్ను పడుతుంది. డెట్ ఫండ్‌లో స్వల్ప, దీర్ఘకాల మూలధన లాభం అని లేదు. 2023 ఏప్రిల్ 1 నుంచి డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెట్టి.. ఆ తర్వాత కాలంలో విక్రయించినట్టయితే వచ్చే మూలధన లాభం సంబంధిత ఆర్థిక సంవత్సరం ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది. ఏ శ్లాబు పరిధిలో ఉండే ఆ రేటును చెల్లించాల్సి వస్తుంది. ఇన్వెస్టర్లు తమ అవసరాలు, పరిస్థితులకు అనుగుణంగా వీటిల్లో అనుకూలమైనదాన్ని ఎంపిక చేసుకోవాలి. కొన్ని వారాల నుంచి కొన్ని నెలల కోసం అయితే మంచి లిక్విడ్ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఒక ఏడాది అంతకుమించిన కాలానికి అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ మంచి ఎంపిక. అంతకుమించిన కాలానికి అయితే షార్ట్ డ్యురేషన్ ఫండ్ అనుకూలం. డెట్ ఫండ్స్ అన్నవి రాబడులకు కానీ, పెట్టుబడికి కానీ హామీ ఇవ్వవు. కానీ, ఎఫ్‌డీల్లో పెట్టుబడి, రాబడికి హామీ ఉంటుంది. డెట్ ఫండ్స్‌లో మెరుగైన రేటింగ్ పేపర్లలో ఇన్వెస్ట్ చేసే పథకాన్ని ఎంపిక చేసుకోవాలి. తక్కువ నాణ్యమైన పేపర్లలో పెట్టుబడులు పెట్టే డెట్ ఫండ్స్‌లో రాబడులతో పాటు రిస్క్ కూడా ఎక్కువ. డిఫాల్ట్ రిస్క్ ఉంటుంది.

నిఫ్టీ ఇండెక్స్ ఫండ్స్ చాలా ఉన్నాయి కదా.. వీటి నుంచి మంచి పథకాన్ని ఎలా ఎంపిక చేసుకోవాలి?
– వెంకటస్వామి

ఇండెక్స్ ఫండ్ ఎంపిక విషయంలో ముఖ్యంగా చూడాల్సింది ఎక్స్‌పెన్స్ రేషియో. ప్రస్తుతం ఇండెక్స్ ఫండ్స్ మధ్య చాలా పోటీ ఉంది. 10-15 బేసిస్ పాయింట్ల (0.1-0.15 శాతం) ఎక్స్‌పెన్స్ రేషియోకే ఇండెక్స్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. కనుక అంతకంటే ఎక్కువ చెల్లించాల్సిన అవసరం లేదు. దీంతోపాటు ట్రాకింగ్ ఎర్రర్‌ను కూడా గమనించాలి.

ఒక ఇండెక్స్ ఫండ్.. తాను పెట్టుబడులను అనుసరించే ఇండెక్స్‌తో పోలిస్తే రాబడుల విషయంలో ఎంత మెరుగ్గా పనిచేసిందన్నది ఇది చెబుతుంది. ఇండెక్స్ ఫండ్ నిర్వహణ బృందం సామర్థ్యాన్ని ఇది ప్రతిఫలిస్తుంది. తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియోతో పాటు.. ట్రాకింగ్ ఎర్రర్ తక్కువగా ఉన్న పథకం మెరుగైనది అవుతుంది. ఈ రెండు అంశాలను ప్రామాణికంగా ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకోండి.

టొరెంట్ ఫార్మా చేతికి జేబీ కెమ్

- ప్రమోటర్ల వాటా 49.19 శాతం కొనుగోలు
- సాధారణ వాటాదారుల నుంచి 26 శాతం
- షేరుకి రూ. 1,639 ధరలో ఓపెన్ ఆఫర్
- డీల్ మొత్తం విలువ రూ. 19,500 కోట్లు
- టొరెంట్ ఫార్మాలో జేబీ కెమ్ విలీనం



న్యూఢిల్లీ: దేశీయంగా ఔషధ రంగంలో మరో భారీ డీల్‌కు తెరలేచింది. ప్రయివేట్ రంగ దిగ్గజం టొరెంట్ ఫార్మాస్యూటికల్స్.. దేశీ కంపెనీ జేబీ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్‌ను కొనుగోలు చేస్తోంది. తద్వారా దేశీ ఫార్మా రంగంలో రెండో పెద్ద కంపెనీగా అవతరించనుంది. జేబీ కెమ్ ప్రమోటర్ల నుంచి 46.39 శాతం వాటా కొనుగోలుకి తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు టొరెంట్ ఫార్మా పేర్కొంది. ఇందుకు మొత్తం రూ. 19,500 కోట్లు వెచ్చించనుంది. డీల్‌లో భాగంగా తొలుత ప్రమోటర్, పీఈ దిగ్గజం కేకేఆర్ నుంచి 46.39% వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు రూ. 11,917 కోట్లు చెల్లించనుంది. అంతేకాకుండా జేబీ కెమ్‌లో కొంతమంది ఉద్యోగుల నుంచి షేరుకి రూ. 1,600 ధరలో 2.8 శాతం వాటాను సైతం సొంతం చేసుకోనుంది. ఇందుకు రూ. 719 కోట్లు వెచ్చించనుంది. తద్వారా 49.19% వాటా చేజిక్కించుకోనుంది. ఆపై నిబంధనల ప్రకారం సాధారణ వాటాదారులకు షేరుకి రూ. 1,639 ధరలో 26% వాటా కొనుగోలుకి ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఇందుకు దాదాపు రూ. 6,843 కోట్లు కేటాయించనుంది. శుక్రవారం ముగింపు ధర రూ. 1,799తో పోలిస్తే ఓపెన్ ఆఫర్ ధర 9% తక్కువకావడం గమనార్హం! దేశీ ఫార్మా రంగంలో టొరెంట్ ఫార్మా, జేబీ కెమికల్స్ డీల్ రెండో పెద్ద లావాదేవీగా నమోదుకానుంది. ఇంతక్రితం 2015లో సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ మరో దేశీ దిగ్గజం ర్యాన్‌బ్యాక్సీ ల్యాబొరేటరీస్‌ను కొనుగోలు చేసిన డీల్ అతిపెద్ద లావాదేవీగా నిలుస్తోంది.

100: 51 నిష్పత్తిలో: నియంత్రిత వాటా కొనుగోలు తదుపరి జేబీ కెమికల్స్‌ను టొరెంట్ ఫార్మాస్యూటికల్స్ విలీనం చేసుకోనుంది. ఇందుకు 100: 51 విలీన నిష్పత్తిని సైతం టొరెంట్ ఫార్మా ప్రకటించింది. జేబీ కెమ్ వాటాదారుల వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 51 టొరెంట్ ఫార్మా షేర్లను కేటాయించనుంది. తాజా డీల్ కారణంగా క్రానిక్ విభాగంలో సుప్రసిద్ధ జేబీ కేమ్ బ్రాండ్లను టొరెంట్ పొందగలుగుతుంది.

రిలయన్స్ గూటికి రాస్‌నెఫ్ట్!

నయారా ఎనర్జీలో 49.13 శాతం వాటాపై కన్ను

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్.. రష్యా చమురు దిగ్గజం పీజేఎస్‌సీ రాస్‌నెఫ్ట్ ఆయిల్ కంపెనీ మధ్య డీల్ కుదరనున్నట్లు తెలుస్తోంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం రాస్‌నెఫ్ట్ దేశీ యూనిట్ నయారా ఎనర్జీలో 49.13 శాతం వాటాను రిలయన్స్‌కు విక్రయించనుంది. దేశీయంగా నయారా ఎనర్జీ 20 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంగల చమురు రిఫైనరీతోపాటు.. 6,750 పెట్రోల్ పంపులను నిర్వహిస్తోంది. నయారా కొనుగోలుకి రాస్‌నెఫ్ట్‌తో రిలయన్స్ ప్రాథమిక చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కొనుగోలు పూర్తయితే చమురు రంగ పీఎస్‌యూ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ)ను వెనక్కి నెట్టి అతిపెద్ద కంపెనీగా నిలిచే వీలుంది. అటు చమురు శుద్ధిసహా ఇటు పెట్రోల్ బంకుల నిర్వహణలో నంబర్ వన్ ర్యాంకును పొందనుంది. అయితే తొలి దశ చర్చలు మాత్రమే జరుగుతున్న నేపథ్యంలో డీల్‌పై అంచనాలకు రాలేమని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ అంశంపై రెండు సంస్థల నుంచి తగిన సమాచారం లభించలేనట్లు తెలియజేశాయి. 2017లో రాస్‌నెఫ్ట్.. 12.9 బిలియన్ డాలర్లకు ఎస్సార్ ఆయిల్‌ను కొనుగోలు చేసింది. తదుపరి ఎస్సార్ ఆయిల్ పేరును నయారా ఎనర్జీగా మార్పు చేసింది.




సాంకేతిక మార్గదర్శకులు!

100 స్టార్టప్స్‌తో వరల్డ్ ఎకనామిక్ ఫోరం జాబితా

- భారత్ నుంచి చోటు దక్కించుకున్న 10 కంపెనీలు
- స్పేస్, రోబోటిక్స్, ఎనర్జీ, రవాణా రంగాల్లో ఆవిష్కరణలు



- సాక్షి, స్పెషల్ డెస్క్



వరల్డ్ ఎకనామిక్ ఫోరం '2025 టెక్నాలజీ పయనీర్స్' పేరిట 28 దేశాల నుండి 100 స్టార్టప్స్‌ను ఎంపిక చేసింది. 'ఆవిష్కరణల రంగంలో విస్తృత మార్పులు చోటు చేసుకున్నాయి. తక్కువ వనరులతో తదుపరి స్థాయి, ఆధునికతను అందుకోవడానికి అనేక కంపెనీలు కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగిస్తున్నాయి. ఆస్టరాయిడ్ మైనింగ్, ఎగిరే ఎలక్ట్రిక్ ట్యాక్సీల నుండి వ్యవసాయాన్ని మార్చడానికి ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించడం, భూమి ఉపరితలం కింద కీలక ఖనిజాలను గుర్తించడానికి సూపర్‌నోవా పేలుళ్ల నుండి శక్తిని ఉపయోగించడం వరకు.. ఇలాంటి కొత్త దారులను కంపెనీలు ఎంచుకుంటున్నాయి' అని వరల్డ్ ఎకనమిక్ ఫోరం కితాబిచ్చింది. వివిధ రంగాల్లో ఆవిష్కరణలను నడిపిస్తున్న ఈ సంస్థల్లో.. 2025 జాబితాలో భారత్ నుంచి ఏకంగా 10 కంపెనీలు చోటు సంపాదించుకోవడం విశేషం. హైదరాబాద్ కంపెనీ ఈక్వల్ సైతం వీటిలో ఉంది. ఈ కంపెనీల గురించి సంక్షిప్తంగా..

అగ్నికుల్ కాస్మోస్: ఇది 2017లో చెన్నైలో ఏర్పాటైంది. భూమికి తక్కువ కక్ష్యలో 100 కేజీల వరకు బరువుండే పేలోడ్‌ను, సుమారు 700 కి.మీ. ఎత్తువరకు మోయగల 'అగ్నిబాణ్' అనే చిన్న ప్రయోగ వాహనాలను అభివృద్ధి చేసింది. దీన్ని ప్రయోగించేందుకు అగ్నికుల్ లాంచ్‌ప్యాడ్‌ను కూడా ఈ సంస్థ తయారుచేసింది. ఇది దేశంలో మొట్టమొదటి ప్రైవేట్ లాంచ్ ప్యాడ్. ఇంతవరకు శ్రీహరికోటలో ఒకటే లాంచ్ ప్యాడ్ ఉండేది. అగ్నిబాణ్‌ను 2024 మే 30న శ్రీహరికోట నుంచి ప్రయోగించారు. 'అగ్నిలెట్' పేరుతో ప్రపంచంలో తొలిసారిగా సింగిల్-పీస్, 3డీ-ప్రింటెడ్, సెమీ-క్రయోజెనిక్ రాకెట్ ఇంజిన్ తయారు చేసింది.

సైన్ ఎల్ఆర్ (సైబర్‌నెటిక్స్ ల్యాబొరేటరీ): బెంగళూరుకు చెందిన ఈ కంపెనీ రోబోటిక్స్ తయారీలో ఉంది. ఇప్పటికే సైరో అనే రోబో తయారుచేసింది. ఇది గుడ్డు, బిస్కెట్ నుంచి.. ఎలాంటి వస్తువునైనా అత్యంత జాగ్రత్తగా హ్యాండిల్ చేస్తుందని, ఏ పరిశ్రమ అవసరాలనైనా చక్కబెడుతుందని కంపెనీ చెబుతోంది.

డెజీ: స్మైల్స్.ఏఐ పేరుతో 2019లో బెంగళూరు కేంద్రంగా ప్రారంభం అయింది. తర్వాత డెజీగా పేరు మార్చుకుంది. ఏఐ ఆధారిత డయాగ్నస్టిక్ టెక్నాలజీని ఉపయోగించి దంత సంరక్షణ సేవలను అందిస్తోంది.

దిగంతర: అంతరిక్ష నిఘా, ఇంటెలిజెన్స్ సేవల్లో ఉంది. ప్రపంచంలో తొలిసారిగా వాణిజ్యపరంగా అంతరిక్ష నిఘా శాటిలైట్‌ను ప్రయోగించింది. అంతరిక్ష కార్యకలాపాలు, ట్రాఫిక్ నిర్వహణ సేవలూ అందిస్తోంది. అంతరిక్షంలో ఉన్న పరిస్థితులను తెలియజేయడంతోపాటు శాటిలైట్లు, శకలాలు ఢీకొనకుండా అలర్ట్స్ చేస్తుంది. భూమికి తక్కువ కక్ష్యలో 5 సెంటీమీటర్ల చిన్న వస్తువులనూ గుర్తిస్తుంది. ఉత్తరాఖండ్‌లో 2018లో స్థాపించారు.

ఈక్వల్: సురక్షిత కేవైసీ ధ్రువీకరణ సేవలను హైదరాబాద్ కేంద్రంగా అందిస్తోంది. కంపెనీని కేశవ్ రెడ్డి, రాజీవ్ రంజన్ 2022లో నెలకొల్పారు. 250లకుపైగా కంపెనీలు క్లయింట్లుగా ఉన్నాయి. 2025 మార్చిలో 10 కోట్లకుపైగా లావాదేవీలను పూర్తి చేసింది.

ఎక్స్‌పోనెంట్ ఎనర్జీ: బెంగళూరు కేంద్రంగా అడ్వాన్స్‌డ్ ఎనర్జీ సొల్యూషన్స్ రంగంలో ఉంది. బ్యాటరీ ప్యాక్స్‌తో పాటు 15 నిమిషాల్లో ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ పూర్తి అయ్యే ఈ-పంప్స్ (చార్జింగ్ స్టేషన్) తయారు చేస్తోంది.

ఫ్రైట్ టైగర్: ముంబై కేంద్రంగా సరుకు రవాణా మౌలిక వసతులు, నిర్వహణ సేవలు అందిస్తోంది. సరుకు సేకరణ, డెలివరీ, బిల్లింగ్‌తో సహా రవాణా కార్యకలాపాలను ట్రాక్ చేయడానికి డిజిటల్ వేదికను రూపొందించింది.

గెలాక్స్ ఐ: అంతరిక్ష సాంకేతిక రంగంలో బెంగళూరుకు చెందిన స్టార్టప్. ఐదుగురు ఐఐటీ మద్రాస్ విద్యార్థులు దీనిని ఏర్పాటు చేశారు. అన్ని కాలాలలోనూ వాతావరణ సమాచారం, తక్కువ వెలుతురులోనూ నిఘా; భూమిపై మనుషులు, వాహనాలు, వస్తువుల కదలికలు; పంట దిగుబడి వంటి సమాచారాన్ని హై రిజొల్యూషన్ చిత్రాలతో అందించే హైబ్రిడ్ ఇమేజింగ్ శాటిలైట్‌ను ప్రపంచంలో తొలిసారిగా దేశీయంగా తయారు చేస్తోంది. మేఘాలు ఉన్నా, రాత్రి సమయంలోనూ చిత్రాలను తీయగల సాంకేతికత అభివృద్ధి చేసింది.

సోలార్‌స్క్వేర్: ముంబైలో 2015లో మొదలైన ఈ కంపెనీ సోలార్ ప్యానెల్ సిస్టమ్స్ రూపకల్పన, స్థాపన రంగంలో ఉంది. రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్, నిర్వహణ, ఫైనాన్సింగ్ సేవలను అందిస్తోంది.

ది ఈ-ప్లేన్ కో: ఐఐటీ మద్రాస్‌లో 2019లో ప్రాణం పోసుకుంది. నగరాల్లో రవాణా కోసం.. ఎగిరే ఎలక్ట్రిక్ ట్యాక్సీల అభివృద్ధిలో నిమగ్నమైంది. ఒక కార్గో విమానాన్ని సైతం పరీక్షిస్తోంది. ఎయిర్ ట్యాక్సీని తొలుత మానవ పైలట్‌తో ప్రవేశపెట్టే పనిలో ఉంది. నిబంధనలు అనుమతిస్తే రానున్న రోజుల్లో అటానమస్ ఎయిర్ ట్యాక్సీ రానుంది. పైలట్ లేకుండానే ఇది గాల్లో చక్కర్లు కొడుతుంది.

స్మిషింగ్‌తో జాగ్రత్త..!

ఫేక్ ఎస్ఎంఎస్‌లతో బురిడీ కొట్టిస్తున్న సైబర్ నేరగాళ్లు
పలు సంస్థల పేరిట మాల్‌వేర్ లింకులు



సాక్షి, హైదరాబాద్: ఆన్‌లైన్ పేమెంట్లు చేయడం.. ఈ-కామర్స్ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వాడకం ఈ రోజుల్లో అత్యంత సాధారణంగా మారింది. ఇందులో ఏ తరహా అవసరానికైనా ఓటీపీలు సహా ఇతర లావాదేవీల సమాచారం అంతా ఎస్ఎంఎస్‌ల రూపంలోనే వస్తుంటుంది. మనం చేసే బ్యాంకు లావాదేవీలు మొదలు, ఆన్‌లైన్ బుకింగ్‌ల కన్ఫర్మేషన్ వరకు అంతా ఎస్ఎంఎస్‌ల ద్వారా జరుగుతుంది. దీనినే తమకు అనుకూలంగా మార్చుకుంటున్న సైబర్ కేటుగాళ్లు స్మిషింగ్‌ను తెరపైకి తెస్తున్నారు. ఎస్ఎంఎస్‌లలో ఫిషింగ్ లింక్‌లు పంపడాన్నే స్మిషింగ్‌గా సైబర్ భద్రత నిపుణులు చెబుతున్నారు. బ్యాంకు లావాదేవీలపేరిట, బ్యాంకు స్టేట్మెంట్లు, కేవైసీ అప్‌డేషన్, బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేసుకోవడానికి అంటూ కొన్ని లింక్‌లతో కూడిన ఎస్ఎంఎస్‌లను పంపుతున్నారు. ఇలాంటి ఎస్ఎంఎస్‌లలోని వెబ్‌లింక్‌లపై క్లిక్ చేస్తే మనకు తెలియకుండానే మన ఫోన్లలోకి మాల్‌వేర్ వచ్చి చేరుతుందని వారు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి లింక్‌లపై క్లిక్ చేయగానే మన ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లు..గ్యాలరీలోని ఫొటోలు, వీడియోలు, ఎస్ఎంఎస్‌లు సహా ఫోన్ మొత్తం సైబర్ నేరగాళ్ల అధీనంలోకి వెళుతుందని, ఆ తర్వాత వారు మన బ్యాంకు ఖాతాలను కొల్లగొట్టే ప్రమాదం ఉందని వారు సూచిస్తున్నారు. అనుమానాస్పద ఎస్ఎంఎస్‌లలోని లింక్‌లపై ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దని సైబర్ నిపుణులు సూచిస్తున్నారు.

రేపు తెరుచుకోనున్న బాబ్లీ గేట్లు

ఏటా జూలై 1న గేట్లు ఎత్తాలని సుప్రీం నిబంధన

భైంసా: గోదావరి నదిపై మహారాష్ట్రలో ఉన్న బాబ్లీ ప్రాజెక్టు గేట్లను జూలై 1న ఎత్తనున్నారు. ఈ ప్రాజెక్టు గేట్లను ఏటా జూలై 1 నుంచి అక్టోబర్ 28 వరకు ఎత్తి ఉంచాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉండటంతో ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా 14 గేట్లను ఎత్తనున్నారు. దీంతో గోదావరి నీరు దిగువన తెలంగాణలోని ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి చేరనుంది. బాబ్లీని మహారాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా నిర్మించిందనే వివాదం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై కోర్టులో పోరాడింది. దీంతో నదికి భారీగా వరద వచ్చే సమయంలో గేట్లను ఎత్తి ఉంచాలని సుప్రీం కోర్టు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని గతంలో ఆదేశించింది. సుప్రీంకోర్టు ఏర్పాటుచేసిన త్రిసభ్యకమిటీ సమక్షంలో మహారాష్ట్ర, తెలంగాణ నీటిపారుదల శాఖల అధికారులు మంగళవారం గేట్లను తెరువనున్నారు. బాబ్లీ నుంచి గోదావరి నీరు ఎస్సారెస్పీలోకి చేరనుంది. ఎస్సారెస్పీలో ప్రస్తుతం 1,064.60 అడుగుల వద్ద 15.567 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

ఏజెన్సీ నుంచి లండన్ దాకా..

స్వయం ఉపాధితో భద్రాచలం గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధి • శానిటరీ ప్యాడ్‌లు, ఆర్గానిక్ మిల్లెట్స్ బిస్కెట్ల తయారీ

భద్రాచలం : కరోనా కష్టాలు, ఆర్థిక ఇబ్బందులను ధైర్యంగా ఎదుర్కొన్న గిరిజన మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతమయ్యారు. ఏజెన్సీ నుంచి ప్రారంభమైన వీరి వ్యాపారం లండన్ వరకూ విస్తరించింది. ప్రధాని మోదీ 'మన్‌కీబాత్'లో భద్రాచలం గిరిజన మహిళల అభివృద్ధి గురించి ప్రస్తావించారు.

ఏడేళ్ల క్రితం ప్రారంభం..

భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో స్వయం శిక్షణ కింద ఏడేళ్ల క్రితం ఓ ప్రత్యేక ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. గిరిజన మహిళ ఊకే వెంకటలక్ష్మి మరో ఏడుగురితో కలిసి శిక్షణ తీసుకుంది. అనంతరం రూ.5 లక్షల పెట్టుబడితో శానిటరీ నాప్‌కిన్ తయారీని 'భద్రాద్రి శ్రీరామ్ జేఎల్ గ్రూప్'అనే సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌తో ప్రారంభించారు. ఐటీడీఏ ప్రాంగణంలోని ఓ భవనాన్ని అధికారులు వీరికి కేటాయించారు. మిషనరీతో తయారీ ప్రారంభించిన కొద్ది కాలంలోనే కరోనా వచ్చింది. దీంతో వ్యాపారం లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మళ్లీ కోవిడ్ కాలం పూర్తయ్యాక మొక్కవోని ధైర్యంతో శానిటరీ ప్యాడ్‌ల తయారీ ప్రారంభించారు. ఐటీడీఏ సహకారం తోడవడంతో ప్యాడ్‌లను గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలు, కళాశాలల్లో బాలికలకు సరఫరా చేశారు. నాడు నెలకు 100 ప్యాడ్‌లతో ప్రారంభం కాగా, ప్రస్తుతం 40 వేలకు చేరింది.

ఆర్గానిక్ మిల్లెట్ బిస్కెట్ల తయారీతో...

వెంకటలక్ష్మి మదిలో మరో ఆలోచన ప్రారంభమైంది. ఆదివాసీ సంప్రదాయ దినుసులతో ఆర్గానిక్ మిల్లెట్ బిస్కెట్ల తయారీని ప్రారంభించాలనుకుంది. మరో ముగ్గురు సభ్యులతో కలిసి అప్పటి ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు దృష్టికి తీసుకెళ్లగా ఆయన తగిన శిక్షణతో పాటు బ్యాంకు లోన్ కూడా ఇప్పించారు. ఇలా 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్'పేరిట బిస్కెట్ల తయారీని ప్రారంభించారు. కొర్రలు, రాగులు, జొన్న, సామలతో రకరకాల బిస్కెట్లను తయారు చేసి అమ్మకం ప్రారంభించారు. మైదా, పంచదార లేకుండా పూర్తిగా ఆర్గానిక్‌తో తయారు చేయడం వీరి ప్రత్యేకత. బెల్లం, నెయ్యి, బటర్‌లతో తయారు చేసిన బిస్కెట్లు అనతికాలంలో అందరికీ నచ్చాయి.



బిస్కెట్లు తయారు చేస్తున్న గిరిజన మహిళ



ఎగ్జిబిషన్‌లో విదేశీ మహిళలకు బిస్కెట్లను విక్రయిస్తున్న మహిళ

ఐటీడీఏ పీఓల సహకారంతో..

గౌతమ్ పోట్రు తర్వాత పీఓగా వచ్చిన రాహుల్ మార్కెటింగ్‌పై తగిన శ్రద్ధ చూపి పలుచోట్ల కౌంటర్లు ఇప్పించారు. దీంతో వ్యాపారం విస్తరించింది. భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయం వద్ద, పట్టణంలోని పలుచోట్ల, ఐటీడీఏ, గిరిజన మ్యూజియంలో కౌంటర్లు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ శిల్పారామం, ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌తోపాటు ఇతర ముఖ్య కేంద్రాల్లోనూ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ప్రోత్సహించారు. సుదూర ప్రాంతాలకు కార్గో ద్వారా సైతం ఆర్డర్లతో సరఫరా చేస్తున్నారు. ఎన్ఆర్ఐల ద్వారా లండన్‌కు సైతం వీరి బిస్కెట్లు పలుమార్లు చేరాయి.

అందరి సహకారం మరువలేనిది



మొదట ఎన్నో ఇబ్బందులు పడ్డాను. ఐటీడీఏ పీఓలు, కుటుంబసభ్యుల సహాయ సహకారాలతో ముందుకొచ్చాం. గ్రూప్‌లో ప్రతీ మహిళ ఐదంకెల జీతంతో సమానంగా సంపాదిస్తున్నాం. ప్రధాని మోదీ మమ్మల్ని మెచ్చుకోవడం మరింత స్ఫూర్తినిచ్చింది. కొత్తగా ఆలోచించి ఇంకా ముందుకెళ్లాలని ఉంది.

– ఊకే వెంకటలక్ష్మి, గ్రూప్ లీడర్

భద్రాచలం మహిళల

విజయాలు అద్భుతం

- రోజు కూలీల నుంచి వ్యాపారులుగా అవతరణ
- వారి ఉత్పత్తులు విదేశాలకు కూడా చేరుతున్నాయి
- మన్‌కీబాత్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసలు

సాక్షి, న్యూఢిల్లీ: భద్రాచలం ప్రాంతంలో చిరుధాన్యా లతో బిస్కెట్లు తయారు చేస్తున్న మహిళలపై ప్రధా నమంత్రి నరేంద్రమోదీ ప్రశంసలు కురిపించారు. దేశంలో మహిళా సాధికారతకు వీరు నిదర్శనంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఆదివారం ఆయన 123వ మన్‌కీబాత్‌లో వివిధ అంశాలపై మాట్లా డారు. 'మహిళల నేతృత్వంలో అభివృద్ధి అనే మంత్రం దేశ కొత్త భవిష్యత్తును సృష్టించేందుకు సిద్ధంగా ఉంది. మన తల్లులు, సోదరీమణులు, కుమార్తెలు నేడు తమకు మాత్రమే కాకుండా మొత్తం సమాజానికి కొత్త దిశానిర్దేశం చేస్తున్నారు. తెలంగాణలోని భద్రాచలం మహిళల విజయం గురించి మీరు తెలుసుకున్నప్పుడు ఎంతో సంతోషిస్తారు. ఈ మహిళలు ఒకప్పుడు పొలాల్లో కూలీలుగా పనిచేసేవారు. నేడు వారే చిరు ధాన్యాలతో బిస్కెట్లు తయారు చేస్తున్నారు. భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ అని పిలవబడే ఈ బిస్కెట్లు హైదరాబాద్ నుంచి లండన్ వరకు చేరుతున్నాయి. వీరు స్వయం సహాయక సంఘాల్లో చేరి శిక్షణ పొందారు. అంతేకాదు, వీరు మరో ప్రశంసనీయమైన పని చేశారు. గిరి శానిటరీ ప్యాడ్‌లు తయారు చేయడం ప్రారంభించారు. కేవలం మూడు నెలల్లో వారు 40 వేల ప్యాడ్‌లను తయారు చేసి పాఠశాలలు, సమీపంలోని కార్యాలయాల్లో అతి తక్కువ ధరకు పంపిణీ చేశారు'అని ప్రధాని ప్రశంసించారు. మన్‌కీబాత్ కార్యక్రమం ప్రారంభంలోనే రెండు తెలుగు రాష్ట్రాల గురించి ప్రధాని ప్రస్తావించారు. యోగా దినోత్సవం పదేళ్లు పూర్తి చేసుకుందని, ఈ సందర్భంగా ఏపీలోని విశాఖలో అద్భుతమైన దృశ్యం ఆవిష్కృతమైందని తెలిపారు. తెలంగాణలో అదేరోజు మూడు వేల మంది దివ్యాంగ స్నేహితులు కలిసి యోగా శిబిరంలో పాల్గొనడం వారి అంకితభావానికి నిదర్శనమని ప్రశంసించారు.

ఆర్టీసీ టూరిస్టు బస్సు

రెగ్యులర్ సర్వీసులకు అదనంగా ఆర్టీసీ టూర్ ప్యాకేజీ బస్సులు

- పొరుగు రాష్ట్రాలతోపాటు, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు సర్వీసులు
- ముమ్మర ప్రచారం చేస్తూ పర్యాటకులను తరలిస్తున్న ఆర్టీసీ
- మంచి స్పందనతో ఆర్టీసీకి కాసులు కురిపిస్తున్న టూర్లు



మియాపూర్-1 డిపో బస్సు వద్ద తీర్థయాత్రకు వెళ్లిన సందర్శకులు

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సు అంటే స్టేజీ క్యారియర్ సర్వీసుగానే మనకు తెలుసు. రవాణా శాఖ చట్టం ప్రకారం స్టేజీ క్యారియర్ సర్వీసు అనుమతి ఒక్క ఆర్టీసీకే ఉంది. కానీ, ఇప్పుడు ఉన్నట్టుండి కొన్ని ఆర్టీసీ బస్సులు టూరిస్టు పర్మిట్ బస్సులుగా మారిపోయాయి. రాష్ట్రంతోపాటు, పొరుగు రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలు, దర్శనీయ స్థలాలకు సందర్శకులను తరలిస్తూ.. ఆర్టీసీ టూర్ ఆపరేటర్ అవతారమెత్తింది. దీనికి సందర్శకుల నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. ఆదాయం పెంచుకునేందుకే ఆర్టీసీ ఈ కొత్త మార్గం ఎంచుకుంది. మధురై, రామేశ్వరం, అరుణాచలం, తుల్జాపూర్, గానుగాపూర్, షిర్డీ, సింహాచలం, వైజాగ్, అరకు, రాజమండ్రి, విజయవాడతోపాటు తెలంగాణలోని సోమశిల, యాదగిరిగుట్ట, స్వర్ణగిరి, రామప్ప, వేయిస్తంభాల గుడి, భద్రకాళి దేవాలయం, వేములవాడ, కొండగట్టు.. తదితర ప్రాంతాలకు టూర్ ప్యాకేజీలు నిర్వహిస్తోంది. ఈ నెల 27 నుంచి వీటిని ప్రారంభించింది. రాష్ట్రంలోని అన్ని డిపోలు విడివిడిగా ఈ టూర్ ప్యాకేజీలను కొనసాగిస్తున్నాయి. ఈ స్పెషల్ బస్సులు ఇప్పుడు పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి.

రెండు రకాలుగా సర్వీసులు..

డిపోలవారీగా ప్రత్యేకంగా టూర్ ప్యాకేజీలను సిద్ధం చేశారు. కొన్ని సర్వీసులను ఎక్కడికి నడపాలనేది ముందుగానే నిర్ణయించి.. ఆ టూర్ వివరాలను, బస్సు నడిచే తేదీలను తెలుపుతూ ఆర్టీసీ రిజర్వేషన్ పోర్టల్ ఓపీఆర్ఎస్‌లో ఉంచుతున్నారు. దీంతో సందర్శకులు సీట్లను రిజర్వ్ చేసుకుంటున్నారు. మరో విధానంలో కొన్ని బస్సులను పెళ్లిళ్లకు అద్దెకిచ్చే 'బస్ ఆన్ కాంట్రాక్టు'పద్ధతిలో తిప్పుతున్నారు. అపార్ట్‌మెంటు వాసులు, కాలనీ ఇరుగుపొరుగు, బంధువులు, కులసంఘాల సభ్యులు.. ఇలా ఎవరైనా ఉమ్మడిగా ఓ సందర్శనీయ స్థలాన్ని ఎంచుకుని ట్రిప్ రిక్వెస్ట్ పెడితే అక్కడికి బస్సును ఏర్పాటు చేస్తున్నారు.

మంచి ఆదాయం..

సాధారణ సర్వీసులతో పోలిస్తే ఈ టూర్ ప్యాకేజీ బస్సులతో ఇప్పుడు ఆర్టీసీకి మంచి ఆదాయం సమకూరుతోంది. బస్ ఆన్ కాంట్రాక్టు పద్ధతిలో బుక్ చేసుకుంటే 100 శాతం ఆక్యుపెన్సీ రేషియో ప్రకారం బస్ మొత్తానికి అయ్యే ఖర్చును సీట్ల సంఖ్యతో భాగించి ఒక్కో ప్రయాణికుడి నుంచి చార్జీ వసూలు చేస్తున్నారు. ఓపీఆర్ఎస్‌లో ఉంచిన స్పెషల్ బస్సు టూర్ ప్యాకేజీ వివరాలపై ముమ్మర ప్రచారం చేయటం ద్వారా అన్ని సీట్లు రిజర్వ్ అయ్యేలా చూస్తున్నారు. దీనివల్ల కూడా పూర్తి ఆక్యుపెన్సీ ప్రకారం చార్జీలు వసూలవుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

స్పందన బాగుంది..

నాలుగు రోజులు, రెండు రోజులు ఉండేలా టూర్ ప్యాకేజీలు సిద్ధం చేశాం. విజయవాడ కనకదుర్గ దేవాలయం, ద్వారకాతిరుమల, అన్నవరం, సింహాచలం, అరకు ప్రాంతాలకు నాలుగు రోజుల ట్రిప్పునకు మంచి స్పందన వచ్చింది. కొండగట్టు, వేములవాడ, ధర్మపురి, కాళేశ్వరం, రామప్ప, హనుమకొండ.. ఇలా రెండు రోజుల ప్యాకేజీకి కూడా మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో ఇలాంటి సర్వీసుల సంఖ్య పెంచుతున్నాం.

– మోహన్‌రావు, మియాపూర్-1 డిపో మేనేజర్.

టూర్ బస్సులకు అధిక డిమాండ్

ప్రత్యేక ప్రాంతాలకు ఏర్పాటుచేసిన బస్సులకు అధిక డిమాండ్ ఉంది. అలంపూర్ జోగులాంబ దేవాలయం, బీచ్‌పల్లి కృష్ణానదీ తీరం-ఆంజనేయస్వామి ఆలయం, శ్రీరంగాపురం శ్రీ రంగనాయకస్వామి దేవాలయం టూర్ సర్వీసుకు మంచి స్పందన వస్తోంది.

-కృష్ణారెడ్డి, రాజేంద్రనగర్ డిపో మేనేజర్.

ఇవి మా ఇళ్లు.. వదిలి వెళ్లం

- డబుల్ బెడ్రూం ఇళ్లను ఆక్రమించిన లబ్ధిదారులు
- ఇళ్ల కేటాయింపులో తీవ్ర జాప్యంతో నేరుగా ఆక్రమణ
- రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లింగంపల్లి వద్ద ఘటన



డబుల్‌బెడ్రూం ఇళ్లలోకి వచ్చిన లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్ఐ రమేష్

మంచాల: డబుల్ బెడ్రూం ఇళ్లను అందజేయటంలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని ఆరోపిస్తూ.. లబ్ధిదారులు ఆ ఇళ్లను నేరుగా ఆక్రమించుకున్నారు. ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన మాటలపై నమ్మకం సన్నగిల్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లింగంపల్లి గేట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. మండలంలోని మంచాల, నోముల, లింగంపల్లి గ్రామస్తుల కోసం లింగంపల్లి గేట్ వద్ద డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించారు. ఏడాదిన్నర క్రితం లాటరీ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇళ్లను మాత్రం అప్పగించలేదు. అప్పటి నుంచి లబ్ధిదారులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఈ క్రమంలో ఈ నెల 23న ఇళ్లు కేటాయిస్తామని అధికారులు తెలపటంతో లబ్ధిదారులు ఆశగా ఎదురుచూశారు. కానీ ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు. ఈ నెల 28న ఇస్తామని మరోసారి చెప్పారు. ఆ గడువు కూడా దాటిపోవడంతో విసిగిపోయిన లబ్ధిదారులంతా కలిసి ఇళ్లను శుభ్రం చేసుకొని ఆక్రమించారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేశ్ అక్కడికి చేరుకొని లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అధికారికంగా ప్రొసీడింగ్స్ ఇచ్చిన తర్వాత రావాలని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా లబ్ధిదారులు ససేమిరా ఒప్పుకోలేదు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని ఇందిరమ్మ ఇళ్లు కూడా కేటాయించలేదని, ప్రస్తుతం తాము ఉన్న ఇళ్లు వర్షాలకు కురుస్తున్నాయని, ఎక్కడ తలదాచుకోవాలని నిలదీశారు. అప్పుడు, ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితిలో ఇళ్లను వదిలి వెళ్లేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. దీంతో చేసేది లేక అధికారులు వెనుదిరిగారు.

నల్లమలలో మానవ సంచారం నిషేధం

- రేపటి నుంచి సెప్టెంబర్ 30 వరకు మూడు నెలల పాటు
- పులుల సమాగ సమయం ఆసన్నం
- ప్రశ్నార్థకంగా చెంచుల ఆహార సేకరణ
- ఇష్ట కామేశ్వరి ఆలయ దర్శనం, పులుల సఫారీ నిలిపివేత



ఆత్మకూరు రూరల్/ మార్కాపురం: పెద్దపులుల సంతానోత్పత్తి సమయం నేపథ్యంలో నాగార్జున సాగర్ శ్రీశైలం పెద్ద పులుల అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్)లో జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు మానవ సంచారం నిషేధం అమలు కానుంది. పులుల సమాగమానికి అడవిలో మనిషి కదలికలు అడ్డంకిగా ఉంటాయన్న శాస్త్రీయ నిరూపణతో మూడు నెలల పాటు నల్లమల అభయారణ్యంలో అన్ని రకాల మానవ కార్యకలాపాలకు విరామం ప్రకటించారు. దీన్ని ఎన్ఎస్‌టీఆర్ అధికారులు గత కొన్నేళ్లుగా పాటిస్తున్నారు. ఈ చర్యల్లో భాగంగా ఎకో-టూరిజం రిసార్ట్‌లు, అటవీ లోతట్టు ప్రాంతాల్లో ఉండే పుణ్యక్షేత్రాల దారులు మూసివేయనున్నారు. అటు ప్రకాశం జిల్లా మార్కాపురం నల్లమల టైగర్ రిజర్వు అటవీ ప్రాంతంలోని సందర్శనీయ స్థలాలను మూడు నెలల పాటు మూసివేస్తున్నామని మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్ ఆదివారం తెలిపారు. దోర్నాల-శ్రీశైలం మధ్య అటవీ ప్రాంతంలో సఫారీ, నెక్కంటి రేంజ్‌లోని ఇష్ట కామేశ్వరి ఆలయం, ఎకో టూరిజాన్ని నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాంతాల్లో సందర్శకులకు అనుమతి ఇవ్వమని స్పష్టం చేశారు.

ప్రశ్నార్థకంగా చెంచుల జీవనం?

పులుల సమాగ సమయంలో అటవీ ప్రాంతాల్లో ఎవరూ సంచరించకూడదన్న నిర్ణయం చెంచుల జీవనానికి ప్రశ్నార్థకంగా మారింది. నల్లమల అటవీ ప్రాంతంలో మనుగడ సాగించే చెంచులు తేనె, నన్నారి గడ్డలు, జిగురు వంటివి సేకరిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. మానవ సంచారం నిషేధం అమలుకానుండటంతో ఉపాధి దూరమవనుందనే ఆందోళనలో చెంచులు ఉన్నారు. ఇలాంటి తరుణంలో వారికి జీవనభృతి కల్పించాలని వారు కోరుతున్నారు. అటు పులుల ప్రవర్ధనానికి ప్రాముఖ్యత కల్పించినట్లే తమనూ అన్ని విధాలా ఆదుకోవాలని వేడుకుంటున్నారు. నల్లమల అభయారణ్యంలో రాష్ట్ర పరిధిలో ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లాలున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం 12 వేల చెంచు కుటుంబాలున్నాయి. వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు భృతి కల్పించినట్లే తమను కూడా ఆర్థికంగా ఆదుకోవాలని చెంచులు కోరుతున్నారు.

గోకాక్ ఫాల్స్... అదుర్స్!



ఎగువ మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడంతో ఉత్తర కర్ణాటకలోని ఘటప్రభ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బెళగావి జిల్లాలోని గోకాక్ పట్టణం సమీపంలో ఉన్న గోకాక్ జలపాతం పరవళ్లు తొక్కుతోంది. దీంతో ఇక్కడకు పెద్ద ఎత్తున పర్యాటకులు క్యూ కడుతున్నారు.

– రాయచూర్ రూరల్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సౌర విద్యుత్‌పై కొరవడిన ఆసక్తి

దరఖాస్తులు చేసినప్పటి ఉత్సాహం.. పీపీఏ నాటికి తగ్గిన వైనం

వేలల్లో దరఖాస్తులు.. వందల్లో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు • టీజీ ఎన్పీడీసీఎల్‌లో 2,098 దరఖాస్తులు

పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకున్నది 133 మంది మాత్రమే..

టీజీ ఎస్పీడీసీఎల్‌లో 2,265 దరఖాస్తులు.. పవర్ పర్చేజ్ చేసుకున్నది 163 మంది



హనుమకొండ: సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై రైతుల్లో ఆసక్తి తగ్గింది. ఇందుకు.. వచ్చిన దరఖాస్తులు, చేసుకున్న పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లే నిదర్శనం. వేలల్లో దరఖాస్తులు రాగా, వందలో మాత్రమే పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లు జరగడాన్ని బట్టీ.. సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై రైతుల్లో ఉత్సాహం సన్నగిల్లిందని అర్థమవుతోంది. భారీ పెట్టుబడి.. గిట్టుబాటు కాని ధర.. 12 ఏళ్ల వరకు రైతుకు ప్రయోజనం లేకపోవడం.. ఈఎంఐలు చెల్లించడం ఇబ్బంది కావచ్చన్న ఆలోచన.. రుణాలపై స్పష్టత లేకపోవడం, రైతు వాటాగా రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉండడం.. ప్రతీనెల ఆదాయం నిలకడగా వస్తుందనే నమ్మకం లేకపోవడం వెరసి.. సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై రైతుల్లో తీవ్ర విముఖత వ్యక్తమవుతోంది. దరఖాస్తులు చేసినప్పటి ఉత్సాహం.. ఈఎండీ చెల్లింపులో కనిపించలేదు. ఈఎండీ చెల్లించడంలో కనిపించిన శ్రద్ధ పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకోవడంలో లేదు.

మొదటినుంచీ రైతుల అనాసక్తి..

మొదటినుంచి సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుపై రైతులు ఆసక్తి కనబరచడం లేదు. దరఖాస్తుల స్వీకరణకు మూడుసార్లు గడువు పొడిగించారు. ఈఎండీలు చెల్లించడానికి రెండు సార్లు గడువు విధించారు. అయినా దరఖాస్తులు వచ్చిన మేరకు.. ఈఎండీలు చెల్లించడానికి రైతులు ముందుకు రాలేదు. ఈఎండీలు చెల్లించిన మేరకు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకునేందుకు రైతులు ముఖం చాటేస్తున్నారు. ఒక మెగావాట్ సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్‌కు రూ.3 కోట్లు ఖర్చవుతుంది. ఇందులో రైతులు తమ వాటాగా 25 శాతం భరిస్తే, బ్యాంకుల ద్వారా 75 శాతం రుణ సదుపాయాన్ని కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది. రుణ విషయంలో బ్యాంకర్లకు స్పష్టంగా చెప్పడం లేదని రైతులు తెలిపారు. సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేంత భారీ పెట్టుబడి రైతులుగా తాము వెచ్చించలేమని చెబుతున్నారు. 25 శాతం కింద రూ.3 కోట్ల వ్యయంలో రైతు వాటాగా రూ.75 లక్షలు భరించలేమని, దీనికి తోడు తమ స్థలం నుంచి సబ్‌స్టేషన్ వరకు అయ్యే ఖర్చులు భరించలేమని, ప్రభుత్వం యూనిట్‌కు చెల్లిస్తామని చెప్పిన రూ.3.13లు ఎటూ సరిపోవన్నారు. విద్యుదుత్పత్తి కూడా అన్ని కాలాల్లో ఒకే రకంగా ఉండకపోవచ్చని, దీంతో వచ్చిన ఆదాయంలో నిలకడ లోపిస్తుందని, దీంతో నెలవారీ వాయిదాలు చెల్లించడంలో ఇబ్బందులు ఎదురుకావచ్చని భావిస్తున్నారు. పన్నెండేళ్ల వరకు రుణ వాయిదాలు చెల్లించాల్సి రావడంతో.. అప్పటి వరకు రైతుకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని వాపోతున్నారు. పన్నెండేళ్ల తర్వాత పరిస్థితులు ఎలా ఉంటాయోనని, అదే విధంగా 25 ఏళ్ల వరకు యూనిట్‌కు రూ.3.13 మాత్రమే చెల్లించడం ఏ మాత్రం గిట్టుబాటు కాదంటున్నారు. రాయితీ లేకపోవడంతో తమపై దారుణమైన భారం పడుతుందని రైతులు చెబుతున్నారు. దీంతో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు రావడం లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు.

టీజీ ఎస్పీడీసీఎల్‌లో..

టీజీ ఎస్పీడీసీఎల్‌లో 2265 మంది రైతులు 3,369.500 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 682 మంది రైతులు 1035.5 మెగావాట్ల విద్యుదుత్పత్తికి రూ.లక్ష చొప్పున ఈఎండీ చెల్లించారు. ఇందులో 560 మంది రైతులకు 850.8 లెటర్ ఆఫ్ ఆక్సెప్టెన్సీ జారీ చేశారు. కాగా ఇప్పటివరకు 163 మంది రైతులు 225 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్ ఏర్పాటుకు డిస్కంతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకున్నారు.



లక్ష్యం ఘనం.. స్పందన గగనం..

కేంద్ర ప్రభుత్వం సౌర విద్యుదుత్పత్తిని పెంచేందుకు ప్లాంట్ ఏర్పాటుపై రైతులను ప్రోత్సహించేందుకు ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఎవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుం) పథకాన్ని తీసుకొచ్చింది. ప్రధానంగా రైతులను సౌర విద్యుదుత్పత్తి వైపు ప్రోత్సహించడం దీని ఉద్దేశం. రాష్ట్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ, టీజీ ఎన్పీడీసీఎల్, టీజీ ఎస్పీడీసీఎల్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తోంది. రైతులతోపాటు మహిళా స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తి సంఘాలు, సహకార సంఘాలు, పంచాయతీలు, నీటి వినియోగదారుల సంఘాలు సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా.. సౌర విద్యుదుత్పత్తి చేసేలా ఈ పథకాన్ని రూపొందించారు. ప్రభుత్వ, దేవాలయ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. వీరు ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను స్థానిక డిస్కంలు ముందుగా నిర్ణయించిన టారిఫ్ ధరలకు కొనుగోలు చేస్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో వేయి మెగావాట్లు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మిగతా 3 వేల మెగావాట్ల ఉత్పత్తి కోసం.. రైతులతో సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నదే పథకం లక్ష్యం. ఇక్కడివరకు బాగానే ఉన్నప్పటికీ.. ఈ మేరకు రైతులనుంచి స్పందన కనిపించకపోవడంతో లక్ష్యం నీరుగారేలా ఉంది.

మందకొడిగా పథకం ప్రక్రియ..

పథకం రూపకల్పన, ఆదాయం వచ్చే మార్గాలపై ఉన్న సందేహాలతో పీఎం కుసుం పథకం ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ వరకు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది.

టీజీ ఎన్పీడీసీఎల్‌లో..

టీజీ ఎన్పీడీసీఎల్‌లో 2,098 మంది రైతులు 2,788.900 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 520 మంది రైతులు 683.800 మెగావాట్లకు రూ.లక్ష చొప్పున ఈఎండీ చెల్లించారు. 439 మందికి 561.7 మెగావాట్లకు లెటర్ ఆఫ్ అక్సెప్టెన్సీ జారీ చేశారు. కాగా ఇప్పటివరకు 133 మంది రైతులు 161 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు మాత్రమే పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ చేసుకున్నారు. దరఖాస్తులు వేలల్లో వస్తే పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ వందలో మాత్రమే చేసుకున్నారు.





ఆలయ మాడ వీధిలో భక్తుల సందడి

యాదగిరిగుట్టకు భక్తుల తాకిడి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం రద్దీ నెలకొంది. సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు.. శ్రీస్వామి దర్శనానికి అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ధర్మ దర్శనానికి మూడున్నర గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. శ్రీస్వామిని 45వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజల్లో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.51,93,737 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.



ముఖ మండపంలో శ్రీస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

30 ఏళ్లుగా నీడనిస్తున్న ఊడల మర్రి



శాయంపేట: హనుమకొండ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లి గ్రామ సెంటర్‌లోని ఊడలమర్రి 30 ఏళ్లుగా ప్రజలకు నీడనిస్తోంది. ఇక్కడి నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు ఎండ, వాన నుంచి రక్షణ ఇస్తోంది. అంతేకాకుండా గ్రామంలోని వృద్ధులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆ చెట్టు నీడన కూర్చుని కాలక్షేపం చేస్తుంటారు. ఈ చెట్టు నీడన సైకిల్ షాపు, పంచర్ దుకాణం, బార్బర్ షాపు ఏర్పాటు చేసుకుని పలువురు జీవనోపాధి పొందుతున్నారు. గ్రామానికి చెందిన కూచన మొగిలి మర్రి మొక్కను 35 ఏళ్ల క్రితం నాటడంతో అది పెరిగి మహా వృక్షంగా మారింది.

శుభ్రపరిచే బతుకులకు భద్రతేదీ?

వేతనాలకు నోచని సులభ్ కార్మికులు

- మూడు నెలలుగా అందక అవస్థలు
- కనీస వేతనాలకు నోచని వైనం..
- మరోవైపు నిర్వహణ లేక అధ్వానంగా కాంప్లెక్స్‌లు
- సింగరేణి వ్యాప్తంగా 213 కాంప్లెక్సులు.. 250 మంది కార్మికులు
- ఒక్కొక్క కార్మికుడికి నెలకు రూ.15 వేల చొప్పున బకాయి



వేతనాల కోసం కొత్తగూడెం హెడ్ ఆఫీస్ వద్ద కార్మికుల ఆందోళన

ఇల్లెందు:

సింగరేణి వ్యాప్తంగా సులభ్ కాంప్లెక్సుల్లో పనిచేస్తున్న కార్మికులు మూడు నెలలుగా వేతనాలు అందక అలమటిస్తున్నారు. సింగరేణి సంస్థ ఒక్కొక్క సులభ్ కాంప్లెక్స్‌కు నెలకు రూ.25 వేలు కేటాయిస్తుంది. ఇందులో కార్మికుడికి నెలకు రూ.15 వేలు వేతనం చెల్లించి.. సులభ్ కాంప్లెక్సుల నిర్వహణకు రూ.10 వేలు ఖర్చు చేయాల్సి ఉంది. ముప్పయ్యేళ్లుగా 'సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ ఆర్గనైజేషన్'కు సింగరేణి సంస్థ టెండర్ ద్వారా నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. ఈ సంస్థ సులభ్ కాంప్లెక్సుల్లో నెలకు చీపుళ్లు, యాసిడ్, బ్లీచింగ్, ఫినాయిల్ కోసం రూ.వెయ్యి వరకు అందజేసి.. రూ.9 వేలు నొక్కేస్తోంది. మూడు నెలల క్రితం వీటి నిర్వహణ కాలం టెండర్ గడువు ముగిసింది. అయితే కార్మికుల ఒత్తిడితో మరో మూడు నెలల టెండర్ కాలపరిమితిని పొడిగించారు. ఈ తరుణంలో కార్మికులకు మూడు నెలలపాటు వేతనాలు అందకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు.

పాతికేళ్ల నాటి నిర్మాణాలు

సింగరేణిలో 25 ఏళ్ల క్రితం కార్మికులకు నివాస క్వార్టర్లు తక్కువగా ఉన్న కాలంలో.. వారి సౌలభ్యం కోసం సులభ్ కాంప్లెక్సులను స్త్రీలు, పురుషులకు వేర్వేరుగా నిర్మించారు. అప్పట్లో సింగరేణి సంస్థ సివిల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో వీటి నిర్వహణ పరిశీలించేవారు. కాలక్రమేణా 30 ఏళ్లకు సరిపడా నిర్వహణ బాధ్యతల్ని ఒకేదఫా టెండర్‌లో ఓ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టారు. సింగరేణి వ్యాప్తంగా 213 సులభ్ కాంప్లెక్సులు ఉండగా.. 250 మంది కార్మికులు పని చేస్తున్నారు. ఒక్కొక్క కార్మికుడికి నెలకు రూ.15 వేల వేతనం అందజేస్తున్నారు. సింగరేణి యాజమాన్యం సులభ్ ఇంటర్నేషనల్ సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ సంస్థకు 36 శాతం కమీషన్ చెల్లిస్తోంది. అదే సింగరేణి సంస్థ మిగతా కాంట్రాక్టర్‌లకు 10 శాతం కమీషన్ చెల్లిస్తోంది. అయితే, కార్మికులకు వేతనం తప్ప ఎలాంటి చట్టబద్ధ హక్కులు అమలు చేయడం లేదు.

కార్మికుల డిమాండ్లివే..

ప్రమాద బీమా సదుపాయం, ఈఎస్ఐ, ఈపీఎఫ్, బోనస్ చెల్లింపు, వేతనాల బకాయిల చెల్లింపు, సహజ మరణం సంభవిస్తే.. రూ.20 లక్షల పరిహారం చెల్లింపు, సులభ్ భవనాలకు మరమ్మతులు, ఏటా రెండు జతల దుస్తులు, బూట్లు, చేతి గొడుగులు, మాస్కులు, సబ్బులు అందజేయాలని కార్మికులు కోరుతున్నారు.

ఎలా బతకాలి?



ప్రతీ నెలా రూ.15 వేలు వేతనం కాగా, మూడు నెలలుగా జీతాలు అందలేదు. దీంతో కుటుంబం గడవటం కష్టంగా మారింది. నెలంతా కష్టపడి వేతనాల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది.

– శారద, జేకే ఏరియా సులభ్ కాంప్లెక్సు కార్మికురాలు, ఇల్లెందు

కనీస వేతనం లేదు



ఏళ్ల తరబడి సులభ్ కాంప్లెక్సులో పని చేస్తున్నా. ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనం అమలు నోచుకోలేదు. ఇతర డిమాండ్లు కూడా అమల్లోకి రావడం లేదు. సింగరేణి సంస్థ సులభ్ భవనాలకు మరమ్మతులు చేసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.

– మధు, 24 ఏరియా సులభ్ కాంప్లెక్సు కార్మికురాలు, ఇల్లెందు

సింగరేణిలో సులభ్ కాంప్లెక్సులు

కొత్తగూడెం ఏరియాలో	10
కార్పొరేట్	5
మణుగూరు	4
ఇల్లెందు	7
భూపాలపల్లి	16
రామగుండం	1
రీజియన్	24
రామగుండం	2
రీజియన్	12
రామగుండం	3
రీజియన్	4
శ్రీరాంపూర్	48
బెల్లంపల్లి	4
మందమర్రి ఏరియాలో	79



ఇల్లెందు జేకే బస్టాప్ ఏరియాలో మరమ్మతులకు నోచుకోని సులభ్ కాంప్లెక్సులు

నిర్వహణ గాలికి..

సింగరేణి వ్యాప్తంగా ఉన్న సులభ్ కాంప్లెక్సులు 30 ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో.. పురాతన గదుల్లో వర్షాలకు పై కప్పులు కురుస్తూ, తలుపులు లేక అధ్వానంగా తయారయ్యాయి. ఎంతో కాలంగా అక్కడి ప్రజలు, కార్మికులు వేడుకున్నా సింగరేణి సంస్థ మాత్రం వీటికి మరమ్మతులు మరిచిపోయింది. నెలకు ఒక ఫినాయిల్ బాటిల్ ఇచ్చి చేతులు దులిపేసుకోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

అమరుల కుటుంబాలను పరామర్శించారా..?

డిప్యూటీ సీఎం భట్టిపై ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు.. తన రాజకీయ జీవితంలో ఒక్కరంటే ఒక్క తెలంగాణ ఉద్యమ అమరుని కుటుంబాన్నయినా పరామర్శించారా? అని ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. అమరవీరుల విషయాన్ని పక్కన పెడితే.. కనీసం వేలాది మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నా పరామర్శించలేదని, పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. హైడ్రా కూల్చివేతలతో ఆత్మహత్యలు చేసుకున్నవారు, లగచర్ల రైతుల కుటుంబాలను సైతం పరామర్శించలేదని ఆరోపించారు. తెలంగాణలో పదవులు కావాలి.. తెలంగాణ వ్యతిరేకులతో స్నేహం కావాలి.. అన్నట్లు భట్టి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించగానే.. అసత్య ప్రచారాలు, అడ్డగోలు వార్తల వంశీని పరామర్శించేందుకు భట్టి విక్రమార్క ఆగమేఘాల మీద బయలుదేరి వెళ్లారని ఆరోపించారు.

గ్రూప్-2లో మహిళలకు తీవ్ర నష్టం

బీఆర్ఎస్ మహిళానేత దాసరి ఉష



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-2 నియామకాల్లో మహిళా అభ్యర్థులకు తీవ్ర నష్టం జరిగిందని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన గ్రూప్-2 నోటిఫికేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా మార్చివేసిందని ఆరోపించారు. మొత్తం 753 పోస్టుల్లో మహిళలకు 259 పోస్టులు దక్కాలన్నారు. కానీ కేవలం 169 పోస్టులు ఇచ్చారని, ఈ మేరకు ధ్రువపత్రాలను పరిశీలించారని తెలిపారు. మహిళకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే.. ఇంకా 90 పోస్టులను ఇవ్వాలన్నారు. ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో మహిళలకు ఒక్కపోస్టు కూడా దక్కలేదన్నారు. ఈ అంశంపై టీజీపీఎస్సీ అధికారులను నిలదీస్తే తదుపరి నోటిఫికేషన్‌లో భర్తీ చేస్తామంటున్నారని మండిపడ్డారు.

తగ్గుతున్న పొదుపు... పెరుగుతున్న అప్పు..!

జీడీపీలో 18.1 శాతానికి పడిపోయిన కుటుంబ పొదుపు
ఇదేసమయంలో 6.2 శాతానికి పెరిగిన రుణాలు
కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక



సాక్షి, అమరావతి: దేశంలో కుటుంబ పొదుపు రేట్లు తగ్గి రుణాలు పెరుగుతున్నాయి. వరుసగా మూడు సంవత్సరాలుగా స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో తగ్గుతూ వస్తున్న దేశీయ నికర కుటుంబ పొదుపు రేటు తాజాగా 18.1 శాతానికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోందని రేటింగ్ ఏజెన్సీ కేర్ ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక ఒకటి తెలిపింది. నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు ఇలా..

- 2022–23లో జీడీపీలో 18.4 శాతంగా ఉన్న గృహ పొదుపు రేటు 2023–24కు 18.1 శాతానికి పడిపోయింది.
- కోవిడ్ మహమ్మారి రాకముందు భారతీయుల సగటు గృహ పొదుపు జీడీపీలో 21.1 శాతంగా ఉంటే ఆ తర్వాత నుంచి క్రమేపీ తగ్గుతూ వస్తోంది.
- ఇదే సమయంలో రికార్డు స్థాయిలో జీడీపీలో రుణాల వాటా పెరిగిపోతోంది. 2022–23లో మొత్తం జీడీపీలో 5.8 శాతంగా ఉన్న రుణాల వాటా ఇప్పుడు ఏకంగా 6.2 శాతానికి పెరిగింది. గడిచిన 20 ఏళ్లల్లో ఈ స్థాయిలో రుణాలు పెరగడం ఇదే తొలిసారి.
- మొత్తం జీడీపీలో పొదుపు వాటా 2014–15లో 32.2 శాతం.
- ఒక పక్క పొదుపు రేటు తగ్గుతూ అదే సమయంలో రుణాల్లో వృద్ధి నమోదు కావడం.. తమ వినియోగ అవసరాలను తీర్చుకోవడం కోసం రుణాలపై ఆధారపడుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోందన్న విషయాన్ని స్పష్టం చేస్తోంది.
- గ్రామీణ ప్రాంతాల్లో మగవారి కూలీలో 6.1 శాతం వృద్ధి నమోదయ్యింది. ఇదే సమయంలో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం కొంత సానుకూల అంశం.
- ఐటీ కంపెనీల్లో జీతాల పెరుగుదల తగ్గుముఖం పట్టింది.
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేటు రెపోను (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు–ప్రస్తుతం 5.5 శాతం) తగ్గించడంతో రానున్న కాలంలో రుణ భారం తగ్గి పొదుపులు పెరిగే అవకాశాలున్నాయి.



అరటి సాగులో ఆదర్శం

- అంతర్ పంటలుగా వక్క, టెంకాయ
- బెంగళూరులో నివాసముంటూ సొంతూరిలో వ్యవసాయం




సాగు చేసిన అరటి పంటను చూపుతున్న రైతు గోపాలరెడ్డి, కోత దశలో ఉన్న యాలక్కి అరటి గెలలు

పెనుకొండ: అరటి సాగులో సత్యసాయి జిల్లా పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని మంగాపురం గ్రామానికి చెందిన గోపాలరెడ్డి వైవిధ్యాన్ని కనబరుస్తూ పలువురిని ఆకర్షిస్తున్నారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఆయన కుటుంబసభ్యులతో కలసి మహానగరంలోనే నివాసముంటున్నారు. అయితే వ్యవసాయంపై మక్కువ ఉన్న ఆయన తరచూ అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తూ గ్రామంలో తనకున్న 3.75 ఎకరాల్లో యాలక్కి రకం అరటి సాగు చేపట్టారు. ప్రస్తుతం కోత దశలో ఉన్న అరటి గెలలను బెంగళూరుకు చెందిన వ్యాపారులకు టన్ను రూ. 50 వేల చొప్పున విక్రయించేలా ఒప్పందం చేసుకున్నారు.

సాగును భారంగా భావిస్తున్న ప్రస్తుత తరుణంలో ఓ ఉద్యోగి పంటల సాగుపై మక్కువ పెంచుకున్నాడు. వృత్తి రీత్యా బెంగళూరులో స్థిరపడినా... సొంతూరులోని పొలంలో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు.

రూ. 26 లక్షల ఖర్చు..

తన తమ్ముడి సహకారంతో యాలక్కి అరటి సాగులో అంతర్‌పంటగా వక్క, టెంకాయ చెట్లను గోపాలరెడ్డి పెంచుతున్నారు. ఈ క్రమంలో పొలం చుట్టూ ఫెన్సింగ్, బోరు వేయించడం, డ్రిప్ ఏర్పాటు, షెడ్ నిర్మాణం, వీడర్ కొనుగోలు, పొలం చదును, కూలీలు, ఇతర ఖర్చులు కలిపి దాదాపు రూ.26 లక్షల వరకూ వెచ్చించారు. కర్ణాటకలోని నెలమంగల సమీపంలో ఉన్న ఫ్రీసీ బనానా కంపెనీ నుంచి టిష్యూ కల్చర్ అరటి ఒక్కో మొక్కను రూ.30 చొప్పున, శివమొగ్గ సమీపంలోని తీర్థహళ్లి నుంచి వక్క మొక్కలు, చెళ్లకెర నుంచి ఒక్కో టెంకాయ మొక్కను రూ.380తో కొనుగోలు చేశారు. మొత్తం 2,500 అరటి మొక్కలు, 1,800 వక్క, 110 టెంకాయ మొక్కలను ఒకేసారి పొలంలో నాటి సాగు చేపట్టారు. ప్రస్తుతం చేతికి అందివచ్చిన తొలిదశ అరటి పంటను విక్రయించగా రూ.3.50 లక్షల ఆదాయం సమకూరింది. మరో రెండు కోతల పంట చేతికి వచ్చే అవకాశముంది. అరటి పిలకలను విక్రయిస్తుంటారు. ఒక్కో పిలకను రూ.20 నుంచి రూ.25 చొప్పున కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. అరటి ఆకులను బెంగళూరుకు తరలించి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం అరటి మొక్క బోద నుంచి లభ్యమయ్యే గడ్డను ఇతర రైతులు తీసుకెళ్లి తమ పొలాల్లో పంట పెట్టుకుంటున్నారు. ఒక్కో గడ్డను రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు.

అవగాహనతోనే పంటల సాగు

పంటల సాగుపై అనుభవం ఉంది. పిల్లల భవిష్యత్తు కోసం బెంగళూరులో నివాసముంటూ భార్యతో కలసి ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నా. గ్రామంలో పెద్దల నుంచి సంక్రమించిన 3.75 ఎకరాల పొలాన్ని బీడుగా మార్చడం ఇష్టం లేక అరటి సాగు చేపట్టాను. భవిష్యత్తు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అంతర్ పంటగా వక్క, టెంకాయ చెట్లను పోషిస్తున్నా. వృద్ధురాలైన తల్లి, వికలాంగుడైన తమ్ముడు తోడుగా ఉంటున్నారు. పంట సాగులో రైతులెవరైనా నా సహకారం కావాలనుకుంటే 974047 1698కు ఫోన్ చేసి సలహాలు తీసుకోవచ్చు.

– గోపాలరెడ్డి, రైతు



చక్కగా పెరుగుతున్న టెంకాయ చెట్టు

కొబ్బరి @ రూ.22 వేలు



పచ్చికొబ్బరి రాశులు

- చరిత్రలో తొలిసారి రికార్డు ధర
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 1.8 లక్షల ఎకరాల్లో సాగు
- ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో గణనీయంగా తగ్గిన దిగుబడి ఉత్తరాదికి దిక్కయిన ఆంధ్రా కొబ్బరి

సాక్షి, అమలాపురం: జాతీయ మార్కెట్‌లో ఆంధ్రా కొబ్బరి రికార్డుల మీద రికార్డు సృష్టిస్తోంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో కొబ్బరి కాయ దిగుబడి తగ్గడం ఆంధ్రా రైతులకు వరంగా మారింది. కొబ్బరి చరిత్రలో తొలిసారి అంబాజీపేట మార్కెట్‌లో వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.22 వేలు పలికింది. లంక గ్రామాల్లో కొబ్బరి కాయ రూ.23 వేల వరకూ ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 1.8 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. ఒక్క కోనసీమ జిల్లాలోనే 1.10 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు ఉంది. గత ఏడాది నుంచి పచ్చికాయ, ముక్కుడు కాయ (నిల్వ కాయ) వెయ్యి కాయల ధర రూ.10 వేలకు ఎప్పుడూ తగ్గలేదు. గత మే నెలలో ఒకానొక సమయంలో రూ.12 వేల వరకూ ఉండగా తరువాత నెమ్మదిగా పెరుగుతూ వస్తోంది. మే చివరి వారంలో రూ.16 వేలకు చేరింది. ఈ నెల మొదటి వారంలో కొబ్బరి కాయ ధర రూ.17,500 నుంచి రూ.18,500 వరకూ పెరిగింది. రెండు రోజుల క్రితం రూ.20 వేల వరకు పెరగగా, శనివారం మార్కెట్‌లో రూ.22 వేలు పలికింది. మరో వారం రోజుల్లో ధర మరింత పెరగవచ్చని రైతులు, వ్యాపారులు అంచనా వేస్తున్నారు. కొబ్బరి పండే దక్షిణాది రాష్ట్రాల్లో దిగుబడి గణనీయంగా తగ్గగా కేరళలో దిగుబడి మరింత పతనమైంది. ఇక్కడ చెట్టుకు సగటు దిగుబడి 50 కాయలు కాగా ఇప్పుడు 15 కాయలకు పడిపోవడంతో ఉత్తరాది అవసరాలు మొత్తాన్ని రాష్ట్రంలో కొబ్బరి తీర్చాల్సి వస్తోంది. దీనికితోడు గత ఏడాది కాలంగా దిగుబడిగా వచ్చిన కొబ్బరి ఇటు రైతుల వద్ద కానీ, వ్యాపారుల వద్ద కానీ నిల్వ ఉండటం లేదు. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతుల వద్ద నుంచి, వ్యాపారుల వద్ద నుంచి వారం రోజుల వ్యవధిలోనే ఎగుమతి అవుతోంది. ఇది కూడా ధర పెరుగుదలకు కారణమవుతోంది. రాష్ట్రం నుంచి ఉత్తరాదిలోని గుజరాత్, హర్యానా, మహారాష్ట్రతో పాటు బిహార్, ఉత్తర ప్రదేశ్‌లకు పచ్చికాయ అధికంగా ఎగుమతి అవుతోంది. ధర పెరిగినా రైతులు ఆచితూచి విక్రయిస్తున్నారు. పెరిగిన ధర కొబ్బరి రైతుల్లో జోష్ నింపింది.

క్లుప్తంగా...

వినియోగదారుల గొంతు కోసేందుకే స్మార్ట్ మీటర్లు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: స్మార్ట్ మీటర్లతో ప్రజలకు ఉపయోగం లేదనీ, వాటిని తయారు చేసే కంపెనీలకు, విద్యుత్‌ను అమ్ముకునే ప్రైవేటు కంపెనీలకు లాభమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని కూటమి నేతలు ఎన్నికల ముందు ప్రజలకు పిలుపునిచ్చారని, అప్పట్లో పయ్యావుల కేశవ్‌తో షిర్డీసాయి కంపెనీపై కోర్టులో కేసు వేయించారని గుర్తు చేశారు. చిత్తశుద్ధి ఉంటే ఇప్పుడు ఆ కేసు విచారణ జరిపి స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

వసతి గృహాల్లో డైట్ చార్జీలు పెంచండి

మంత్రికి రాష్ట్ర వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో ప్రస్తుత ధరలకు అనుగుణంగా డైట్ (మెనూ) చార్జీలు పెంచాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితకు రాష్ట్ర వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం విజ్ఞప్తి చేసింది. తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసిన సంఘ ప్రతినిధులు పలు సమస్యలపై మంత్రికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని వసతి గృహాల్లో నాలుగో తరగతి సిబ్బంది, వసతి గృహ సంక్షేమ అధికారుల ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సి.మస్తాన్, గౌరవాధ్యక్షుడు దయానందరాజు తదితరులు ఉన్నారు.

2న సీఎం చంద్రబాబు కుప్పం రాక

కుప్పం: జూలై 2న ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఖరారైంది. మంగళవారం రాత్రి బెంగళూరు నుంచి సీఎం శాంతిపురం మండలం, కడపల్లి గ్రామంలోని సొంత ఇంటికి చేరుకుంటారు. బుధవారం ఉదయం శాంతిపురం మండలం, తిమ్మరాజుపల్లి గ్రామంలో కుటుంబ సాధికార సమితి సభ్యులు 60 కుటుంబాలతో పరిచయ వేదిక నిర్వహిస్తారు. అనంతరం తులసినాయపల్లి వద్ద జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. తర్వాత విజయవాడకు తిరుగు ప్రయాణమవుతారు.

గిరిజనుల అభివృద్ధి పట్టదా బాబూ?

- అధికారంలోకి వచ్చి ఏడాదైనా గిరిజన సలహా మండలి ఏది?
- గిరిజన సంక్షేమ శాఖ ఫైలు పంపినా సీఎం పేషీలో పెండింగ్

సాక్షి, అమరావతి: గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించిన కీలకమైన గిరిజన సలహా మండలి ఏర్పాటు గురించి సీఎం చంద్రబాబు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారం చేపట్టి ఏడాది దాటినా గిరిజన సలహా మండలి ఏర్పాటుకు చర్యలు చేపట్టలేదు. గిరిజన సలహా మండలి ఏర్పాటుకు సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ ప్రతిపాదనలతో ఫైలును చాలా రోజుల కిందటే ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించింది. ఆ ఫైలు ముఖ్యమంత్రి కార్యాలయంలోనే మగ్గుతోంది. షెడ్యూల్డ్ ప్రాంతాలు ఉన్న ప్రతి రాష్ట్రంలో రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్, ఆర్టికల్ 244 (1)లోని 4వ పేరాలోని నిబంధనల ప్రకారం గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాల్సి ఉంది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షతన గిరిజన ఎమ్మెల్యేలు, అధికారులతో గిరిజన సలహా మండలి ఏర్పాటు చేస్తే ఆరు నెలలకు ఒకసారి సమావేశమై గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం విషయంలో తగిన నిర్ణయాలు తీసుకుని అమలు చేయిస్తుంది. అందుకు సంబంధించిన నివేదికలను గవర్నర్‌కు అందజేస్తే, ఆయన రాష్ట్రపతికి సమర్పిస్తారు. రాజ్యాంగం పరంగా ప్రాముఖ్యత కలిగిన గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయకపోవడంతో గిరిజనుల సంక్షేమ కార్యక్రమాలు, షెడ్యూల్ ప్రాంతాల సమగ్రాభివృద్ధిని పట్టించుకునే వారే లేకుండాపోయారు.

గతంలోనూ ఇంతే...

చంద్రబాబు 2014–19 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా గిరిజన సలహా మండలి ఏర్పాటుపై తీవ్ర నిర్లక్ష్యం చేశారు. దీంతో గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలని అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడేళ్లపాటు పోరాటం చేశారు. నాటి గవర్నర్ నరసింహన్‌ను కూడా వైఎస్ జగన్ కలిసి వినతిపత్రం కూడా అందించారు. దానిపై గవర్నర్ స్పందిస్తూ గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేశారా? లేదా? ఏర్పాటు చేస్తే ఆ వివరాలను పంపించండి.. అని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో చంద్రబాబు నాడు అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత 2017, సెప్టెంబర్ 25వ తేదీన గిరిజన సలహా మండలి ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పుడు కూడా అదే తరహాలోనే తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఏపీలో 213 మంది అరెస్ట్

బాలకార్మికుల రెస్క్యూ ఆపరేషన్స్ వివరాలు వెల్లడి



- 2024–25లో అత్యధిక బాలకార్మిక రెస్క్యూ ఆపరేషన్‌లు తెలంగాణలోనే

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన బాలకార్మికుల కేసుల్లో 211 మందిని, బెగ్గింగ్ కేసులో ఒకరిని, లైంగిక దోపిడీ వ్యవహారంలో మరొకరిని కలిపి మొత్తం 213 మంది అరెస్టయ్యారు. దేశవ్యాప్తంగా బాలల హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి 2024–25లో నమోదైన కేసులు, కాపాడిన బాలల వివరాలను ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ అనే స్వచ్ఛంద సంస్థ వెల్లడించింది. ఈ నివేదికలో తెలంగాణ తొలిస్థానంలో నిలిచింది. బాలకార్మికులు, యాచక, లైంగిక దోపిడీకి సంబంధించి నమోదైన కేసుల్లో విముక్తి పొందిన వారిలో 90 శాతం మంది బాలకార్మికులేనని.. అత్యధికంగా తెలంగాణ నుంచి 11,063 మంది ఉన్నారని తెలిపింది. బాలకార్మికులకు సంబంధించి కేసుల్లో జరిగిన అరెస్టులలోనూ తెలంగాణ తొలి స్థానంలో ఉందని వివరించింది. ఈ మేరకు ఇటీవల విడుదల చేసిన నివేదికలో పలు అంశాలను పొందుపరిచింది.

నివేదికలోని అంశాలు ఇలా...

- 2024–25లో దేశవ్యాప్తంగా 27,320 రెస్క్యూ ఆపరేషన్‌లు నిర్వహించారు. అందులో అత్యధికంగా తెలంగాణలో 7,632 రెస్క్యూ ఆపరేషన్లు జరగ్గా యూపీలో 2,469, రాజస్తాన్‌లో 2,453, మధ్యప్రదేశ్‌లో 2,335 రెస్క్యూ ఆపరేషన్లు జరిగాయి. దేశవ్యాప్తంగా నిర్వహించిన అన్ని రెస్క్యూ ఆపరేషన్లలో 86 శాతం బాలకార్మికులకు సంబంధించినవే ఉన్నాయి.
- వివిధ ప్రభుత్వ సంస్థలు, ఎన్జీఓలు కలిపి రక్షించిన 44,902 మంది బాలల్లో 90 శాతం మంది బాలకార్మికులే ఉన్నారు. వారిలో అత్యధికంగా తెలంగాణలో 11,063 మందిని రక్షించారు. ఆ తర్వాత స్థానాల్లో బిహార్ 3,974, రాజస్తాన్ 3,847, యూపీ 3,804, ఢిల్లీ 2,588 ఉన్నాయి.
- మొత్తంగా 2,971 మంది బాలలను లైంగిక దోపిడీ నుంచి రక్షించగా అందులో అత్యధికంగా పశ్చిమ బెంగాల్ నుంచి 1,005 మందిని, బిహార్‌లో 454 మందిని, ఒడిశాలో 232 మందిని, మహారాష్ట్రలో 194, రాజస్తాన్‌లో 191 మందిని కాపాడారు.
- బాలకార్మికులు, బెగ్గింగ్, లైంగిక దోపిడీకి సంబంధించి 2024–25లో మొత్తంగా 5,809 మంది యజమానులు, అక్రమ రవాణాదారులను అరెస్ట్ చేశారు. ఈ మొత్తం కేసుల్లో అత్యధిక అరెస్టులు తెలంగాణలో జరిగాయి. బాలకార్మికుల కేసుల్లో 2,226, లైంగిక దోపిడీల్లో 21 అరెస్ట్ కలిపి మొత్తంగా 2,247 అరెస్ట్ అయ్యాయి.
- 2024–25 11,409 మంది పిల్లల మిస్సింగ్ కేసులు నమోదవగా 8,749 మంది పిల్లలను గుర్తించారు. అందులో అత్యధికంగా బెంగాల్‌లో 3,509 మందిని, మహారాష్ట్రలో 1,149, బిహార్‌లో 1,306 మందిని కాపాడారు.



అల్యూమినియం పాత్ర.. 'అతి' వాడకంతో ముప్పు!

12-24 నెలలకు మించి ఆ పాత్రలు వాడకపోవడం ఉత్తమం



- తేలికపాటి పాత్రలను ఏడాదికి మించి వినియోగించకూడదు
- బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సూచన
- అతి వినియోగంతో ఆహారంలో కలుస్తున్న అల్యూమినియం
- ఆరోగ్యంపై ప్రభావం చూపించే అవకాశం

ఒకప్పుడు వంట చేయాలంటే మట్టి పాత్రలే వినియోగించేవాళ్లు. ఆ తర్వాత కాలక్రమేణా వంటింట్లోకి రాగి, ఇత్తడి, స్టీల్, అల్యూమినియం, నాన్‌స్టిక్ పాత్రలు చొచ్చుకొచ్చేశాయి. ప్రస్తుతం వీటిలో అత్యధిక మంది ఉపయోగించేవి అల్యూమినియం పాత్రలే. అన్నం, కూర, పిండివంటలు.. వంటకం ఏదైనా అల్యూమినియం గిన్నెలు ఉండాల్సిందే. ఈ పాత్రలు ఉపయోగించడం వరకు బాగానే ఉన్నా.. వాటిని సుదీర్ఘ కాలం వాడటం ఆరోగ్యానికి ఎంత మాత్రం మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ వంట పాత్రలకూ ఎక్స్‌పెయిరీ ఉంటుందని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) వెల్లడించింది. -సాక్షి, అమరావతి

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం..

ఈ పాత్రల్లో టమాటా, చింతపండు, నిమ్మకాయ వంటి పుల్లటి పదార్థాలతో వంటలు చేయడం వల్ల అల్యూమినియం కరిగి ఆహారంలోకి చేరుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆ ఆహారం శరీరంలోకి ప్రవేశించి ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపిస్తుందని తెలిపారు. ఎముకలు, మెదడు సంబంధిత సమస్యలు తలెత్తే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాల కిడ్నీ జబ్బుతో బాధపడేవారికి మరింత ఎక్కువ హాని చేసే అవకాశం ఉందని వివరించారు.

రెండేళ్లకు మించి వాడొద్దు..

1938లో ఇండియన్ అల్యూమినియం కంపెనీ మన దేశంలో ఉత్పాదకత ప్రారంభించింది. అనంతరం అల్యూమినియం వంట పాత్రల తయారీ కుటీర పరిశ్రమగా మారింది. దేశంలో ఈ పాత్రలు లేని వంట గది ఉండదు. అందుబాటు ధరల్లో లభిస్తుండటంతో ప్రజలు వీటిని విరివిగా ఉపయోగిస్తున్నారు. అయితే వీటిని సుదీర్ఘకాలం ఉపయోగించకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వీటి తయారీ నాణ్యతను బట్టి 12 నుంచి 24 నెలలకు ఒకసారి పాత్రలను మారుస్తుండాలని బీఐఎస్ సూచించింది. తేలికైన వంట పాత్రలను ఏడాదికి మించి వాడకూడదని తెలిపింది. సూపర్ గ్రేడ్ వంట సామగ్రి సైతం అధిక ఉష్ణోగ్రతల్లో వేడికి గురై నెలల వ్యవధిలోనే పాడై పోతుంటాయని పేర్కొంది. ఈ క్రమంలో వీటిని రెండేళ్లకు మించి వినియోగించకపోవడం ఉత్తమమని సూచించింది.

త్వరలో కొత్త నిబంధనలు అమల్లోకి..

అల్యూమినియం వంట పాత్రల తయారీ ప్రమాణాలను బీఐఎస్ సవరించింది. వంట పాత్రల తయారీలో సీసం, కాడ్మియం, పాదరసం, హెక్సావాలెంట్ క్రోమియం వంటివి 0.05 శాతం కంటే తక్కువ ఉండాలని స్పష్టం చేసింది. వచ్చే నెల నుంచి దేశంలోని చిన్న పరిశ్రమలు, అక్టోబర్ నుంచి సూక్ష్మ పరిశ్రమల్లో ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. అలాగే వంట పాత్రలపై అల్యూమినియం గ్రేడ్‌ను లేబులింగ్ చేయడం తప్పనిసరి చేసింది.

ట్రావెల్

మధ్యప్రదేశ్ జ్యోతిర్లింగ దర్శనం.
ప్రాచీన కోటల సందర్శనం.
సాంచి బౌద్ధ స్థూపం వీక్షణం.
ఇండోర్ లాల్‌బాగ్ ప్యాలెస్.
ఉజ్జయిని మహాకాలేశ్వరుడు.
భోపాల్ ఆదివాసీ ఆద్యకళల నిలయం.
నర్మద తీరాన అహిల్యాబాయి కోట.
ఇంకా... ఇంకా ఈ టూర్‌లో.



ఇండోర్‌లోని సాంచి స్థూపం

ఎంపీ టూర్

ఆద్యంతం... ఆసక్తికరం

1వ రోజు
సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ (12707) సాయంత్రం నాలుగన్నరకు కాచిగూడ స్టేషన్‌లో బయలుదేరుతుంది. రాత్రంతా ప్రయాణం.



భోపాల్ ట్రైబల్ మ్యూజియం



సాంచి ఆర్కియలాజికల్ మ్యూజియంలోని నాలుగు సింహాల అశోకుని రాజముద్ర, ధర్మచక్రం

మధ్యప్రదేశ్ జ్యోతిర్లింగ్ దర్శన్ (ఎస్‌హెచ్‌ఆర్ 097). ఇది ఆరు రోజుల యాత్ర. భోపాల్, ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ఇండోర్ ప్రదేశాలను సందర్శించవచ్చు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్ నుంచి ట్రైన్ నంబరు 12707, సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ బుధవారం సాయంత్రం నాలుగన్నరకు బయలుదేరుతుంది. ఇది వీక్లీ టూర్.

- కంఫర్ట్ (థర్డ్ ఏసీ)లో సింగిల్ షేరింగ్‌కి 36 వేలకు పైగా అవుతుంది. ట్విన్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 20వేలు దాటుతుంది. ట్రిపుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి దాదాపుగా 16 వేలవుతుంది. నలుగురు నుంచి ఆరుగురు వరకు బృందంగా ప్రయాణం చేస్తే మరికొంత తగ్గుతుంది.
- స్టాండర్డ్ (స్లీపర్) కేటగిరీలో సింగిల్ షేరింగ్ సుమారు 34 వేలు, ట్విన్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి సుమారు 18 వేలవుతుంది. ట్రిపుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి సుమారు 14 వేలవుతుంది.
- **టూర్ కోడ్:** https://www.irctctourism.com/pacakage_description?packageCode=SHR097


2వ రోజు

రైలు ఉదయం 08:15 గంటలకు భోపాల్ రైల్వే స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి హోటల్ గదిలో చెక్ ఇన్, ఫ్రెష్ అప్ అయిన తర్వాత రోడ్డు మార్గాన సాంచి స్థూపానికి ప్రయాణం. ఆ తర్వాత భోజేశ్వర్ మహాదేవ్ ఆలయ దర్శనం చేసుకుని తిరిగి భోపాల్‌కు రావాలి. భోపాల్‌లోని ట్రైబల్ మ్యూజియం వీక్షణం. రాత్రికి హోటల్‌లో బస.

అశోకుడి పెళ్లి మండపం!

సాంచి స్థూపం బౌద్ధ క్షేత్రాల్లో ప్రధానమైనది. మన ప్రాచీన నిర్మాణ శాస్త్ర విజ్ఞానానికి ప్రతీక. యునెస్కో గుర్తించిన వరల్డ్ హెరిటేజ్ సైట్ కూడా. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ నగరానికి 45 కిలోమీటర్ల దూరాన ఉంది. ఇది క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దం నాటి నిర్మాణం. ఈ చారిత్రక నిర్మాణం మౌర్య, బౌద్ధ వాస్తుశైలిల సమ్మేళనం. బుద్ధుని అవశిష్టాన్ని ప్రతిష్ఠించి నిర్మించారు. స్థూపానికి దక్షిణ ముఖ ద్వారానికి దగ్గరగా సాంచి ఆర్కియలాజికల్ మ్యూజియం ఉంది. ఇందులో నాలుగు సింహాల అశోకుని రాజ ముద్ర, ధర్మచక్రం ఉన్నాయి. అశోక చక్రవర్తి బౌద్ధాన్ని స్వీకరించిన తర్వాత చేసిన గొప్ప నిర్మాణాల్లో ఇది ముఖ్యమైనది. ఇది అశోకుని భార్య దేవి పుట్టిన ప్రదేశం, వారి వివాహం జరిగిన ప్రదేశం కూడా ఇక్కడికి పది కిలోమీటర్ల దూరానున్న విదిశ.. రెండు వందల రూపాయల కరెన్సీ నోట్‌ను వెనక్కి తిప్పి చూడండి. సాంచిలోని బౌద్ధస్థూపం కనిపిస్తుంది.





భోజేశ్వర మందిరం



భోజ్‌పూర్ మందిరంలోని సీలింగ్



భోజ్‌పూర్ మందిరం దగ్గరి విగ్రహాలు

భోపాల్ మ్యూజియం - ఆదివాసీల ఆద్యకళ

(ఆద్యకళా నిలయం)

మధ్యప్రదేశ్‌లో నివసించే ఆదివాసీలు, వారి జీవనశైలికి ఒక మీనియేచర్ రూపమే ఈ ట్రైబల్ మ్యూజియం. ఇందులో స్థానికంగా నివసించే గోండ్, భిల్, భారియా, సహారియా, కోర్కు, కోల్, బైగా ఆదివాసీ జాతుల రోజువారీ వస్తువులు, కళాకృతులు ఉన్నాయి. ఆదిలాబాద్‌లోని ఆదివాసీలు తయారు చేసే ఢోక్రా శైలి ఇత్తడి బొమ్మలు కూడా ఉన్నాయి. ఆదివాసీలు ధాన్యం నిల్వచేసుకోవడానికి అడవిలోని చెట్ల తీగలతో అల్లిన పెద్ద పెద్ద బుట్టలు ఉంటాయి.

భోజ్‌పూర్ ఈశ్వరుడు

భోజేశ్వర మందిరం... ఉన్న ప్రదేశం పేరు భోజ్‌పూర్. ఇది చిన్న గ్రామం. పారమార రాజు భోజుడు నిర్మించిన ఆలయం ఇది. అయితే ఇక్కడ ఆలయ నిర్మాణం పూర్తయినట్లు కనిపించదు. అర్ధంతరంగా ఆగిపోయిందా లేక నిర్మాణం విధ్వంసానికి గురైందా అనే సందేహం వస్తుంది. ఆలయ ప్రాంగణంలో అక్కడక్కడా శిల్పాల విడిభాగాలు కనిపిస్తాయి. ఆ విడిభాగాలు క్షతగాత్రాలు కాదు. ఒక పెద్ద శిల్పం ఆకారం ఉంటుంది, కానీ మెరుగులు లేక అసంపూర్తిగా కనిపిస్తుంది. బహుశా ఈ ఆలయ నిర్మాణాన్ని తలపెట్టిన తర్వాత అనుకోని కారణాలతో నిర్మాణం ఆగిపోయి ఉండవచ్చని చరిత్రకారుల అంచనా. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా దీనిని నిశితంగా పరిశోధించి మాన్యుమెంట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్‌గా గుర్తించింది. ఏటా ఇక్కడ శివరాత్రి వేడుక అంబరాన్ని తాకుతుంది.

3వ రోజు



ఉజ్జయిని మహాకాళేశ్వర్ ఆలయం


బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్, ఉజ్జయినికి ప్రయాణం. ఉజ్జయినిలో హోటల్ చెక్ ఇన్. మహాకాలేశ్వర్ ఆలయం, హర్‌సిద్ధి ఆలయం, మంగళ్‌నాథ్ ఆలయం, నవగ్రహ శని మందిర్, శ్రీచింతామన్ గణేశ్ టెంపుల్, రామ్‌ఘాట్, శ్రీగఢ్‌కాలిక టెంపుల్ దర్శనం, రాత్రికి ఉజ్జయినిలోనే బస.

క్షతగాత్ర ఉజ్జయిని

ప్రాచీనకాలం నుంచి ప్రాముఖ్యత కలిగిన ప్రదేశం ఇది. పద్దెనిమిది శక్తిపీఠాల్లో ఉజ్జయిని ఒకటి. ద్వాదశ జ్యోతిర్లింగం కూడా. సతీదేవి దేహంలో పై పెదవి పడిన ప్రదేశం ఉజ్జయిని అని చెబుతారు. మహాకాలేశ్వరుడి ఆలయం కూడా ఇక్కడ ప్రసిద్ధి. గుజరాత్ లోని సోమనాథ్ ఆలయం లాగానే ఇది కూడా విధ్వంసాల బారిన పడిన ఆలయం. ఢిల్లీ పాలకుడు ఇల్టుట్‌మిష్ తన రాజ్యవిస్తరణలో భాగంగా ఉజ్జయిని మీద దండెత్తి విజయం సాధించిన సందర్భంగా ఇక్కడి ప్రాచీన ఆలయాన్ని ధ్వంసం చేశాడు. జ్యోతిర్లింగాన్ని ముక్కలు చేసి సమీపంలోని కోటితీర్థ కుండ్‌లో విసిరివేశాడని చెబుతారు. మరాఠా రాజోద్యోగి రామచంద్ర బాబా సుఖ్తాంకర్ పునర్నిర్మాణం చేశాడు. కానీ అది కూడా జలాలుద్దీన్, అలాఉద్దీన్ ఖిల్జీల దాడికి గురైంది.


ఈ శని క్షేత్రం త్రివేణీ సంగమం

నవగ్రహ శని మందిర్ ఉజ్జయినికి ఎనిమిది కిలోమీటర్ల దూరాన ఉంది. ఇక్కడ క్షిప్ర, గండకి, సరస్వతి నదులు కలుస్తాయి. ఈ ప్రదేశాన్ని త్రివేణీ ఉజ్జయిని అంటారు. సాధారణంగా శివాలయం లేదా ఇతర ఆలయాల్లో నవగ్రహాల వేదిక ఉంటుంది. ఇక్కడ నవగ్రహాల కోసమే ఓ ఆలయం ఉంది.



సీతమ్మ కొలిచిన గణేశుడు

ఈ ఆలయం ఉజ్జయినికి ఏడు కిలోమీటర్ల దూరాన ఫతేహాబాద్‌లో ఉంది. స్వయంభువుగా వెలిసిన ఈ గణేశుడిని కొలిస్తే మనసులోని చింతలన్నీ తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. రామాయణ కాలంలో సీతాదేవి ఈ ప్రదేశంలో కొంత కాలం నివసించిందని, ఆ సమయంలో ఈ గణేశుడిని ప్రార్థించినదని చెబుతారు. ఇక్కడి క్షిప్రా నది తీరాన రామ్‌ఘాట్ కూడా ఉంది.



4వ రోజు

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్, మహేశ్వర్‌కు ప్రయాణం. అహిల్యాదేవి కోట, నర్మద ఘాట్ దర్శనం తర్వాత ఓంకారేశ్వర్‌కు ప్రయాణం. ఓంకారేశ్వర్‌లో హోటల్ లో చెక్ ఇన్ అయిన తర్వాత నడకదూరంలో ఉన్న ఆలయాలను దర్శించుకోవచ్చు. నదిలో పడవ ప్రయాణం చేయవచ్చు. రాత్రి బస ఓంకారేశ్వర్‌లో.

రాతికి పూచిన పూలు

రాణి అహిల్యాబాయి కోట మహేశ్వర్ పట్టణంలో ఉంది. దాంతో మహేశ్వర్ కోటగా వ్యవహారంలోకి వచ్చింది. ఇది మొత్తం గ్రానైట్ స్టోన్‌తో చేసిన మరాఠా శైలి నిర్మాణం. నర్మద నది తీరాన శత్రుదుర్భేద్యంగా నిర్మించడమే కాక అత్యంత సునిశితమైన నైపుణ్యంతో నగిషీలు చెక్కారు. కోటలోని ప్యాలెస్‌ల గోడలకు చెక్కిన పూలు అప్పుడే విచ్చుకున్నట్లున్న తాజా పూల తోరణాల్లా ఉంటాయి. రాతికి పూచిన ఈ పూలు నాటి శిల్పకారుల నైపుణ్యాన్ని నేటి తరానికి తెలియచేస్తున్న ప్రతిబింబాలు. ఈ కోట స్త్రీసాధికారతకు ప్రతీక. రాణి అహిల్యాబాయ్ హోల్కర్ క్రీ.శ 1765 నుంచి 1796 వరకు మాల్వా రాజ్యాన్ని పాలించారు. ఈ కోటలో ఉన్న రాణి ప్యాలెస్‌ను మ్యూజియంగా మార్చారు. అందులో ఆమె ఆహార్యం, జీవనశైలితోపాటు పాలన రీతి కూడా కళ్లకు కడుతుంది. ఆమె వారసుడు ప్రిన్స్ రిచర్డ్ హోల్కర్ ఈ కోటలోని అహిల్యాబాయి వాడాను హెరిటేజ్ హోటల్‌గా మార్చారు. మహేశ్వరలో నర్మదాతీరాన విహరిస్తూ అనేక ఆలయాలు, చారిత్రక నిర్మాణాలను దగ్గరగా వీక్షించవచ్చు.

6వ రోజు


ఈ ట్రైన్ ఇండోర్ నుంచి ఉజ్జయిన్, భోపాల్, ఇటార్సి జంక్షన్, నిజామాబాద్, కామారెడ్డి మీదుగా ప్రయాణిస్తూ రాత్రి పది గంటలకు కాచిగూడకు చేరుతుంది.

5వ రోజు


బ్రేక్‌ఫాస్ట్ తర్వాత గది చెక్ అవుట్, ప్రయాణం ఇండోర్ వైపు సాగుతుంది. ఇండోర్‌లో లాల్‌బాగ్ ప్యాలెస్, ఖజ్రన గణేశ్ మందిర్ దర్శనం తర్వాత రాత్రి ఎనిమిది గంటలకు ఇండోర్ రైల్వేస్టేషన్‌కు వచ్చి ట్రైన్ నంబర్ 19301 అంబేద్కర్ నగర్- యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాలి. ఎనిమిది గంటలకు రైలు బయలుదేరుతుంది. రాత్రంతా ప్రయాణం.

లాల్‌బాగ్ గులాబీల తోట


ఇండోర్‌లోని లాల్‌బాగ్ ప్యాలెస్ కూడా హోల్కర్ రాజవంశ నిర్మాణమే. యాభై ఏళ్ల కిందటి వరకు ఆ రాజవంశమే ఇందులో నివసించింది. ప్రభుత్వ నిర్వహణలో ఉంది. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా దీనిని మ్యూజియంగా మార్చింది. ఈ ప్యాలెస్‌లోకి వెళ్లే ముందు మెయిన్ గేట్ నిశితంగా పరిశీలించాలి. యూరోపియన్ శైలిలో బకింగ్‌హామ్ ప్యాలెస్‌ను తలపిస్తుంది. ఇక భవనంలోపలి గదులు కూడా ప్రాచ్య-పాశ్చాత్య కలబోతగా ఉంటాయి. 76 ఎకరాల్లో విస్తరించిన ప్యాలెస్ ప్రాంగణమంతటినీ చూడడం కష్టమే. కానీ ఇరవై ఎకరాల రోజ్ గార్డెన్‌ను మిస్ కాకూడదు. అహిల్యాబాయి వాడాను ఆమె వారసుడు హోటల్‌గా మార్చాడని చెప్పుకున్నప్పుడు అతడి పేరు ప్రిన్స్ రిచర్డ్ హోల్కర్ అని చెప్పుకున్నాం. అప్పుడు కలిగిన సందేహానికి సమాధానం ఈ ప్యాలెస్‌లో లభిస్తుంది. హోల్కర్ రాజవంశానికి చెందిన తుకోజీరావ్ హోల్కర్ మూడవ భార్య అమెరికన్. పేరు నాన్సీ అన్నే మిల్లర్. తుకోజీ మరణం తర్వాత ఆమె అమెరికాకి వెళ్లిపోయారు.



లాల్‌బాగ్ ప్యాలెస్ ముఖద్వారం




లాల్‌బాగ్ ప్యాలెస్ లోపల



మహేశ్వర్ కోటలోని రాయల్ ప్యాలెస్



మహేశ్వర్ కోట



రాణి అహల్యాబాయి హోల్కర్ విగ్రహం



లాల్‌బాగ్ ప్యాలెస్

- వాకా మంజులారెడ్డి, సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి



మీ వ్యాపారాన్ని మెరుగుపరచుకోడానికి ముందు
మీరు కలలుకనే రేపటి రోజును నిజం చేసుకునే అవకాశం
మిమ్మల్ని మీరు మెరుగుపరచుకోండి.
'ఈరోజు' రూపంలో మీకు లభిస్తుంది.
- ఇదోవు కొయెనికన్, ప్రఖ్యాత రచయిత
- కెన్ పాయిరాట్, అమెరికన్ రచయిత, వ్యాపారవేత్త

న్యూ ఫండ్ ఆఫర్...

మహీంద్రా మాన్యులైఫ్ బ్యాంకింగ్ ఫండ్..



మహీంద్రా మాన్యులైఫ్ మ్యుచువల్ ఫండ్ కొత్తగా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఇది జూలై 11తో ముగుస్తుంది. బ్యాంకింగ్, ఆర్థిక సేవలందించే సంస్థల షేర్లు, ఇతరత్రా సెక్యూరిటీల్లో ఈ ఫండ్ ఇన్వెస్ట్ చేస్తుంది. దేశ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో మూడో వాటా ఆర్థిక సేవల రంగానిదే ఉంటోందని మహీంద్రా మాన్యులైఫ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ ఎండీ ఆంథోని హెరెడియా తెలిపారు. డిజిటల్ వినియోగం, ఫైనాన్షియలైజేషన్, తలసరి ఆదాయం పెరుగుతుండటం, నియంత్రణ పరిస్థితులు సానుకూలంగా ఉండటం వంటివి ఈ రంగం వృద్ధికి దోహదపడే అంశాలని పేర్కొన్నారు.

యూనియన్ ఎంఎఫ్ నుంచి 'లో డ్యూరేషన్ ఫండ్'



చేతిలో ఉన్న మిగులు మొత్తాన్ని కాస్త మెరుగైన రాబడి అందించే స్వల్పకాలిక సాధనాల్లో (3–12 నెలల కాల వ్యవధికి) ఇన్వెస్ట్ చేయాలనుకునే వారి కోసం యూనియన్ లో డ్యూరేషన్ ఫండ్‌ను ఆవిష్కరించినట్లు యూనియన్ మ్యుచువల్ ఫండ్ ప్రకటించింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ జూలై 10న ముగుస్తుంది. ఇది డెట్, మనీ మార్కెట్ సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. స్వల్ప సమయంలో అంతగా రిస్కులు లేకుండా, మెరుగైన రాబడులు కోరుకునే ఇన్వెస్టర్లకు ఇది అనువుగా ఉంటుందని సంస్థ సీఈవో మధు నాయర్ తెలిపారు.

కోటక్ నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్



కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ తాజాగా నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఇండెక్స్ ఫండ్, నిఫ్టీ 200 క్వాలిటీ 30 ఈటీఎఫ్‌ల పేరిట రెండు స్కీములను ప్రవేశపెట్టింది. వీటికి నిఫ్టీ200 క్వాలిటీ 30 ఇండెక్స్ ప్రామాణికంగా ఉంటుంది. జూలై 7న ఈ ఫండ్స్ ముగుస్తాయి. పటిష్టమైన ఫండమెంటల్స్‌తో పాటు ఆదాయ వృద్ధికి మెరుగైన అవకాశాలున్న సంస్థల్లో ఇన్వెస్ట్ చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. స్థిరత్వం, దీర్ఘకాలిక వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్లకు ఇవి అనువుగా ఉంటాయని సంస్థ ఎండీ నీలేష్ షా తెలిపారు. ఇండెక్స్ ఫండ్‌లో కనీసం రూ. 100 నుంచి, ఈటీఎఫ్‌లో రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-6-2025

విశాఖ	585-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	570-00
విజయవాడ	590-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	565-00
వరంగల్	567-00
రిటైల్ ధర	6.25

మార్కెట్ మరింత స్పీడు!



ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లు మరింత జోరు చూపవచ్చని సాంకేతిక నిపుణులు భావిస్తున్నారు. గత వారం అంచనాలకు అనుగుణంగా బీఎస్ఈ సెన్సెక్స్ 84,000 పాయింట్ల మైలురాయిని అధిగమించగా.. ఎన్ఎస్ఈ నిఫ్టీ సాంకేతికంగా కీలకమైన 25,200 పాయింట్ల రెసిస్టెన్స్‌ను దాటి నిలిచింది. ఈ స్పీడ్ కొనసాగనున్నట్లు అధిక శాతం మంది నిపుణులు భావిస్తున్నారు. వివరాలు చూద్దాం..

– సాక్షి, బిజినెస్ డెస్క్

- సరికొత్త గరిష్టాలవైపు ప్రయాణం
- యూఎస్ టారిఫ్‌లకు ప్రాధాన్యం
- ఆర్థిక గణాంకాలూ కీలకమే
- ఎఫ్‌పీఐల పెట్టుబడులపై చూపు
- ఈ వారం ట్రెండ్‌పై నిపుణుల అంచనా

దేశీ స్టాక్ మార్కెట్లలో ట్రెండ్‌కు ఇకపై ఆర్థిక గణాంకాలు కీలకంగా నిలవనున్నాయి. నేడు(30న) మే నెలకుగాను వార్షికంగా పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ), కరెంట్ ఖాతా 2025 జనవరి–మార్చి లోటు గణాంకాలు వెలువడనున్నాయి. ఏప్రిల్‌లో ఐఐపీ 2.7 శాతం పుంజుకుంది. 2024 అక్టోబర్–డిసెంబర్‌లో 11.5 బిలియన్ డాలర్ల లోటు నమోదైంది. మంగళవారం(జులై 1న) జూన్ నెలకు తయారీ రంగ పీఎంఐ, 3న సర్వీసుల రంగ పీఎంఐ వివరాలు వెల్లడికానున్నాయి. ఆర్డర్లరాకతోపాటు పరిశ్రమల రంగ ప్రగతిని తయారీ పీఎంఐ తెలియజేయనున్నట్లు బజాజ్ బ్రోకింగ్ రీసెర్చ్ పేర్కొంది. వీటికితోడు రుతుపవన కదలికలకు ప్రాధాన్యత ఉన్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

విదేశీ అంశాలు..

ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ మార్కెట్లకు సానుకూల అంశంకాగా.. 1న జపనీస్ తయారీ రంగ క్యూ1 వివరాలు వెల్లడికానున్నాయి. ఇదే రోజు జూన్ నెలకు చైనా తయారీ పీఎంఐ తెలియనుంది. 3న జూన్ నెలకు యూఎస్ ఉపాధి, నిరుద్యోగ గణాంకాలు వెలువడనున్నాయి. ఇవికాకుండా 9న యూఎస్ టారిఫ్‌ల గడువు ముగియనుంది. యూఎస్, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై ఇన్వెస్టర్లు దృష్టి సారించనున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ పేర్కొన్నారు. గత వారం మధ్యప్రాచ్యంలో యుద్ధ భయాలు తగ్గడంతో చమురు ధరలు చల్లబడ్డాయి. ఈ నేపథ్యంలో విదేశీ అంశాలు సైతం కీలకంగా నిలవనున్నట్లు నాయర్ తెలియజేశారు.

ఎఫ్‌పీఐల దన్ను

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) గత వారం భారీస్థాయిలో రూ. 13,108 కోట్ల విలువైన దేశీ స్టాక్స్ కొనుగోలు చేశారు. ఫలితంగా జూన్‌లో ఇంతవరకూ నికరంగా రూ. 8,915 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లయ్యింది. ఆర్‌బీఐ రెపో రేటులో 0.5 శాతం కోతకుతోడు.. మధ్యప్రాచ్యంలో యుద్ధ భయాలు ఉపశమించడం, యూఎస్ టారిఫ్‌ల ఆందోళనలు సైతం తగ్గడం ఎఫ్‌పీఐల పెట్టుబడులకు దోహదం చేస్తున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ పెట్టుబడుల ప్రధాన వ్యూహకర్త వీకే విజయకుమార్ తెలియజేశారు. గతేడాది అక్టోబర్ మొదలు అమ్మకాలకే ప్రాధాన్యమిస్తూ వచ్చిన ఎఫ్‌పీఐలు ఏప్రిల్ చివరి నుంచి దేశీ స్టాక్స్‌లో పెట్టుబడులకు ఆసక్తి చూపుతూ వస్తున్నారు. వెరసి ఏప్రిల్‌లో నికరంగా రూ. 4,223 కోట్లు ఇన్వెస్ట్ చేయగా..మే నెలలో రూ. 19,860 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు.

26,100 పాయింట్లపై కన్ను

అత్యధిక శాతం మంది విశ్లేషకులు అంచనా వేసినట్లుగానే గత వారం దేశీ స్టాక్ మార్కెట్లలో బ్రేకవుట్ నమోదైంది. 5 వారాలుగా ఒక పరిమిత శ్రేణిలోనే కదిలిన మార్కెట్లు పరిధిని ఛేదించాయి. ఎన్ఎస్ఈ నిఫ్టీ అంచనాలకు అనుగుణంగా సాంకేతికంగా కీలకమైన 25,200 పాయింట్ల రెసిస్టెన్స్‌ను అధిగమించి నిలిచింది. ఫలితంగా 25,600 పాయింట్లను దాటింది. బీఎస్ఈ సెన్సెక్స్ 84,000 పాయింట్ల మైలురాయిని మరోసారి అధిగమించింది. ఈ బాటలో మరింత బలపడే వీలున్నట్లు స్టాక్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వెరసి నిఫ్టీ 25,800 పాయింట్లను దాటి 26,100వరకూ పరుగు తీయవచ్చని భావిస్తున్నారు. మధ్యకాలంలో నిఫ్టీ చరిత్రాత్మక గరిష్టం 26,277 పాయింట్లవైపు పరుగు తీయవచ్చని అంచనా వేస్తున్నారు. ఇలాకాకుండా బలహీనపడితే 25,300 వద్ద మద్దతు లభించే వీలున్నట్లు పేర్కొన్నారు.

గత వారమిలా

ఐదు వారాల కన్సాలిడేషన్ తదుపరి గత వారం చివరి 4 రోజుల్లో మార్కెట్లు జోరందుకున్నాయి. సెన్సెక్స్ 2,162 పాయింట్లు జంప్‌చేసింది. దీంతో నికరంగా గత వారం సెన్సెక్స్ 1,651 పాయింట్లు(2 శాతం) జమ చేసుకుంది. 84,059 వద్ద ముగిసింది. ఈ బాటలో చివరి 4 రోజుల్లో 666 పాయింట్లు దూసుకెళ్లిన నిఫ్టీ నికరంగా 525 పాయింట్లు(2.1 శాతం) లాభపడింది. 25,638 వద్ద స్థిరపడింది. ఇక బీఎస్ఈ మిడ్‌క్యాప్ మరింత అధికంగా 2.35 శాతం, స్మాల్‌క్యాప్ 3.6 శాతం చొప్పున జంప్ చేయడం గమనార్హం!

రాబడుల తీరుతెన్నులే పోర్ట్‌ఫోలియోకు కీలకం..

అజిత్ మీనన్



సీఈవో, పీజీఐఎం ఇండియా ఎంఎఫ్

పెట్టుబడులకు సంబంధించి ఏ పోర్ట్‌ఫోలియోకైనా రాబడుల ధోరణే కీలకంగా ఉంటుంది. ఉదాహరణకు ఓ సందర్భాన్ని ఊహించుకోండి. మీకు ఇష్టమైన క్రికెట్ టీమ్ భారీ టార్గెట్‌ను ఛేదించే క్రమంలో ప్రారంభంలోనే ఓ అయిదు వికెట్లు కోల్పోయింది. మిడిల్ ఆర్డర్ బాగానే ఆడినా, మ్యాచ్ పూర్తయ్యేంత వరకు టీమ్‌పై ఒత్తిడి కొనసాగుతూనే ఉంటుంది. అలా కాకుండా, ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ ప్రారంభంలోనే భారీ స్కోర్ చేస్తే టీమ్‌పై ఒత్తిడి తగ్గుతుంది. గెలిచే అవకాశాలూ కాస్త మెరుగ్గా ఉంటాయి. దీన్నే ఇన్వెస్టింగ్ కోణంలో ఒకసారి చూద్దాం. రాము, కృష్ణ ఇద్దరూ ఒకేసారి ఒకే తరహాలో రూ. 1 కోటి కార్పస్‌తో రిటైరయ్యారు. ఏటా రూ. 5 లక్షల చొప్పున విత్‌డ్రా చేసుకోవడం మొదలుపెట్టారు. అంటే పదేళ్లలో రూ. 50 లక్షలు విత్‌డ్రా చేసుకున్నారు. పోర్ట్‌ఫోలియోలో బ్యాలెన్స్‌లపై వచ్చే రాబడులతో పదేళ్ల తర్వాత, రాము నిధి రూ. 37.32 లక్షలు పెరగ్గా, కృష్ణ నిధి రూ. 58.52 లక్షలు పెరిగింది. రెండింటి మధ్య వ్యత్యాసం ఏకంగా 36 శాతం ఏర్పడింది. నిర్దిష్ట వ్యవధిలో మొత్తం విత్‌డ్రా చేసుకున్నది, ఆఖర్లో ఉన్న బ్యాలెన్స్‌ను కలిపితే రాము మొత్తం రూ. 87.32 లక్షలు ఆర్జించినట్లు కాగా, కృష్ణ రూ. 1.08 కోట్లు (రూ. 50 లక్షలు + రూ. 58.52 లక్షలు) ఆర్జించినట్లయింది. 2015–19 మధ్య కాలంలో వరుసగా అయిదేళ్ల పాటు నెగటివ్ రిటర్న్స్ నమోదై, రూ. 50 లక్షలు విత్‌డ్రా చేసుకున్నప్పటికీ కృష్ణ నిధి అసలు మొత్తం మీద మరో రూ. 8.52 లక్షల మేర పెరిగింది.

పదేళ్లలో రాము రాబడులనేవి -5%, -6%, -15%, -8%, -4%, 5%,7%,9%,11%, 9%గా నమోదయ్యాయి. అదే సమయంలో దీనికి భిన్నంగా కృష్ణ రాబడులు 9%, 11%, 9%, 7%,5%,-4%, -8%, -15%, -6%, -5%గా నమోదయ్యాయి. రాము బేర్ ఫేజ్‌లో పెట్టుబడులు ప్రారంభించగా, కృష్ణ బుల్ ఫేజ్‌లో పెట్టుబడులు పెట్టారు. ఇలా పెట్టుబడులు పెట్టే సమయమనేది పోర్ట్‌ఫోలియోపై గణనీయంగా ప్రభావం చూపుతుంది. ఇద్దరు ఇన్వెస్టర్లు తమ సేవింగ్స్ నుంచి ఒకే స్థాయిలో విత్‌డ్రా చేస్తున్నా, అసలు మొత్తం భిన్నంగా ఉండటం వల్లే ఇద్దరి రాబడుల్లో అంతరానికి కారణమైంది. ఉదాహరణకు తొలి ఏడాది మార్కెట్లు 5 శాతం పడి, రూ. 5 లక్షలు విత్‌డ్రా చేసుకున్నప్పుడు రాము కార్పస్ రూ. 90 లక్షలకు తగ్గిపోయింది. కానీ కృష్ణ కూడా అంతే మొత్తం విత్‌డ్రా చేసుకున్నప్పటికీ తొలి ఏడాదిలో 9 శాతం రాబడి రావడంతో ఆయన బ్యాలెన్స్ రూ. 1.04 కోట్లకు పెరిగింది. కృష్ణ పెట్టుబడులపై ఆరో సంవత్సరం నుంచి పదో సంవత్సరం వరకు నెగటివ్ రాబడులే వచ్చినప్పటికీ, చివరికి వచ్చే సరికి రాము స్థాయి ప్రతికూల ప్రభావం కృష్ణపై పడలేదు. తొలి ఐదేళ్లలో రాము పెట్టుబడులపై రాబడులు క్షీణించడంతో పాటు ఏటా రూ. 5 లక్షలు వెనక్కి తీసుకుంటూ ఉండటమనేది అతని పోర్ట్‌ఫోలియో విలువపై బాగా ప్రతికూల ప్రభావం చూపింది.



రాబడులు వచ్చే తీరుతెన్నులు ఏ విధంగా పోర్ట్‌ఫోలియోను ప్రభావితం చేస్తాయనేది ఈ ఉదాహరణ తెలియజేస్తుంది. ఒకే ఆదాయ వనరుపై ఆధారపడే రిటైరీలకు ఇది మరీ ముఖ్యమైన విషయం. ఈ కాన్సెప్ట్ థియరీ ప్రకారం కరెక్టే అయినప్పటికీ .. సరైన సమయంలో మార్కెట్లో ఇన్వెస్ట్ చేయడమనేది ఎవరికైనా కష్టమే. ముఖ్యంగా రిటైరీలకు మరింత సమస్యగా ఉంటుంది. కాబట్టి దీర్ఘకాలిక పెట్టుబడుల ప్రస్థానంలో రిటర్న్ రిస్కుల సీక్వెన్స్‌ను పరిగణనలోకి తీసుకుని ప్లానింగ్ చేసుకోవడం కీలకంగా ఉంటుంది.

'బకెటింగ్'తో రిస్కులకు చెక్..

చారిత్రకంగా సెన్సెక్స్ వరుసగా రెండేళ్ల పాటు 1986–87, 1995–97, 2000–01లో క్షీణించింది. అయితే, మరింత లోతుగా పరిశోధిస్తే (నెలవారీ లేదా రోజువారీ రిటర్నులు) ఇలాంటి సందర్భాలు చాలా కనిపిస్తాయి. బకెటింగ్ విధానంతో ఇన్వెస్టర్లు ఇలాంటి రిస్కులను అధిగమించవచ్చు. ఈ విధానంలో కార్పస్‌ను స్వల్పకాలికం (ఫిక్స్‌డ్ ఇన్‌కం పోర్ట్‌ఫోలియో), మధ్యకాలికం (హైబ్రిడ్), దీర్ఘకాలిక (ఈక్విటీ) ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఇన్వెస్ట్ చేసి, అదనంగా మరో ఆదాయ మార్గాన్ని కూడా ఏర్పర్చుకుంటే, మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకుల్లో ఉన్నప్పుడు బఫర్‌గా పని చేస్తుంది. ప్రత్యామ్నాయంగా ఇన్వెస్టర్లు తమ విత్‌డ్రాయల్ రేటును తగ్గించుకుని, ఏదైనా ఫిక్స్‌డ్ యాన్యుటీ పథకాన్ని కొనుగోలు చేయొచ్చు లేదా డెట్, బంగారం, రీట్లు, ఇంటర్నేషనల్ అసెట్స్‌లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా పోర్ట్‌ఫోలియోలో వైవిధ్యాన్ని పాటించవచ్చు. తద్వారా మార్కెట్ ఒడిదుడుకుల వల్ల నష్టపోయే అవకాశాలను తగ్గించుకోవచ్చు.

కార్పస్ ఫండ్ నుంచి విత్‌డ్రా చేసుకునే యోచనతో, భారీ పెట్టుబడుల పోర్ట్‌ఫోలియోను రూపొందించుకుంటున్నప్పుడు, రాబడుల తీరుతెన్నులను కూడా పరిగణనలోకి తీసుకోవడం ముఖ్యం. భారీ టార్గెట్‌ను ఛేదించేటప్పుడు ప్రారంభంలోనే వేగంగా స్కోర్ చేస్తే గెలిచే అవకాశాలు ఎలాగైతే ఎక్కువగా ఉంటాయో, పెట్టుబడుల ప్రస్థానంలో తొలినాళ్లలో మెరుగైన రాబడులు రావడం వల్ల మీ పోర్ట్‌ఫోలియో తుది విలువపై సానుకూల ప్రభావం ఉంటుంది.

కార్యకలాపాలను విస్తరించి లిస్ట్ చేయండి

- సబ్సిడరీల్లో వాటాల విక్రయంతో రాబడులు
- ప్రభుత్వరంగ బ్యాంకులకు ఆర్థిక శాఖ సూచన



న్యూఢిల్లీ: సబ్సిడరీల కార్యకలాపాలను మరింత విస్తరించి వాటిని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ చేయడంపై దృష్టి సారించాలని ప్రభుత్వరంగ బ్యాంక్‌లకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. తద్వారా మంచి రాబడులు అందుకోవచ్చని పేర్కొంది. ప్రభుత్వరంగ బ్యాంక్‌ల (పీఎస్‌బీలు)కు సంబంధించి సుమారు 15 సబ్సిడరీలు, జాయింట్ వెంచర్లు మధ్య కాలం నుంచి దీర్ఘకాలలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) లేదా పెట్టుబడుల ఉపసంహరణకు రానున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సబ్సిడరీలు లేదా జాయింట్ వెంచర్లకు సంబంధించి అవసరమైతే కార్యకలాపాల విస్తరణపై పీఎస్‌బీలు పెట్టుబడులు పెట్టాలని ఆర్థిక శాఖ సూచిస్తూ.. సరైన సమయంలో వాటాల విక్రయం ద్వారా లాభాలను సమకూర్చుకోవడంపై దృష్టి సారించాలని పేర్కొంది. సబ్సిడరీలకు సంబంధించి పరిపాలన, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను మెరుగుపరుచుకోవాలని, గొప్ప నిర్వహణ సామర్థ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.

ఆ దిశగా ఇప్పటికే చర్యలు..

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో అగ్రగామి అయిన ఎస్‌బీఐ నుంచి భవిష్యత్తులో అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (మ్యూచువల్ ఫండ్స్), జనరల్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ పేమెంట్ సర్వీసెస్ ఐపీవోకు వచ్చే అవకాశాలున్నాయి. ఇందులో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ గత ఆర్థిక సంవత్సరంలో రూ.509 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌లో ఎస్‌బీఐకి 68.99 వాటా ఉంది. ఎస్‌బీఐ పేమెంట్ సర్వీసెస్‌లో ఎస్‌బీఐకి 74 శాతం వాటా ఉంటే, హిటాచీ పేమెంట్ సర్వీసెస్‌కు మిగిలిన 26 శాతం వాటా ఉంది. ఎస్‌బీఐ పేమెంట్ సర్వీసెస్ కింద 33.10 లక్షల మంది మర్చంట్ టచ్ పాయింట్లు నమోదై ఉన్నాయి. ఇందులో 13.67 లక్షల పీవోస్ మెషిన్లు కూడా ఉన్నాయి. మరోవైపు కెనరా బ్యాంక్ తన మ్యూచువల్ ఫండ్స్ వ్యాపార జాయింట్ వెంచర్ అయిన కెనరా రొబెకో ఏఎంసీ లిస్టింగ్‌కు ఇప్పటికే చర్యలు మొదలుపెట్టింది. బీమా జాయింట్ వెంచర్ అయిన కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్‌ను కూడా లిస్ట్ చేసే ప్రణాళికతో ఉంది. బీమా జేవీలో 14.5 శాతం వాటా విక్రయానికి అనుకూలంగా కెనరా బ్యాంక్ బోర్డు ఇప్పటికే నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

రిటర్నులు ఎవరు వేయాలి..?

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి | కె.వి.ఎన్ లావణ్య



ట్యాక్సేషన్ నిపుణులు

ఇదొక ప్రశ్నా...? అని అనుకోకండి... ఆదాయం అంటే నికర ఆదాయం లేదా టాక్సబుల్ ఇన్‌కం బేసిక్ లిమిట్ దాటిన ప్రతి వ్యక్తి, ప్రతి ఏటా విధిగా, కచ్చితంగా సకాలంలో రిటర్నులు దాఖలు చేయాలి. ఇదొక ప్రాథమిక సూత్రం. ఫాలో అవ్వండి. చట్ట ప్రకారం, వ్యక్తులకు ఎటువంటి ఆదాయం లేకపోయినా బేసిక్ లిమిట్ పరిధిలోకి వస్తారు. టాక్సబుల్ ఇన్‌కం ఉంటే ఆదాయపు పన్ను రిటర్నులు చేయాల్సిందే. ఇటువంటి వ్యక్తులు ఎవరు? ఏమిటా సందర్భము? ఆ వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం ..

- మీరు ఒక సంవత్సరం కాలం, అంటే ఓ ఆర్థిక సంవత్సరంలో ఒక కోటి రూపాయిలు దాటి బ్యాంకులో డిపాజిట్ చేశారనుకోండి. మీరు రిటర్ను వేయాల్సిందే. అమెరికా నుంచి మీ అబ్బాయి రూ.కోటి దాటి పంపితే, అది మీ అకౌంటులో జమ కాబట్టి మీరు రిటర్ను వేయాలి. సాంకేతికంగా ఒక సలహా.. మీ అకౌంట్లో కోటి లోపు, మీ జీవిత భాగస్వామి అకౌంట్‌లో కోటి లోపు వేసినట్లయితే ఈ బాధ్యత నుంచి బయట పడవచ్చు. ఇటువంటి బదిలీల వలన మీకు ఎటువంటి పన్ను భారం మాత్రం ఉండదు.
- మీరు ఓ కంపెనీకి డైరెక్టర్ అనుకోండి. లేదా లిమిటెడ్ పార్టనర్ షిప్‌లో భాగస్వామి అనుకోండి. జీతం/పారితోషికం/కమీషన్ ఏమీ తీసుకోకపోయినా రిటర్ను వేయాల్సిందే. దగ్గరి వారో లేదా మిత్రులో.. ప్రోద్బలం వల్ల కంపెనీ పెట్టవచ్చు. లిమిటెడ్ పార్టనర్‌షిప్‌లో చేరవచ్చు. మీకు ఎటువంటి బరువు, బాధ్యతలు ఉండకపోవచ్చు. కానీ రిటర్ను మాత్రం వేయాలి. మీకు చెప్పకుండా మీ పేరు కూడా వాడుకోవచ్చు. తగిన జాగ్రత్త వహించాలి.
- విదేశీయానం మీద రూ.2 లక్షలు దాటి పెట్టారనుకోండి. మీరు రిటర్ను దాఖలు చేయాలి. అలా చేయడం వల్ల ఎటువంటి ఇబ్బందీ, పన్ను భారం ఉండకపోవచ్చు. మీ అబ్బాయో/ అమ్మాయో టికెట్ కొనమనండి. ఆ డబ్బుల్ని వారిని చెల్లించమనండి.
- మీకు కరెంట్ బిల్లు సంవత్సరంలో రూ.ఒక లక్ష దాటింది అనుకోండి. ఆ షాక్‌తో పాటు రిటర్ను దాఖలు షాక్ కూడా మీ నెత్తిన పడుతుంది. పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లలో మీ పేరు మీద ఫ్లాట్లు ఉన్నాయనుకోండి. అన్నీ కలిపి మీ పేరు మీద బిల్లు రూ.లక్ష దాటింది అనుకోండి. మీకు ఈ బాధ్యత వర్తిస్తుంది. కరెంటు బిల్లు.. ఇంటికి, బిల్డింగ్‌కి, అపార్ట్‌మెంట్‌కి, కమర్షియల్ ప్రాపర్టీకే కాదు ఒక వ్యక్తికి వస్తుంది. ఇలాంటి జాబితాలో చాలామంది ఉంటారు. ఉన్నారు. ప్రస్తుతం సమాచార సమన్వయం లేకపోవడంతో వీళ్లు తప్పించుకుంటున్నారు. కానీ కృత్రిమ మేధస్సు వలన ఇవన్నీ బయటపడతాయి.
- మీ విషయంలో టీడీఎస్ రూ.25,000 లేదా ఆపైన జరిగిందనుకోండి. సీనియర్ సిటిజన్ల విషయంలో ఈ లిమిట్ రూ.50,000గా ఉంటుంది. వీరు రిటర్ను వేయాల్సిందే. వెంటనే ఫారం 16/ఫారం 16 అ చెక్ చేసుకోండి. లేదా ఫారం 26 అ చెక్ చేసుకొండి. 'నిప్పు లేనిదే పొగరాదు' లాగా ఏదొక వ్యవహారం జరగనిదే టీడీఎస్ కోత తప్పదు. ఈ వ్యవహారాన్ని బయట పెట్టే సందర్భమే... ఈ రిటర్ను వేయడం.
- మీ వ్యాపారం/బిజినెస్/వసూళ్లు/ అమ్మకాలు సంవత్సర కాలంలో రూ.60 లక్షలు దాటాయనుకోండి. జీఎస్టీ రిజిస్ట్రేషన్ ద్వారా ఇది బయటపడుతుంది. అలాగే వృత్తి పరంగా వచ్చే ఆదాయం ఏటా రూ.10 లక్షలు దాటిందంటే రిటర్ను వేయాలి. ఈ రెండు కేసుల్లోనూ నికర ఆదాయంతో సంబంధం లేదు. లాభనష్టాలతో అసలు పనేంలేదు. రిటర్ను వేయాలి.
- టీడీఎస్ జరిగింది ... ఆదాయం టాక్సబుల్ ఇన్‌కం లోపల ఉన్నా, ఆదాయం ఏమాత్రం లేకున్నా, పన్ను భారానికి మించి టాక్స్ కట్ చేసినా రిఫండ్ పొందాలి. రిఫండ్ కోసం రిటర్ను వేయాల్సిందే.

చివరిగా, మీకు రుణాల మంజూరు, విదేశీ ప్రయాణాలకు వీసాలు లాంటి విషయాల్లో .. గౌరవం, పరపతి, గుర్తింపు ఇటువంటి ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి కాబట్టి రిటర్నులు వేయడంపై దృష్టి పెట్టండి. ఎగవేత మార్గాన్ని ఎంచుకోకండి.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

పోర్ట్‌ఫోలియోకి మరింత స్థిరత్వం

ఆదిత్య బిర్లా బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్

గడిచిన ఏడాది కాలంగా ఈక్విటీ మార్కెట్లలో అస్థిరతలు గణనీయంగా పెరిగాయి. వీటిని చూసి మొదటిసారి ఇన్వెస్టర్లు ఈక్విటీ పెట్టుబడుల విషయంలో ఆందోళనకు గురయ్యే అవకాశం లేకపోలేదు. రిస్క్ సామర్థ్యం తక్కువగా ఉన్న వారు కూడా ఈక్విటీలు అంటే వెనకడుగు వేస్తుంటారు. ఇలాంటి వారికి బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్స్ ఎంతో అనుకూలం. వీటినే డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ అని కూడా అంటారు. ఈ విభాగంలో ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ బ్యాలన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్ (ఏబీఎస్ఎల్ బీఏఎఫ్) మంచి పనితీరు చూపిస్తోంది. మధ్య కాలం నుంచి దీర్ఘకాల పెట్టుబడుల కోసం ఇన్వెస్టర్లు ఈ విభాగంలోని పథకాలను పరిశీలించొచ్చు.

పనితీరు...


ఈ పథకం డైరెక్ట్ ప్లాన్ పనితీరును గమనిస్తే.. ఏడాది కాల రాబడి 10.21 శాతంగా ఉంది. మూడేళ్ల కాలంలో ఏటా 16.62 శాతం చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని తెచ్చిపెట్టింది. ఐదేళ్లలో ఏటా 16 శాతానికి పైగా రాబడి నమోదైంది. ఏడేళ్లలో 13 శాతం, పదేళ్లలోనూ వార్షిక రాబడి 12 శాతానికి పైనే ఉండడం గమనించొచ్చు. డైనమిక్ అస్సెట్ ఫండ్స్ విభాగం సగటు రాబడి కంటే ఈ పథకమే అధిక కాలాల్లో అదనపు రాబడి తెచ్చిపెట్టింది.

పెట్టుబడుల విధానం..

ఈ పథకంలో ఉన్న ప్రధాన వెసులుబాటు పెట్టుబడులను ఈక్విటీ, డెట్ విభాగాల మధ్య వైవిధ్యం చేయడమని చెప్పుకోవచ్చు. డెట్ విభాగంలో ఆకర్షణీయమైన అవకాశాలున్నప్పుడు పెట్టుబడులను పెంచుతుంది. ఇదే మాదిరి ఈక్విటీల్లో ఆకర్షణీయమైన వ్యాల్యుయేషన్లను గుర్తించిన సమయంలో అక్కడ పెట్టుబడుల కేటాయింపులను అధికం చేస్తుంది. తద్వారా రిస్క్‌ను సాధ్యమైనంత తగ్గించే విధంగా ఈ పథకం పనిచేస్తుంటుంది. కనుక మోస్తరు రిస్క్‌తో దీర్ఘకాలంలో మంచి సంపద సమకూర్చుకోవాలని భావించే వారికి ఈ పథకం అనుకూలమని చెప్పుకోవచ్చు. ఈ పథకం 2000 ఏప్రిల్ 25న మొదలైంది. లవ్‌లిష్ సోలంకి, మోహిత్ శర్మ, హరీష్ కృష్ణన్ ఈ పథకానికి మేనేజర్లుగా వ్యవహరిస్తున్నారు. ఈక్విటీ, డెట్ సాధనాల మధ్య పెట్టుబడులను వైవిధ్యం చేస్తూ దీర్ఘకాలంలో అధిక రాబడులను తెచ్చిపెట్టడం ఈ పథకం ఉద్దేశ్యం. ఈక్విటీల్లో వ్యాల్యుయేషన్లు ఖరీదుగా మారిన సమయంలో అక్కడ కొంత శాతం మేర లాభాలను స్వీకరించి, ఆ పెట్టుబడులను రిస్క్ తక్కువగా ఉండే డెట్ విభాగానికి ఈ పథకం మళ్లిస్తుంటుంది. దీని వల్ల మార్జిన్ ఆఫ్ సేఫ్టీ (పెట్టుబడులకు భద్రత) ఉంటుందన్నది పథకం మేనేజర్ల వివరణ.

పోర్ట్‌ఫోలియో

ఈ పథకంలో 2024 అక్టోబర్ ముందు వరకు ఈక్విటీ పెట్టుబడులు 38 శాతంగానే ఉన్నాయి. ఆ తర్వాత నుంచి ఈ ఏడాది మార్చి చివరి వరకు ఈక్విటీలు గణనీయంగా దిద్దుబాటుకు గురికావడం చూశాం. సరిగ్గా ఆ సమయంలో ఈక్విటీ పెట్టుబడులను ఈ పథకం 38 శాతం నుంచి ఈ ఏడాది మార్చి చివరికి 70 శాతానికి పెంచుకోవడాన్ని గమనించొచ్చు. ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.7,710 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 75 శాతం మేర ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసింది. డెట్ సాధనాల్లో 18.83 శాతం పెట్టుబడులు కలిగి ఉండగా, రియల్ ఎస్టేట్ సాధనాల్లో 4.17 శాతం ఇన్వెస్ట్ చేసింది. 1.81 శాతం మేర నగదు నిల్వలు ఉన్నాయి. ఈక్విటీ పెట్టుబడులను గమనించినట్టయితే 76 శాతం లార్జ్‌క్యాప్‌లో, 21.74 శాతం మిడ్‌క్యాప్‌లో 2 శాతం మేర స్మాల్‌క్యాప్‌లో ఉన్నాయి. డెట్ పెట్టుబడుల్లో అత్యధిక భద్రత కలిగిన ఏఏఏ రేటెడ్ సాధనాల్లో 7.5 శాతం, ఎస్‌వోవీల్లో 5.36 శాతం, కొంచెం రిస్క్ ఉండే ఏఏ రేటెడ్ సాధనాల్లో 4 శాతం మేర పెట్టుబడులు కలిగి ఉంది. ఈక్విటీల్లో 22.61 శాతాన్ని బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. టెక్నాలజీ రంగ కంపెనీలకు 9.73 శాతం, మెటీరియల్స్ కంపెనీలకు 8.78 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషనరీ కంపెనీలకు 8 శాతం చొప్పున కేటాయింపులు చేసింది.



టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
ఐసీఐసీఐ బ్యాంక్	3.94
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	3.82
రిలయన్స్ ఇండస్ట్రీస్	3.37
కోటక్ బ్యాంక్	2.93
ఇన్ఫోసిస్	2.55
టెక్ మహీంద్రా	1.75
యాక్సిస్ బ్యాంక్	1.73
ఎల్అండ్‌టీ	1.62
ఎస్‌బీఐ	1.59
ఐసీఐసీఐ లాంబార్డ్	1.46

సాక్షి ప్లస్
సోమవారం : 30-6-2025



ఇకపై మళ్లీ ఆడగలనా?

- వాళ్ల అమ్మకైతే నడుస్తాడో లేడోనన్న బెంగ
- అదృష్టం, రక్తనాళాల పనితీరువల్లే మామూలు స్థితికి
- **రిషభ్ పంత్ పోరాటంపై డాక్టర్ పర్దివాలా వ్యాఖ్య**

ఆసుపత్రికి తీసుకెళ్లగానే పంత్ అడిగిన తొలి ప్రశ్న


డాక్టర్ పర్దివాలా

లండన్: భారత వికెట్ కీపర్, బ్యాటర్ రిషభ్ పంత్ ఇప్పుడైతే మైదానంలో సెంచరీలు చేసి... పిచ్‌పై ఎగిరి గంతులేస్తూ... పల్టీలతో సంబరాలు చేసుకుంటున్నాడు. కానీ... రెండున్నరేళ్ల క్రితమైతే అతను ఇకపై క్రికెట్ ఆడనేమో అన్న కంగారులో మంచంపై ఉండిపోయాడు. 2022లో పంత్ ఘోరమైన ప్రమాదానికి గురయ్యాడు. ఆ ఏడాది డిసెంబర్ 30వ తేదీన ఢిల్లీ నుంచి సొంతూరు రూర్కీకి కారు నడుపుకుంటూ వెళ్తుండగా ఆ కారు అదుపుతప్పి వేగంగా డివైడర్‌ను ఢీకొట్టి పల్టీలు కొట్టింది. ఈ ఘోరప్రమాదంలో పంత్ తీవ్రంగా గాయపడ్డాడు. దాదాపు ప్రాణంమీదికి తెచ్చుకున్నాడు. వెంటనే హాస్పిటల్‌కు తరలించగా... స్పృహలోకి రాగానే తొలుత క్రికెట్ కెరీర్ గురించే ఆందోళన చెందాడు. తనకు చికిత్స అందిస్తున్న డాక్టర్ దిన్‌షా పర్దివాలాతో 'ఇకపై నేను మళ్లీ క్రికెట్ ఆడగలనా?' అని ప్రశ్నించాడని ఆ డాక్టర్ వెల్లడించాడు. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో భారత బృందానికి చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన ఈ సీనియర్ డాక్టర్ అప్పటి ప్రమాదం, తదనంతర చికిత్సపై ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన సంగతులివి...

బతికి బట్టకట్టడమే గొప్ప

ఘోరమైన ఆ ప్రమాదంలో రిషభ్ బతికి బట్టకట్టడమే పెద్ద అదృష్టం. మంచంపై అతన్ని మొదట చూసినప్పుడు... పంత్ కుడికాలు మామూలు స్థితిలోనే లేదు. అక్కడక్కడ విరిగి చాలావరకు జరిగిపోయింది. ఆ కాలి చీలమండకు పెద్ద గాయమే అయ్యింది. ఒళ్లంతా గాయాలే. ప్రమాదంలో చర్మం అంతా గీరుకొనిపోయింది. శరీరభాగాల్లో పెద్దగా రాసుకుపోయింది. మెడ నుంచి మోకాళ్ల వరకైతే పైచర్మమంతా చీరుకుపోయింది. కారు లోపలి నుంచి లాగే ప్రయత్నంలో పగిలిన అద్దాలు అతని వీపును, చర్మాన్ని లోపలిదాకా చీల్చాయి. ఇలాంటి పరిస్థితిలోని ఓ క్షతగాత్రుడు బ్రతకడమే కష్టం. పంత్ చాలా అదృష్టవంతుడు కాబట్టే బ్రతకడం కాదు... ఏకంగా తనకిష్టమైన ఆటను ఆడేస్తున్నాడు

635 రోజులపాటు...

వెంటనే ఐసీయూలో చికిత్స, తదనంతరం మోకాలుకు పలుమార్లు ఆపరేషన్లు, రోజుల తరబడి క్రమం తప్పని ఫిజియోథెరపీ చికిత్స అతన్ని బతికించాయి. కానీ ఆడించాలంటే అది చాలదుగా... ఇంకా చేయాలి. అప్పటిదాకా వైద్యులు శ్రమించారు. అక్కడి నుంచి వైద్యులతో కలిసి పంత్ శ్రమించాల్సి వచ్చింది. అలా ఓ వారమో నెలనో కాదు... ఏకంగా 635 రోజులు అంటే దాదాపు రెండేళ్లపాటు సాగిన వైద్య చికిత్స, పునరావాస కార్యక్రమాలతోనే రిషభ్ ఓ **పేషెంట్ నుంచి ఎప్పట్లాగే మళ్లీ క్రికెటర్ అయ్యాడు. నిజం చెప్పాలంటే అతని పోరాటం క్రీడాచరిత్రలో నిలిపోయే పాఠమని చెప్పాలి. ఎందుకంటే ఇలాంటి ఘోరమైన ప్రమాదాల్లో మరణాలే** ఎక్కువగా సంభవిస్తాయి.

రక్తనాళాలు పని చేయడంవల్లే...

ప్రమాదం తీవ్రత వల్ల అతని మోకాలు నుంచి పాదం వరకు జరిగిపోవడంతో అక్కడక్కడ ఎముక స్నాయువులు విరిగాయి. ఇలాంటప్పుడు కండరాలు, ప్రధాన రక్తనాళాలు కూడా తెగిపోయి రక్తసరఫరా ఆగిపోతుంది. దీంతో కాలు తీసేయాల్సిన పరిస్థితి రావడం సహజం. కానీ అదృష్టమేమిటంటే... ఇంత జరిగినా కూడా అతని రక్తనాళాలేవీ గాయపపడలేదు. తెగలేదు. దీనివల్లే అతని కాలు తీసేయాల్సిన దుస్థితి రాలేదు. కాలు తిరిగి యథాతథ స్థితికి వచ్చేందుకు, నడిచేందుకు, ఇప్పుడైతే ఆడేందుకు పనిచేస్తుందంటే దీనికంతటికి ప్రధాన కారణం బలమైన రక్తనాళాలే! ఇది ఎంతో అదృష్టముంటేగానీ జరగదు.

వాళ్ల అమ్మయితే నడుస్తాడా అని విలపించింది

రిషభ్ తాను మళ్లీ క్రికెట్ ఆడగలనా అని ప్రశ్నిస్తే... అతడి పరిస్థితిని చూసిన వాళ్ల అమ్మయితే 'నా కొడుకు అసలు నడవగలడా' అని విలపించింది. దీంతో అప్పుడు గాయాల తీవ్రత గురించి వివరించాను. మళ్లీ మోకాలు పునర్నిర్మాణానికి ఉన్న అవకాశాల్ని చెప్పాను. ఆ తర్వాతే ఏదైనా ఆశించవచ్చని బదులిచ్చాను. 2023 జనవరి 6న నిష్ణాతులైన ఆర్థోపెడిక్ వైద్య బృందం నాలుగు గంటలపాటు తొలి సర్జరీని విజయవంతంగా పూర్తి చేసింది. మూడు చోట్ల ఎముక స్నాయువుల్ని సరిచేసింది. మామూలుగా విరిగిన చోట్ల చికిత్స చేసింది. కొన్ని వారాల తర్వాత కూడా అతను సొంతంగా తన పళ్లను బ్రష్ చేసుకోలేకపోయాడు. చేతులకు అయిన గాయాలు, చర్మంలోతుగా అయిన గాట్లతో చేతుల్ని కూడా సాధారణంగా కదిలించలేకపోయాడు. మెల్లమెల్లగా నీళ్లు తాగడంతో మొదలుపెట్టి... తర్వాత తర్వాత అన్ని పనులు అలవాటు చేసుకున్నాడు.

హ్యాట్రిక్ మిరాకిల్స్ వల్లే...

సర్జరీ, తదనంతరం పరిస్థితిని సమీక్షించిన మీదటే పంత్ తల్లికి అతను నడవగలడనే ధైర్యమిచ్చాం. ఇక అతను మాత్రం ఇంతటి ఘోరమైన ప్రమాదంలో జీవించి ఉండటమే అద్భుతమని, కాలు తిరిగి సాధారణ స్థితిలో నడవడం, పరుగెత్తడం మరో అద్భుతమని చెప్పాను. ఇక క్రికెట్ ఆడటమైతే మూడో మిరాకిల్ అని అతని ధైర్యాన్ని పెంచాను. తను కూడా ఆత్మస్థయిర్యంతో మెలిగాడు. తనకెంతో ఇష్టమైన క్రికెట్ కోసం తిరిగి పునరాగమనం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేశాడు. అందువల్లే బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీకి తర్వాత మైదానంలోకి వచ్చి యథేచ్ఛగా ఆడగలుగుతున్నాడు. అయితే సెంచరీ చేశాక ఉత్సాహంతో పంత్ మైదానంలో పల్టీలు కొడుతున్నాడు. ఈ విన్యాసాలు చేయకపోతేనే మంచిదని సలహా ఇస్తున్నా.


ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన తర్వాత పల్టీ కొడుతూ పంత్ సంబరం

ఇంగ్లండ్ మహిళల జట్టుకు జరిమానా



నాటింగ్‌హామ్: భారత మహిళల క్రికెట్ జట్టుతో శనివారం జరిగిన తొలి టి20లో 'స్లో ఓవర్ రేట్'కు పాల్పడినందుకుగానూ ఇంగ్లండ్ జట్టుకు జరిమానా పడింది. నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయలేక పోయినందుకు ఇంగ్లండ్ ప్లేయర్ల మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించారు. 'అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నియమావళి ప్రకారం ఇంగ్లండ్ ఆటగాళ్లకు జరిమానా విధించాం. టీమిండియాతో మొదటి టి20లో ఇంగ్లండ్ నిర్ణీత సమయంలో రెండు ఓవర్లు తక్కువ వేసింది. ఓవర్‌కు 5 శాతం చొప్పున రెండు ఓవర్లకు 10 శాతం కోత విధించాం' అని ఐసీసీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇంగ్లండ్ కెప్టెన్ సీవర్ బ్రంట్ తప్పు అంగీకరించడంతో ఈ అంశంలో ఎలాంటి వాదనల అవసరం పడలేదని పేర్కొంది.

వెల్‌డన్ నోరిస్


- ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి విజేతగా మెక్‌లారెన్ డ్రైవర్
- సీజన్‌లో మూడో విజయం నమోదు
- సహచరుడు పియాస్ట్రికి రెండో స్థానం



స్పీల్‌బర్గ్ (ఆస్ట్రియా): ఫార్ములావన్ తాజా సీజన్‌లో మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ తన ఖాతాలో మూడో విజయం జమ చేసుకున్నాడు. 2025 సీజన్‌లో 11వ రేసుగా ఆదివారం జరిగిన ఆస్ట్రియా గ్రాండ్‌ప్రిలో నోరిస్ విజేతగా నిలిచాడు. నిర్ణీత 70 ల్యాప్‌లను నోరిస్ అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా ఒక గంట 23 నిమిషాల 47.693 సెకన్లలో ముగించి అగ్రస్థానం దక్కించుకున్నాడు. మెక్‌లారెన్ జట్టుకే చెందిన ఆస్కార్ పియాస్ట్రి ఒక గంట 23 నిమిషాల 50.388 సెకన్లతో రెండో స్థానంలో నిలిచాడు. చివరగా జరిగిన కెనడా గ్రాండ్‌ప్రిలో ఈ ఇద్దరి కార్లు పరస్పరం ఢీకొనగా... తాజా రేసులో వీరి మధ్య ఆద్యంతం రసవత్తర పోటీ సాగింది. అయితే ఆఖర్లో వేగం పెంచిన నోరిస్ టైటిల్ హస్తగతం చేసుకున్నాడు. తద్వారా డ్రైవర్స్ ప్రపంచ చాంపియన్‌షిప్ సాధించే దిశగా ముందడుగు వేశాడు. 'మా ఇద్దరి మధ్య గట్టి పోటీ సాగింది. తొలి రెండు స్థానాల్లో నిలవడం ఆనందంగా ఉంది' అని రేసు అనంతరం నోరిస్ అన్నాడు. ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ (1 గంట 24 నిమిషాల 7.513 సెకన్లు) మూడో స్థానంలో నిలవగా... ఏడుసార్లు ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (1 గంట 24 నిమిషాల 16.713 సెకన్లు; ఫెరారీ) నాలుగో స్థానంలో, రసెల్ (1 గంట 24 నిమిషాల 50.089 సెకన్లు; మెర్సిడెస్) ఐదో స్థానంలో నిలిచారు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్, రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ రేసును పూర్తి చేయలేకపోయాడు. మొత్తం 20 మంది డ్రైవర్లు పాల్గొన్న ఈ రేసులో 16 మంది మాత్రమే రేసు పూర్తిచేశారు. 24 రేసుల తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 11 రేసులు ముగిశాయి. డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో 216 పాయింట్లతో ప్రియాస్ట్రి అగ్రస్థానంలోనే కొనసాగుతుండగా... 201 పాయింట్లతో నోరిస్ రెండో స్థానంలో, 155 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నారు. సీజన్‌లోని తదుపరి రేసు బ్రిటన్ గ్రాండ్‌ప్రి జూలై 6న జరుగుతుంది. మరోవైపు ఫార్ములావన్ షెడ్యూల్‌లో 2041 వరకు ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి కొనసాగనుంది. ఈ మేరకు ఆదివారం ఫార్ములావన్ నిర్వాహకులు వివరాలు వెల్లడించారు.

ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	ల్యాప్‌లు	సమయం	వ్యత్యాసం	పాయింట్లు
1	నోరిస్	మెక్‌లారెన్	70	1:23:47.693 సెకన్లు	-	25
2	పియాస్ట్రి	మెక్‌లారెన్	70	1:23:50.388 సెకన్లు	2.695 సెకన్లు	18
3	లెక్‌లెర్క్	ఫెరారీ	70	1:24:07.513 సెకన్లు	19.820 సెకన్లు	15
4	హామిల్టన్	ఫెరారీ	70	1:24:16.713 సెకన్లు	29.020 సెకన్లు	12
5	జార్జి రసెల్	మెర్సిడెస్	70	1:24:50.089 సెకన్లు	62.396 సెకన్లు	10
6	లాసన్	రేసింగ్‌బుల్స్	70	1:24:55.447 సెకన్లు	67.754 సెకన్లు	8
7	అలోన్సో	ఆస్టన్ మార్టిన్	69	1: 23:49.130 సెకన్లు	1 ల్యాప్	6
8	గాబ్రియల్	స్టేక్ ఎఫ్1	69	1:23:49.645 సెకన్లు	1 ల్యాప్	4
9	హుల్కెన్‌బర్గ్	స్టేక్ ఎఫ్1	69	1:23:55.413 సెకన్లు	1 ల్యాప్	2
10	ఒకాన్	మనీగ్రామ్ హాస్	69	1:23:57.679 సెకన్లు	1 ల్యాప్	1


లాండో నోరిస్



విజేత అభిరామ్

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన వెన్నెం అభిరామ్ మూడు స్వర్ణ పతకాలు సాధించాడు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో 14 ఏళ్ల అభిరామ్ సబ్ యూత్, యూత్, జూనియర్ కేటగిరీల్లో విజేతగా నిలిచి మూడు బంగారు పతకాలను దక్కించుకున్నాడు. అభిరామ్ 400 పాయింట్లకుగాను 396 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచాడు.

సీన్ విలియమ్స్ సెంచరీ

జింబాబ్వే తొలి ఇన్నింగ్స్ 251 ● దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 49/1

బులవాయో: మిడిలార్డర్ బ్యాటర్ సీన్ విలియమ్స్ (164 బంతుల్లో 137; 16 ఫోర్లు) సెంచరీ సాధించడంతో... దక్షిణాఫ్రికాతో తొలి టెస్టులో జింబాబ్వే ఫాలోఆన్ తప్పించుకుంది. ఆతిథ్య జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 67.4 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (90 బంతుల్లో 36; 4 ఫోర్లు) పర్వాలేదనిపించాడు. మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. బ్రియాన్ బెనెట్ (19), కిటానో (0), నిక్ వెల్చ్ (4), వెస్లీ మధెవెరె (15), ప్రిన్స్ (7), తఫద్జ్వా ట్సిగా (9), మసకద్జా (4) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు వరుసకట్టారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ముల్డర్ 4 వికెట్లు పడగొట్టగా... కేశవ్ మహరాజ్, యూసుఫ్ చెరో మూడు వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా ఆదివారం రెండో రోజు ఆట ముగిసే సమయానికి 13 ఓవర్లలో వికెట్ నష్టానికి 49 పరుగులు చేసింది. మాథ్యూ బ్రీజ్కి (1) అవుట్ కాగా... టోనీ డి జోర్జి (22 బ్యాటింగ్; 2 ఫోర్లు), ముల్డర్ (25 బ్యాటింగ్; 4 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 418/9 వద్దే దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. దీంతో ఓవరాల్‌గా చేతిలో 9 వికెట్లు ఉన్న సఫారీ జట్టు ప్రస్తుతం 216 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

కేశవ్ మహరాజ్ @ 200

ఈ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టుకు సారథిగా వ్యవహరిస్తున్న కేశవ్ మహరాజ్... అరుదైన ఘనత సాధించాడు. సఫారీ జట్టు తరఫున 200 టెస్టు వికెట్లు పడగొట్టిన తొలి స్పిన్నర్‌గా రికార్డుల్లోకెక్కాడు. జింబాబ్వే కెప్టెన్ ఇర్విన్‌ను అవుట్ చేయడం ద్వారా కేశవ్ మహరాజ్ సుదీర్ఘ ఫార్మాట్‌లో 200వ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. 9 ఏళ్లుగా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న 35 ఏళ్ల కేశవ్... ఇప్పటి వరకు 59 టెస్టుల్లో 202 వికెట్లు పడగొట్టాడు.


సీన్ విలియమ్స్

రన్నరప్ యూకీ జోడీ

మలోర్కా (స్పెయిన్): కెరీర్‌లో ఐదో డబుల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన భారత టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీకి నిరాశ ఎదురైంది. మలోర్కా ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ రన్నరప్‌గా నిలిచింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో యూకీ-గాలోవే జోడీ 1-6, 6-1, 13-15తో 'సూపర్ టైబ్రేక్'లో సాంటియాగో గొంజాలెజ్ (మెక్సికో)-ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా) జోడీ జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. 79 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-గాలోవే జోడీ ఏడు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయిన ఈ ఇండో-అమెరికన్ ద్వయం ప్రత్యర్థుల సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. రన్నరప్ యూకీ-గాలోవే జంటకు 16,940 యూరోల (రూ. 16 లక్షల 95 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 150 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 2023లో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)తో కలిసి ఇదే టోర్నీలో యూకీ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఓవరాల్‌గా యూకీ తన కెరీర్‌లో నాలుగు ఏటీపీ డబుల్స్ టైటిల్స్‌ను సాధించి, మరో నాలుగింటిలో రన్నరప్‌గా నిలిచాడు.


యూకీ బాంబ్రీ



ఆదివారం నాగపూర్‌లోని మహారాష్ట్ర నేషనల్ లా కాలేజీ పరిపాలనా భవనం ప్రారంభానికి బ్యాటరీ వాహనంలో వస్తున్న సీజేఐ బీఆర్ గవాయ్, సీఎం దేవేంద్ర ఫడ్నవీస్



ఆదివారం ఆగ్రాలో హోరు వర్షం నడుమ చారిత్రక తాజ్ మహల్ అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు

భారత కాలపు ఆయుధాలు!

రాజస్థాన్‌లో లభ్యం
- పురాతన విగ్రహాలు, పాత్రలు కూడా
- క్రీ.పూ. 2,500 నాటివని భావిస్తున్న నిపుణులు
- భూమిలో నిక్షిప్తమైన గొప్ప సాంస్కృతిక ఆనవాళ్లు

పొలం దున్నుతుంటేనో, కొత్త ఇంటి కోసం భూమిని తవ్వుతుంటేనో లంకెబిందెలు దొరకడం, ఎవరూ చూడకుంటే దాచేసుకోవడం, అందరికీ తెలిస్తే ప్రభుత్వపరం కావడం తెల్సిందే. మానవాళి నడిచి వచ్చిన దారుల గురించి, మన పూర్వీకులు వదిలి వెళ్లిన జ్ఞాపకాలు, సాంస్కృతిక సంపద గురించి తెలియాలంటే ఇలా లభ్యమైన పురాతన విగ్రహాలు, పాత్రలు, కళాఖండాలే ఆధారం. తాజాగా ఏకంగా మహాభారత కాలం నాటి, అంటే దాదాపు 4,500 ఏళ్ల నాటి పురాతన విగ్రహాలు, ఆయుధాలు, పాత్రలు రాజస్తాన్‌లోని బీట్ జిల్లాలో తవ్వకాల్లో బయటపడ్డాయి. మౌర్యులు, శుంగ వంశ పాలనా కాలానికి చెందిన ఈ వస్తువులను పురాతత్వ శాఖ (ఏఎస్ఐ) తాజాగా తవ్వితీసింది. గత నాగరికత తాలూకు అవశేషాలు బయల్పడిన రాజస్తాన్‌లోని భరత్‌పూర్‌కు 40 కిలోమీటర్ల దూరంలోని బహాజ్ గ్రామంలో ఈ తవ్వకాలు జరిపారు. ఉత్తరప్రదేశ్‌లోని మథుర, ఈ బహాజ్ గ్రామం, హరియాణాలోని మరికొన్ని ప్రాంతాలన్నింటినీ కలిపి కృష్ణుడు నడయాడిన 'బ్రజ్ భూమి'గా పిల్చుకుంటారన్నది తెలిసిందే.

జనవరిలో తవ్వకాలు షురూ

బహాజ్ గ్రామ భూముల్లో పురాతన ఆనవాళ్లు ఉన్నట్లు ప్రాథమిక అంచనాతో ఈ ఏడాది జనవరిలో పురాతత్వ బృందాలు తవ్వకాలు మొదలెట్టాయి. నిరాటంకంగా ఆరు నెలలుగా తవ్వకాలు జరపగా ఎన్నెన్నో పురాతన వస్తువులు లభించాయి. రాజులు, రాజ్యాల ఘనతను చాటే విగ్రహాలు, వస్తువులు, పాత్రలు, ఆయుధాలు దొరికాయి. ఒక అస్థిపంజరం సైతం లభించింది. అది ఏ కాలపుదో తెల్సుకునేందుకు ఇజ్రాయెల్ పంపారు. కొన్ని అపురూప విగ్రహాలను జైపూర్‌లోని పురాతత్వ శాఖ విభాగానికి తరలించి భద్రపరిచారు. మరి కొన్నింటిని పౌరుల సందర్శనల కోసం డీగ్ జల్‌మహల్, ఇతర మ్యూజియాల్లో ప్రదర్శనకు ఉంచారు. ''తవ్వకాలకు అనుమతి రాగానే ఎంతో సంతోషించాం. ఏమాత్రం ఆలస్యంచేయకుండా జనవరి 10వ తేదీన తవ్వకాలు మొదలెట్టాం. తవ్వకాలు ఇక మీదట కూడా కొనసాగుతాయి. సమీప ప్రాంతాల్లోనూ తవ్వకాలు జరిపి పురాతన నాగరికత తాలూకు అవశేషాలను కనుగొంటాం. నాటి సంస్కృతిపై ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు కృషిచేస్తాం'' అని జైపూర్ పురాతత్వ శాఖ డైరెక్టర్ డాక్టర్ వినయ్ గుప్తా చెప్పారు. దశాబ్దాల క్రితం సమీప నౌ గ్రామంలో ఏఎస్ఐ బృందాలు తవ్వకాలు జరిపారు. ఆనాడు సైతం కొన్ని పురాతన వస్తువులు లభించాయి.



తవ్వకాల్లో లభ్యమైన ప్రతిమ

- జైపూర్



ఆదివారం కోల్‌కతాలోని కేంద్రీయ విద్యాలయంలో ఫుట్‌బాల్ పోటీల ప్రారంభం సందర్భంగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ క్రీడా విన్యాసం

సభా వేదికపై కూలిన డ్రోన్.. తేజస్వికి తప్పిన ప్రమాదం

పట్నా: ఆర్‌జేడీ నేత, బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ వెంట్రుకవాసిలో ప్రమాదాన్ని తప్పించుకున్నారు. పట్నాలోని చారిత్రక మైదానంలో ఆదివారం 'సేవ్ వక్ఫ్–సేవ్ కాన్‌స్టిట్యూషన్' పేరుతో ఏర్పాటైన ర్యాలీలో తేజస్వీ ప్రసంగించాల్సి ఉంది. కార్యక్రమం కొనసాగుతుండగా ఎక్కడి నుంచో ఒక డ్రోన్ వేదికపై కూర్చున్న తేజస్వీ దిశగా దూసుకొచ్చింది. వేగంగా స్పందించిన తేజస్వీయాదవ్ తలను కిందికి వంచడంతో ఆయన మీదుగా డ్రోన్ వెనక్కి వెళ్లి నేల కూలింది. చాకచక్యంగా వ్యవహరించడంతో ఆయన పెను ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఘటనపై పట్నా (సెంట్రల్)ఎస్పీ దీక్ష మీడియాతో మాట్లాడారు. 'ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టాం. అది నిషిద్ధ ప్రాంతం. అక్కడికి డ్రోన్ వంటివేవీ ప్రవేశించరాదు. ర్యాలీకి వచ్చిన జనాన్ని నియంత్రించడంలో ఆ సమయంలో పోలీసులు బిజీగా ఉండిపోయారు. ఈ ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేపడతాం'అని వివరించారు. ఇలా ఉండగా, ర్యాలీలో ప్రసంగించిన తేజస్వీ యాదవ్..మహాఘట్ బంధన్ అధికారంలోకి వస్తే బిహార్‌లో వక్ఫ్ చట్టాన్ని చెత్త బుట్టలో పడేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు నితీశ్ సారథ్యంలోని ఎన్‌డీఏ సర్కారును సాగనంపడం ఖాయమని చెప్పారు.

మెదడును నియంత్రించే ఫంగస్!

చాన్నాళ్ల క్రితం విడుదలై సంచలన విజయం సృష్టించిన హాలీవుడ్ చిత్రం జురాసిక్ పార్క్ సినిమా గుర్తుండే ఉంటుంది. అందులో అడవిలో పెద్ద చెట్టు నరికేస్తుంటే దాని జిగురులో ఒక దోమ చిక్కుకుపోయి ఉంటుంది. ఆ దోమ అప్పటికే ఒక పెద్ద డైనోసార్‌ను కుదుతుంది. ఆ డైనోసార్ రక్తం నుంచి సేకరించి డీఎన్‌ఏతో శాస్త్రవేత్తలు మళ్లీ డైనోసార్‌కు ప్రాణప్రతిష్టచేస్తారు. అచ్చం అలాగే 9.9 కోట్ల సంవత్సరాల క్రితంనాటి ఒక జిగురులో చిక్కుకుపోయిన చీమ, ఈగల సాయంతో వాటికి సోకిన ఒక ఫంగస్ జాడను నేడు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అయితే ఆ ఫంగస్ కూడా డైనోసార్ల కాలంనాటిదిగా పరిశోధకులు భావిస్తున్నారు.

ప్రాచీన కీటకాల్లో తిష్టవేసిన ఫంగస్
- 9.9 కోట్ల ఏళ్లనాటి జిగురులో నిక్షిప్తం
- జిగురులో చిక్కుకున్న ఈగ, చీమలో కనుగొన్న శాస్త్రవేత్తలు



జాంబీ ఫంగస్?

చెట్లు సూర్యరశ్మి ద్వారా కిరణజన్యసంయోగ క్రియ జరిపి శక్తిని సంపాదిస్తాయి. అయితే ఫంగస్, కీటకాలు వంటివి సొంతంగా ఆహారాన్ని, శక్తిని సృష్టించుకోలేక ఇతర జీవులపై ఆధారపడతాయి. వీటిని పరాన్న జీవులు అంటారు. అలాంటి పరాన్న జీవజాతులకు చెందిన కొన్ని ఫంగస్ రకాలు ఏకంగా తిన్నింటి వాసాలు లెక్కబెట్టేస్తాయి. అంటే చీమ మెదడులోకి దూరి దానినే ఈ ఫంగస్ నియంత్రిస్తుంది. దాంతో ఆ చీమ ఒక 'జాంబీ' తరహాలో నియంత్రణ తప్పి ప్రవర్తిస్తుంది. అలాంటి జాంబీ ఫంగస్ ఈకాలంలోనేకాదు డైనోసార్ల కాలంలోనూ జీవించి ఉన్నట్లు భావిస్తున్నారు. ఈ వాదనకు బలం చేకూరేలా ఈ జిగురులో చిక్కుకుపోయిన ఈగ, చీమలో కొత్త రకం ఫంగస్‌ల ఆనవాళ్లను గుర్తించారు. అయితే ఈ జాంబీ ఫంగస్ ఎంతటి శక్తివంతమైంది?. ఆనాటి చిన్నపాటి జీవజాలానికి ఇవి సోకి తమ నియంత్రణలోకి తెచ్చుకున్నాయా అనే ప్రశ్నలకు ఇప్పుడు శాస్త్రవేత్తలు సమాధానాలు వెతికే పనిలో పడ్డారు.

ఏమిటీ ఫంగస్ ప్రత్యేకత

కొన్ని రకాల కీటకాలు ఎక్కువగా ఒఫియోకార్డిసెప్స్ అనే ఫంగస్ బారిన పడతాయి. ఈ కీటకాల్లోని అతిదేహి కణాల్లోకి ఫంగస్ చొరబడి నెమ్మదిగా మెదడును చేరుతుంది. మెదడు కణాలను ఫంగస్ తనకు అనువుగా పనిచేసేలా మార్చేస్తుంది. పని పూర్తయ్యాక చివరకు ఆ కీటకాన్ని ఈ ఫంగస్ కణాలు చంపేస్తాయి. కీటక ప్రపంచంలో ఒఫియోకార్డిసెప్స్ ఫంగస్ వ్యాప్తి వివరాలపై తాజాగా పరిశోధన వేగవంతంకానుంది. అయితే తాజాగా ఈ చీమ, ఈగలో కనుగొన్న ఫంగస్‌లను గతంలో శాస్త్రవేత్తలు ఎన్నడూ చూడలేదు. దీంతో వీటికి కొత్త పేర్లు పెట్టారు. '' 9.9 కోట్ల ఏళ్ల క్రితం నాటి జీవులకు సోకిన ఫంగస్ రకాలున్న చీమ, ఈగ లభించడం నిజంగా అత్యంత అరుదు'' అని నైరుతి చైనాలోని యునాన్ విశ్వవిద్యాలయంలోని పురాతనజీవశాస్త్ర విభాగ డాక్టోరల్ విద్యార్థి, ఈ పరిశోధనకు నాయకత్వం వహించిన యుహూయీ ఝువాంగ్ చెప్పారు. ''ఒఫియోకార్డిసెప్స్ ఫంగస్ పూర్వీకులను గుర్తించడం ఇదే తొలిసారి. అందుకే వీటికి కొత్త పేర్లు పెట్టాం. చీమలో లభించిన కొత్త ఫంగస్‌కు పాలియోకార్డిసెప్స్ అని, ఈగకు సోకిన ఫంగస్‌కు పాలియోకార్డిసెప్స్ ఐరనోమేయియా అని నామకరణం చేశారు. కొన్ని ఒఫియోకార్డిసెప్స్ ఫంగస్ జాతులు ఈకాలంనాటి చీమలకూ సోకుతాయి. ఈ ఫంగస్‌కు 'జాంబీయాంట్ ఫంగీ' అనే పేరుంది. మెదడులోకి ఒఫియోకార్డిసెప్స్ ఫంగస్ వ్యాపించి తనకు అనువుగా ప్రవర్తించేలా చీమను తన వశంచేసుకుంటుంది. హెచ్‌బీఓ ప్రసారమైన టీవీ సిరీస్ ' ది లాస్ట్ ఆఫ్ అస్'కు ఈ ఫంగసే స్ఫూర్తి. కొత్త ఫంగస్ రకాలను కనుగొన్న పరిశోధనా తాలూకు వివరాలు ''ప్రొసీడింగ్స్ ఆఫ్ రాయల్ సొసైటీ'' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. కొత్త ఫంగస్‌ల రూపురేఖలు, లక్షణాలను తెల్సుకునేందుకు మైక్రో–కంప్యూటెడ్ టోమోగ్రఫీ ద్వారా త్రిమితీయ చిత్రాలను తీశారు. 14 నుంచి ఆరున్నర కోట్ల ఏళ్ల క్రితం నాటి ఫంగస్‌గా తేల్చారు. ఈ కాలాన్ని క్రిటేసియస్ కాలంగా పరిగణిస్తారు. '' జాంబీ ఫంగస్ సోకిన కీటకాలు త్వరగా చనిపోతాయి. ఒకరకంగా ఈ రకం కీటకాల జనాభాను నియంత్రించే కారకాలుగా జంబీ ఫంగస్‌ను చెప్పొచ్చు'' అని పరిశోధకుడు ఝువాంగ్ వ్యాఖ్యానించారు.

ఇప్పుడు ఏ జాతులకు సోకుతున్నాయి?

చీమలతోపాటు ఈగ, సాలెపురుగు, పేడపురుగు, సికాడాస్ పెద్ద ఈగ జాతులకూ ఈ జాంబీ ఫంగస్ బెడద ఉందని లండన్‌లోని నేచరల్ హిస్టరీ మ్యూజియం పత్రాలు వెల్లడిస్తున్నాయి. గండు చీమల మెదడులోకి నేరుగా దూరిపోయి వాటిని జాంబీ చీమలుగా మారుస్తాయని వాషింగ్టన్‌లోని స్మిత్‌సోనియన్ మ్యూజియం ఆఫ్ నేచరల్ హిస్టరీ సీనియర్ సైంటిస్ట్ కాన్రాడ్ లాబండీరీ చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

జనాభాలో మూడోవంతు దేశం వీడుతున్నారు!

యుద్ధాలు, అంతర్యుద్ధాలు కొన్ని దేశాల ప్రజలను శరణార్థులుగా మారుస్తుంటే.. వాతావరణంలో మార్పులు ఒక దేశ మనుగడకు ముప్పుగా పరిణమించాయి. ఆ దేశం పేరు తువాలు. హవాయి, ఆస్ట్రేలియా మధ్యలో పసిఫిక్ మహాసముద్రంలో తొమ్మిది చిన్న పగడపు దీవులతో కూడిన అతి చిన్న దేశం. ఇక్కడి జనాభాలో మూడింట ఒక వంతుకు పైగా ఆస్ట్రేలియాకు వెళ్లిపోవాలనుకుంటున్నారు. ప్రజలు దేశాన్ని వీడటానికి కారణమేంటి? వాతావరణం ఆ దేశానికి ముప్పుగా ఎలా మారింది? ఇప్పుడు వార్తల్లో ఎందుకు నిలిచింది చూద్దాం.

తువాలు.. ప్రపంచంలోనే అత్యల్ప జనాభా కలిగిన దేశాలలో ఒకటి. ఇక్కడి జనాభా 10,000 మంది కంటే తక్కువ. అంటే మన దేశంలో చిన్న పట్టణంతో సమానం. 1978లో బ్రిటిష్ పాలకుల నుంచి నుంచి స్వాతంత్ర్యం పొందింది. సహజమైన

ద్వీపదేశం తువలులో అస్థిరత

సౌందర్యానికి నెలవు. స్కూబా డైవింగ్‌కు ఎంతో ప్రసిద్ధి పొందింది. ఇక ఈ దేశంలో అతి పెద్ద దీవి.. పగడపు దీవి అయిన ఫనాఫుటి. ఇది దేశ రాజధాని కూడా. దీనికి కొన్ని ప్రదేశాల్లో కేవలం 65 అడుగుల వెడల్పు ఉన్న రన్‌వే లాంటి భూమి ఉంది. వాతావరణంలో మార్పులు ఈ దేశానికి ముప్పుగా పరిణమించాయి. దీంతో ఇక్కడి ప్రజలు ఆస్ట్రేలియాకు వలసపోతారు. వీరికి నివాసం కల్పించడం కోసం మానవతా దృక్పథంతో ఆస్ట్రేలియా ల్యాండ్‌మార్క్ వీసా పథకాన్ని రూపొందించింది. ఈ నెల 16న దరఖాస్తుల విండోను ప్రారంభించింది. ఇప్పటివరకు 4,000 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరి నుంచి జనవరి 2026 వరకు 280 మందిని ఎంపిక చేయనుంది. ఈ వీసాలను గెలుచుకున్నవారు.. ఆస్ట్రేలియాలో శాశ్వత నివాసం పొందుతారు. విద్య, ప్రజారోగ్యంతోపాటు పనిచేసే హక్కు కూడా వారికి లభిస్తుంది. 2050 నాటికి తువాలులో సగానికి పైగా భూమి మునిగిపోతుందని, ఇక 2100 నాటికి 90శాతం దేశం సముద్రంలో కలిసిపోతుందని తువాలు ప్రధాన మంత్రి ఫెలేటి టియో తెలిపారు. అయితే భవిష్యత్తులో ఎవరూ అక్కడ నివసించలేకపోయినా, తువాలుకు గుర్తింపు ఇస్తామని ఆస్ట్రేలి యా హామీ ఇచ్చింది.



- సాక్షి, నేషనల్ డెస్క్

అవి అస్పష్ట, గంపగుత్త ఆరోపణలు

తల్లి, కుమారుడిపై కట్నం కేసు కొట్టేసిన బాంబే హైకోర్టు

నాగ్‌పూర్: క్యాన్సర్ నుంచి కోలుకుని భర్త వద్దకు వెళ్లిన తన సోదరిని అత్తింటి వారు కట్నం తేవాలంటూ వెనక్కి పంపించి వేశారంటూ ఓ వ్యక్తి చేసిన ఆరోపణలను బాంబే హైకోర్టు తోసిపుచ్చింది. ప్రతీకారేచ్ఛతోనే ఈ ఫిర్యాదు చేసినట్టుగా భావిస్తున్నామని పేర్కొంది. తనతోపాటు 68 ఏళ్ల తన తల్లిపై నమోదైన కట్నం వేధింపుల కేసును కొట్టివేయాలంటూ పుణేకు చెందిన పిటిషనర్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ అనిల్ కిలోర్, జస్టిస్ ప్రవీణ్ ఎస్ పాటిల్‌ల ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. పిటిషనర్‌కు 2016లో వివాహమవగా అతడి భార్యకు క్యాన్సర్ ఉన్నట్లు 2019లో నిర్ధారణయింది. అనంతరం ఆమె తన సోదరుడి వద్ద ఉంటూ చికిత్స తీసుకుంది. వైద్యం ఖర్చు కొంత సోదరుడే భరించాడు. వ్యాధి నుంచి కోలుకున్నాక 2020 జనవరిలో ఆమె తిరిగి భర్త వద్దకు వెళ్లింది. అయితే, రూ.8 లక్షల కట్నం తేవాలంటూ ఆమెను భర్త, అత్త వెనక్కి పంపించి వేశారంటూ సోదరుడు 2021 ఫిబ్రవరి 11న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మరునాడు, అంటే ఫిబ్రవరి 12వ తేదీన ఆమె కన్నుమూసింది. అత్తింటి వారి నుంచి క్యాన్సర్ చికిత్సకు అయిన ఖర్చులను రాబట్టేందుకే అతడు కేసు వేశాడని పిటిషనర్ తరఫు లాయర్ యోగేశ్ వైద్య వాదించారు. పిటిషనర్ తన భార్య వైద్యానికైన ఖర్చు కొంత భరించారని, వైద్య బీమా కూడా చేయించారని ధర్మాసనానికి ఆధారాలను నివేదించారు. పైపెచ్చు, పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయలేదు, ఇతరత్రా వేధింపులేవీ నమోదు కాలేదన్నారు. క్యాన్సర్ నుంచి కోలుకున్న తర్వాత భర్త వద్దకు ఆమె ఎప్పుడు వెళ్లింది వంటి వివరాలు సైతం లేవన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ భార్య సోదరుడు కక్ష సాధింపు కోసమే పోలీసులకు ఫిర్యాదు చేసినట్టుగా భావిస్తున్నామని ధర్మాసనం పేర్కొంది. అస్పష్టంగా, ఎలాంటి ఆధారాల్లేకుండా గంపగుత్తగా అతడి ఆరోపణలు చేశాడని తెలిపింది. పిటిషనర్, అతడి తల్లిపై నమోదైన కేసు కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది.

లా కాలేజీ విద్యార్థినిపై దాష్టీకం సీసీ కెమెరాలో రికార్డు

కోల్‌కతా: సౌత్ కోల్‌కతా లా కాలేజీలో విద్యార్థినిపై గ్యాంగ్‌రేప్ ఘటనపై దర్యాప్తు వేగవంతమైంది. ఘటన చోటుచేసుకున్న జూన్ 25వ తేదీనాటి సీసీటీవీ ఫుటేజీలో ఫస్టియర్ చదివే విద్యార్థినిని కొందరు సెక్యూరిటీ గార్డు రూంలోకి ఈడ్చుకెళ్తున్న దృశ్యాలు నమోదయ్యాయని పోలీసులు వెల్లడించారు. అందులో బాధితురాలు, ముగ్గురు నిందితుడు, సెక్యూరిటీ గార్డు కనిపించారన్నారు. అక్కడి స్టూడెంట్స్ యూనియన్ గది, వాష్‌రూంలో వెంట్రుకలు, హాకీ స్టిక్‌ను, గుర్తు తెలియని ద్రావకం కలిగిన కొన్ని బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గార్డు రూం, స్టూడెంట్స్ యూనియన్ గది, వాష్ రూంలలో పెనుగులాట చోటుచేసుకున్నట్లు ఆనవాళ్లున్నాయని వివరించారు. నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షకు పంపినట్లు తెలిపారు. బాధితురాలి ముఖం, మెడపై గీసుకుపోయినట్లు, ఛాతీపై కొన్ని గుర్తులు ఉన్నాయని వివరించారు. ప్రధాన నిందితుడు కాలేజీ మాజీ విద్యార్థి, టీఎంసీ విద్యార్థి నేత మోనోజిత్ మిశ్రాతోపాటు మరో ఇద్దరు విద్యార్థులను, కాలేజీ వాచ్‌మ్యాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇలా ఉండగా, ఘటన చోటుచేసుకున్న లా కాలేజీకి ఆదివారం జాతీయ మహిళా కమిషన్(ఎన్‌సీడబ్ల్యూ)సభ్యురాలు అర్చనా మజుందార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విద్యార్థినిపై జరిగిన దారుణంపై దర్యాప్తు చేయకుండా పోలీసులు తనకు ఆటంకం కలిగించారని అనంతరం మజుందార్ ఆరోపించారు. ఘటనాప్రాంతంలో ఫొటోలు, వీడియోలు నిషేధించినట్లు చెప్పారన్నారు. కాగా, ఘటనపై దర్యాప్తునకు అసిస్టెంట్ కమిషనర్ స్థాయి పోలీసు అధికారి సారథ్యంలో ఐదుగురు సభ్యుల సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడం తెల్సిందే.

శ్రీలంక నేవీ అదుపులో మన జాలర్లు

కొలంబో: శ్రీలంక నావికా దళం ఆదివారం ఎనిమిది మంది భారతీయ మత్స్యకారులను అరెస్ట్ చేయడంతోపాటు, వారి ట్రాలర్లను స్వాధీనం చేసుకుంది. మన్నార్‌కు ఉత్తర ప్రాంతంలో ఆదివారం ఉదయం తమ ప్రాదేశిక జలాల్లో అక్రమంగా చేపలు పడుతున్న భారతీయ మత్స్యకారులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు శ్రీలంక నేవీ తెలిపింది. భారత్, శ్రీలంకల నడుమ సంబంధాల్లో మత్స్యకారుల సమస్య వివాదాస్పదమైంది. శ్రీలంక నేవీ పాక్ జలసంధిలో భారత మత్స్యకారులపై కాల్పులు జరపడం, తమ ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారని అరెస్టులు చేయడం, వారి పడవలను స్వాధీనం చేసుకోవడం తరచూ జరుగుతున్నాయి.

లింగ సమానత్వంలో... అట్టడుగుకు!

148 దేశాల్లో 131 స్థానంలో భారత్

విద్యలో ముందున్నా ఆర్థికంగా అంతరాలే



ఒక దేశ ప్రగతి.. ఆ దేశంలోని మహిళల ఆర్థిక అభివృద్ధి, ఆర్థిక సమానత్వంపైనే ఆధారపడి ఉంటుంది. అందుకే మన దేశంలో లింగ వివక్షకు తావివ్వకూడదని రాజ్యాంగంలోనే రాసుకున్నాం. కానీ.. అది రాతల వరకే పరిమితమైంది. మహిళలు చదువుకున్నా.. లింగ సమానత్వంలో మన దేశం నానాటికి అట్టడుగు స్థాయికి పోతోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం విడుదల చేసిన గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ –2025 ఆ విషయాన్ని వెల్లడించింది. ప్రపంచంలో లింగ సమానత్వంలో మొత్తం 148 దేశాల్లో మన దేశం 131 స్థానంలో నిలిచింది. గత ఏడాది 129 స్థానంలో ఉన్న దేశం ఈ ఏడాదికి మరో రెండు స్థానాలు పడిపోయింది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2006 నుంచి ప్రపంచ దేశాల్లో లింగ సమానత్వాన్ని పరిశీలిస్తోంది. ఇది ఆర్థిక భాగస్వామ్యం, విద్య, ఆరోగ్యం–జీవితకాలం, రాజకీయ సాధికారత అంశాల్లో మహిళలు, పురుషుల మధ్య అంతరాన్ని అధ్యయనం చేస్తోంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా ఏ ఆర్థిక వ్యవస్థ కూడా పూర్తి లింగ సమానత్వాన్ని సాధించకపోయినా.. పొరుగుదేశాలైన బంగ్లాదేశ్ 24, భూటాన్ 119, నేపాల్ 125, శ్రీలంక 130 స్థానాల్లో ఉండగా, భారత్ వాటికంటే వెనుకబడి ఉంటడం ఆందోళన కలిగించే విషయం. మహిళల సమానత్వంలో ఐస్‌ల్యాండ్ అగ్రస్థానంలో ఉంది. 16 ఏళ్లుగా ఇదే స్థానాన్ని కొనసాగించడం విశేషం.

కార్పొరేట్ రంగంలో మరింత అంతరం

మహిళల ఉపాధి విషయంలో మరింత అంతరం ఉంది. భారతీయ కంపెనీల్లో జూనియర్ స్థాయి ఉద్యోగులు ప్రతి ముగ్గురిలో ఒకరు మాత్రమే మహిళ. పై స్థాయికి వెళ్లేకొద్దీ మహిళల సంఖ్య బాగా తగ్గింది. కార్పొరేట్ కంపెనీల్లోని బోర్డు పదవుల్లో మహిళలు కేవలం 18.2 శాతం మాత్రమే ఉన్నారు. మహిళల సామర్థ్యానికి తగిన ఉపాధి లభించడం లేదు. ఈ అంతరం నానాటికీ పెరుగుతోంది. మహిళల ఆర్థిక భాగస్వామ్యం గత ఏడాది 39.8 శాతం ఉండగా.. ఈ ఏడాదికి 40.7 శాతానికి మాత్రమే మెరుగుపడింది. కానీ పురుషులు, మహిళల వేతనం విషయంలో చాలా వ్యత్యాసం ఉంది. ఒకే పనికి మహిళలు.. పురుషుల కంటే మూడింట ఒక వంతు తక్కువ సంపాదిస్తున్నారు. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం చాలా తక్కువగా ఉంది.

విద్యలో మెరుగుపడినప్పటికీ..

భారత్ మహిళల విద్యలో పురుషులతో పోలిస్తే పురోగతి సాధించింది. బాలురతో సమానంగా బాలికలు పాఠశాలకు వెళ్లి కళాశాలల్లో చేరుతున్నారు. అనేక పట్టణాల్లోని విశ్వవిద్యాలయాల గ్రాడ్యుయేట్లలో మహిళలే ఎక్కువ మంది ఉన్నారు. అయినప్పటికీ, ఈ విజయం ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించడం లేదు. మహిళల ఆరోగ్యం విషయంలో ఫలితాలు కొద్దిగా మెరుగుపడ్డాయి. జనన సమయంలో లింగ నిష్పత్తి మెరుగుపడింది. మహిళల ఆయుర్దాయం పెరిగింది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ అయినప్పటికీ, ఆర్థిక భాగస్వామ్యం, అవకాశాలలో లింగ సమానత్వంలో భారత్ ప్రపంచవ్యాప్తంగా అధ్వాన్నమైన స్థితిలో ఉంది.

అధికారంలో మరింత తక్కువ..

ఇక రాజకీయంగా చెప్పాల్సిన అవసరమే లేదు. రాజకీయ ప్రాతినిధ్యంలో మహిళల స్థానం అత్యంత ఆందోళన కలిగించే విషయం, దేశ భవిష్యత్‌ను రూపొందించే పార్లమెంటులో మహిళల సంఖ్య 14.7 నుంచి 13.8 శాతానికి తగ్గింది. మహిళా మంత్రుల వాటా 5.6 శాతమే. గత సంవత్సరం ఇది 6.5 శాతంగా ఉన్నది.. ఈ ఏడాది మరింత తగ్గింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

హిందీ బోధనపై మహా సర్కార్ వెనక్కి

తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో ఉత్తర్వుల వాపస్

ముంబై: ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్కూళ్లలో హిందీ భాషా బోధన అమలుపై తీవ్ర వ్యతిరేకత రావడంతో మహారాష్ట్ర సర్కార్ వెనక్కి తగ్గింది. త్రి భాషా సూత్రం అమలుకు ఉద్దేశించి ఏప్రిల్, జూన్‌లలో జారీ చేసిన రెండు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించుకుంది. సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఆదివారం మీడియా సమావేశంలో ఈ విషయం ప్రకటించారు. మరాఠా విద్యార్థులను దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. భాషా విధానంపై ఎలా ముందుకెళ్లాలనే విషయం నిర్ణయించేందుకు విద్యావేత్త డాక్టర్ నరేంద్ర జాధవ్ సారథ్యంలో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ మూడు నెలల్లో నివేదిక ఇస్తుందని, ఆ తర్వాత నిర్ణయం తీసుకుంటామని సీఎం వివరించారు. స్కూళ్లలో హిందీ నిర్బంధ బోధన విధానానికి వ్యతిరేకంగా శివసేన(యూబీటీ), ఎంఎన్‌ఎస్ జూలై 5న ఉమ్మడి ర్యాలీ చేపడతామని ప్రకటించడం తెల్సిందే. కాగా, ఫడ్నవిస్ ప్రభుత్వ తాజా ప్రకటన నేపథ్యంలో దానిని విజయోత్సవ ర్యాలీగా నిర్వహించాలని నిర్ణయించాయి.

బంగ్లాదేశ్‌లో హిందూ మహిళపై అత్యాచారం

ఢాకా: బంగ్లాదేశ్‌లోని మురాద్‌నగర్‌లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) నేత ఒకరు హిందూ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రధాన నిందితుడు సహా ఐదుగుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రామచంద్రాపూర్ పచ్‌కిట గ్రామానికి చెందిన ఫజోర్ అలీ(38) జూన్ 26వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో ఓ ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించి బాధితురాలి(21)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అతడికి దేహశుద్ధి చేశారు. పారిపోయిన అతడిని ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో ఢాకాలోని సైదాబాద్‌లో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భర్తతోపాటు దుబాయ్‌లో ఉంటున్న బాధితురాలు హరిసేవా పండుగ కోసం పిల్లలతో కలిసి తండ్రి వద్దకు వచ్చిందని తెలిపారు. షేక్ హసీనా ప్రభుత్వం వైదొలిగినప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు పెరగడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

బహమనీ రాజ్యస్థాపకుడు ఎవరు?

తెలుగు జాతి గౌరవాన్ని సుసంపన్నం చేసి, దాని కీర్తిని దశదిశలా వ్యాప్తి చేసిన కాకతీయ రాజుల సామ్రాజ్యం ముస్లిం రాజుల దాడివల్ల ధ్వంసమైంది. క్రీ.శ. 1323లో జరిగిన యుద్ధంలో కాకతీయుల చివరి రాజు రెండో ప్రతాపరుద్రుడు ఓటమి పాలై ఢిల్లీ సైన్యానికి పట్టుబడ్డాడు. ఇతడు అవమాన భారాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడంతో ఓరుగల్లులో కాకతీయ సామ్రాజ్య సౌధం శాశ్వతంగా కుప్పకూలిపోయింది. తెలుగునాట ముస్లిం సైనిక పాలనకు పునాది పడింది. వీరి పాలనలో విపత్కర పరిస్థితులను ఎదుర్కొన్న తెలుగు ప్రజలు స్వేచ్ఛ కోసం విముక్తి పోరాటానికి నడుం బిగించారు. 'ముసునూరి ప్రోలయ నాయకుడు' ఈ విమోచన ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రజలను ముందుకు నడిపించాడు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర



కాకతీయుల అనంతర పరిస్థితులు

ఢిల్లీ సుల్తాన్ ఘియాజుద్దీన్ తుగ్లక్ (క్రీ.శ.1320-25) కుమారుడు జునాఖాన్ (మహ్మద్‌బిన్ తుగ్లక్). ఇతడినే ఉలుగ్‌ఖాన్ అని కూడా అంటారు. కాకతీయులపై విజయం (1323) సాధించిన జునాఖాన్ వారి రాజ్యాన్ని ఢిల్లీ సుల్తానత్‌లో కలిపాడు. ఇతడి నాయకత్వంలోని ఢిల్లీ సుల్తాన్ తురుష్క సైన్యం కాకతీయ రాజ్యానికి చెందిన ప్రజల సమస్త సంపదను దోచుకుంది. ఓరుగల్లు పేరును సుల్తాన్‌పూర్‌గా మార్చారు. కాకతీయులు నిర్మించిన అనేక కోటలు, దుర్గాలు, దేవాలయాలను నాశనం చేశారు. దోచుకున్న సంపదనంతా ఢిల్లీకి తరలించారు. తురుష్క సైన్యం తమ క్రూరమైన చర్యలతో తెలుగు ప్రజలను భయకంపితులను చేసింది. చాళుక్యులు, కాకతీయులు నిర్మించిన అనేక దేవాలయాలను కూలగొట్టి వాటి స్థానంలో మసీదులను నిర్మించారు. మత మార్పిడులకు పాల్పడ్డారు. ముసునూరి ప్రోలయ నాయకుడు కందరాడ గ్రామంలో (పిఠాపురం సమీపంలో) వేయించిన 'విలాసతామ్ర శాసనం', విజయనగర కంపల రాయల భార్య గంగాదేవి రచించిన 'మధురా విజయం' (సంస్కృత కావ్యం), ప్రముఖ ముస్లిం చరిత్రకారుడు జియావుద్దీన్ బరౌనీ రచనల ద్వారా ఈ వివరాలు తెలుస్తున్నాయి. భారతదేశానికి వచ్చిన విదేశీ ముస్లింలు ఢిల్లీ సుల్తాన్ల కాలంలో ఉత్తర భారతం నుంచి తెలంగాణా ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు.

కాకతీయుల పతనం దక్షిణ భారత దేశానికి చెందిన అనేక రాజ్యాలకు శాపంగా మారింది. వీటిలో చాలా రాజ్యాలు 1325 వరకు తుగ్లక్ ఆధీనంలోకి వచ్చాయి. వారిలో ఉన్న అనైక్యత కారణంగా ముస్లిం సైన్యాన్ని అడ్డుకోలేక చాలా మంది రాజులు ఢిల్లీ సుల్తాన్‌కు లొంగిపోయారు. దౌల్తాబాద్ (దేవగిరి) వజీరైన మాలిక్ బుర్హనుద్దీన్‌ను తెలుగు ప్రాంతానికి అధికారిగా నియమించారు. పాలనలో ఇతడికి సహాయం అందించడానికి సుల్తాన్‌పూర్ (ఓరుగల్లు) కోటకు అధిపతిగా 'మాలిక్ మక్బూల్'ను నియమించారు. ఢిల్లీ సింహాసనం కోసం వారసత్వ పోరు జరిగింది. మహ్మద్ బిన్ తుగ్లక్ తన తండ్రిని చంపి సుల్తానయ్యాడు. ఈ నేపథ్యంలో కాకతీయుల కాలంలో పనిచేసిన సైన్యాధికారులు, అనేక మంది బలమైన నాయంకరులు ఏకమై ఢిల్లీ సుల్తాన్‌పై తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. తెలుగు ప్రాంతంపై ఇస్లాం పాలనను అంతం చేయడమే ప్రథమ కర్తవ్యంగా ఈ తిరుగుబాటులో అనేక వర్గాలకు చెందిన ప్రజలు, నాయకులు పాల్గొన్నారు. ఈ పోరాటం హిందూ మతోద్ధరణకు, సంస్కృతి రక్షణకు తోడ్పడిందని అనితల్లి (రాజమండ్రి రెడ్డి రాజు కాటయ వేమారెడ్డి కుమార్తె) వేయించిన కలువచేరు శాసనం (క్రీ.శ. 1423) ద్వారా తెలుస్తోంది.

కాకతీయుల నాయంకర విధానం

కాకతీయుల సైనిక పరిపాలనను 'నాయంకర విధానం' అని పిలుస్తారు. రుద్రమదేవి ప్రవేశపెట్టిన ఈ విధానాన్ని రెండో ప్రతాపరుద్రుడు పునర్ వ్యవస్థీకరించి బలోపేతం చేశాడు. సైన్యాధికారులైన ఈ నాయంకరులు తమ ఆధీనంలో, వారి స్థాయిని బట్టి స్వతంత్రంగా కొంత సైన్యాన్ని పోషించేవారు. సైన్య పోషణకు అయ్యే ఖర్చు నిమిత్తం వీరికి కొన్ని గ్రామాలపై పూర్తి అధికారం ఇచ్చారు. వీరు ఈ గ్రామాల నుంచి శిస్తు వసూలు చేసుకునేవారు. కొంత సొమ్మును రాజుకు కప్పంగా చెల్లించేవారు. రాజుకు అవసరమైనప్పుడు సైనిక సహాయం చేయడం వీరి బాధ్యత. కాకతీయులకు నమ్మకంగా ఉన్న వంశస్థుల వారే వంశపారంపర్యంగా నాయంకరులుగా నియమితులయ్యారు. కాకతీయులు సాధించిన అనేక విజయాల్లో వీరు గణనీయ పాత్ర పోషించారు. రెండో ప్రతాపరుద్రుడి పాలన చివరి నాటికి ఈ నాయంకరులు చిన్న చిన్న రాజులుగా అవతరించారు. ఢిల్లీ సుల్తాన్ దాడుల వల్ల వీరి ప్రాబల్యం పతనమైంది. వీరు తమ ఉనికిని నిలుపుకోవడానికి ఢిల్లీ పాలనను ఎదురించాలని ఏకమయ్యారు. ఆ కాలంలో 75 మంది నాయంకరులున్నట్లుగా కలువచేరు శాసనం ద్వారా తెలుస్తోంది. వీరిలో ఎక్కువగా వెలమ కులానికి చెందిన నాయకులే ఉన్నారని 'ప్రతాపరుద్ర చరిత్ర' ద్వారా తెలుస్తోంది. వీరితో పాటు రెడ్డి, కమ్మ, కాపు, తెలగ, యాదవ నాయకులు కూడా ఉన్నట్లు ఆధారాలున్నాయి. రైతు కుటుంబాలకు చెందిన వీరు మొదట సైన్యాధికారులుగా నియమితులై ఆ తర్వాత క్రమంగా ప్రభువులయ్యారు.

తెలుగు నాయకుల విమోచనోద్యమం

ప్రతాపరుద్రుడి మరణం తర్వాత వయోవృద్ధులైన కాకతీయ సేనానుల్లో ముఖ్యమైనవారు - ఇందలూరి అన్నయ్య, కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమ నాయకుడు, రేచర్ల ఏచ నాయకుడు, యాదవసాంగపనిదేవుడు. వీరు నాయంకరుల వారసులను ఏకం చేసి ఢిల్లీ సుల్తాన్ అధికారాన్ని ధిక్కరించాలని నిశ్చయించారు. ముసునూరి ప్రోలయ నాయకుడిని వీరికి నాయకుడిగా ఎన్నుకున్నట్లు విలాసతామ్ర శాసనం, పోలవరం శాసనం, కలువ చేరు శాసనాల ద్వారా తెలుస్తోంది. ప్రోలయకు అండగా అతడి పిన తండ్రి కుమారుడైన ముసునూరి కాపయ నాయకుడు వ్యవహరించాడు. వీరి నాయకత్వాన్ని అద్దంకి వేమారెడ్డి, కొప్పుల ప్రోలయ నాయకుడు, రేచర్ల సింగమ నాయకుడు, మంచికొండ గణపతి నాయకుడు, ఉండీ వేంగభూపాలుడు, ఎరువ చోడభక్తిరాజు, ఆరవీటి సోమదేవ రాజు లాంటి ముఖ్యులు సమర్థించారు. 1325 చివర్లో మధ్యాంధ్ర ప్రాంతంలో ముసునూరి ప్రోలయ నాయకుడు తురుష్క సైన్యాలను ఓడించి రేఖపల్లిలో స్వతంత్ర్య రాజ్యాన్ని స్థాపించాడు. ఇతడికి అనుయాయిగా వేమారెడ్డి అద్దంకిలో రెడ్డి రాజ్యాన్ని స్థాపించాడు.

ముసునూరి నాయకులు

కమ్మ వ్యవసాయదారుల కుటుంబానికి చెందిన ముసునూరు నాయకులు దివిసీమను పాలించిన పిన్నచోడుని ఆశ్రయంలో ఉండేవారు. పిన్నచోడుని కుమార్తెలను (నారాంబ, పేరాంబ) వివాహమాడిన గణపతి దేవుడు వారి సోదరుడైన జాయపసేనానిని తన ఆస్థానంలో చేర్చుకోవడంతో ఈ ముసునూరు వారు కూడా కాకతీయుల కొలువులో చేరారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు సమీపంలోని ముసునూరు గ్రామం వీరి తొలి నివాసం. వీరు సైనిక శిక్షణ పొందడం ద్వారా వీరులయ్యారు. ప్రతాపరుద్రుడి మంత్రి అయిన ఇందలూరి అన్నయ్య సహకారంతో ముసునూరి పోచినాయకుడు కాకతీయ నాయంకరుడయ్యాడు. ఇతని కుమారుడు ముసునూరి ప్రోలయ నాయకుడు.

ముసునూరి ప్రోలయ నాయకుడు (1325-33): గోదావరి తీరంలోని రేఖపల్లి దుర్గం రాజధానిగా (భద్రాచలం తాలుకా) చేసుకొని ఇతడు మహ్మదీయులను ఎదుర్కొన్నాడు. ఇతడి నాయకత్వంలో సామంత ప్రభువులు చాలా విజయాలు సాధించారు. ప్రతి విజయంలో సోదరుడైన కాపయ నాయకుడి పాత్ర ఉంది. ఇతడికి 'ఆంధ్ర భూమండలాధ్యక్ష సింహాసన సంప్రతిష్ఠాపనాచార్య' బిరుదు ఉంది.

ముసునూరి కాపయ నాయకుడు (1333-69): ముస్లిం చరిత్రకారులు ఇతడిని కన్యానాయక్, కృష్ణానాయక్‌గా వ్యవహరించారు. ప్రోలయ మరణం తర్వాత రేఖపల్లి కేంద్రంగా కాపయ పాలనను ప్రారంభించాడు. ఢిల్లీ పాలకులకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి ప్రోలయ స్థానంలో ఇతడు నాయకత్వం వహించాడు. సుల్తాన్ కబంధ హస్తాల నుంచి ఓరుగల్లును విముక్తి చేయడానికి కంకణం కట్టుకున్నాడు. హోయసాల రాజ్యాన్ని పాలిస్తున్న మూడో భల్లాలుడు పంపించిన సైన్యం సహకారంతో 1336-37 కాలంలో ఓరుగల్లు కోటపై దాడి చేశాడు. దీంతో ఓరుగల్లు పాలకుడు మాలిక్ మక్బూల్ ఢిల్లీకి పారిపోయాడు. 1337లో ఓరుగల్లు కోటను వశపర్చుకున్న కాపయ నాయకుడు అంతకుముందు కాకతీయుల ఆధీనంలో ఉన్న అనేక ప్రాంతాలను తిరిగి తన అధికారంలోకి తెచ్చుకున్నాడు. కాపయ నాయకుడికి 'ఆంధ్రదేశాధీశ్వర', 'ఆంధ్ర సురత్రాణ' బిరుదులున్నాయి.

ఢిల్లీ సుల్తాన్ ముప్పు తొలగిన తర్వాత అప్పటి వరకూ కాపయకు సామంతులుగా ఉన్న సహచరులు కాపయను ధిక్కరించి స్వతంత్రులయ్యారు. కాలక్రమంలో రాచకొండ (నల్గొండ జిల్లా)లో వెలమ నాయకులు (రేచర్ల అనపోత నాయకుడు), అద్దంకి, కొండవీడుల్లో రెడ్డి రాజులు (ప్రోలయ వేమారెడ్డి), విజయనగరంలో యాదవులు, కోరుకొండలో మంచికొండ నాయకులు (ముమ్మడి నాయకుడు), పిఠాపురంలో కొప్పుల నాయకులు బలమైన స్వతంత్ర్య రాజులుగా అవతరించారు.

ఓరుగల్లు రాజ్యానికి పొరుగున ఉన్న గుల్బర్గా (కర్ణాటక)కు సేనాధిపతిగా అల్లావుద్దీన్ బహమన్ షా (హసన్ గంగూ/ జాఫర్ ఖాన్) వ్యవహరించేవాడు. 1347లో ఇతడు తమ రాజైన ఢిల్లీ సుల్తాన్‌ను ఎదిరించి, గుల్బర్గా రాజధానిగా బహమనీ రాజ్యాన్ని స్వతంత్రంగా స్థాపించాడు. ఢిల్లీ సేనల్ని ఓడించడంలో హసన్ గంగూకు కాపయ నాయకుడు సైన్య సహకారం అందించాడు. తన అవసరం తీరిన తర్వాత హసన్ గంగూ రాజ్య విస్తరణ కాంక్షతో 1350లో తెలంగాణపై దండయాత్ర చేశాడు. కాపయ నాయకుడు ఓడిపోయి కౌలాస్ కోట (నిజామాబాద్)ను బహమనీలకు ధారాదత్తం చేసి సంధి చేసుకున్నాడు. హసన్ గంగూ 1356-57లో తెలంగాణాపై మళ్లీ దాడి చేసి కాపయను ఓడించాడు. దీంతో కాపయ భువనగిరి కోట (నల్గొండ)ను వదులుకొని బహమనీలకు కప్పం కట్టడానికి అంగీకరించాడు.

హసన్ గంగూ మరణం తర్వాత 1359లో మొదటి మహ్మద్‌షా బహమనీ సుల్తాన్‌గా అవతరించాడు. కాపయ నాయకుడి కుమారుడు వినాయక దేవుడు, విజయనగర రాజైన మొదటి బుక్కరాయలు పంపిన సైన్యం సహకారంతో 1361లో భువనగిరి కోటను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. ఇతడు కౌలాస్ కోటను స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉండగా మొదటి మహ్మద్ షా ఓరుగల్లు కోటను ముట్టడించి కాపయ నాయకుడిని ఓడించి సంధి చేసుకున్నాడు. ఆ తర్వాత మొదటి మహ్మద్ షా వినాయక దేవుడిని అతిక్రూరంగా హత్య చేశాడు.

కాపయ నాయకుడు బహమనీ సుల్తాన్‌ను ఓడించడమే ధ్యేయంగా విజయనగరాధీశులతో కలిసి ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్ షా తుగ్లక్ సహాయమర్థించాడు. 'కాఫిర్ల' (హిందువుల)తో కలిసి స్వజాతీయులపై (ముస్లిం) యుద్ధం చేయడానికి ఫిరోజ్ షా నిరాకరించాడు. అది తెలిసిన మొదటి మహ్మద్ షా ఓరుగల్లుపై దండెత్తి సర్వనాశనం చేశాడు. కాపయ నాయకుడు చేసేదేమీ లేక బహమనీ రాజుతో సంధి చేసుకొని గోల్కొండ కోటను, అపార ధనరాశులను అప్పగించాడు. అప్పటికే కుంగిపోయిన ముసునూరి కాపయ నాయకుడు రేచర్ల వెలమ నాయకుడైన అనపోత నాయకుడి చేతిలో 1369లో భీమారం (వరంగల్) సమీపంలో జరిగిన యుద్ధంలో మరణించాడు. దీంతో ముసునూరి నాయకుల పాలన ముగిసింది.

తెలంగాణ రాజ్యం కమ్మ నాయకుల పాలన నుంచి వెలమ నాయకుల పాలనలోకి వెళ్లింది. ఓరుగల్లు రాచకొండ రాజ్యంలో భాగంగా మారింది. దీనికి రాజు అనపోత నాయకుడు. ఓరుగల్లు పట్టణం తన ప్రతిష్ఠను క్రమంగా కోల్పోయింది.

మాదిరి ప్రశ్నలు

1. ముసునూరి నాయకుల మొదటి రాజధాని?
   1) ఓరుగల్లు 2) ఉయ్యూరు
   3) రేఖపల్లి 4) రాచకొండ
2. ముసునూరి ప్రోలయ నాయకుడు వేయించిన శాసనం?
   1) విలాస తామ్ర శాసనం
   2) విప్పర్ల శాసనం 3) కలవచేరు శాసనం
   4) పైవన్నీ
3. బహమనీ రాజ్యస్థాపకుడు ఎవరు?
   1) మహ్మద్ షా 2) హసన్ గంగూ
   3) నిజాం షా 4) జునాఖాన్
4. కాకతీయుల చివరి రాజు?
   1) రుద్రదేవుడు 2) మహాదేవుడు
   3) గణపతి దేవుడు 4) ప్రతాపరుద్రుడు

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 4.

విద్య, ఉద్యోగ సమాచారం

ఐఐపీఈ, విశాఖపట్నంలో వివిధ ఉద్యోగాలు

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ(ఐఐపీఈ) ప్రాజెక్ట్ అసోసియేట్, టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్-01, టెక్నీషియన్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీటెక్, గేట్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ప్రాజెక్ట్ అసోసియేట్‌కు 35 ఏళ్లు, టెక్నీషియన్‌కు 45 ఏళ్లు.
» **ఫెలోషిప్:** నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.25,000, టెక్నీషియన్‌కు రూ.20,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.07.2025.
» **వెబ్‌సైట్:** https://iipe.ac.in

ఎన్ఐఓటీ, చెన్నైలో ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ(ఎన్ఐఓటీ) ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజనీర్-1, ప్రాజెక్ట్ ఇంజనీర్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్ 1-02, ప్రాజెక్ట్ ఇంజనీర్2-01.
» **విభాగాలు:** ఓషన్ ఇంజనీరింగ్-నావల్ ఆర్కిటెక్చర్/నావల్ ఆర్కిటెక్చర్-ఓషన్ ఇంజనీరింగ్/నావల్ ఆర్కిటెక్చర్-మెరైన్ ఇంజనీరింగ్/నావల్ ఆర్కిటెక్చర్-షిప్ ఇంజనీరింగ్/నావల్ ఆర్కిటెక్చర్-ఆఫ్‌షోర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్/కోస్టల్ ఇంజనీరింగ్/ఓషన్ ఇంజనీరింగ్/హార్బర్ ఇంజనీరింగ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** ప్రాజెక్ట్ ఇంజనీర్-1కు 35 ఏళ్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్-2కు 40 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ ఇంజనీర్-1కు రూ.56,000, ప్రాజెక్ట్ ఇంజనీర్-2కు రూ.67,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**15.07.2025
» **వెబ్‌సైట్:** https://www.niot.res.in

రంగులేని, చిక్కటి నూనె వంటి ఆమ్లం?



టెట్/డీఎస్సీ ప్రత్యేకం
భౌతిక రసాయన శాస్త్రం

ఫాస్ఫరస్, సల్ఫర్, దాని సమ్మేళనాలు: సాధారణ ఉప్పు, దాని ఉత్పన్నాలు

- **సల్ఫర్ ధాతువులు:** కాపర్ పైరటీస్- CuS, ఐరన్ పైరటీస్ - FeS, గెలీనా PbS, సిన్నబార్ - HgS, జింక్ బ్లెండ్ ZnS
- భూగర్భ ఉపరితలంలో లభించే ధాతువుల నుంచి సల్ఫర్‌ను సంగ్రహించే పద్ధతి సిసిలీ పద్ధతి.
- భూమి పొరల నుంచి సల్ఫర్‌ను సంగ్రహించే పద్ధతి ఫ్రాష్ పద్ధతి.
- సిసిలీ పద్ధతిలో ఉపయోగించే కొలిమి - కాల్కరోని
- సల్ఫర్ అణువు ఆకృతి - కిరీటం
- సల్ఫర్ పరివర్తన ఉష్ణోగ్రత 96°C
- ఫ్లవర్ ఆఫ్ సల్ఫర్ 444°C వద్ద ఏర్పడుతుంది.
- CaSను కాగిత పరిశ్రమలో విరంజనకారిగా ఉపయోగిస్తారు.
- **గన్‌పౌడర్ సంఘటనం:** సల్ఫర్ + బొగ్గుపొడి + KNO_3
- చర్మవ్యాధుల నివారణలో ఉపయోగించేది - HgS
- SO_2 వాయువు గాలి కంటే 2½ రెట్లు బరువైంది.
- ఫౌంటెన్ ప్రయోగం వల్ల SO_2 నీటిలో కరుగుతుందని, దానికి ఆమ్ల లక్షణం ఉంటుందని నిరూపించవచ్చు.
- SO_2 వాయువు విరంజన చర్యకు కారణం - నవజాత హైడ్రోజన్ ఏర్పడటం
- స్పర్శాపద్ధతిలో ఉపయోగించే ఉత్ప్రేరకం - V_2O_5
- నీలి కాపర్ సల్ఫేట్‌కు H_2SO_4ను కలిపినపుడు రంగును కోల్పోతుంది. ఈ ప్రక్రియను నిర్జలీకరణం అంటారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని రసాయనాల రాజు అంటారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని డిటర్జెంట్స్, పేలుడు పదార్థాల తయారీలో ఉపయోగిస్తారు. బ్యాటరీలను నిల్వచేయడానికి వాడుతారు.
- సల్ఫ్యూరిక్ ఆమ్లం Au, Pt వంటి లోహాలతో చర్య జరపదు.
- అగ్నిపర్వతాల నుంచి వెలువడే వాయువు H_2S
- H_2S తయారు చేయడానికి ఉపయోగించే పరికరం - కిప్పు పరికరం
- H_2S గాలి కంటే బరువైంది. ఆమ్ల లక్షణాన్ని కలిగి ఉంటుంది.
- లెడ్ ఎసిటేట్‌లో ముంచిన వడపోత కాగితాన్ని H_2S నల్లగా మారుస్తుంది.
- ఓలియంను నీటితో చర్య జరిపిస్తే H_2SO_4 ఏర్పడుతుంది.
- H_2S క్షయకరణ కారకంగా పనిచేస్తుంది.
- సల్ఫర్ రూపాంతరాల్లో అత్యంత స్థిరమైంది - రాంబిక్ సల్ఫర్
- $K_2Cr_2O_4$లో ముంచిన వడపోత కాగితాన్ని SO_2 వాయువు ఆకుపచ్చగా మారుస్తుంది.
- ఫాస్ఫోరైట్ ఫార్ములా $Ca_3(PO_4)_2$
- మెటా ఫాస్ఫారిక్ ఆమ్లం ఫార్ములా HPO_3
- ఫాస్ఫరస్ పరిశ్రమలో పనిచేసే శ్రామికులకు వచ్చే జబ్బు - ఫాసిజా
- భాస్వరాన్ని గాలిలో ఉంచితే నెమ్మదిగా మెరుస్తుంది. దీన్ని ఫాస్ఫారిజన్స్ అంటారు.
- ఎలుకలను చంపడానికి తెల్ల భాస్వరాన్ని ఉపయోగిస్తారు.
- ఫాస్ఫార్ బ్రాంజ్ మిశ్రమలోహం - Cu + Sn + P
- అగ్గిపుల్లలోని పదార్థాలు $KClO_3$, Sb_2S_3, బంక
- అగ్గిపెట్టె పక్కభాగంలోని పదార్థాలు - ఎర్రభాస్వరం, Sb_2, గాజుముక్కలు.
- ఫాస్ఫారిక్ ఆమ్లం ఒక త్రిక్షార ఆమ్లం.
- సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ ఒక ఫాస్ఫాటిక్ ఎరువు.
- గాఢ ఉప్పు ద్రావణంలోనికి HCl వాయువును పంపి శుద్ధమైన ఉప్పును పొందుతారు.
- ఉప్పునీటి ద్రావణాన్ని బ్రైన్ ద్రావణం అంటారు.
- సోడియం లోహం మెర్క్యురీతో కలిసి సోడియం అమాల్గంను ఏర్పరుస్తుంది.
- క్లోరిన్.. ఆకుపచ్చ పసుపు రంగు ఉన్న వాయువు.
- తడిపిన పూలు క్లోరిన్ సమక్షంలో రంగును కోల్పోవడానికి కారణం నవజాత ఆక్సిజన్ ఏర్పడటం.
- బ్లీచింగ్ పౌడర్ ఫార్ములా $CaOCl_2$
- ఫాస్జీన్ ఫార్ములా - $COCl_2$; టియర్ గ్యాస్ - CCl_3NO_2; క్లోరోఫామ్ - $CHCl_3$;

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో సల్ఫర్ ధాతువు కానిది?
   ఎ) కాపర్ పైరటీస్ బి) హెమటైట్
   సి) గెలీనా డి) సిన్నబార్
2. సల్ఫర్ పరివర్తన ఉష్ణోగ్రత?
   ఎ) 106°C బి) 86°C
   సి) 90°C డి) 96°C
3. అత్యంత స్థిరత్వం ఉన్న సల్ఫర్ రూపాంతరం?
   ఎ) ప్లాస్టిక్ సల్ఫర్
   బి) మోనోక్లినిక్ సల్ఫర్
   సి) రాంబిక్ సల్ఫర్
   డి) ఫ్లవర్ ఆఫ్ సల్ఫర్
4. సిసిలీ పద్ధతిలో సల్ఫర్ ధాతువును ఉంచే కొలిమి పేరు?
   ఎ) బ్లాస్ట్ కొలిమి బి) షాఫ్ట్‌కొలిమి
   సి) కాల్కరోని కొలిమి డి) రివర్బరేటరీ
5. గన్ పౌడర్ అంటే?
   ఎ) ఫాస్ఫరస్, చార్‌కోల్, మెగ్నీషియం పౌడర్
   బి) సల్ఫర్, బొగ్గుపొడి, KNO_3 మిశ్రమం
   సి) Se, దీపాంగారం
   డి) బొగ్గుపొడి, NCl_3 ల మిశ్రమం
6. $2SO_2 + O_2 \longrightarrow 2SO_3$
   (స్పర్శాపద్ధతి) ఈ చర్యలో ఉత్ప్రేరకం?
   ఎ) Ni బి) Mo
   సి) Fe డి) V_2O_5
7. రసాయనాల రాజు అని దేన్ని అంటారు?
   ఎ) H_2SO_4 బి) H_2SO_3
   సి) $H_2S_2O_7$ డి) H_3PO_4
8. నీలి కాపర్ సల్ఫేట్‌కు సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని కలిపినపుడు రంగుని కోల్పోతుంది. ఈ ప్రక్రియను ఏమంటారు?
   ఎ) ఆక్సీకరణం బి) నిర్జలీకరణం
   సి) క్షయకరణం డి) ఫెర్మెంటేషన్
9. సల్ఫ్యూరిక్ ఆమ్లం ఏ లోహాలతో చర్య పొందదు?
   ఎ) Zn, Mg బి) Cu, Ca
   సి) Au, Pt డి) Ag, Sn
10. ఫెర్రస్ సల్ఫైడ్.. హైడ్రోక్లోరిక్ ఆమ్లంతో చర్య పొందినపుడు ఏర్పడే వాయువు?
    ఎ) SO_2 బి) SO_3
    సి) H_2S డి) NH_3
11. $K_2Cr_2O_7$ ద్రవంలో ముంచిన వడపోత కాగితాన్ని ఏ వాయువు దగ్గరకు తీసుకెళ్తే లేత ఆకుపచ్చ రంగుని పొందుతుంది?
    ఎ) H_2S బి) SO_2
    సి) N_2O డి) NO
12. చర్మవ్యాధుల నివారణకు ఉపయోగించేది?
    ఎ) ZnS బి) CaS
    సి) HgS డి) PbS
13. ఓలియంను నీటితో చర్య జరిపితే ఏర్పడే ఆమ్లం?
    ఎ) HNO_3 బి) H_2SO_4
    సి) H_2SO_3 డి) H_3PO_3
14. ఫాస్ఫరస్ మూలకం?
    ఎ) P_8 బి) P_4
    సి) P_6 డి) P_3
15. కిందివాటిలో నిర్జలీకరణి?
    ఎ) H_3PO_4 బి) $Ca_3(PO_4)_2$
    సి) P_2O_5 డి) Na_3PO_4
16. సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ ఒక?
    ఎ) నత్రజని ఎరువు
    బి) ఫాస్ఫాటిక్ ఎరువు
    సి) పొటాషియం ఎరువు
    డి) కాల్షియం ఎరువు
17. అగ్గిపుల్ల తలలో ఉండే రసాయనిక పదార్థాలు?
    ఎ) $KClO_3$, Sb_2S_3, బంక
    బి) KCl, $SbCl_3$, బంక
    సి) $NaCl$, Sb_2S_3, బంక
    డి) P_4, Sb_2S_3, గాజుముక్కలు
18. కాల్షియం ఫాస్ఫేట్ ———— ను కలిగి ఉంటుంది.
    ఎ) $CO_2(PO_2)_3$
    బి) $CaHPO_2$
    సి) $Ca_3(PO_4)_2$
    డి) $Ca(H_2PO_4)_2$
19. P_2O_5 ను చల్లని నీటిలో కరిగించినపుడు ఏర్పడేది?
    ఎ) H_3PO_4 బి) HPO_3
    సి) PH_3 డి) PH_3, H_3PO_4
20. ఫాస్ఫార్ బ్రాంజ్ అనే మిశ్రమలోహం సంఘటనం?
    ఎ) Cu + Sn + P
    బి) Cu + Zn + P
    సి) Cu + Sn
    డి) Cu + Mg + S
21. తెల్ల ఫాస్ఫరస్‌ను దేనిలో నిల్వ ఉంచుతారు?
    ఎ) CS_2 బి) కిరోసిన్
    సి) నీరు డి) CCl_4
22. చీకటిలో భాస్వరాన్ని గాలిలో ఉంచితే నెమ్మదిగా మండి మెరుస్తుంది. దీన్ని ఏమంటారు?
    ఎ) ప్రతిదీప్తి బి) రసాయనశక్తి
    సి) ఫాస్ఫారిజన్స్ డి) జీవదీప్తి
23. కిందివాటిలో ఏది ఫాస్ఫారికామ్ల లవణం కాదు?
    ఎ) NaH_2PO_4 బి) Na_2HPO_4
    సి) Na_3PO_4 డి) H_3PO_4
24. కిందివాటిలో దేన్ని ఎలుకల మందుగా ఉపయోగిస్తారు?
    ఎ) కాల్షియం ఫాస్ఫైడ్
    బి) జింక్ ఫాస్ఫైడ్
    సి) మెగ్నీషియం ఫాస్ఫైడ్
    డి) ఫాస్ఫీన్
25. సముద్ర నీటిలో ఉప్పుశాతం?
    ఎ) 3.2% బి) 2.8%
    సి) 4.6% డి) 5.2%
26. క్లోరిన్ వాయువు రంగు
    ఎ) ఎరుపు బి) నీలం
    సి) ఆకుపచ్చ-పసుపు
    డి) నలుపు
27. నీటిలో హైడ్రోజన్ క్లోరైడ్ స్వభావం?
    ఎ) క్షారం బి) ఆమ్లం
    సి) తటస్థ డి) ద్వంద్వ
28. టియర్ గ్యాస్ ఫార్ములా
    ఎ) $COCl_2$ బి) $CaOCl_2$
    సి) CCl_3NO_2 డి) $CaSO_4$
29. $CHCl_3$ను ఏమంటారు?
    ఎ) బ్లీచింగ్ పౌడర్
    బి) ఫాస్జీన్ సి) క్లోరోఫాం
    డి) అమాల్గం
30. బ్రైన్ ద్రావణం అంటే?
    ఎ) ఉప్పు+ నీరు
    బి) చక్కెర+ నీరు
    సి) యూరియా+ నీరు
    డి) గ్లూకోజ్ + నీరు

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) సి; 5) బి; 6) డి; 7) ఎ; 8) బి; 9) సి; 10) సి; 11) బి; 12) సి; 13) బి; 14) బి; 15) సి; 16) బి; 17) ఎ; 18) సి; 19) బి; 20) ఎ; 21) సి; 22) సి; 23) డి; 24) బి; 25) బి; 26) సి; 27) బి; 28) సి; 29) సి; 30) ఎ.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. సల్ఫ్యూరిక్ ఆమ్లంలోని మూలకాలు (DSC-1996)
   ఎ) నత్రజని, సల్ఫర్, ఆక్సిజన్
   బి) హైడ్రోజన్, సల్ఫర్, ఆక్సిజన్
   సి) సల్ఫర్, ఆక్సిజన్
   డి) ఫాస్ఫరస్, సల్ఫర్, హైడ్రోజన్
2. వాసనలేని ఆమ్లానికి ఉదాహరణ (DSC-2001)
   ఎ) HNO_3 బి) H_3PO_4
   సి) HCl డి) H_2SO_4
3. రంగులేని, చిక్కటి నూనె వంటి ఆమ్లం? (DSC-2002)
   ఎ) H_2SO_4 బి) H_3PO_4
   సి) HNO_3 డి) HCl
4. ఫాస్ఫారిక్ ఆమ్ల సంకేతం (DSC-2003)
   ఎ) H_3PO_4 బి) H_2SO_4
   సి) HNO_3
   డి) CH_3COOH
5. జడవాయువు కాని దానికి ఉదాహరణ (DSC-2000)
   ఎ) క్లోరిన్ బి) హీలియం
   సి) నియాన్ డి) ఆర్గాన్

సమాధానాలు

1) బి; 2) డి; 3) ఎ; 4) ఎ; 5) ఎ

ఒడిశాలోని సుకిండా దేనికి ప్రసిద్ధి?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ జాగ్రఫీ

భారతదేశం - ఖనిజ వనరులు

వజ్రాలు: ప్రపంచంలో ప్రస్తుతం వజ్రాల ఉత్పత్తిలో రష్యా, బోట్స్వానా, కాంగో, కెనడా దేశాలు మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో నిల్వలు, ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాలను ఆక్రమించాయి. కింబర్లైట్ శిలాస్థరాల్లో ఇవి లభ్యమవుతున్నాయి.

గనుల విస్తరణ:
- మధ్యప్రదేశ్ - కేన్ నది ఒడ్డున ఉన్న పన్నా.
- ఆంధ్రప్రదేశ్ - అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్ కింబర్లైట్, కృష్ణా నదిలోయ.
- కేరళ - కోజికోడ్.

అభ్రకం (మైకా): మైకా ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఎలక్ట్రికల్ ఇండస్ట్రీలో ఇన్సులేటర్‌గా, ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీలో మైక్రో చిప్స్ రూపంలో, గ్లాస్ ఇండస్ట్రీలో గట్టితనం కోసం దీన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు.

ఇది హైడ్రోసిలికేట్ల రూపంలో భూపటలంలో మూడు రూపాల్లో లభ్యమవుతుంది. అవి:
1. **మస్కోవైట్ (పొటాష్ మైకా):** శ్వేత వర్ణంలో ఉంటుంది. దీన్నే 'రూబీ మైకా' అంటారు. ఇది అత్యంత నాణ్యమైంది.
2. **ఫ్లోగోపైట్:** పసుపు రంగులో ఉంటుంది. దీన్నే 'మెగ్నీషియా మైకా' అంటారు.
3. **బయొటైట్:** నలుపు వర్ణంలో ఉంటుంది.

గనుల విస్తరణ:
- బిహార్ - గయ.
- జార్ఖండ్ - కోడెర్మా, హజారీబాగ్, సింగ్భూమ్, పాలమావు.
- ఆంధ్రప్రదేశ్ - నెల్లూరు (గూడూరు).
- తెలంగాణ - ఖమ్మం.

బెరైటీస్ (ముగ్గురాయి): బెరైటీస్ నిల్వలు, ఉత్పత్తిపరంగా భారతదేశం ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగంపేట, అనంతరాజుపేట (కడప జిల్లా) ప్రాంతాలు వీటికి ప్రసిద్ధి చెందాయి. ఈ ఖనిజం బేరియం ఆక్సైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని ముడి చమురును వెలికితీయడంలో కందెనగా, వైద్య అవసరాలకు ఉపయోగిస్తారు.

గనుల విస్తరణ:
- ఆంధ్రప్రదేశ్ - కడప.
- తెలంగాణ - ఖమ్మం.

ఆస్‌బెస్టాస్ (రాతి నార): సిమెంటు రేకులు, తాళ్లు, పెయింటింగులు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ల తయారీలో ఆస్‌బెస్టాస్‌ను ఉపయోగిస్తారు. వీటి నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ గనుల్లో పనిచేసే కార్మికులు 'ఆస్‌బెస్టోసిస్' అనే ఊపిరితిత్తులకు సంబంధించిన కేన్సర్‌కు గురవుతున్నారు.

సున్నపురాయి: సున్నపురాయిని 75 శాతం సిమెంట్ పరిశ్రమల్లో, 16 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో ఉపయోగిస్తారు. భారతదేశంలో నిల్వలపరంగా కర్ణాటక, రాజస్థాన్; ఉత్పత్తిపరంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

డోలమైట్: దీన్ని 90 శాతం స్టీల్ ఇండస్ట్రీల్లో, 4 శాతం ఎరువుల పరిశ్రమల్లో వాడుతున్నారు. దీని ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి.

గ్రాఫైట్: పెన్సిళ్లు, ఎలక్ట్రిక్ బ్యాటరీల తయారీలో దీన్ని వాడతారు. దీని నిల్వల విషయంలో చైనా, భారత్ మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. భారత్‌లో దీని ఉత్పత్తిలో ఒడిశా, జార్ఖండ్, తమిళనాడు మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

ఇతర లోహ, అలోహ ఖనిజాలు

జింక్: ఇది సల్ఫైడ్ల రూపంలో లభ్యమవుతుంది. గాల్వనైజేషన్ ప్రక్రియలో దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. నిల్వలు, ఉత్పత్తిలో రాజస్థాన్ ప్రథమ స్థానంలో ఉంది.

సీసం: ఇది 'గెలీనా' అనే సల్ఫైడ్‌ల రూపంలో లభ్యమవుతుంది. దీన్ని కేబుల్ కవర్లు, పెయింట్ల తయారీలో, రబ్బర్ తయారీకి చెందిన 'వల్కనైజేషన్' ప్రక్రియలో ఉపయోగిస్తారు. ప్రపంచంలో నిల్వలు, ఉత్పత్తి పరంగా ఆస్ట్రేలియా మొదటి స్థానంలో ఉంది. న్యూ సౌత్ వేల్స్, క్వీన్స్‌లాండ్‌లోని బ్రోకన్ హిల్స్ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా లభ్యమవుతోంది.

భారతదేశంలో సీసం నిల్వలు రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ (కర్నూలు, గుంటూరు), తెలంగాణ (నల్గొండ, ఖమ్మం), బిహార్, ఒడిశా రాష్ట్రాల్లో ఉన్నాయి.

తగరం: మలేషియాలో దీని ఉత్పత్తి ఎక్కువగా ఉండగా స్మెల్టింగ్ ఇండస్ట్రీ ఎక్కువగా సింగపూర్‌లో ఉంది. భారత్‌లో దీని నిల్వలు జార్ఖండ్ (హజారీబాగ్), బిహార్ (గయ), ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నాయి.

వెండి (సిల్వర్): అర్జంటైట్ రూపంలో క్వార్ట్జైట్ శిలాస్థరాల్లో బంగారంతో కలిసి లభ్యమవుతుంది. దీన్ని ఎలక్ట్రో ప్లేటింగ్, ఫొటోగ్రఫీ, పారిశ్రామిక రసాయనాల తయారీలో ఉపయోగిస్తారు. దీని నిల్వలు రాజస్థాన్ (జువార్)లో ఎక్కువగా ఉన్నాయి. కర్ణాటక (కోలార్), ఆంధ్రప్రదేశ్ (కడప, గుంటూరు, కర్నూలు), జార్ఖండ్ (రాంచీ, హజారీబాగ్) ప్రాంతాల్లోనూ వీటి నిల్వలు ఉన్నాయి.

టంగ్‌స్టన్: రాజస్థాన్‌లోని 'డేగనా' ప్రాంతంలో ఉన్నాయి.

నికెల్: ఒడిశాలో ఎక్కువగా లభిస్తోంది.

కోబాల్ట్: రాజస్థాన్, కేరళలో దీని నిల్వలు అధికంగా ఉన్నాయి.

ఉప్పు: గుజరాత్ దీని ఉత్పత్తికి ప్రసిద్ధి.

రాతి ఉప్పు: మండి (హిమాచల్ ప్రదేశ్)లో అధికంగా లభ్యమవుతోంది.

కియొనైట్: జార్ఖండ్‌లో అధికంగా లభిస్తుంది.

జిప్సం: రాజస్థాన్‌లో దీని నిల్వలు అధికం.

ఇంధన ఖనిజాలు

మండే స్వభావం ఉన్న ఖనిజాలు, పునరుత్పత్తి చెందని సాంప్రదాయ ఇంధన వనరులు (బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు) ఇంధన ఖనిజాలకు ఉదాహరణ. ఇవి ప్రధానంగా హైడ్రోకార్బన్లు.

బొగ్గు: దీన్నే నల్ల బంగారం అంటారు. ఇది దేశంలో ప్రధానంగా రెండు భౌమ కాలాలకు చెందిన అవక్షేప శిలాస్థరాల్లో లభ్యమవుతోంది. అవి:

1) **గోండ్వానా బొగ్గు:** దేశంలో లభ్యమయ్యే బొగ్గులో 90 శాతం ఈ రకానికి చెందిందే. ఇది ఎక్కువగా దిగువ గోండ్వానా యుగానికి చెందిన అవక్షేప శిలాస్థరాల్లోని దామోదర్ లోయ (జార్ఖండ్-దామోదర్), సోన్ (మధ్య ప్రదేశ్), మహానది (ఒడిశా), గోదావరి (ఆంధ్రప్రదేశ్), వార్ధా (మహారాష్ట్ర)లో నిక్షిప్తమై ఉంది. ఇది అత్యంత నాణ్యమైన బొగ్గు.

2) **టెర్షియరీ బొగ్గు:** ఇది ఎక్కువగా తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, అసోం, జమ్ము-కశ్మీర్‌లోని ద్వీపకల్ప, ద్వీపకల్పేతర ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

బొగ్గులోని కర్బన శాతాన్ని అనుసరించి దీన్ని 4 రకాలుగా వర్గీకరించారు. అవి..
1. **అంత్రసైట్:** అత్యంత నాణ్యమైన బొగ్గు. ఇందులో 90-95 శాతం కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో మాత్రమే కొద్ది పరిమాణంలో లభ్యమవుతోంది.
2. **బిట్యూమినస్:** ఇందులో 85-90% కార్బన్ ఉంటుంది. దేశంలో ఎక్కువగా లభ్యమయ్యే రకం ఇది. దీని వినియోగం కూడా ఎక్కువే.
3. **లిగ్నైట్ (బ్రౌన్‌కోల్):** 30-40 శాతం కార్బన్ ఉంటుంది. దీని నాణ్యత తక్కువ. తమిళనాడులోని నైవేలి ప్రాంతంలో 90 శాతం నిల్వలు ఉన్నాయి.
4. **పీట్:** కార్బన్ 10 శాతం మాత్రమే ఉంటుంది. ఇది కర్ర నుంచి బొగ్గు ఏర్పడటంలోని మొదటిదశ. దీన్నే కొయ్య బొగ్గు అని కూడా అంటారు.

భారత్‌లో 285 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నాయి. వీటిలో 200 బిలియన్ టన్నులు బిట్యూమినస్, మిగిలినవి లిగ్నైట్ రకానికి చెందినవి. బొగ్గు నిల్వల్లో జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, తెలంగాణ; ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు వరుసగా మొదటి స్థానాల్లో ఉన్నాయి.

దేశంలో ప్రధానమైన గోండ్వానా బొగ్గు గనులు
జార్ఖండ్ - జారియా, బొకారో, డాల్టన్‌గాజ్.
పశ్చిమ బెంగాల్ - రాణిగంజ్, గిరిధి, కరన్ పురా, డార్జిలింగ్.
ఛత్తీస్‌గఢ్ - కోర్బా, బీరమ్‌పూర్, చిరిమిరి, హస్‌డో- అరండ్, తాతాపాని- రామ్‌కోలా.
మధ్యప్రదేశ్ - సింగ్రౌలి, సొహాగ్‌పూర్, ఉమారియా.
మహారాష్ట్ర - చందా, వార్ధా, కంప్టీ, భాండర్.
తెలంగాణ - సింగరేణి, కొత్తగూడెం, తాండూరు, పాల్వంచ.

టెర్షియరీ బొగ్గు గనులు:
తమిళనాడు - నైవేలి జయమ్ కొండ చోళాపురం, మన్నార్ గుడి, హిమాచల్ ప్రదేశ్, చంద్రలోయ.
అసోం - మాకుమ్, జెంజి, నజీరా, జయపూర్.
రాజస్థాన్ - బికనీర్ .
ఉత్తర ప్రదేశ్ - నామ్‌చిక్, నాంరూప్.

బొగ్గు ఉత్పత్తిలో చైనా, యూఎస్ఏ, భారత్ వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి.

విస్తరణ:
యూఎస్ఏ: పెన్సిల్వేనియా నుంచి అలబామా వరకు ఉన్న అపలేచియన్ ప్రాంతం, కెంటకీ, పశ్చిమ వర్జీనియా.
ఉక్రెయిన్: డొనెట్స్క్ ప్రాంతం.
రష్యా: కుజ్‌నెట్స్క్ బేసిన్ .
కజకిస్థాన్: కరగండా.
జర్మనీ: రూర్ లోయ.
ఆస్ట్రేలియా: న్యూసౌత్‌వేల్స్.

పెట్రోలియం: దీన్నే ముడి చమురు, రాతి నూనె, క్రూడాయిల్, బంగారుద్రవం అని కూడా అంటారు. ఇది ప్రధానంగా అవక్షేప శిలల నుంచి లభ్యమవుతుంది. ప్రపంచంలో మొదటిసారిగా పెట్రోలియం బావిని 'పెన్సిల్వేనియా'లో కనుగొన్నారు. పెట్రోలియం నిల్వలు, ఉత్పత్తి, ఎగుమతుల్లో సౌదీ అరేబియా ప్రథమస్థానంలో ఉంది. దీని వినియోగంలో యూఎస్ఏ మొదటి స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో చైనా, జపాన్, ఇండియా ఉన్నాయి.

భారతదేశంలో మొదటగా అసోంలోని 'మాకుమ్' ప్రాంతంలో ముడి చమురును గుర్తించారు. 'దిగ్బాయ్' ప్రాంతంలో దీన్ని ఉత్పత్తి చేశారు. దేశంలో చమురు నిక్షేపాల అన్వేషణ, వెలికితీత కోసం 1957లో 'డెహ్రాడూన్'లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమిషన్ (ONGC)ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది విదేశాల్లో చమురు నిక్షేపాలను వెలికితీయడానికి OVL (ONGC Videsh Ltd.) అనే సంస్థను ఏర్పాటు చేసుకుంది. ఇటీవల రష్యాలోని 'శకాలిన్' క్షేత్రంలో పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం ముడి చమురు ఉత్పత్తిలో మహారాష్ట్ర ప్రథమ స్థానంలో ఉండగా, గుజరాత్ రెండో స్థానంలో ఉంది.

ముడి చమురు బావుల విస్తరణ:

మహారాష్ట్ర: ముంబై-హైలోని పొన్న, ముక్త, గాంధార, హీరా బావులు, శాలిశెట్టి, బస్సైన్.

గుజరాత్: అంకలేశ్వర్ (జవహర్‌లాల్ నెహ్రూ ముడి చమురు బావి), నవ్‌గావ్, థోర్కా కలోల్, కోసాంబ (వీటన్నింటినీ కలిపి గాంధార క్షేత్రం లేదా కాంబే బేసిన్ అంటారు), ఖంబట్ బేసిన్‌లోని అలియాబాట్, కచ్ ప్రాంతంలోని కలోల్, మేసిన్.

అసోం: దిగ్బాయ్, నహర్ కాటియా, మొరాన్, హుగ్రీజన్, సిబ్ సాగర్, రుద్రసాగర్.

తమిళనాడు: కావేరి బేసిన్‌లోని నారీమనం, కోవెల్‌పూల్.

త్రిపుర: మూమ్‌బాగ, బారాముర, దేవ్‌టమూరు.

ఏపీ: కేజీ బేసిన్‌లోని రవ్వ, లింగాల.

సహజవాయువు: భారతదేశంలో మొదటిసారిగా సహజవాయువును హిమాచల్ ప్రదేశ్‌లోని జ్వాలాముఖి వద్ద కనుగొన్నారు. సహజవాయువును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి రవాణా చేయడానికి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (GAIL)ను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ నిర్మించిన పైప్ లైన్లలో ప్రముఖమైంది-HBJ పైప్ లైన్. ఇది గుజరాత్‌లోని హజీరా నుంచి మధ్య ప్రదేశ్‌లోని బీజాపూర్ మీదుగా ఉత్తర ప్రదేశ్‌లోని జగదీష్‌పూర్ వరకు ఉంది. ప్రస్తుతం దీన్ని ఉత్తర ప్రదేశ్‌లోని దుబ్రాల వరకు (1750 కి.మీ.) పొడిగించారు.

విస్తరణ:
1. అసోం, త్రిపుర
2. కాంబే బేసిన్ (గుజరాత్)
3. బాంబే హై
4. కేజీ బేసిన్ కైకలూరు, పాసర్లపూడి (ఆంధ్రప్రదేశ్)
5. కావేరి బేసిన్ (తమిళనాడు)
6. రాజస్థాన్‌లోని తానోట్

అణు ఇంధన ఖనిజాలు

ఇవి శక్తిని వికిరణ రూపంలో వెదజల్లే అస్థిర కేంద్రక పదార్థాలు. యురేనియం (పిచ్‌బ్లెండ్), థోరియం (మోనోజైట్), జిర్కోనియం, ఇల్మనైట్, టిటానియం వీటికి ఉదాహరణ.

యురేనియం: దేశంలో యురేనియం నిల్వలు ఎక్కువగా జార్ఖండ్ (జాదుగూడ), బిహార్ (గయ), ఆంధ్రప్రదేశ్ (కడప జిల్లాలోని తుమ్మలపల్లి), తెలంగాణ (నల్గొండ జిల్లాలోని పెద్ద అడిశర్లపల్లి), రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత ప్రాంతాల్లో ఉన్నాయి.

థోరియం: ఇది ఎక్కువగా కేరళ, విశాఖ తీర ప్రాంత ఇసుక రేణువుల్లో లభ్యమవుతోంది.

ఇల్మనైట్, టిటానియం ఎక్కువగా విశాఖ తీరంలో లభిస్తోంది. జిర్కోనియం కేరళ తీరంలో; లిథియం జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ ఛత్తీస్ గఢ్‌లోని బస్తర్ ప్రాంతాల్లో లభ్యమవుతోంది.

మాదిరి ప్రశ్నలు


1. నాణ్యత ఆధారంగా ఇనుప ధాతువు రకాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.
ఎ. మాగ్నటైట్ బి. హెమటైట్
సి. లియోనైట్ డి. సెడరైట్
1) డి, సి, బి, ఎ 2) సి, డి, బి, ఎ
3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, బి, డి
2. అల్యూమినియం భూ పటలంలో ఏ రూపంలో లభ్యమవుతుంది?
1) పెరైట్ 2) బాక్సైట్
3) మాగ్నసైట్ 4) శుద్ధలోహం
3. కోర్బా బొగ్గు గనులు ఎక్కడ ఉన్నాయి?
1) మధ్యప్రదేశ్ 2) జార్ఖండ్
3) ఛత్తీస్‌గఢ్ 4) ఒడిశా
4. సఖాలియన్ చమురు క్షేత్రం ఉన్న దేశం?
1) అమెరికా 2) ఉక్రెయిన్
3) చైనా 4) రష్యా
5. కరగండా బొగ్గు క్షేత్రం ఏ దేశంలో ఉంది?
1) కజకిస్థాన్ 2) జర్మనీ
3) ఉక్రెయిన్ 4) జాంబియా
6. సింగరేణి బొగ్గుగనులు ఉన్న రాష్ట్రం?
1) ఆంధ్రప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
3) తెలంగాణా 4) ఒడిశా
7. మార్గేరీటా బొగ్గు నిక్షేపాలు ఉన్న ప్రాంతం?
1) మేఘాలయ 2) అసోం
3) మణిపూర్ 4) త్రిపుర
8. ఒడిశాలోని సుకిండా దేనికి ప్రసిద్ధి?
1) కాపర్ 2) క్రోమైట్
3) బాక్సైట్ 4) బొగ్గు

సమాధానాలు

1) 1	2) 2	3) 3
4) 4	5) 1	6) 3
7) 2	8) 2	

What is the code for "manage"?

BANK EXAMS REASONING



Model Questions

Directions (Q. No. 1-7): Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between E and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
1) April 2) June 3) July
4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
1) The person whose joining date is in May
2) The person whose joining date is in January
3) D 4) A
5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
1) Only two people sit to the left of D
2) D is sitting second to the right of the person whose joining date is in July
3) E and B are immediate neighbours of D
4) D's joining date is in May
5) None is true
5. Who among the following has joining date in June?
1) F 2) E 3) G
4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
1) None 2) One 3) Two
4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
1) A and the person whose joining date is in August
2) The person whose joining date is in May and E
3) C and G
4) The persons whose joining dates are in March and June
5) None of these

Directions (Q. No. 8-12): Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
1) D sits at one of the extreme ends of the line
2) A sits on the immediate left of D
3) Q faces D
4) C is an immediate neighbour of D
5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
1) P 2) Q 3) R 4) S
5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
1) P 2) Q 3) R 4) S
5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
1) A 2) B 3) C 4) D
5) Cannot be determined

Directions (Q. No. 13-18): Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
1) si 2) ru 3) ha 4) ma
5) Cannot be determined
14. Which of the following represents "more time"?
1) pa jo 2) zi ki 3) ma ki
4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
1) ru 2) pa 3) jo
4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
1) ki to 2) ma pa 3) fi ma
4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
1) well 2) manage
3) time 4) enough
5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
1) ru si 2) da ha 3) si pa
4) si da 5) ki ru

Directions (Q. No. 19-23): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: gone over 35 69 test 72 park 27
Step I: 27 gone over 35 69 test 72 park
Step II: 27 test gone over 35 69 72 park
Step III: 27 test 35 gone over 69 72 park
Step IV: 27 test 35 park gone over 69 72
Step V: 27 test 35 park 69 gone over 72
Step VI: 27 test 35 park 69 over gone 72
Step VII: 27 test 35 park 69 over 72 gone

Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
How many steps will be required to complete the rearrangement?
1) Five 2) Six 3) Seven
4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
Which of the following is definitely the input?
1) enemy 25 joy defeat yes 52 37 46
2) 37 enemy 25 joy yes defeat 52 46
3) enemy joy defeat 25 52 yes 46 37
4) Cannot be determined
5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61
How many more steps will be required to complete the rearrangement?
1) Three 2) Four 3) Five
4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
Which of the following steps will be the last but one?
1) VII 2) IV 3) V
4) VIII 5) None of these
23. **Step II of an input:** 33 store 81 75 full of goods 52
Which of the following will be step VI?
1) 33 store 52 of 75 81 full goods
2) 33 store 52 of 75 full 81 goods
3) 33 store 52 of 75 goods 81 full
4) There will be no such step
5) None of these

Explanations

(1-7):

March	June	May	Jan	July	April	Feb	Aug
A	E	C	B	F	G	H	D

1\. 4 2. 1 3. 1 4. 5 5. 2
6\. 3 7. 1

(8-12):

Q	P	S	R	Row 2
B	C	D	A	Row 1

8\. 4 9. 1 10. 2 11. 5 12. 1

(13-18):
time and money → ma jo ki... (i)
manage time well → pa ru jo...(ii)
earn more money→ zi ha ma..(iii)
earn well enough → si ru ha ...(iv)
From (i) and (ii), time → jo
From (i) and (iii), money → ma
From (i), and → ki
From (ii) and (iv) well → ru
From (ii), manage → pa
From (iii) and (iv), earn → ha
From (iii), more → zi
From (iv), enough → si

13\. 3 14. 5 15. 2

16\. Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**

17\. 1

18\. Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

(19-23):
The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.

19\. **Input:** 86 open shut door 31 49 always 45
Step I: 31 86 open shut door 49 always 45
Step II: 31 shut 86 open door 49 always 45
Step III: 31 shut 45 86 open door 49 always
Step IV: 31 shut 45 open 86 door 49 always
Step V: 31 shut 45 open 49 86 door always
Step VI: 31 shut 45 open 49 door 86 always **Ans: 2**

20\. Can't proceed backward. **Ans: 4**

21\. **Step II:** 18 win 71 34 now if victory 61
Step III: 18 win 34 71 now if victory 61
Step IV: 18 win 34 victory 71 now if 61
Step V: 18 win 34 victory 61 71 now if
Step VI: 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**

22\. **Input:** where 47 59 12 are they going 39
Step I: 12 where 47 59 are they going 39
Step II: 12 where 39 47 59 are they going
Step III: 12 where 39 they 47 59 are going
Step IV: 12 where 39 they 47 going 59 are **Ans: 5**

23\. **Step II:** 33 store 81 75 full of goods 52
Step III: 33 store 52 81 75 full of goods
Step IV: 33 store 52 of 81 75 full goods
Step V: 33 store 52 of 75 81 full goods
Step VI: 33 store 52 of 75 goods 81 full **Ans: 3**